శ్రీ

భక్తమందారము

(వచనము)

శ్రీ మహావిష్ణువును సేవించి చరితార్థులైన
కొందఱు మహాభక్తుల కథలు.

రచయిత:

కవిశేఖర కొండేపూడి సుబ్బారావు

శ్రీ ర స్తు

భ క్త మం దా ర ము

(వ చ న ము)

శ్రీవిష్ణువును సేవించి చరితార్థులైన కొందఱు మహాభక్తుల

క థ లు

ర చ యి త:

కవిశేఖర కొండేపూడి సుబ్బారావు

మొదటి ప్రచురణ 1000 ప్రతులు

నవంబరు 1986

అక్షయనామ సం॥ర కార్తికము

అన్ని హక్కులు గ్రంథకర్తవి

వెల రు. 10-00 లు

894.81231
SUB

ప్రాప్తిస్థానము :
శ్రీ కొండేపూడి సుబ్బారావు
47-10-5 ద్వారకానగరు
విశాఖపట్టణము - 530 016

ముద్రణ :
శ్రీ పతి ప్రెస్,
సుభాష్ రోడ్డు, కాకినాడ

Acc no 21764



కృతజ్ఞత

This book is Published with the
Financial Assistance of
Sri Tirumala - Tirupati Devasthanams
under their scheme
Aid to Publish Religious Books.

ఏవిభుకృపచే నీకృతి
కావిష్కృతి భాగ్యమబ్బె నా జగదీశున్
శ్రీ వేంకటగిరినాథుని
భావంబుననిల్పి కొల్తు భక్తితలిర్పన్.

ఈ గ్రంథము
శ్రీశ్రీశ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమువారి
ద్రవ్యసహాయమున ముద్రితము.
వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

సమర్పణము

శ్రీ ఆంధ్ర మహాభాగవత రచనతో
ఆంధ్రావనియందు
శ్రీవిష్ణుగాథామధురామృతవర్షము కురిపించిన
మహాకవి బమ్మెర పోతనార్యుని
పవిత్ర సంస్మరణ చిహ్నముగ
ఈ భక్తమందారము అనుగ్రంథము సమర్పితము.

* * *

పూజాంజలి

అది మహోదయ మ్మతులశుభాస్పదమ్ము
కవివరుఁడు పోతనార్యుని గంటమందు
సరస భాగవత స్వాదుసాహితీ సు
ధా స్రవంతి పొంగిన అమృతక్షణమ్ము. 1

సహజపాండిత్య కవితా ప్రసాదగుణమొ
పోతనార్య పూజాఫలమ్మొ మహిమొ
ఎపుడు వ్రాసిన పద్యమ్ము లపుడె తెల్గు
నేలవ్యాపించె పండువెన్నెలల పగిది. 2

మృదుల మనోజ్ఞ శబ్దలహరీమధువాహిను లెన్ని యెన్నిగా
పదిలము లయ్యెనో యతనిస్వాంతమునందున భావతీవ్రతన్
కదలిన గంట మూగినది కానము మానితవిశ్వభారతీ
సదనమునందు మా తెలుగుసాహితి కింక మహోదయంబ చే. 3
విమల వియన్నదీ సలిల వేగము నందన నవ్యవల్లరీ
సుమమకరందమాధురియు సుందరవర్ణ తటిత్ప్రరోచియున్
అమరినవోయి పోతనమహాకవి ! నీకవితావిధమ్మునన్
గమనము శైలియున్ మధురకావ్యకళాంచితశబ్దశిల్పమై. 4
బమ్మెరపోతనార్యుఁడట భాగవతామల భక్తిభావనా
ర్థమ్ములు విష్ణుకీర్తిచరితమ్ములు కోమలపల్లవార్ద్రర
మ్యమ్ములు సత్కవిత్వమహిమమ్ములు కమ్మని తేట తెల్గువా
క్యమ్ములలోన తీయకలకండలు పోతలు పోసినాడ చే. 5
అని యూరూరను మ్రోగిపోయినవి సర్వాంధ్రప్రదేశాన పో
తన కావ్యప్రతిభాసముజ్జ్వల కవిత్వస్తోత్రపాఠమ్ములో
వినుత ప్రేమమయైక జీవనకళావిజ్ఞాత బృందావనీ
వనితా గోపకిశోర రాసనటనా వ్యాలోల లీలాధ్వనుల్. 6
లేరే పూర్వము సత్కవుల్ మధురశైలిన్ కావ్యముల్ వ్రాయరే
వారల్ వ్రాసిన సత్కవిత్వములు శశ్వత్కీర్తి నార్జింపవే
వరీ భాగవతప్రబంధకవితా హృద్యోజ్జ్వలన్మాధురీ
పారమ్యమ్మును చూపగల్గినకవుల్ వాణీపదోపాసకుల్. 7
మాకొక దివ్యనందనసమంచిత నిత్యవసంత కాంతి కా
దా కలకాల మోయికవితాపస ! నీకవితాకళాశరత్

శ్రీకమనీయచంద్రికలు చేతములందున పూలతీవలై
ప్రాకినవోయి నవ్యమధురమ్ములు స్వాదుసుధాఝురమ్ములై. 7

ఒకకృష్ణుండునుగాదు గోపికలుకాదో సత్కవీంద్రప్రభూ !
అకలంకాకృతు లందఱున్ తెలుగువారై నట్లు
కాన్పింత్రు మా
మకనేత్రమ్ములలో నటన్మధుసుధామానోజ్ఞ్యముల్
తోఁచి తా
వక పాండిత్య మృదూక్తి సుందర కవిత్వశ్రీవచోరేఖలన్. 9

దైవతకార్యసిద్ధిచరితాత్ముఁడు వ్యాసునివాణిలో జగ
త్పావనమైన భాగవత భవ్యకథాకమనీయసాహితీ
శ్రీవిభవమ్ములన్ తెలుఁగుసీమలనెల్ల కళాతపస్వియై
ప్రోవులుగాగ పంచియిడు పోతన మాకుఁ ప్రసన్నుఁ
డయ్యెడున్. 10

నిలిపిన వాంధ్రభాగవత నిస్తులదివ్యకవిత్వ దీపికా
సలలితకాంతు లీతెలుగుసాహితికిన్ మహనీయకీర్తులా
పలుకుల తీయతేనెవినువాకల వాచవి క్రొత్తచల్వఁలన్
పులకితమానసుండ నయి పోతన కేను నమస్కరించెదన్. 11

నూతనసాహితీవ్రతమనోహరదీక్షు ధనప్రలోభవాం
ఛాతతులన్ జయించి కవిసంతతి కొక్కస్వతంత్రమార్గవి
ఖ్యాతి గడింపఁజాలిన మహాకవి కావ్యకళామహాత్వసం
పూత యశోవిభాసితుఁడు పోతనకున్ విజయాభిషేకముల్.

—

భక్తమందారము

తొలిపలుకు

శ్రీమహావిష్ణువును సేవించి చరితార్థులైన కొందఱు పరమభాగవతుల కథ లీగ్రంథమున రచింపఁబడినవి. ఈకథ లన్నియును మహాభాగవతమునుండి గైకొనఁబడినవే. మహా భక్తుల జీవితములు మానవజాతి ఇహపరసౌఖ్యము లందుట కెట్లు మార్గదర్శకములు కాగలవో చూపుటయే లక్ష్యము గాఁగల రచన లీకథలు. మున్ముందుగ శ్రీమహాభాగవత మును గూర్చి రెండుమాటలు అవసరము.

మన భారతదేశము కర్మభూమి; మనమతము వైదిక మతము. దుఃఖభాజనములను జననమరణములనుండి విముక్తి నంది పరమాత్మసాయుజ్యమందుటయే శ్రీకైవల్యపద ప్రాప్తి. అదియే జీవితగమ్యస్థానమగు మోక్షము, శాశ్వతా నందప్రదమగు బ్రహ్మభావము. అట్టి పరమపదప్రాప్తికి అనువైన కర్మములను ఉపాసనావిధానములను ఉపదేశించు గ్రంథములు వేదోపనిషత్తులు. ఆ వైదికధర్మములు ప్రజ లకు సులభగ్రాహ్యములుగా నుండుటకొఱకు శ్రీమద్రామా యణ మహాభారత మహాభాగవతములను మన పూర్వ ఋషులు రచించిరి. మానవజాతికి లభ్యమైన అనర్ఘరత్న ఖను లాపురాణములు. శోధించినకొలఁదియు మానవజీవన

ధర్మసూత్రములు నిత్యనూతనములై అందుండి వెలువడు చునే యుండును.

ఈమూడు పురాణపుణ్యగ్రంథములందును పరమాత్మ నెఱుఁగు జ్ఞానసముపార్జనకు భక్తిమార్గ ముత్తమమైనదని బోధించు గ్రంథము మహాభాగవతము. భగవంతుని ప్రేమించి ధ్యానించి సేవించుటయే భక్తి; అదియే మోక్షసాధనకు బ్రహ్మము నుపాసించు సులభమార్గము. ఎందఱో మహాత్ములు వివిధభక్తిమార్గములలో శ్రీహరి నుపాసించి మహాభక్తులై, ఆదర్శజీవనులై, చరితార్థులైరి. భగవదనుగ్రహమునకు పాత్రులైన ఆ మహనీయుల చరిత్రము లెన్నియో మహాభాగవతమున కలవు.

భగవానుడు భక్తసులభుఁడు. "నాభక్తులు నా కతి ప్రియులు, నాభక్తుల యోగక్షేమములను నేనే చూచెదను, నాభక్తున కెన్నఁటికిని నాశము లే''దని శ్రీకృష్ణపరమాత్మ తనగీతాప్రబోధమున స్పష్టముగ చెప్పెను. చూడుడు భగవద్గీత అధ్యా. 12 శ్లో. 20, అధ్యా. 9 శ్లో. 22, అధ్యా. 9 శ్లో. 31 మొ॥వి.

భగవద్భక్తుల కిట్టి పవిత్రమార్గమును చూపఁగలిగినది వ్యాసమహర్షి కృతసంస్కృత మహాభాగవతము. దీనిని తెనిఁగించిన ఆంధ్రమహాకవి బమ్మెర పోతనార్యుఁడు. పోతనార్యుని రచనలో మధురాతిమధురములై ఆంధ్రభాగవత కథామృతరసప్రవాహములు ఆంధ్రావనియం దెల్లెడల పొంగి

పొరలినవి. తెలుఁగుసీమలో అత్యధిక ప్రజాదరణమునందిన గ్రంథము పోతనార్యుని ఆంధ్రమహాభాగవతము.

ఈ భక్తమందారమున రచింపఁబడిన కథలన్నియు ఆంధ్రమహాభాగవతము నాధారముగాఁగొని రచించినవే. పుష్పమకరందమాధుర్యము నెఱిఁగిన మధుపము వేఱొక చోటికిపోదు; అట్లే భగవన్మహిమను గ్రహింపగలిగిన భక్తుని చిత్తము భగవచ్చరణారవిందములయందే లగ్నమైయుండును. భగవద్భక్తి ఒకరిసొమ్ముకాదు. అందఱును భగవానుని సేవించుట కర్హులే. ఎవరిమార్గము వారిది. ఎవరిసాధన వారిది.

మహాభాగవత సప్తమగ్రంథమునఁగల ప్రహ్లాదచరిత్రము సుప్రసిద్ధమైనది. తన కుమారుఁడైన ప్రహ్లాదుఁడు శ్రీహరిభక్తుఁడగుట సహించలేని రాక్షసపతి హిరణ్యకశిపుఁడు ఆపసిబాలుని నానావిధముల హింసించి చంపింపఁ జూచును. ప్రహ్లాదుఁడు నిర్భయుఁడై తనతండ్రికి దైవభక్తి మహిమ నుపదేశించుచు వివిధ భక్తిమార్గముల నిట్లు వర్ణించెను.

"తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్
వందనా
ర్చనముల్ సేవయు ఆత్మలోనెఱుకయున్ సంకీర్తనల్
చింతనం

బను నీతొమ్మిదిభక్తిమార్గముల సర్వాత్ముని హరిన్
నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁదలఁతున్ సత్యంబు
దైత్యోత్తమా.''

పోతనార్యుని ఈ తెలుఁగుపద్యము సంస్కృతమున గల ఈక్రింది శ్లోకము ననుసరించి వ్రాయబడినదే.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్ ॥''

ఆపై పద్యమునం దుదహరింపఁబడిన తొమ్మిది భక్తి మార్గములలో సఖ్యము, శ్రవణము మున్నగు ఒక్కొక మార్గమునకు ఒక్కొక మహాభక్తుని చరితము నుదాహరణముగా తీసికొని తొమ్మిది భాగములుగ ఈ భక్తమందారము రచింపఁబడినది. ఈభక్తుల కథలన్నియు ఆంధ్రమహాభాగవతములోనివే. ఏభక్తునిగూర్చియయినను ఈభక్తునియందు గల భక్తిమార్గ మిదియేయని వింగడించి ఒకేగుణమును చెప్పుట వీలుకాదు. ఆభక్తునియం దేభక్తిమార్గము ప్రస్ఫుటముగ తోచునో దానినే ప్రధానముగ సూచించుచు వ్రాసిన కథలివి.

రచన నొకింత ఆకర్షణీయ మొనర్చుటకై అందందు కొన్ని వర్ణనలను జేర్చితిని. సందర్భానుసారముగ పోతనార్యుని పద్యములఁ జేర్చితిని. ఈకథలయం దుదహరింపఁ

బడిన పద్యములన్నియు ఆంధ్రమహాభాగవతములోని ఆయా ఘట్టములనుండి యెత్తి వ్రాయబడినవే.

శ్రీహరిని గూర్చిన కథలన్నియు ఇహపరసౌఖ్యప్రదములు, హర్షదాయకములే.

"ఏకథలయందు పుణ్య
శ్లోకుఁడు హరిసెప్పఁబడును సూరిజనముచే
ఆకథలు పుణ్యకథలని
ఆకర్ణించెదరు పెద్దలతి హర్షమునన్."

అనికదా పోతనార్యుని వాక్యము

ఈ మహాభక్తుల కథలనుండి చదువరులకు కొన్ని సత్యములు తెల్లముకాకపోవు. దైవభక్తులగుటకు ఎక్కువ తక్కువ భేదములులేక అందఱును అర్హులే. సర్వాంతర్యామియు సర్వభూతమహేశ్వరుఁడైన శ్రీహరి కందఱును సమానులె. విప్రోత్తముఁడైన కుచేలుని, ఆప్తుఁడైన అక్రూరుని, మహాజ్ఞానియగు భీష్ముని, శ్రీకృష్ణభగవానుఁ డెట్లను గ్రహించెనో, కేవలము పూవులమ్ముకొని జీవించు సుదాముని కూడ అట్లే ప్రేమించి ఆదరించెను. నిశ్చలము నిర్మలమైన భక్తి అలవడవలయునే కాని తరతమభేదములులేక భగవద్భక్తు లందఱికి ధ్యేయము గమ్యస్థానము ఒక్కటియే. వారందఱియందు భగవదనుగ్రహ మొకరీతిగనే ప్రసరించును.

ఈకథనుండి మహాభక్తుల జీవనవిధానములు సార్వజనీనములగు మానవశ్రేయోమార్గములని కూడ స్పష్టముగ తెలియనగును. భక్తుని ముఖ్యలక్షణములు కరుణ, భూతదయ, స్నేహాభావము, సత్సాంగత్యము, ద్వేషము లేకుండుట, నిర్భయము, శుచిత్వము, కార్యదక్షత, నిస్వార్థము, కష్టసుఖములయందు సమబుద్ధి మున్నగునవి. మానవాభ్యుదయమునకు విశ్వశాంతి సౌఖ్యములకు అనువైన మార్గము లివియేకదా. ఇట్టి పవిత్రవర్తనము కలవారగుటచేతనే "సర్వేజనాః సుఖినోభవన్తు'' అను భారతసనాతన ధర్మసూత్రసాధనకు మహాభక్తులు మార్గదర్శకులైరి.

ఈ సత్యములను నిర్వచించుటయే ఈ భక్తమందార గ్రంథలక్ష్యము. ఈ గ్రంథమువలన భగవన్మహిమను భగవద్భక్తి ఫలితములను చదువరు లేమాత్రము గ్రహింపఁగలిగినను నా ప్రయత్నము సఫలమని భావించుచు ఆంధ్రప్రజానీకమున కీగ్రంథము నందించుచున్నాను.

నా కోరికను మన్నించి ఈ గ్రంథమునకు భూమికగా సుప్రసిద్ధులు మహాపండితులు మహాపౌరాణికులు పూజ్యులు అయిన శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులవారు ఆమోదము అనుపేరున పరిచయవాక్యములు వ్రాసియిచ్చినందులకు నేను వారికి బహుధా కృతజ్ఞుఁడను, వారికి నా హృదయపూర్వక వందనములు.

అక్షయ సం॥ర కార్తికము
నవంబరు 1986.

గ్రంథకర్త.

ఆమోదము

వ్యాకరణవిద్యాప్రవీణ, భాషాప్రవీణ,
శ్రీ భాష్యం అప్పలాచార్యులు M. A.

కవిశేఖర శ్రీ కొండేపూడి సుబ్బారావుగారి భక్తమందారమకరంద రసామోదమునఁదేలి ధన్యుడనైతిని. శ్రీమద్భాగవతము భక్తమందారవనము. అందెందరో భక్తులు తమభక్తిప్రసూనములతో నలరింతురు. శ్రీమద్భాగవతము శ్రీకృష్ణావతారము. శ్రీమద్భాగవతము భక్త్యుత్పాదకము- భక్తివర్ధకము. వాసుదేవపాదారవింద భక్తియే మానవజీవితమునకు చరితార్థత గల్గించును. భగవంతుని స్వరూపరూపగుణములను విని ఎఱింగి స్మరించి అవిచ్ఛిన్నభావనతో దర్శనసమానమైన అనుభూతినందుటయే భక్తి. "ప్రీతి పూర్వమనుధ్యానం భక్తిరిత్యభిధీయతే'' పరమప్రేమయే భక్తి. ఆ భక్తియొక్క అవస్థలు తొమ్మిది విధములుగ నుండును.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్ ।
అర్చనం వందనం సఖ్యం దాస్యమాత్మనివేదనమ్ ॥''

శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, సఖ్యము, దాస్యము, ఆత్మనివేదనము అను తొమ్మిది భేదములు గలిగిన ప్రీతిరూపమైన దర్శన సమానమైన తైలధారవలె సాగు అవిచ్ఛిన్న స్మృతిసంతతి

భక్తి. దాస్యము సఖ్యము వాత్సల్యము శాంతము మధురము అని భక్తి అయిదు విధములుగా నుండును. అన్నిటను స్థాయిభావము భగవద్రతియే. ఆలంబనము భగవానుడు. ఉద్దీపనము బృందావన గోగోపికామురళీరవాదులు. ఆరతి అవిచ్ఛిన్నముగ విజాతీయభావనలేక సాగునపుడు కల్గు అవస్థలే శ్రవణాదులు. అందు దాస్యభక్తి ఉద్ధవాక్రూరవరాలా కారులది. వాత్సల్యభక్తి నందయశోదలది. సఖ్యభక్తి కుచేల గోపాలురది. శాంతభక్తి భీష్మాదులది. మధురభక్తి గోపికలది. ఈ అయిదువిధములయిన భక్తులందును పై తొమ్మిది అవస్థాభేదము లుండును. అందు ఒక్కొక్కరియందు ఒకొక్క అవస్థ ప్రస్ఫుటముగా గోచరించును. దానిని భావించి శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు తొమ్మిదిమంది భక్తుల చరితములను అందించినారు. సంస్కృతభాగవతమున నున్న క్రమమును మార్చి పోతనామాత్యులు సఖ్యము, శ్రవణము, దాసత్వము, వందనము, అర్చనము, సేవ, ఆత్మలో నెఱుక, సంకీర్తనము, చింతనము అను క్రమమును నిర్దేశించిరి. అదేక్రమమున తొమ్మండుగురు భక్తుల చరితములను వచనమున శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు రచించిరి.

శ్రీ సుబ్బారావుగారి పద్యశైలి పరమరమణీయము. పోతన పద్యముల బోలియుండు మధుర గంభీర పదగుంఫనము కలది. వచనమునగూడ కేవల కథాప్రతిపాదనమే

కాక కావ్యత్వమును సంతరించిరి. అందమైన సన్నివేశము లతో దృశ్యముగ సాగినది. జరిగినది కండ్లయెదుట దర్శన మిచ్చునట్లున్నది. మధ్యమధ్య పోతన పద్యములను పొందు పరచినారు. శ్రీకృష్ణకుచేలుల పరస్పరమైత్రిని ఎంతో అంద ముగ వర్ణించిరి.

కుచేలుడు శ్రీకృష్ణుని దర్శించిన సన్నివేశము, అక్రూరుడు భగవానుని దర్శించిన సన్నివేశమూ- భీష్ముడు శ్రీకృష్ణుని దర్శనమున అనుభవించిన అనుభూతి_ గోపికలు వెదకి వెదకి శ్రీకృష్ణుని దర్శించి అనుభవించిన అనుభూతి_ పరమసుందరములు, మధురాతిమధురములు. చదువుచున్న పుడు ఏదో చెప్పలేని అలౌకికానుభూతిని కల్గించుచున్నవి. కవిహృదయము భక్తిరసభరితము- భావన తన్మయీభావ ముతో తాదాత్మ్యదశాసంపన్నము- భావములు శ్రీకృష్ణ మాధుర్యసంతరితములు - పదగుంఫనము ఓజఃప్రసాద మాధుర్యసమ్మిళితము.

వచనరచన చాల కష్టము. "గద్యం కవీనాం నికషం వదంతి'' అని పెద్దలసూక్తి. అట్టి వచనమునుగూడ కావ్య ముగ రచింపగల మహాకవులు శ్రీ కొండేపూడి సుబ్బారావు గారు. నాచేత భక్తమందారము ననుభవింపజేసిన మహో దారులు. ఈ మహాకావ్యమునందలి ఆమోదమును సహృ దయులెల్లరు ఆస్వాదింతురుగాక.

ఇతి నివేదయితా

— శ్రీభాష్యం అప్పలాచార్యః

భక్తమందారము

విషయసూచిక

	పుటలు
కృతజ్ఞత	3
సమర్పణము	4
తొలిపలుకు	7-12
ఆమోదము	13-15

కథలు	పుటలు
1. సఖ్యము – కుచేలుఁడు	1- 22
2. శ్రవణము – పరీక్షిత్తు	23- 53
3. దాసత్వము – అక్రూరుఁడు	54- 76
4. వందనము – సుదాముఁడు	77- 85
5. అర్చనము – అంబరీషుఁడు	86–102
6. సేవ – యశోదానందులు	103–134
7. ఆత్మలోనెఱుక – భీష్ముఁడు	135–149
8. సంకీర్తనము – ప్రహ్లాదుఁడు	150–173
9. చింతనము – గోపికలు	174–208

శ్రీరస్తు

భక్తమందారము

1. సఖ్యము - కుచేలుఁడు

కం. దళమైనఁ బుష్పమైనను
ఫలమైనను సలిలమైనఁ బాయనిభక్తిం
గొలిచిన జను లర్పించిన
నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్.

నాయందు భక్తిఁగల జను లర్పించిన పత్రము పుష్పము ఫలము ఏదైనను, లేశమాత్రంబైనఁ బదివేలుగా నంగీకరింతు నట్లుగాక నాయందు భక్తిలేని దుష్టాత్ముండు మేరుగిరియంతటి బంగార మిచ్చినను నాకది సమ్మతంబు గాదు; అని భగవద్వచనము. కుచేలుడు నిరుపేదయే కావచ్చును కాని పరమాత్మయందు నిరంతరము నిశ్చలమైన భక్తిగలవాడు. ఆతడు స్నేహాభక్తి పూర్వకముగ తెచ్చిన అటుకలనే శ్రీకృష్ణుఁడు పరమానందముతో స్వీకరించి సకల సంపదలు భవమోక్షము నొసఁగినాఁడు. ఇది క్లుప్తముగ కుచేలుని కథ.

శ్రీకాశీపట్టణమున గంగానది ఉత్తరవాహినియై నేత్ర పర్వముగ ప్రవహించును. ఆ పుణ్యక్షేత్రమున కొకింత దూరమున సాందీపముని ఆశ్రమ మున్నది. అది ఆముని వర్యుని తపోవాటికయేకాక, నిత్యము ఆ మహాసీయుఁడు

శిష్యులకు వేదవేదాంగములు, సకల శాస్త్రములు బోధించు గురుకులము కూడను. అది యెల్లపుడును పలుచోట్లనుండి వచ్చు అనేక విద్యార్థులకు నెలవు.

ఆనాఁడు సాందీపుని గురుకులము కడు రమణీయమై విరాజిల్లుచున్నది. ప్రాతస్సమయ శీతలానిలములు సుమసుగంధములను నలుదెసలకు పంచుచున్నవి. బాలభానుని కిరణములు చెట్ల ఆకుల సందులనుండి బంగరు కాంతులను విరజిమ్ముచు ఆ యాశ్రమస్థలమున కొక నూతనశోభ నిచ్చుచున్నవి. ఆ ప్రదేశమంతయు ఆదినమున మఱింత రమ్యము ఆహ్లాదకరముగ నున్నది.

శిష్యులకు వేదపాఠములతో సాందీపుని ప్రబోధ మారంభమైనది. ఆతఁడొక ఋక్కు స్వరయుక్తముగ చదువును. వెనువెంటనే శిష్యులందఱు ఆ వేదపాఠమును సస్వరముగ వల్లెవేయుదురు. సోదాహరణముగ గురు వాపాఠమునకు వ్యాఖ్యానము నుడివి మఱియొకదాని నందుకొనును. ఛాత్రుల కాప్రవచన మంతటితో కంఠస్థము కావలసినదే. సాందీపుని వేదస్వరము లాప్రాతఃకాల పవనవీచికలందు మధువు లొలుకుచున్నవి. ఇంతలో ఆజానుబాహుఁడయిన ఒక తేజస్వి ఇద్దఱు బాలకులను చెరియొక చేతితో తీసికొని వచ్చి సాందీపున కభివాదన మొనర్చి నిలుచుండెను. ఆ బాలురును లేతచిగురులవంటి తమ చిఱుచేతులతో సాందీపుని చరణారవిందములంటి ప్రణామము లర్పించి నిలుచుం

డిరి. వారిరువురిలో ఒకఁడు కొంచెవము పెద్ద అనిపించును. బంగారు మేనిచాయతో మిసమిస లాడుచున్నాడు. రెండవ బాలుఁడు నీలమేఘశ్యాముఁడు. చేతిలో మురళి, శిరమున నెమలిపింఛము, గజ్జెల మొలత్రాడుఁ గలిగి చాల ఆకర్షణీయముగ నుండెను. ఇద్దఱును క్రొత్తగ ఉపనయనమైన వటువులు మందహాససుందరాననులు. వారిని తీసికొనివచ్చిన మహాపురుషుఁడు వారితండ్రి వసుదేవుడు. సాందీపునిచూచి "గురుదేవా! వీడు నా పెద్దకొమరుఁడు బలరాముఁడు. ఇతడు రెండవవాడు కృష్ణుఁడు. మొన్ననే వీరికి వడుగులు చేసితిని. గురుశిక్షణ వీరి కీవఱకును లేదు. తమ విద్వత్కీర్తి జగత్ప్రసిద్ధము. తమ అనుగ్రహమున కీపసిబిడ్డలను పాత్రుల నొనర్చి దిద్దితీర్చుడు" అని మఱియొకసారి వందన మాచరించెను. వారిని చూచుటతోడనే సాందీపుడు హర్షపులకాంకితుడై "వసుదేవా, ఈబిడ్డల విద్యాభ్యాసమునకై నీవు చింతవలదు. నా శక్తికొలఁది వీరిని విద్యావంతులఁజేసి పంపెదను. నీ కొమరులు కుశాగ్రబుద్ధులని వారి మోములే తెల్లము చేయుచున్నవి. త్వరలోనే సకలవిద్యాపారంగతులు కాగల"రని ధైర్యము చెప్పి పంపెను. బలరామకృష్ణుల ప్రసిద్ధి అప్పటికే రాష్ట్రవ్యాప్తమైనది. మొన్న మొన్ననే మహాదుష్టుఁడగు కంసుని, అతని అనుచరులైన ఇతర దుష్టులను బలసాహసులై వధించి ప్రజల కపార

మోదము కలుగఁజేసిన బాలవీరులు వారు. ఆకథల నన్నిటిని సాందీపుఁ డెఱుఁగును.

అచ్చటనున్న విద్యార్థుల దృష్టియంతయు క్రొత్తగా వచ్చిన ఆ బాలకులపైననే యున్నది. ముందు బలరాముని చూతురు. వెంటనే ఆచూపులు కృష్ణునిపై ప్రసరించి అచటనే నిలిచిపోవును. దేశికు నానతిని బలరామకృష్ణులు గంగాజలముల కాళ్ళేతులు కడుగుకొని, విష్ణుపాదోద్భవి హరజటాజూటోద్గతయైన గంగానది జలములు శిరసులపైఁ జల్లుకొని, సంకల్పము కావించి సంధ్యావందనము సరస్వతీ ప్రార్థనము ముగించి తిరిగివచ్చి చివరివరుసలో కూరుచుండిరి. ఆ వరుసలో కృష్ణుని ప్రక్కన ఉపవిష్టుఁడైన బాలుడు కుచేలుఁడు. అతని చినుగుబట్టలను బట్టియే ఆపేరతనికి పెట్టిరేమో. సాందీపుఁడు ప్రేమాదరములతో శాస్త్రబోధ కావించుచుండెను. ప్రతిభావంతులైన శిష్యులు లభించి నపుడు గురుని హృదయోల్లాసమునకు మేర యుండదు కదా.

కృష్ణుని చూడఁగనే కుచేలునకు అతడెవరో మహాసీయుడు భాగ్యవంతుల బిడ్డయని తోచినది. ఆతడు ధరించినవి తెల్లని దుకూలవస్త్రములు. తాను కట్టుకొనినవి చినుగులున్న సామాన్యపు వలువలు. తనప్రక్కనే కృష్ణుఁడు కూరుచుండుట గమనించి కుచేలు డొకింతదూరము జరిగెను. కృష్ణు డదిచూచి చిఱునవ్వి మఱింత దగ్గరకు జరిగి కుచే

లుని రాసుకొనుచు కూరుచుండెను. మఱి జరుగుటకు చోటు లేదు కుచేలునకు. ప్రతిదినము కృష్ణుఁ డట్లేచేయును. కుచేలుఁ డొకింత సందియపడుచుండును. పేదబాలుఁడైననేమి కుచేలుని వదనములో ఒక విధమగు జ్ఞానతేజము దీపించుచుండును. నలువురిలో అతనికి అదియొక ప్రత్యేకత. తీరిక సమయములో విద్యార్థు లందఱు ఆదినము పాఠములు వల్లెవేసుకొని ఒకరినొకరు ప్రశ్నించుకొనుచుందురు. కృష్ణుఁడు మాత్రము, దేశికుఁ డటు మొగము త్రిప్పగనే ఇటు ఆటలకు దిగును. కుచేలుని తనతో బలవంతముగా లాగుకొనిపోవును. కృష్ణునకు కొంచెము దూరముగా కుచేలుఁడుండ ప్రయత్నించిన కొలఁదియు కృష్ణుఁ డాతనిని మఱింత దగ్గరకు లాగుకొనును. వారి సఖ్యము ఆరీతిగ దినదినప్రవర్ధమానమైనది. భోజనసమయమప్పుడు కృష్ణుడు చాల అల్లరిచేయును. కృష్ణుని చిలిపిపనులు చూచినకొలఁదియు కుచేలున కానందము పట్టరానిదిగా ఉండును. అందఱితో కలసి కృష్ణుఁడును భిక్షాభ్యర్థిగా నేగును. దొరకిన వస్తువులు గురువుగారింటిలో ఇచ్చును. ఒకనాడు విద్యార్థులకు విందు జరుగుచున్నది. "కుచేలా నీ విస్తరిలో అపూపము చిదిపి ఒకముక్క కృష్ణుఁడు తీసికొనెనురా, చూచితివా" అని ప్రక్కవాడు చెప్పెను. కుచేలుఁడు మిగిలినదానిలో మఱొక పెద్దముక్క విఱిచి కృష్ణున కీయబోయెను. కృష్ణుడు నవ్వుచు ఊరకుండెను. కుచేలు డిటుతిరిగి చూచునంతలో కుచేలుని విస్తరిలో

ఘుమఘుమలాడు సువాసనతో రెండు అపూపములు పడి యున్నవి. ఎచ్చటినుండి వచ్చినవి అని అందఱికి ఆశ్చర్య మయ్యెను. మఱియొకనాడు కృష్ణుఁడు కుచేలుని జూచి "ప్రతిదినము ఈ చినుఁగుబట్టలేనా, నావి ఒకజత నీకిచ్చెదను అనెను". 'వద్దులే కృష్ణా నాకివి చాలవా, ఒకటి కట్టుకుం టిని, ఒకజత ఉతికి ఆరవేసితిని, ఒకటి వేఱే చూరులో మడత పెట్టి ఉంచినాను. ఇంతకు మిక్కిలి అనవసరము' అని కుచే లుడు ఉత్తరమిచ్చెను. 'పోనీ ముందుముందు నీ పిల్లలకు పనికివచ్చును. నీవిప్పుడే విరాగివలె నున్నావే, చదువు పూర్తి అయినతరువాత ఎట్లుందువో మఱి' అని కృష్ణుఁడు పరిహాసము చేయును. "అప్పటిమాట ఇప్పుడేల, నీవే ఉం దువు కదా అన్నిటికి" అని కుచేలుని సమాధానము. ఇట్లే పరిహాసపు మాటలతో ఆటపాటలతో వారిరువురు ప్రొద్దు పుచ్చుచుందురు. ఆ బాల్యస్నేహములోని మాధుర్యము వారికే తెలియును. ఎచ్చటి కేగినను వారిద్దఱు పోవలసి నదే. జంట విడువరు.

ఒకనాఁడు తెల్లవారకుండగనే సాందీపునిభార్య కుచే లుని లేపి 'ఈనాడగ్నిహోత్రమునకు సమిధలు తక్కువగా నున్నది. ప్రొద్దు పోడిచిన మీ చదువులతోడనే సమయము సరిపోవును" అనినది. కుచేలుడు లేచి కాలకృత్యములు తీర్చు కొని సమీపముననున్న అడవిలోనికి బయలుదేరి తమ ఆశ్ర మము దాటి పదిబారలు పోయెనోలేదో, తన వెనుకనే

కృష్ణుఁడును వచ్చుచుండుట చూచి ఆశ్చర్యముగ నవ్వెను. "నీ వొక్కడవే అడవికి పోయెదవేల, నీకు భయములేదా, నేను సాయము వచ్చెదనుగదా" అని కుచేలునితో కలిసి కృష్ణుడును అడవికి వచ్చెను. వా రడవిని సమీపించినంతలో నలువైపులనుండి కారుమబ్బులు క్రమ్మి చీకటి భూనభోంతరము నిండిపోయినది. కన్ను మిన్ను కనబడుట లేదు. ఝంఝూనిలము ప్రబలవేగమున వీచుచు మహావృక్షములను పడగొట్టుచున్నది. మెఱపులతో ఉరుములతో పిడుగులతో ధారాపాతముగా కుంభవృష్టి పడుచున్నది. కృష్ణకుచేలులు ఒకరి నొకరు ఎల్గెత్తి పిలుచుచు ఒకరిచేయి నొకరూతగా గొని ఒక రాతిబండ ప్రక్కగా బిక్కుబిక్కుమని కూరుచుండిరి. క్రమ క్రమముగా ఆ గాలివాన తగ్గినది. సమిధలకేగిన ఆ యిరువురు బాలురు రాలేదు. వర్షపాతము మహాభీకరముగా నున్నది. సాందీపుఁడు స్వయముగా ఆ యరణ్యమున కేగి వారు క్షేమముగా నుండుట చూచి సంతసించి "మీరిరువురిటులే ఒకరికొకరు తోడుగా నుందురుగాక, మీ రీనాఁడు పడిన శ్రమ మీ గురుభక్తికి నిదర్శనము. ఈభక్తియే మీకు సకలసంపదలు, ధారాపుత్రుల సౌఖ్యము, విజయాయురున్నతులు కలుగజేయునుగాక" అని దీవించి అచట లభ్యమైన సమిధలనేరి ఆ బాలుర నింటికి గొంపోయెను.

కృష్ణబలరాములు సునిశితబుద్ధులు, అతి ప్రతిభావంతులు. అరువదినాల్గు దినములలో అరువదినాల్గు విద్యలను

సంపూర్ణముగా నేర్చి ధీశాలులైరి. సాందీపుని పుత్రుడు ప్రవాసతీర్థముకడ జలమునందు మునిఁగి చనిపోయెను. గురు వర్యుని కోరికపై బలరామకృష్ణులేగి ఆబాలుని సజీవునిగ తీసికొనివచ్చి గురుదక్షిణగ నిచ్చిరి. సకలవిద్యాపరిపూర్ణులై బలరామకృష్ణులు గురువునకు ప్రణతు లర్పించి, గురుదీవన లంది తిరిగి తమ తల్లిదండ్రులవద్దకు ప్రయాణమైరి. ఒకరి కొకరు వీడుకోలు తెలుపుచు కృష్ణకుచేలులు ఒకరినొకరు కౌగలించుకొనిరి. ఒకరి ఆనందభాష్పములు మఱియొకరి భుజములపై కాల్వలై పారినవి. ఆ సంయోగప్రాముఖ్యము భావనాతీతము. సాందీపుఁ డాదృశ్యమును జూచి "ఆహా! ఒకరు నిజముగ పరమాత్మ, ఒక రచ్ఛమైన పరమాత్మ భావము" అనుకొని కనులు చెమ్మగిలగా వారినెయ్యమిట్లే వర్ధిల్లి సఫలమగుగాక" అని దీవించెను. ఆ యాశీస్సునందు గల రహస్యము సాందీపునకే తెలియును.

పెరిగి పెద్దవాడయి మహాద్భుతకార్యము లెన్నో చేసి శ్రీకృష్ణుఁడు తన యెనమండ్రు దేవేరులతో ద్వారకయందు మహావైభవముగ నుండెను. దుష్టులను శిక్షించెను; శిష్టు లను రక్షించెను. ఆశ్రితశరణ్యుఁడు. కరుణామయుఁడు. దీన బాంధవుఁడు భక్తసులభుఁడు నని కృష్ణునికీర్తి దేశమంతయు ప్రాకినది. శ్రీకృష్ణుని కేవల నారాయణునిగా భావించి ప్రజలు కీర్తించుచుండిరి.

విద్యాపరిపూర్ణుఁడై సకలశాస్త్రజ్ఞుఁడై కుచేలుఁడును తన గ్రామము చేరుకొనెను. వివాహమైనది. పుత్రసంతతియు కల్గుచున్నది. తనకున్న కొలఁదిపాటి భూమిలో లభ్యమైన ధాన్యాదులతో తృప్తిపడి కుచేలుఁడచ్చటనే ఒకచిన్న కుటీరమునందు నివసించును.

ధనసముపార్జన లేదుగాని కుచేలునకు సంతానాభివృద్ధి మిక్కుటముగనే యుండెను. అంతకంతకు సంసారబాధ యెక్కువగుచుండెను. కుచేలునిభార్య మహాపతివ్రత. తనకు లేకున్నను కలిగినంతలో పిల్లలకు, భర్తకు, వేళకు అన్నపానాదులు సమకూర్చుచుండెడిది. కాలక్రమమున అదికూడ కష్టమయ్యెను. తనకు లేదనుబాధగాని, ఇదికావలయును అని ఇతరుల నర్థించువాంఛగాని కుచేలునకులేవు. తాను భార్యయు పస్తులుండవలసి వచ్చుచున్నది. నిరంతర భగవచ్చింతన తత్పరుఁడైన నిర్వికారుఁడు కుచేలుఁడు. మానధనుడు జితేంద్రియుఁడు. రాగాదివిషయవిరహితస్వాంతుడు శాంతుడు గంభీరుడు బ్రహ్మవేత్త. ఆతని ధర్మతత్పరతయు భగవద్ధ్యానము నెఱిఁగిన యాతని భార్యకు భూదేవికిగల సహనమున్నది.

ఒకదినమున ఇంట పొయ్యి వెలుగనేలేదు. పిల్లలందఱు అమ్మా ఆకలి, అమ్మా ఆకలి అని గోలుగోలున ఏడ్చుచున్నారు. ఆమెకడుపు చెరువై పోయినది. ఇక పిల్లల బాధ

[2]

సహించలేక పోయినది. ఆకలి కాగలేని పిల్లల మృతికూడ చూడవలసి వచ్చునేమోయని కంటనీరు గార్చుచు నాథునికి నమస్కరించి చెప్పినది. "ప్రాణేశ్వరా! మీ జపతపములకంతరాయము కల్గించుచున్నందులకు క్షమింపుడు. నిన్నటి నుండి పిల్లలకు తిండిలేదు. ఏవో దోసెడు అటుకులు నీళ్లలో నానబెట్టి నిన్న మధ్యాహ్నము అందఱికి ఒక్కొక్క ముద్ద మాత్రము పెట్టితిని. ఈపూట త్రాగుటకు గంజియులేదు. ఏదోరీతిని ఎవరినైన అర్థించి తెచ్చుకొనుటకన్న వేఱొక గతిలేదు. ఇంకొకరివద్దకు మీరు పోనంటిరిగదా. పోనిండు, ద్వారకనున్న శ్రీకృష్ణుడు మీ బాల్యసఖుడని ఎన్నియో మార్లు చెప్పితిరి. ఆయన దీనదయాళుడని ప్రసిద్ధి. మీరడిగినచో కాదనరు. నామాటను త్రోసిపుచ్చకుడు.

వరదుఁడు సాధుభక్తజనవత్సలుఁ డార్తశరణ్యుఁ డిందిరా
వరుఁడు దయాపయోధి భగవంతుడు కృష్ణుడు దాఁ గుశస్థలీ
పురమున యాదవప్రకరమున్ భజియింపగనున్నవాడు నీ
వరిగిన నిన్నుఁజూచి విభుఁడప్పుడయిచ్చు ననూనసంపదల్.

అనిచెప్పి "అదిగో చూడుము. పిల్లలు ఎట్లేడ్చుచున్నారో. పసిపిల్లలెన్నాళ్లు పస్తుండగలరు" అని చెప్పుచు పిల్లలను చేతిలోనికి తీసికొని బావురుమని విలపించిన దామహాసాధ్వి.

ఎచ్చటో ఊర్ధ్వలోకములలోనున్న కుచేలుని దృష్టి కొంత క్రిందకు దిగినది. తన సంతతిని పోషించుటలో తాను

నిర్లక్ష్యము చూపుచున్నట్లు తలచి భార్య చెప్పిన మాటకు ఆలోచించి ఆలోచించి తలయూచినాడు- ఆనాఁడు గురుకులమున కృష్ణకుచేలులను చూచి మీరిరువురు సఖ్యము వీడకుడు అని సాందీపుడు దీవించెను. ఆశ్రమము వీడు సమయమున కుచేలా! నన్ను మఱవకుసుమీ అని శ్రీకృష్ణుడనెను- గురుదేవుని దీవెనలు కృష్ణుని పలుకులు కుచేలుని గుండెలలో మ్రోగినవి. ఆ చిన్నికృష్ణుఁడు ఆ సహపాఠి ఆ బాల్యసఖుఁడు మఱియొకసారి తన కన్నులలో మెఱసినట్లు కుచేలునకు తోచినది. శ్రీకృష్ణుని తలఁచుకొని మనసార నమస్కరించి ద్వారకకు బయలుదేరినాడు. ఎన్నఁటిమాట కొన్ని దశాబ్దములు గడచినది. తన బాల్యమిత్రుని కలసికొని, ఆతనికేదైన ఉపాయనము గొనిపోవుట యోగ్యము. రిక్తహస్తములతో బోవుటకన్న అని యోచించుచున్న కుచేలుని చూచి భార్య ఎన్నఁడో దాచియుంచిన రెండు గుప్పెడుల అటుకులను కుచేలుని అంగవస్త్రము కొంగున మూట కట్టినది. ఇల్లు నలుమూలల వెదకినను మఱేమియు లేదు.

కుచేలుని మనసులో దారిపొడుగునను శ్రీకృష్ణుని గూర్చిన ఆలోచనలే. 'నడచినడచి యెట్లో ద్వారకకు చేరుదును, ఆమహాత్ముఁ డేసౌధాంతఃపురములలో నుండునో ద్వారపాలకులు లోనికి రానిచ్చెదరా, శ్రీకృష్ణుఁడు నన్ను గుర్తించునా, గుర్తించిన ఆదరించునా' ఇవియే ఆలోచనలు. ఇదియే ఆందోళన. తానెందుల కచటికేగుచున్నాఁ

డనినమాట అడుగునపడినది. తలఁపులన్నియు కృష్ణమయమై భాసించినవి. ఒక్కసారి నా చిన్ననాఁటి స్నేహితుఁడు కృష్ణుని చూచిన చాలు, నాకదియే మహాభాగ్యము అని కుచేలుఁడు తృప్తిపడెను.

చివరికెట్లో కుచేలుఁడు ద్వారకకు చేరినాఁడు. ఆతని మనముననున్న భయములు నిజమయినట్లే తోఁచినది. వైకుంఠమే వసుధకు దిగిన వైభవమంతయు అచటనే యున్నది. ప్రాకారములు గోపురములు సౌధములు కొలనులు ఉద్యానవనములు క్రీడాశైలములు– ఆమధ్య శ్రీకృష్ణుని సౌధము రమ్యాతిరమ్యముగ ప్రకాశించుచున్నది. ఎవరితో తనరాక చెప్పుట. ఎవరు విని శ్రీకృష్ణునకు తెలియజేయుదురు. అంతయు అగమ్యము. శ్రీకృష్ణుడుండు సౌధప్రాకార ముఖద్వారమున వాడిశూలములు ధరించిన ద్వారపాలకులున్నారు. ఆజాను దీర్ఘ బాహులు. మహావీరులు. కుచేలునకు కాళ్ళు వణకుచున్నవి. తిరిగి వెనుకకు బోవుచో తన యత్నమంతయు వ్యర్థమగును. అడుగు లీడ్చుకొనుచు ద్వారపాలకుల కడకేగి వినయముగఁ బ్రార్థించినాఁడు. "అయ్యా! నాపేరు కుచేలుఁడు, శ్రీకృష్ణులకు బాల్యమిత్రుఁడను. వారి దర్శనార్థము వచ్చితిని, లోనికి దయయుంచి పోనిండు" అని. చినిగిన బట్టలతో, ఎండిపోయి బెరడువారిన రావికొమ్మవలె నున్నాఁడు కుచేలుఁడు. ఆ పేదబాపని ఆపాదమస్తకము ద్వారపాలకులు పరికించి పెదవి విరచి యూరకుండిరి గాని

కుచేలుని ప్రవేశము నిరోధింపలేదు. కుచేలుఁడు లోనికేగి కక్ష్యాంతరములు గడచి శ్రీకృష్ణుఁడున్న ప్రాసాదద్వారము చేరుసరికి, బహిర్ద్వారమునుండియే లోన రుక్మిణీసహితుఁడై యున్న శ్రీకృష్ణుని ఆకృతి దృగ్గోచరమైనది. ఇందీవర శ్యాముఁడు, కరుణాలవాలుఁడు, సర్వలోకారాధ్యుఁడు, భక్త శరణ్యుఁడు, దుకూలవస్త్రుఁడు, కౌస్తుభాది భూషణభూషిత సురుచిరలావణ్యుఁడైన తన బాల్యమిత్రుని చూచుచే తడ వుగ కుచేలుడు తన్మయుఁడై ఆ లీలామానుషవిగ్రహుని-

కని డాయం జనునంతఁ గృష్ణుఁడు దళత్కంజాతుఁ డప్పేదవి ప్రుని, నశ్రాంతదరిద్రపీడితుఁ గృశీభూతాంగు, జీర్ణాంబరున్ ఘనతృష్ణాతురచిత్తు, హాస్యనిలయున్, ఖండోత్తరీయుం గుచే లుని నల్లంతనె చూచి సంభ్రమవిలోలుండై దిగెం దల్పమున్.

నిర్మలమగు భక్తి పవిత్రవర్తనము కావలయును. అది చాలును. భగవానుఁడే భక్తుని వెదకుకొనుచు వచ్చి కాపాడును. ఆనాఁడెచ్చటనో ఒకకాసారమున భీకరమగు మకరముచే బంధింపబడిన గజేంద్రుని దీనాలాపములు, అల వైకుంఠ పురంబులో నగరిలో ఆ మూలసౌధంబులోనున్న శ్రీమన్నారాయణునకు వినిపించినవి. పరుగెత్తుకొని వచ్చి ఆ గజరాజును రక్షించినాడు. ఈనాడు నిజసౌధ ప్రాకార ద్వారమున కుచేలుఁడు ద్వారపాలకులతోననిన మాటలు సౌధాంతఃపురములోనున్న శ్రీకృష్ణుని కర్ణములలో మాఱు మ్రోగినవి. ఒక నిమిషము పట్టలేదు. రుక్మిణి అర్ఘ్యపా

ద్యాది పూజావస్తువులు తీసికొనివచ్చుచుండ శ్రీకృష్ణుడు కుచేలుని కెదురేగినాడు. బాల్యమిత్రుని చూచినంతనే శ్రీకృష్ణుని వదనము అరుణరాగము సోకిన పద్మమువలె సంఫుల్లమైనది. ఆదరగౌరవ కౌముదులా సుందరవదనమున వెల్లివిరిసినవి. మందహాస మధురమూర్తియై శ్రీకృష్ణుఁడు "ఆహా ఎన్నాళ్ళకెన్నాళ్ళకోయీ బాల్యమిత్రమా! నిన్ను జూచుట" అని తనబాహువల్లరులతో కౌగలించుకొని శిరము మూర్కొని తన హస్తముతో కుచేలుని చేయిపట్టుకొని తిన్నగ తన శయనాగారమునకు తీసికొనిపోయినాడు.

కుచేలునకచ్చట ఒక క్రొత్తలోకమునకు చేరినట్లున్నది. తానెక్కడ! నవరత్నమయములైన ఆసౌధాంగణ సోపానములు, కనకమయకుడ్యములు, దీపాలంకృతమంటపములు, ముక్తాజాలవిలసిత కక్ష్యాంతరములు ఎక్కడ. ఆ కాంతిమయ ప్రదేశమున శ్రీకృష్ణునితో ప్రక్క ప్రక్కల నడచుచున్న తన జన్మము ధన్యమైనట్లు కుచేలుఁడు తలఁచి ముగ్ధుఁడయ్యెను. పరమాత్మచింతనకగు ఫలసిద్ధి అది. భక్తి పారమ్యము బడయగలిగినవిరాగి కుచేలునకు భగవత్ సాన్నిధ్యభాగ్యము లభించినవి.

కుచేలుని తన శయ్యాతల్పమునందే ఉపవిష్టునిజేసి అర్ఘ్యపాద్యాది విధులు షోడశోపచారములతో శ్రీకృష్ణుఁడర్చించెను. నూతన వస్త్రములిచ్చెను. గోదానమొసగెను.

రుక్మిణీదేవి కుచేలునకు వింజామర వీచుచున్నది. శ్రీకృష్ణుడు తన మిత్రునిఁజూచి "కుచేలా, ఆనాడు గురుకులమున నే నీయఁబోయిన దుస్తులను నీవు గైకొనలేదు. ఈనాడు తీసికొనకతప్ప"దని బలవంతపెట్టెను. కుచేలున కూపిరి తిరుగుటలేదు. శ్రీకృష్ణుని స్నేహాభావము, మర్యాదలు తల మున్కలై తోచినవి. చెమ్మగిలిన కన్నులతో అన్నిఁటిని స్వీకరించుచున్నాడు. శ్రీకృష్ణుడు కుచేలుని బుజముపై చేయివేసి కుశలప్రశ్న లడుగుచున్నాడు. సాందీపుని ఆశ్రమమున కుచేలునితో గడపిన దినములు, సాంద్రారణ్యమున వారిరువురు ఒక పెనుగాలి వానలో చిక్కుపడిన సంఘటన, అన్నియు ఒకటొకటే జ్ఞప్తికిఁ దెచ్చినాడు. వారిరువురకును మరల వారా గురుకులమున నున్నట్లు, సాందీపుడు వారి ముందుండి దీవించుచున్నట్లనిపించినది.

శ్రీకృష్ణుఁడు చెప్పుచున్నవన్నియు కుచేలుడు కౌతుకముతో వినుచున్నాడు. ఏమనగలడు, అయినను "శ్రీకృష్ణా! నీవు జగద్గురుఁడవు, పరిపూర్ణుఁడవు, నీతో కలసి గురుకుల వాసముచేయు మహాభాగ్యము నాకు కలిగినది. నా జన్మ కదియే పదివేలు" అని ఊరకొనెను.

కుచేలుని రాకకు కారణము శ్రీకృష్ణుడు గ్రహించినాడు. ఇతడు పూర్వభవమున భక్తుఁడయ్యు భోగభాగ్యము లాశించినవాడుగాడు. నేడు దారాపుత్రులను పోషింపలేని

దరిద్ర బాధతో, భార్యవాంఛానుసారము ఇట్లరుదెంచి నాఁడు. ఈతని కోర్కె తీర్పవలయును అని తలఁచి-

"అయితే కుచేలా ! ఇన్నాళ్ళకు వచ్చితివి, ఊరకనే వచ్చితివా నా కొఱకేదైన బహూకృతి తెచ్చితివా లేదా" అని శ్రీకృష్ణుఁ డడుగగనే కుచేలుని గుండెలు గతుకుమని ఈ మహాత్ముని యెదుట నా ఈ పేదవాని అటుకుల మూట విప్పుట అను సందియంతో తన బుజముమీఁదనున్న మూటను దాచ యత్నింపఁబోయెను. "ఆహా ఇదిగో ఏదో మధుర పదార్థము తెచ్చితివే నేను అనుకొనినట్లు, ఏదీ విప్పుము" అనుచునే శ్రీకృష్ణుఁ డా మూటనందుకొని తానే విడదీసి ఒక గుప్పెడు అటుకులు పరమానందముతో తీసికొని నమిలి తినుచు మఱియొక గుప్పెడు తీయబోవుసరికి రుక్మిణీదేవి అడ్డువచ్చి "దేవా అవి చాలును, నీ యనుగ్రహ భక్త శేఖరునకు సంపూర్ణంగ కలిగినది'' అని చిఱునవ్వుచు కుచేలునిజూచి "అన్నగారూ ఇంటివద్ద సౌభాగ్యవతి మా వదినె గారు పిల్లలందరు క్షేమమేగదా! పరమభాగవతులు శ్రీకృష్ణభక్తులు అయిన మిమ్ము పతిగాబడసిన ఆయనకు కేమిలోటగును?" అని ప్రసన్నవదనయై పలికినది. శ్రీకృష్ణుఁ డామె వంకజూచి తానును చిఱునవ్వెను. ఈ సుందరదృశ్యమేదో ఆకర్షణీయముగ గన్పట్టెనే గాని అందలి యర్థము కుచేలున కాక్షణమున తోచనేలేదు.

కుచేలుని ఆనాటికి తన సౌధమునందే ఆపి శ్రీకృష్ణుడు సకల సౌకర్యములు కల్పించెను; రాత్రి చాల ప్రొద్దుపోవువఱకు ఆమాటలు ఈమాటలు చెప్పుచు కుచేలునిచే చెప్పించుచు ఆనందముగ గడపెను. మాటల నడుమ 'కుచేలా ! నీ ప్రవర్తనము జూడ ప్రాపంచిక విషయములందు అచంచల విరాగివయినట్లు తోచుచున్నది. ఉత్తముల వర్తనము లట్లే యుండును, మఱియు బ్రహ్మభావుఁడు సత్కర్మనిరతుఁడైన గురువర్యుడు సాందీపునివద్ద జ్ఞానమార్గంబుల నేర్చితిమి. ఆ ప్రబోధములందలి సత్యమును నీవు చక్కగా గ్రహించితివి. నన్ను పరమాత్మ స్వరూపునిగ భావించుచున్నావు. అది సముచితమే. అంతమాత్రమున నేను నిన్ను మఱచువాడనుగాను. నాభక్తు లెప్పుడును నాకు ప్రియులే. వా రెన్నటికి చెడిపోరు. నేను జగద్గురుండను, సకల వంద్యుఁడ నయినప్పటికి లోకకళ్యాణార్థము కర్మ లొనరించుచు, పరమధర్మంబని లోకమున తెలుకపరచుటకే సామాన్యునివలె గురుసేవ నొనర్చితిని. సకల భూతాత్మకుఁడ నయిన నాకు శమ దమ దాన తపోవ్రత యజ్ఞాది కార్యముల కన్న నాయందు అచంచల భక్తివిశ్వాసములను చిత్తశుద్ధితో చూపఁగలిగిన వారియందే ఇష్ట మెక్కువ. మఱియు మత్పదాంబుజధ్యానపరులే భవజలధి సులభముగ తరింపగలరని కొంతవడి తత్త్వచర్చ జరిపి నిదుర కేగెను. కుచేలుడు

తనకై అమరింపఁబడిన మృదుతూలికా శయ్యను విడచి పుడమిపై ఒక ముతకవసనము పఱచి పరుండెను. పరుండెనేకాని నిదురయే రాలేదు. ఆరేయి రేయెల్ల కుచేలుని మనసులో శ్రీకృష్ణదేవుని విగ్రహమే శ్రీకృష్ణభావమే. ఆతాదాత్మ్యములో కుచేలుఁడు బ్రహ్మానందరసాస్వాదన సౌఖ్యమున నోలలాడుచుండెను.

ఎచ్చటనుండియో వచ్చిన ఒకపేద బాపనికి శ్రీకృష్ణుని మందిరమున ఇంత సత్కారమా! శ్రీకృష్ణుఁడే స్వయముగ అతిథిమర్యాద లొనర్చుటయా! ఆహా! ఈతఁ డెంతటి మహాత్ముఁడో!

"ఏమితపంబుసేసెనొకో ఈధరణీదివిజోత్తముండు తొల్
బామున యోగివిస్ఫురదుపాస్యకుడై తనరారు నీజగ
త్స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించియున్నవాఁ
డీమహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్.

తనమృదుతల్పమందు వనితామణియైన రమాలలామ పొం
దును నెడఁగాదలంపక యదుప్రవరుండెదురేగి మోదముం
దనుకగఁ గౌగిలించి యుచితక్రియలన్ బఱితుష్టిఁజేయుచున్
వినయమునన్ భజించె ధరణీసురుఁ డెంతటిభాగ్యవంతుడో

అని యెన్నియో విధముల ఆ సౌధముననున్న పరిచారకులు, శుద్ధాంతకాంతాజనము, తమలోతామే తర్కించుకొని యద్భుతం బందుచుండిరి.

భక్తశరణ్యుఁడు దీనజనావనుఁడైన శ్రీకృష్ణ భగవానుఁడు కుచేలుని కెఱుకలేకయే కుచేలుని పూరియిల్లొక సుందరసౌధముగ మార్చి అశేషధనధాన్యభోగభాగ్యములను తన తలంపుతోడనే సమకూర్చెను. మఱునాఁడు మరల దక్షిణతాంబూలాది సర్వసత్కారములతో కుచేలుని సమ్మానించి ప్రాకారద్వారమువఱకు వచ్చి శ్రీకృష్ణుఁడు సాగనంపెను.

శ్రీకృష్ణుని సన్నిధిని విడువలేక విడువలేక విడచి కుచేలుఁ డింటిదారి పట్టెను. కనుపడినంతవఱకు శ్రీకృష్ణుని సౌధప్రాకారము మాటిమాటికి వెనుదిరిగి చూచుచు, అది కనుమఱుగైన పిదప ద్వారకానగరమును జూచుచు తిరుగు ప్రయాణము సాగించెను. కుచేలుని మనసున మెఱపువలె ఇంటివద్దనున్న భార్యాపుత్రుల విషయము జ్ఞప్తికి వచ్చినది. అయ్యో! వారెట్లున్నారో, నేను ద్వారకకేగిన దెందులకు? ఏదేని సాయముకొఱకు శ్రీకృష్ణు నర్థింపవలయునని కదా. అచట నున్నంతవఱకు నాకీవిషయము మనసునకే తట్టలేదు. ఎంతటి జడుఁడనైతిని అని తనలో తానే విమర్శించుకొని, పోనిమ్ము నా పేదతనము గమనించిన శ్రీకృష్ణుఁడైన తనకుతానయి ఏమయిన ఈయవచ్చునుగదా అని వితర్కించి- 'ఓహో! నాకు భోగభాగ్యము లలవడుచో శ్రీకృష్ణ చింతనము స్వాంతమున విస్మరింతునేమో'యని శ్రీకృష్ణపరమాత్మయే ఇట్లు చేసెను. ఇదియు మేలే.

శ్రీకృష్ణచింతనము నే నెన్నఁటికిని విడువఁజాలను. నాకు తినుట కున్నను లేకపోయినను సరియే. శ్రీకృష్ణభగవానుఁడే నాకు సర్వశరణ్యమని సంతృప్తిపడి కుచేలుఁడు తన గ్రామము చేరెను.

తనయింటి పరిసరములు చేరుసరికి కుచేలున కాన వాలు పట్టజాలని దృశ్యములు గోచరమయ్యెను. తనగృహ మొక మహాసౌధరాజముగ మారిపోయినది. ప్రాంగణము శశికాంత వేదికలతో, పుష్పవనములతో విరాజిల్లుచున్నది. ఇంతలో వివిధసుందరవర్ణముల నూతనవస్త్ర భూషణముల ధరించి ఉల్లాసముతో నున్న పుత్రులందఱు వెంట వచ్చు చుండగా భార్య బంగరు పళ్ళెమున నీరాజనముతో కుచే లున కెదురేగి అర్ఘ్యపాద్యాదులతో పూజించి భవనము లోనికి తీసికొనిపోయినది. కుచేలుని గృహము సమస్తభోగ భాగ్యములతో ప్రకాశించుచున్నది. ఏయెడ జూచినను మహేంద్రభాగ్యతుల్యములైన సంపదలే. ఇదియంతెయు శ్రీకృష్ణుని అనుగ్రహఫలమని కుచేలుఁడు భార్యయు ఆనాఁ డంతయు శ్రీకృష్ణునే తలఁచుచు పూజ లొనర్చిరి.

నిజదారసుతాదుల కిక శ్రీకృష్ణుని యనుగ్రహమున ఏలోటు కలుగదను ధైర్యము కుచేలునకు కలిగినది. తన కుటుంబసభ్యుల కెల్లరకు వేదశాస్త్రములు బోధించి జ్ఞాన మార్గ ముపదేశించెను. జిజ్ఞాసువులై వచ్చిన శిష్యలోకము నకు సాందీపునివలెనే కుచేలుఁడు కూడ సకలవిద్యలు

బోధించు పండితులను జేయును. ఇంటనున్న భోగభాగ్యములతో కుచేలున కవసరము లేదు, వానియం దిచ్ఛయును లేదు. యథాపూర్వము తన పెరటి చెట్టుక్రిందనున్న వేదికపై నిరంతరభగవద్ధ్యానమునందే తన కాలము నంతయు గడపును. దేహపోషణకు భగవత్ప్రసాదము రెండు మూడు కబళముల అన్నము చాలును.

కుచేలుడు నిర్మల సఖ్యభావమున శ్రీకృష్ణుని ప్రేమించిన సుహృద్వరుడు. శ్రీకృష్ణపరమాత్మను అకలంకభావమున స్మరించుచు శ్రీకృష్ణ చింతనమునందే తన జీవితకాలమంతమునంతయు గడపిన మహాభక్తుడు. అనన్యచింతనుడై పరమాత్మునియందు తాదాత్మ్యము నందగలిగిన బ్రహ్మభావుడు. భవముక్తిసంపదను చూఱగొని తుదకు శ్రీమన్నారాయణుని పాదారవిందముల చేరగలిగిన మహాభాగవతుడు. సకల భక్తలోకమునకు మేల్బంతి. ఆతని తపస్సు సఫలమై ఆత్మానందుడై యలరెను.

మానవజన్మ ధన్యమై సాఫల్యమంది గమ్యస్థానము చేరుటకు ధనధాన్యసంపదలతోగాని వైభవోపేతమగు యజ్ఞయాగాది కార్యములతోగాని పనిలేదు. కావలసినవి భగవానునియెడ చిత్తశుద్ధి గలిగిన అచంచల భక్తివిశ్వాసములు; నిష్కామసిద్ధిగల హృదయార్పణము. ఆలుబిడ్డలను పోషించుటకుగూడ లేని నిరుపేద కుచేలుడు. భగవదనుగ్రహమునకు పాత్రుడైన భక్తశిఖామణి యయ్యెను. నిరుపేదయని

గాని, ధనవంతుఁడనిగాని భగవానునకు విచక్షణ లేదు. భక్తుఁడు సమర్పించిన పత్రమైన, ఫలమైన, చివర కింత జల మైనను ప్రీతితో స్వీకరించును. తన భక్తుని భగవానుఁ డెన్నడును మఱవడు. భక్తుని యోగక్షేమములు తానే చూచుచు అవసరమైనప్పుడు తప్పక సాయపడును.

భక్తుఁడు భగవానుఁడు అనుమాట 'అటులుండ కృష్ణ కుచేలుల మధ్యఁగల సఖ్య మెట్టిది ? శ్రీకృష్ణుఁడు జగత్ప్ర సిద్ధుఁడైన యదుప్రముఖుఁడు. తన బాల్యమిత్రుఁడే గదా యను తేలికభావము కుచేలు డెప్పుడును చూపక శ్రీకృ ష్ణునియెడ సముచితమగు గౌరవమర్యాదలతో ప్రవర్తించెను. కుచేలుఁ డేమియులేని నిరుపేద'యని శ్రీకృష్ణుఁ డెఱుఁగును; అయినను తాను ఐశ్వర్యవంతుఁడనను గర్వభావము లేశ మైనను లేక తనతో సమానముగ కుచేలుని భావించి ఆదరిం చెను. చేయవలసిన సాహాయ్య మొనర్చెను. ఉత్తమోత్త ముల సఖ్యము లిట్లే యలరారును. వీ రిరువురి సఖ్యము మానవజాతికి మార్గదర్శకము.

కుచేలుని కథయందు ప్రస్ఫుటముగ ద్యోతకమగు పరమార్థము లివి.

2. శ్రవణము - పరీక్షిత్తు

కం. భూషణములు వాణికి నఘ
పేషణములు మృత్యుచిత్తభీషణములు హ
త్తోషణములు కల్యాణవి
శేషణములు హరిగుణోపచితభాషణముల్.

ఆం.భా. 1_46.

కం. విష్ణుకథారతుఁడగు నరు
విష్ణుకథల్ చెప్పు నరుని వినుచుండునరున్
విష్ణుకథాసంప్రశ్నము
విష్ణుపదీజలముభంగి విమలులఁ జేయున్.

ఆం.భా. 10_13.

అని శ్రీమదాంధ్ర భాగవతవచనము. లోకోత్తరములగు ఈ పద్యములలో చెప్పినట్లు, ఇహపరసౌఖ్యప్రదములగు విష్ణుకథలం దాసక్తి కలిగి విష్ణుకథాసర్వస్వమును భక్తిశ్రద్ధలతో విని భవముక్తిభాగ్యము నొందిన నరవరుఁడు పరీక్షిన్మహారాజు. ఈ మహనీయునకు భాగవతరూపమున విష్ణుగాథ లన్నియు బోధించిన దేశికుఁడు శుకయోగి. పరమపావనమగు పాండవవంశ సంజాతుఁడై, మహావీరుఁడగు పార్థునికి మనుమఁడు, యోధాగ్రేసరుఁడగు అభిమన్యుని పుత్రుఁడై జనించిన మహాపురుషుఁడు పరీక్షిత్తు. ప్రజల

శ్రేయమెఱిఁగి పరిపాలించుటలో తాతయగు ధర్మరాజును మఱపించిన మహారాజు పరీక్షిత్తు. జననసమయమునందే పురుషోత్తముఁడగు శ్రీకృష్ణభగవానుని చక్రపరిరక్షితుఁడై జన్మించిన భాగ్యశాలి. ఈ రాజలలాముని చరిత మెంత శ్లాఘ్యమైనదో ఈతని జన్మకథయు అంత విశిష్టమైనది.

కౌరవపాండవ మహాసంగ్రామము సమాప్తమయి పాండురాజపుత్రులగు ధర్మజాదులకు విజయలక్ష్మి లభించు సమయము వచ్చినది. ఇరువాగులందును ఎందఱెందఱో మృతినందిరి. కౌరవనాయకుఁడైన దుర్యోధనుఁడు తానెవరిని నమ్మి పాండవులతో భండనమునకు దిగెనో ఆ మహాయోధులు భీష్మ ద్రోణ కర్ణ శల్యాదు లాలమున గూలిరి. నిరాశాహతుఁడు, నిస్సహాయుఁడైన దుర్యోధనుఁ డొకకొలనులోఁ డాగియున్న ఒక నిశీథసమయమున ద్రోణపుత్రుఁడగు అశ్వత్థామ దుర్యోధను నోదార్చి ఆతని యానతిఁగొని రణభారము తన భుజములపై వైచికొని, పాండవు లెవ్వరును లేని సమయమున పాండవ శిబిరములందు నిద్రాసక్తులగు పిన్న పాపలను, ద్రౌపదేయులను దయాశూన్యుఁడై వధించెను. అంతతో విడువక పాండవవంశీయు లెచటనున్నను అపాండవ మగుగాక యని ఒక దివ్యాస్త్రమును మంత్రించి వదలెను. ఆ దివ్యాస్త్ర నిర్గతదుర్భరబాణాగ్ని అభిమన్యుని భార్యయగు ఉత్తరాగర్భాంతర్గత పిండమును ధ్వంసమొనర్ప నేతెంచుచున్నంత, వేఱొక దిక్కులేక ఉత్తర ఆక్రోశించుచు

శ్రీకృష్ణుని పాదములపైఁబడి ప్రార్థించినది. దేవా ! నీవు జగద్రక్షకుఁడవు, నీ చెల్లెలి కోడలను. నీ మేనల్లుఁ డభిమన్యుఁడు శత్రువులచే హతుఁడయ్యెను. నా గర్భముననున్న శిశువును దహింప ఈ మారణమార్గణాగ్ని వచ్చుచున్నది. ఈ శిశువునైన రక్షింపు రక్షింపుమని దీనాలాపయై వేడుచున్నంత ఆశ్రితవత్సలుఁడగు శ్రీకృష్ణుఁడు తన చక్రముచే అశ్వత్థామ అస్త్రమును నివారించి ఆ శిశువును రక్షించెను. పుట్టుకమునుపే శ్రీకృష్ణభగవానుని కృపకు పాత్రుఁడైన మహాత్ముఁ డాశిశువు. ఆతఁడే పరీక్షిత్తు.

తన వంశమును నిలపఁగల మగబిడ్డ జన్మించినందులకు ధర్మరాజు చాల ఆనందమునంది, ధనధాన్యములు, గోవులు, భూములు, గజతురగములు, వాహనములు బ్రాహ్మణులకు విరివిగ దానము చేసెను. వారందఱు చాల సంతృప్తులైరి. దైవజ్ఞు లాశిశువు జాతకమును చూచి ఇతఁడు ధార్మికుఁడు ధాత క్రతుకర్త కీర్తిశాలి వీరుఁడు చక్రవర్తి కాఁగలఁడని పలికిరి. కాని విప్రశాపమున ఇతనికి మరణము సంభవించును. అయినను అంత్యకాలమున విరాగియు, జ్ఞానియునై హరిపాదపద్మముల జేరుకొను మహాభక్తుఁ డగునని కూడ వచించిరి. శ్రీవిష్ణువు అవతారమగు కృష్ణుని దయవలన రక్షింపఁబడుటచే ఆ శిశువునకు విష్ణురాతుఁడను నామమిడిరి.

ఉత్తరాగర్భస్థుఁడై యున్న విష్ణురాతుఁడు తనమీదకు అశ్వత్థామ ప్రయోగించిన నారాయణాస్త్రము అగ్నిజ్వాలలతో వచ్చుచుండగా, శ్యామలవర్ణుఁడు, కిరీటధారి, మహాతేజస్వి యయిన పురుషుఁ డొకఁడు అంగుష్ఠమాత్రుఁడయ్యు గదను ధరించి ఆ యస్త్రమును తిరుగగొట్టి తనను రక్షించుట చూచెను. జన్మించిన తరువాత విష్ణురాతుఁడు తల్లి గర్భమునం దున్నపుడు తాను చూచిన తేజస్వి కొరకు ప్రతిపురుషుని పరీక్షగ చూచుచుండుటవలన 'పరీక్షిత్తు' అను నామమును బడసెను.

భారతసంగ్రామమున విజయుఁడై ధర్మరాజు తన సోదరులు నలువురి సాయముతో హస్తినాపుర సామ్రాజ్యమేలుచుండెను. కొంతకాలము గడచినది. పెద్దలందఱు ఒకరొకరే గతించిరి. శ్రీకృష్ణుఁడు పరమపదమున కేగెను. తల్లి కుంతి మరణించినది. గాంధారీ ధృతరాష్ట్రులు తనువులు చాలించిరి. విదురుఁడును దివంగతుఁ డయ్యెను. తానిక చేయవలసినది లేదని ధర్మజునకు తోచినది. పరీక్షిత్తు పెరిగి పెద్దవాఁ డయ్యెను. తాతయగు అర్జునునివద్ద బాణవిద్యయు, పెదతాతయగు ధర్మజునికడ రాజనీతితో బాటు సకలశాస్త్రములను అభ్యసించెను. ధర్మజుఁడు పరీక్షిత్తునకు హస్తినాపుర సామ్రాజ్యము పట్టముకట్టి, భార్య సోదరసహితుఁడై మహాప్రస్థానమున కేగెను.

పరీక్షిత్తునకు గోవన ప్రాప్తితో హస్తినాపుర సామ్రాజ్యప్రాప్తియు గలిగినది. మేనమామయగు ఉత్తరుని పుత్రికయగు ఇరావతిని పెండ్లాడి జనమేజయాది ప్రముఖుల నలువురిని పుత్రులుగాఁ బడసి పరమధార్మికుఁడై ధరాపాలనము సాగించుచు, కృపాచార్యుల గురుత్వమున మూఁడశ్వమేధముల నిర్విఘ్నముగ నెఱవేర్చి, దేవతలఁ దృప్తిగావించి గోభూధనధాన్య వస్త్ర దానముల విరివిగ నొనర్చి అర్థులై వచ్చినవారి కనంతప్రమోదము గూర్చెను.

అశ్వమేధయాగ సమయమ్మున దిగ్విజయార్థంబు సశరశరాసనుండయి చతురంగబలంబులు వెంట నడువ జంబూద్వీపమంతయు విజయశీలియై విహరించుచు కురుజాంగల దేశమున పాపాత్ముఁడగు కలి ప్రవేశించుట విని కలిని నిగ్రహించు కౌతూహలమున నరుగు పరీక్షిత్తున కొక విషాద దృశ్యము గోచరించినది.

తపశ్శౌచదయాసత్యమ్ములను నాలుగు పాదముల నడచు ధర్మదేవుఁడు వృషభరూపమున ఏకపాదమున తిరుగుచు, ఆచెంత లేగలేని లేగఁటి ఆవురూపమున భూదేవి కన్నుల నశ్రులు కాల్వలుగట్ట దుఃఖించుచుండుట చూచి, దేవీ! నీకేల ఈ దుఃఖము? శ్రీకృష్ణుఁడులేని యీ క్షితితలమున నింక సకలధర్మములు సజ్జనత్వము లుడిగ పాపమే పాలించు ననియా నీ భయమని ప్రశ్నింపగా గోరూపయగు భూదేవి యిట్లు మొఱవెట్టినది. అయ్యా! ఆశ్రితవత్సలుఁ

డును, సాధుజన సంరక్షకుఁడును, సకల సద్గుణ శోభితుఁడు నగు శ్రీకృష్ణదేవుఁడు వైకుంఠమున కేగెను. భూఖండమున నేమి మిగిలినది ? అశుభప్రతిపాదకమగు కలియుగమే తెంచినది. నాలుగు పాదములుగల ధర్మరూపుఁడవగు నీకు నేఁడొక పాదమేగద నిలిచినది. కలి ప్రభావమున వర్ణాశ్రమ ధర్మము లడుఁగంటును. సురలకు, మునులకు, పితృదేవతలకు, సజ్జనులకు, నాకు, నీకును. గోగణమ్మునకు నానాబాధ లుప్పతిల్లునని కుందుచుంటి. శ్రీకరుఁడగు శ్రీకృష్ణుఁడు నాపై నడుగిడిన చోటులెల్ల సకల సస్యసంపత్కరములై శోభిల్లుచుండినవిగదా ! ఆ రమణీయ విగ్రహుని వర్ణింపఁదరమా !

ఉ. ఆమధురోక్తు లానయము లాదరహాసము లాదయారసం
 బామురిపంబు లాతగవు లాగమనక్రియ లామనోహర
 ప్రేమకరావలోకనము ప్రీతికనుంగొనలేమి మాధవుం
 గామిను లేల నిర్దళితకర్మలు యోగులు బాయనేర్తురే.

అని కీర్తించుచున్న సమయమ్మున ధనుర్బాణ తూణీరసంయుతుఁడగు పరీక్షిన్నరపాలుఁ డచ్చటి కేతెంచి యా గోమిథునమ్మును జూచి యబ్బురపడుచుండ, సర్వోన్నతుఁడు, మహాదండధరుఁడు, చండాలాకృతినున్న నృపాలాకారుఁ డొకడు నిర్దాక్షిణ్యమున నా ధేనువృషభంబుల రెంటిని కఠినముగ కాలఁదన్ని నేలఁబడగొట్టెను. ఆ మహాఘోరదృశ్యమును చూచినంతనె పరీక్షిత్తునకు మోమునగల

ఆనందమంతయు అదృశ్యమై ఆగ్రహావేశములు తాండవించి నవి. ప్రసన్నవచనములతో ఆధేనువృషభంబుల నోదార్చి కన్నుల నిప్పులురాలు మహోగ్రరూపుఁడై యా భీకరా కారుని జూచి ఓరీ! పాపాత్మా! నీ వెవ్వఁడవు? ఈ సాధు జీవుల నకారణముగ హింసించు పాపకార్యంబున కొడగట్టి తివి? ధర్మజార్జునుల మనుమఁడు పరిక్షిత్తు పాలించు కాల మున నీ కంటకములు సాగవని, ధగధగాయిత ప్రభామండి తమ్మగు ఖడ్గంబెత్తి-

నిన్నుం గొమ్ములఁజిమ్మెనో కదిసెనో నిర్భీతివై గోవులం
దన్నం గారణమేమి మద్భుజసనాథక్షోణి నేవేళలం
దు న్నేరంబులు సేయరాదెఱుఁగవా ధూర్తత్వమున్ భూమిభృ
త్సన్నాహంబు నొనర్చి తెవ్వఁడవు నిన్ శాసించెదన్ దుర్మతీ!

I-415.

అని మృగముపై లంఘించు మృగరాజుపగిది తనపైకి దుర్వారుఁడై వచ్చు పరీక్షితుం గని, కలి భయభ్రాంతుం డయి ఆకంపితాంగుడయి రాజరూపమును విడనాడి రక్షింపు మని పరీక్షిన్నరపాలుని పాదంబులపైఁబడి ప్రార్థింపసాగెను. మహాపాపముల కన్నిఁటికి కలి ఆశ్రయమని యెఱిఁగియు, భయాకులితులను ఆశ్రితులను చంపనొల్లని సాధుమూర్తి యగు పరీక్షిత్తు ఓయీ, నీవు పాపరూపుఁడవు. నిన్ను అసత్య లోభ చౌర్య దౌర్జన్య దురాచార మాయా కలహ కలు

షమ్ము లాశ్రయించు గావున సత్యధర్మములకు నివాసమగు ఈ బ్రహ్మవర్తదేశమ్మున నుండఁదగవు. అసత్య మద కామ హింసా వైరంబులు గల ప్రదేశంబులే నీ నివాసంబులగుం గావున కదలి పొమ్మని శాసించెను. పరీక్షిన్నరువరుచే నట్లు నిగ్రహింపఁబడి నిర్జితుఁడైన కలి దూరుఁడై యేగినంత పరీక్షిత్తు ఆ ధేనువృషభంబుల జూచి, దుష్టనిగ్రహమ్మునకు శిష్టజనానుగ్రహమ్మునకు సాధువులగు జంతువులకు బాధలు లేకుండ జేయుటకుగదా రాజన్యుల నా రాజీవభవుడు సృష్టించినది. నా శక్తి కొలఁది నేనా ధర్మమును నిర్వహింతును. ధర్మదేవ భూదేవ్యాకారులైన మీరిక నిర్భయముగ నుండుడని సమ్మదితులఁజేసి బంపెను.

పరీక్షిన్మహారాజు ధర్మపరిపాలనము సర్వజనసమ్మోదకరముగ సాగుచున్నది. ఏకడఁజూచినను ఆ రాజవర్యుని పేరు చెప్పకొనువారే. వర్ణాశ్రమధర్మము లకుంఠితమ్ముగ నెఱవేరుచున్నవి. ఋషుల తపోవ్రతవిధులన్నియు నిరాటంకముగ సాగుచున్నవి. ఎవరికే బాధ కలిగినను చారుల వలన తెలిసికొని తన్నివారణ కార్యమును వెనువెంటనే ఆ రాజు నిర్వర్తించును. తండ్రి తాతల పరాక్రమ సాహసములును, పెదతాతయగు ధర్మజుని రాజనీతియు ధర్మబుద్ధియు రూపుదాల్చిన మూర్తి యతఁడు. కాలమిట్లు నడచుచున్నది.

పరీక్షిన్నరపాలుని కొలువుకూటమున కొకనాఁడరణ్యప్రాంతముల వసించు జనులు పెక్కుమంది దేతెంచి "మహారాజా! అరణ్యములందు వరాహ వ్యాఘ్ర భల్లూక వేదండాది వన్యమృగము లసంఖ్యాముగ పెచ్చుపెరిగిపోయినవి. ఆ జంతుసమూహములు పంటభూములు ఫలవృక్షములపైబడి పాడుచేయుటయేగాక ప్రాణిహింసకుగూడ పాల్పడుచున్నవి. కరుణించి తమరీబాధను నిరోధింపవలయు"నని ప్రార్థించి చనిరి. మఱునాఁడే పరీక్షిత్తు బాణాయుధపాణియై పరివారపరివృతుండయి అరణ్యములకు వేటకేగి క్రూరమృగముల నెన్నిఁటినో కూల్చి కూల్చి తృప్తిపడక దుర్గమంబులగు నడవులకు దానొక్కఁడరిగి క్రూరజంతువుల వేటాడి వేటాడి ప్రొద్దు వాటారుసరికి దప్పిగొని యాపరిసరమ్ముల జలము లభించునేమోనని తిరిగితిరిగి నిష్ఫలుఁడై ఒకింత దూరముననున్న మున్యాశ్రమమ్మున కేగుదెంచి యచ్చట ధ్యానముద్రలోనున్న శమీకుఁడను మునిని దప్పి తీర్చుకొనుటకు జలమిమ్మని వినయముగ నడిగెను. మరల మరల ఆమునిని మేల్కొల్పఁ జూచెను. సమాధిస్థితుఁడైన యా శమీకమునీంద్రుఁ డీప్రపంచమునందే లేడు. పిలచిన పలుకడు, కనులుదెప్పి కదలడు. పిపాసాతురుఁడైన పృథ్వీశునకు విసువెత్తినది. దాపుననున్న ఒక మృతసర్పమును వింటికొప్పున నెత్తి ఆముని గళమున వ్రేలవైచి వెనుదిరిగెను.

హస్తినాపుర మహాసామ్రాజ్యాధిపుఁడైన పరీక్షితున కాసమ
యమున త్రాగుటకు గ్రుక్కెడు నీరము నిచ్చువారు లేరు.

ఆ తరుణమున నచ్చటనున్న బాలకులు కొందఱు
పరువెత్తి యీ వార్తను శమీకుని పుత్రుఁడగు శృంగితో
నుడివిరి. ఆతఁడు తండ్రిని జూచి భీతిల్లి యీ నీచపుకార్య
మొనరించిన నృపునిపై మహోగ్రహుఁడై -

ఓడక వింటికోపున మృతోరగముంగొనివచ్చి మాఱుమా
టాడకయున్న మజ్జనకు నంసతలమ్మునబెట్టి దుర్మద
క్రీడ చరించు రాజు నరకేశవులొడ్డినఁ గావఁ జచ్చుబో
నేడవనాఁడు తక్షకఫణీంద్రవిషానలహేతిసంహతిన్.

అని దారుణ మారణ వాక్యమ్ముల శపించి, రాజు
లైనవారు భోగభాగ్యముల కుడుతురు గట్టుదురు గాని
సాధువులైన మునుల నిట్లు సేయుదురే యని పల్కుచున్నం
తలో శమీకమహామునియు మేల్కాంచి కంఠసీమనున్న
సర్పమును దీసి పాఱవైచి, పరీక్షిన్నరపతికి తన తనయుఁ
డిచ్చిన శాపమును విని కుమారుని కార్యమున కేమాత్ర
మును సంతసింపక విచారమగ్నుఁడై "అయ్యో! ధార్మికుడు.
ప్రజలను మునులను కన్నబిడ్డలవలె గాపాడు ఘనకాంతుడు
పరీక్షిన్మహారాజునకా యీ శాపము" అని దుఃఖించెను.
శృంగి శాపమునకు తిరుగు లేదు. క్షితిపాలునకు మృతితప్పదు.
అనాలోచితమునఁ జేసిన యిట్టి యకార్యమునకు శమీకు

డాత్మజుం జూచి. "పుత్రా! పుణ్యచారిత్రుఁడగు భూపుని మరణమునకు కారకుఁడ వైతివిగదా. బలవంతుడు ధర్మ పరిపాలకుఁడైన పరీక్షిన్నరవరునివంటి ధరణీశుఁడు లేని పుడమిని పుణ్యము లడుగంటి పాప కార్యములై ప్రబలునని యెఱుగవా-

ఉ॥ భారతవంశజుం బరమభాగవతున్ హయమేధయాజి నా
చారవరున్ మహానయవిశారదు రాజకులైకభూషణున్
నీరము గోరి నేఁ డిట మన నేలకు వచ్చిన యర్థి భక్తి స
త్కారము జేసి పంపఁ జనుగాక శపింపగ నీకు ధర్మమే.

యని నిందించి. శాపము ప్రత్యాహరింప లేని నిస్సహాయుండై, కొడుకు చేసిన పాపంబునకు సంతాపంబు నొంది, యేతద్వార్తను మఱునాడే తన శిష్యులనంపి రాజున కెఱింగించెను.

తనకుఁ గలిగిన శాపవార్తను నిశ్చలచిత్తుఁడై పరీక్షిత్తు వినినాడు. ఆహా, యెంతలో యెంత వాటిల్లినది. వేటకేల పగితిని. ఏగినవాడను వేగముగ వెనుదిరిగి రాక ఆ ముని యాశ్రమమున కేగి ధ్యాన సమాధియందా తాపసవరుఁ డుండుట చూచియు చచ్చిన పామును దెచ్చి సంయమీంద్రుని మెడకేల చుట్టితిని. ఈ వైపరీత్యమున కిది ఫలముకదా.

కం. గోవులకును బ్రాహ్మణులకు
దేవతలకు నెల్లప్రొద్దుఁ దెంపున బీడల్

కావించు పాపమానస
మేవిధమున బుట్టకుండ నే వారింతున్.

అని పశ్చాత్తప్తుండై పరీక్షిత్తు మునికుమారునకు ప్రతిశాప మిన్నాయ సర్వసమర్థుం డయ్యును, వాక్సిద్ధి భాజనుడయ్యు కించిత్తైనను కినుక వహింపక తన కరణీయము నాలోచింపం దొడగెను. పరమ భాగవతు లెపుడును యెట్టి యప్రియము లైనను అపచారములైనను సహింతురే గాని మాఱుసేయ నేరరు. అందునను పరీక్షిత్తు ప్రజలకు మేలొనరించు మేదినీశుండే గాని యెగ్గుందలపోసి యెఱుంగని యేలిక –

నేనొక రాజుననుచు రాజగర్వమున మునిరాడ్వాటిక కేగి, మునివరునకు అపచార మొనరింప, మునిసుతుండు నన్నేల దిట్టకయుండునని యా శాపశిక్ష కధీనుండై, హరి చరణ భక్తి పరత్వమున నరిషడ్వర్గంబుల గెలిచినవాడుగావున, తనకీ శాపఫలము విరక్తి బీజము గావలెననుచు పరీక్షిన్మహామనస్వి ఒక్క త్రుటికాల మాత్రమున సర్వ సంగ పరిత్యాగియయ్యె. రాజ్యభోగములు, భూలోక స్వర్గలోక సౌఖ్యములు తన ప్రాణములు యా మహానీయుని తలపున తృణమాత్రముగూడ విలువ లేనివయ్యెను. హరికథా శ్రవణ హరిరూపచింతనా చరణములకంటె వేఱొక కరణీయము శరణమ్మునాదని, నిరశన దీక్షా నియతుండై, కలి దోషం బులంబాపగలిగిన గంగా ప్రవాహము లోపలికింజని చిత్తము గోవింద పదాయత్త మొనర్చి ప్రాయోపవేశమ్ముం బూనెను.

ఆ మహనీయుని మనోవాక్కాయ కర్మములు శ్రీహరి భావ భావితములై, సర్వము శ్రీహరి మయమై భాసించెను. ఆ క్షణమున తనయందు అఖిల భూతములందు అఖిల భూతాత్మకుఁడైన హరినిగాంచిన పరమానందమయుండు పరీక్షిత్తు పరమఋషులకుగూడఁ బడయరాని బ్రహ్మభావమది-

పరీక్షిత్తుని ప్రాయోపవేశవార్త నలుదిశలకు ప్రాకినది. కలనైనను తలఁపరాని యీ సంఘటనము ప్రజలను దిగ్భ్రమయందు ముంచివైచినది. శిరమున పిడుగులే పడినట్లు యెచ్చటివారచ్చట నిశ్చేష్టులైరి. ఈ వార్త చెవులబడినంత నారద అత్రి వసిష్ఠ విశ్వామిత్ర మైత్రేయ భృగు పరాశర వ్యాసాది దేవర్షి బ్రహ్మర్షి రాజర్షి వర్యులు శిష్య ప్రశిష్య గణములతో ప్రాయోపవిష్టుఁడైన యా మహారాజును జూడవచ్చిరి. పవిత్ర తీర్థ ప్రదేశంబులకైనను పావిత్ర్య మాపాదింపగల మహత్త్వముగల వారా మహర్షులందఱును- వారిని చూడఁగనే ప్రఫుల్లవదనుఁడై ప్రణామ సత్కారము లాచరించి పరీక్షిత్తు నిర్మల హృదయుఁడై ఇట్లు ముక్తకంఠమున ప్రార్థించినాడు.

ఉ॥ ఓపిక లేక చచ్చిన మహోరగముం గొనివచ్చి కోపినై
తాపసుమూపుపై నిడిన దారుణచిత్తుఁడ మత్తుఁడన్ మహా
పాపుడ మీరు పాపత్రణపావను లుత్తము లయ్యలార నా
పాపము వాయుమార్గము కృపాపరులార విధించి చెప్పరే.

అయ్యా! సంసార వ్యాకులతతో చీకాకుపడుచున్న నా చిత్తమున కేడు దినములలో ననుదాకి మృతినొందింపనున్న తక్షక కాకోదరవిషము ముక్తి కారణమైనది. ఈ యేడు దినములలోన నను ముక్తిపదమునఁ జేర్చగల ముకుందు పుణ్యగాథలను చదువుడు వినిపింపుఁడని వినయుఁడై వేడు పుడమిరేని నా మునిరాజులు ప్రసన్న ముఖారవిందులై వీక్షించి రాజా ! నీవు ఉత్తములలో ఉత్తముడవు, పావన వంశీయుడవు. మీ తాతలందరు పరమపదమును వాంఛించి సామ్రాజ్య భోగములను వర్జింపగలిగిన వరిష్ఠులు. నిరంతర నారాయణ ధ్యానపారీణుఁడవైన నీవు బ్రహ్మపదమును జేరునంతదనుక మేమిందేయుండి దివ్యతేజః ప్రభావుఁడవైన నిన్ను వీక్షించుచుండెదమని మాధుర్య ధుర్యంబులైన గంభీర భాషణంబుల నుడివి ఆ రాజముఖ్యునికి ముదమొదవించిరి.

అంతలో నచటికి బ్రహ్మతేజస్వియగు బాల సన్యాసి శ్రీశుకయోగి అరుదెంచెను. ఆ మహనీయుని ప్రభావము నెఱుగుదురు. గాన అచ్చటున్నన్న యతివరులందఱేగి ఎదురేగి శుకుని తీసికొని వచ్చిరి. అవధూతాకారుఁడు, నిరంతరాత్మ చింతనుఁడు నయిన శుకయోగికూడ ఆసమయమున నచటి కేతెంచుట తన భాగ్యముగ పరీక్షిత్తు భావించి దండ ప్రణామమ్ము లాచరించి అతిథి సత్కారమ్ము లొసఁగి, శ్రీశుకయోగీంద్రా! నీరాకచే నేను ధన్యుఁడనైతి, ముని

కుమారుని శాపమున నాకేడు దినములలో మృతి సంభవించుట తప్పదు. నా మనస్సు సర్వ రక్షకుండైన శ్రీహరి చరణారవిందములయందే లగ్నమై యున్నది. దేహధారి యేమి చింతించిన, యేమి సేవించిన, యేమి వినిన భవమోక్షము బడయంగల్గునో, గురుదేవా! ఆ పవిత్ర వాక్యములు నాకు వినిపించి నన్ను చరితార్థుని జేయగదే ,అని వేడెను. ఆ మహారాజుకోరిక వినగనే శుకయోగి కమితానందము గలిగినది. అంత్య దశలో మానవుని కెట్టి దైవచింతనాభిలాష కలుగవలెనో అది పరీక్షిత్తునకు గలిగినది. అమలము అచంచలము అపవర్గ సాధనము అయిన హరిభక్తిభావము నాటుకొనుటకు ఆరాజు మనస్సు సిద్ధముగా నున్నది. వినయుండై శ్రద్ధాళువై వినుచున్నాడు.

ప్రాయోపనిష్టుడై భగవచ్చింతనుడైన పరిక్షీన్న రేంద్రునికి శుకయోగి తన ప్రబోధ మారంభించినాండు.

రాజేంద్రా ! నీకతి శ్రేష్టమగు మనోవాంఛ కలిగినది. వినుము, సంసారమగ్నమానసులు ధనధాన్య సతీసుతాదులు శాశ్వతమని మోసపోదురు. చివరి దినములందైనను నిజమును గానరు.

కం. కావున సర్వాత్ముండును మ
హావిభవుండు విష్ణుండీశుం డాకర్ణింపన్
సేవింపను వర్ణింపను
భావింపను భావ్యుడభవభాజికి నదిపా ॥

నిర్గుణ బ్రహ్మశ్రేయమునందిన మానసము సాంఖ్య యోగమున అంత్యకాలమందు హరిచింతన మొనర్చుట జన్మ సాఫల్యసిద్ధికి మార్గము - నా తండ్రి వ్యాసమహర్షి వ్రాసిన మహాకావ్యము బ్రహ్మ సమ్మితమగు భాగవతము దానిని నేను పఠించితిని. వాసుదేవనామ వర్ణములు, మోక్ష ప్రాప్తి సాధనములు అయిన ప్రబోధము లాగ్రంథమందున్నవి. నీ వద్దానిని వినుము. తొల్లి రెండుగడియల కాలములో, తన రాజ్య వైభవమును త్యజించి సురవరులీయఁబోయిన వరముల గూడ నొల్లక ఖట్వాంగుఁడను రాజు గోవిందనామ కీర్తన గావించి గాఢవైరాగ్యమును ముక్తిని చూఱఁగొనెను. నీకేడు దినములకుగాని మరణము లేదు. నీవు నన్నడిగిన విశేషము పూర్వము బ్రహ్మ మాధవుని వలన విని నారదునకుఁ జెప్పెను. నారదుడు నాకది ప్రసాదించెను. దానిని నీకు బోధించెదను, వినుమని శుకయోగీంద్రుఁడు శ్రీహరిని తన చిత్తమునఁ దలఁచి ఆత్మతత్త్వమును గూర్చియు మోక్షసాధనను గూర్చియు పరీక్షిత్తున కిట్లు నుడివెను.

మోక్షకామియగువాడు సంసార మోహమును త్యజించి శుచి ప్రదేశమున, కుశాజిన చేలముల పఱచిన ఏకాంత స్థలమున ఆసీనుడై, నిర్మలము దృఢమునగు చిత్తమున, ఇంద్రియముల నాయా విషయసుఖములను పరువిడ నీయక బంధించి హరిచింతనుఁడు కావలెను. సకల విశ్వము

హరిమయమే, హరిమయముగాని పరమాణువైనను లేదు. ఆ పరమేశ్వరుఁ డఖిల జీవుల హృదయములందుండి వారి బుద్ధి వృత్తుల వీక్షించుచుండును. ఆ పరమేశ్వరు నెఱుఁగని ప్రాణి మూఢత్వమున దుష్కర్మ లాచరించుచు తత్కర్మ ఫలమున మరల మరల పుట్టుచు చచ్చుచు సంసార పాశము లందు జిక్కుకొని నరకబాధల ననుభవించుచుండును. సౌధ ప్రాసాద సుఖ శయ్యా భోజనాదు లెందులకు ? ప్రకృతి సిద్ధములైన సౌఖ్యము లనేకము లున్నవి. పర్వత గుహలు శాద్వల స్థలులు నదీజలములు తరుఫలములు మున్నగునవి, భగవచ్చింతనున కివిచాలును. మహాసుందరాకారుఁడు బహు విధ భూషణాలంకృతుఁడు, బహువిధాకారుఁడు, సంతతా నందమయుఁడు, సంతతానుగ్రహశీలావదనుఁడు, ప్రాణుల హృదయకమలకర్ణికాస్థితుడైన పరమేశ్వరుని ధ్యానించుచు నరుడు తద్రూపములను పరిపూర్ణ నిశ్చల భక్తియోగంబు సిద్ధించువరకు చింతనమందు నిలుపవలయును.

తనువును త్యజించి బ్రహ్మ సాయుజ్యమందఁగోరు యతికి కాలదేశములతో పని లేదు. బుద్ధిచే ప్రాణ వాయువును బంధించి జీవాత్మను బ్రహ్మమునందు గలుపును. ప్రాణము బిగియఁబట్టి దిగువనున్న మూలాధార చక్రమును నాభితలమున జేర్చి వక్షమున కెగయబట్టి హృదయ పద్మ మున ప్రాణవాయువును నిలిపి, ప్రణవరూపమున పరమాత్మ నెంచుచు, కనుబొమల మధ్యకు ప్రాణవాయువును దెమల్చి

నేత్రములు, చెవులు, ముక్కు, నోరు మూసి, ఇంద్రియ వ్యాపారము లరికట్టి ప్రాణములను వంచి శిరోవీథినున్న బ్రహ్మరంధ్రమును చించి పరబ్రహ్మమున గలియును- అట్టి యోగి, పరమాణుభూతమైన సుషుమ్నా నాడివెంట నగ్నిని అధిదేవతంజేసి జ్యోతిర్మయంబైన లింగ శరీరమున, తారా మండలము, సూర్యాది ధ్రువాంత పదములు, మహర్లోకము దాటి హరిసంబంధమగు శింశుమార చక్రముజేరి బ్రహ్మలోకమునందు వసించుచు మరల తిరిగిరాడు. ఆత్మానందమయమైన బ్రహ్మస్థితి యది. పరమసిద్ధ యోగులు విష్ణుపద ధ్యానులు వెడలు ప్రదేశమది.

పరమ భాగవతులు పాటించు నీ పథముననేగిన యోగికి పునర్జన్మ లేదు. వేదగీతలందు సద్యోముక్తియు క్రమముక్తియని రెండు తెఱగులున్నవి. తపోయోగాదులైన పెక్కు మోక్ష మార్గములందు భక్తిమార్గము సంసారగతులైన వారికి సులభ సాధ్యమైనదియు, ముఖ్యమైనదియును దానిని వినుము.

వేదము నంతయు మున్ను బ్రహ్మ ముమ్మాఱు పరామర్శించి జనార్దనుని భక్తిభావమున సేవించుటయె సులభమార్గమను నిర్ణయమునకువచ్చెను. అఖిల భూతములందును ఆత్మరూపకుఁడగు హరికథామృతమును వీనులవిందుగ వినువారు ధన్యులు. అహరిశ్నములు సేవనీయుడు వందనీయుడు భక్తవత్సలుఁడు ఆ హరియె. ఆ పరమాత్ముని దివ్య

గాథలు యెట్టివారికైనను శ్రవణానందదాయకములే. వ్యర్థములైన పశువులు, శునకాదులు తిరుగునట్లే ధర్మార్థచింతయు ముక్తికాంక్షయులేని మనుష్యపశువు సంసార బంధమునఁబడి బాధల నొందుచుండును. వేయేల రాజేంద్రా! ఒక్క పలుకాలకింపుము—

సీ॥ విష్ణుకీర్తనముల విననికర్ణంబులు
కొండబిలంబులు కువలయేశ
చక్రిపద్యంబులఁ జదువనిజిహ్వాలు
కప్పలజిహ్వాలు కౌరవేంద్ర
శ్రీమనోనాథు నీక్షింపనికన్నులు
కేకిపింఛాక్షులు కీర్తిదయిత.
కమలాక్షుపూజకుఁ గాని హస్తంబులు
శవముహస్తంబులు సత్యవచన
హరిపద తులసీదళామోదరతి లేని
ముక్కు పందిముక్కు మునిచరిత్ర
గరుడగమను భజనగతిలేని పదములు
పాదపముల పాదపటల మనఘ.

సీ॥ నారాయణుని దివ్యనామాక్షరములపై
గరగనిమనములు కఠినశిలలు,
మురవైరికథలకు ముదితాశ్రురోమాంచ
మిళితమైయుండని మేను మొద్దు,

చక్రికిఁ మ్రొక్కని జడుని యొడలనున్న
కనకకిరీటంబు కట్టెమోపు
మాధవార్పితముగా మనని మానవుసిరి
వనదుర్గ చంద్రికావైభవంబు

కైటభారిభజన కలిగియుండనివాడు
గాలిలోననుండి కదలుశవము
కమలనాభుపదము గననివాని బ్రదుకు
పసిడికాయలోని ప్రాణి బ్రదుకు-

ఇట్లుపన్యసించుచున్న శ్రీశుకుని ప్రబోధామృత వృష్టియందు పరిక్షిత్తు హృదయము కరగిపోయినది. మేను పులకించినది. తన సర్వస్వము శ్రీహరి మయమైనట్లు తోచినది. ఆహా! పరమాత్ముఁడగు హరి చింతనములేని బ్రతుకు నిరర్థకము వ్యర్థము కదాయనుకొని శ్రీశుకయోగీంద్రుఁడింతవఱకు నుడివిన ఆత్మతత్త్వము యోగమార్గము భక్తిభావము పునర్విమర్శించుకొని ఒకనిమేషమాత్రము సమాధిగతుఁడైనట్లు నిస్పృహుఁడై యుండిపోయెను. శ్రీశుకుని ప్రవచనములు మధుర మధుర నినాదములై చెవులలో మ్రోగుచున్నవి. తనలోనున్న పరమాత్మ ఒకపరంజ్యోతీ రూపముగా భాసించుచు తన సర్వస్వము ప్రకాశమానము చేయుచుండెను. చుట్టునున్న వారందఱు పరమాత్మ స్వరూపులే. ప్రత్యణువు పరమాత్మమయమే. తాను మరణించి

నను జీవించినను తన మనోనేత్రమున కొకకే మార్గము గోచరించుచున్నది. వినవలెను, విష్ణుదేవుని గాథలన్నియు వినవలెను, మనసార వినవలెను — కనులార ఆ జగన్నాథుని కనవలెను. తత్పదసన్నిధికి జనవలెను, మోక్షసామ్రాజ్యమును చూఱగొనవలెను. ఇదియే తపన. తక్కిన లోకముతో తనకొక నిమేషమాత్రమైన సంబంధములేదు. ఆ హరికథా శ్రవణ భక్త్యావేశములో కనులు తెఱచి శుకయోగీంద్రుని చరణములవ్రాలి పరీక్షిత్తు—

“గురుదేవా, శుకయోగీంద్ర! నీ పలుకులలోని మహత్తరశక్తి యేదియో నన్నాకర్షించి లాగివేయుచున్నది. ఆ పలుకులయందలి పరమార్థతేజమేదియో నన్నుగ్రమ్మిచు నా చుట్టునున్న సర్వమును పరమాత్మమయముగా చేయుచున్నది. నీవు సర్వజ్ఞుడవు. నీ వొనరించిన సర్వాత్ముని సంస్తుతితో నా మనస్సున సర్వభ్రాంతులు వదలిపోయినవి. జగదాశ్రయమైన సర్వేశ్వరునిఁజేరుటయొకక్కటే నా యాశయము. మిగిలియున్న ఈ కొలఁది దినముల జీవితకాలములో కరుణించి నీవు నాకు చెప్పగలిగినదంతయు చెప్పుము. ఆపరమాత్ముని గాథలు వేయివీనులతో విందును. ఆ పరమాత్ముని కథామృతము మనసార ఆస్వాదింతును. ఆ పరమాత్ముని రూపమును నా హృదంతరమున స్థాపించి సమ్మానింతును — సర్వేశ్వరుఁడు విష్ణుఁడైన హరి సృష్టి

స్థితిలయముల నెట్లొనర్చెను. సర్వసమర్థుడైన యాతడు ఏ శక్తుల నాశ్రయించి బ్రహ్మాది దేవతా రూపము లందెను. ఏకరూపుండై యుండు హరి భిన్న రూపముల నేలఁదాల్చెను. ఏమేమి చేసెను. ఆ జగన్నాథుని లీలలు సర్వమెట్టివి. దుష్టుల శిక్షించి సాధుల నెట్లు సంరక్షించెను. ఆచార్యా! ఈ హరికథా సర్వస్వమువిన కుతూహలుఁడనైతినని, పులకితదేహుఁడు, అశ్రుసిక్తనయనుఁడై పరీక్షిత్తు శుకయోగీంద్రుని ముందు భక్తి శ్రద్ధలు రూపుదాల్చిన మూర్తియో యన, బద్ధాంజలియై కూర్చుండెను -

పరీక్షిత్తు మనః స్థితిఁ జూచి శుకముని పరమాశ్చర్య భరతుఁడయ్యెను. ఆహా ! యీ క్షణమువఱకు సకలసామ్రాజ్య వైభములఁ దులతూగుచున్న ఈ రాజేంద్రునికి శ్రీహరియందు యెంత భక్తిభావ ముదయించినది! యెంత తాదాత్మ్యము సిద్ధించినది! యెంతగాఢమైన మోక్షకాంక్ష జనించినది- వైరాగ్యమనిన ఇట్టులుండవలెను. ఇట్టి జనుఁడే కద జీవన్ముక్తుడు- ఇంక ఎక్కువ సమయములేదు. కాలము మహావేగమున గతించుచున్నది- మరణోన్ముఖుఁడు మాధవ చింతనుఁడు, జన్మించినదాది సచ్చరిత్రుఁడు ధర్మపరిపాలకుఁడైన మహాభక్తునకు ఈశ్వరునిగూర్చి బోధించు సదవకాశము తనకు కలిగినది -

శ్రీమహావిష్ణు వనాది పురుషుడు, అనంతుడు, విశ్వకారణుడు విశ్వాత్మకుఁడయిన ఆ జగన్నాథుని పుణ్యగాథ

లకేయది మొదలు ఏయది తుది? అంతయునొకటే. ఏ విభు నామ సంకీర్తనము, ఏ విభుని కథాశ్రవణము, సర్వపాప నివారకము. మోక్షదాయకమో, విబుధులెల్లరేవిభుని పాద పద్మములు పూజింపనెంతురో, ఏ విభుడు ముని మనోగోచరుడో, జప తపోదానములకన్న ఏ విభునిచింతన మత్యుత్తమమో, బ్రహ్మ రుద్రాదులుకూడ ఏ విభుని భావించు చుందురో జగదుత్పాదన రక్షణ లయక్రియలెవ్వని మహిమములో అట్టి సర్వాత్ముడు పరముడు అయిన శ్రీవిష్ణుని ధ్యానపదమున నిల్పి శ్రీశుకుడు పరీక్షిన్నరేంద్రునికి బోధించుట కారంభించెను—

తాను తండ్రియగు వ్యాసభగవానునివలన వినినది కనినది పఠించినది అగు శ్రీమన్నారాయణుని పవిత్రగాథామృతము, శ్రీమహాభాగవత ప్రవచనము శ్రీశుకయోగీంద్రు డారంభించినాడు. పరీక్షిత్తు భక్తి శ్రద్ధలతో ఆకర్ణించుచున్నాడు. నిరశనుడు నిరాగ్రహుడు నిశ్చలధ్యానమగ్నుడు కేవలము వాయుభక్షకుడు ప్రాయోపవేశ భద్రాసనుడైన పరీక్షితుని కాత్మలో శ్రీవిష్ణుచింతనము తప్ప అన్యములేదు—

శ్రీమహావిష్ణుని లీలావతార గాథలు ఒకదాని తరువాత నొకటి శ్రీశుకుని నోట వెలువడినవి — శ్రీహరియొనర్చినది సర్వము లోకకళ్యాణార్థము ధర్మసంస్థాపనార్థము ఇందుల కవసరమైన దుష్టుల వధలు నిశ్శంకగ నెఱవేర్చి

నాడు. సాధుజనుల రక్షించి సన్మార్గ వర్తనమునకు ఆశ్రయము కల్పించినాడు. ఈ కథాకథనము మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన భార్గవరామ శ్రీరామ బలరామ శ్రీకృష్ణ బుద్ధావతార వర్ణనములు పూర్తియైనవి. రాబోవు కల్క్యవతార వర్ణనమైనది. శ్రావ్యములై ఆ దృశ్యములన్నియు పరీక్షిత్తు మనమున హత్తుకొనుచున్నవి. హయగ్రీవ దత్తాత్రేయ వృషభావతారాదులైనవి. హరి యంశలగు సుయజ్ఞుడు సనకసనందనులు కపిలుడు నరనారాయణులు ధ్రువుడు పృథుడు మున్నగువారి చరిత్రములైనవి. నారద వ్యాస వసిష్ఠాది విశ్వామిత్రాది మునుల చరిత్రములైనవి. అంబరీష రుక్మాంగదాది మహాభక్తుల కథలైనవి. సూర్య చంద్ర వంశనృపతుల కథలైనవి. ఆకర్ణించుకొలది అమృతప్రాయములుగానున్న వవియన్నియును కాలమానము కల్పములు యుగములు మన్వంతరముల కథలైనవి. ఈ గాధలకు కథలకు సంబంధించిన ఆఖ్యానములు ఉపాఖ్యానములుకోకొల్లలు. అన్నియు విష్ణుసంబంధములే. మహాభాగవతకథ మహాస్రోతః ప్రవాహమై మధుర మధురమై మహారాజు పరీక్షిత్తు కర్ణములఁ జేరుచున్నది. ప్రతి వాక్యమున ఆతఁడుత్తేజితుఁడగుచున్నాడు. శ్రీమహావిష్ణువు లీలా ప్రదర్శనస్థానమైన ఈ విశ్వమంతయు యెట్లుద్భవించినది? పరీక్షిత్తున కాప్రశ్న యుదయించినది.

శ్రీశుకుఁడు మరల మొదటికి వచ్చినాడు. పాలసంద్రమున వటపత్రశాయియైన బాలనారాయణుని నాభికమలమందుద్భవించిన బ్రహ్మ శ్రీహరి యానతిని సృష్టికార్యం నారంభించినాడు. బ్రహ్మ మానసపుత్రులు మహాఋషులుద్భవించిరి. ప్రజాపతు లుద్భవించిరి. బ్రహ్మఫాలనమున రుద్రు లుద్భవించిరి. సర్వలోకముల సృజనమైనది. దేవ దానవ మర్త్యజంతు జలచరాది సకలచరాచర భూతకోటు లుద్భవించినవి. బ్రహ్మదేవుని నాలుగు ముఖములనుండి వేదములు శ్రుతములైనవి. సకల శాస్త్రములు విజ్ఞానములు విద్యలు కళలు వెలువడినవి. జగచ్చక్ర మవిచ్ఛిన్నముగ సాగుచున్నది. విశ్వరూపమునఁగల ఊర్ధ్వమండల, గ్రహమండల తారామండల ఆకాశ భూమండలముల వర్ణనలైనవి. సప్తద్వీప సంశోభితమైన భూమండలము, ముఖ్యముగ నారాయణుని కీర్తన జరుగు జంబూద్వీప భరతవర్షముల వర్ణనలైనవి. నదీనదపర్వత పయోనిధుల వర్ణనములు సాగినవి. అంతయు అణువునుండి మహత్తువరకు ఆయచ్యుతుని స్వరూపమే. ఆ విష్ణుమూర్తి విలాసమే.

దినము లొక్కొక్కటి వెనుకఁ బడుచుండెను. హరికథా శ్రవణానంద కందళిత హృదయారవిందుఁడైన పరీక్షిన్నరేంద్రునకుమృత్యుసమయముదగ్గఅపడుచున్న దన్న భావమే లేదు. మహాభాగవతములో తొమ్మిది స్కంధముల కథయైనది. దశమస్కంధ మారంభమైనది. శ్రీకృష్ణావతార

కథను శుకయోగి మొదలిడెను. శ్రీకృష్ణుడనుమాట వినగానే పరీక్షిత్తునకు శరీరము రోమాంచమైనది. తన తాతలకు ఏ మహనీయుడు మేనమఅదియై సచివుడై సర్వవిధముల సంరక్షకుడై సముద్ర వేలావలయిత సామ్రాజ్యమిప్పించెనో; ఏమహనీయుడు తన జన్మవేళ అశ్వత్థామ అస్త్రబాధనుండి తప్పించెనో ఆ మహామహుఁడు ఆ చక్రి ఆకారుణ్యనిధియగు శ్రీకృష్ణునిచరిత మారంభమైనది. ఈ భాగవతమే శ్రీకృష్ణ భాగవతము. కంసుని కారాగారమున వసుదేవ దేవకులకు శ్రీకృష్ణ ప్రాదుర్భావము మొదలు శ్రీకృష్ణుడు తనువు చాలించినవఱకు శ్రీశుకుఁడు వచించుట పరీక్షిత్తు వినుట ఒక్కబిగిని సాగిపోయినది. ఆ ఇరువురు ఒక ఆనందసాగరమున కలసి పయనించు యాత్రికుల వలె ఒకరి అనుభూతిని ఒకరు పంచుకొనుచుండిరి. పుట్టుకతోడనే తన దివ్యాకృతితో ఆవిర్భవించిన అవతారమూర్తి యశోదకు తన విశ్వరూపము జూపిన విశ్వమయుడు, సమరాంగణమున సవ్యసాచికి తన ప్రళయ భీకర విశ్వాకృతిని జూపిన సకలభూత మహేశ్వరుడు, శ్రీకృష్ణుడు నేడు మురళీమోహనాకారుడు, రాసలీలా విలాసుఁడు తన కన్నుల ముందే తాండవించుచున్నట్లయినది. పరీక్షిత్తునకు శ్రీకృష్ణుని గాథామహాత్మ్యము అనూహ్యము అతర్క్యము అనుభవైకవేద్యమేగాని అన్యముగాదు. పూతన మొదలు యెందఱో దుష్టులను వధించి ధరణిని ధర్మము సుస్థిరము చేసి

నాడు. నందయశోదలు అక్రూరుఁడు విదురుఁడు ఉద్ధవుఁడు భీష్ముఁడు, కుబ్జ, సుదాముఁడు, కుచేలుఁడు గోపికలు ఆహా! యెందఱెందరో నిర్మల హృదయులు శ్రీకృష్ణుని మధురానుగ్రహమునకు పాత్రులై భవాబ్ధిని తరించిరి. శుకుడు చెప్పుచుపోవుచున్న ఆకథాకథనము పరీక్షిత్తు మానసాకాశమున శరదుత్సవమే అయినది. శ్రీకృష్ణునకు గోపికలకు గల సంబంధమెంత పవిత్రమైనది ? యెంత ఉన్నత ఆధ్యాత్మిక భావభావితమైనది ? వినుచున్న కొలఁదియు అద్భుతావహముగ నున్నది. వంశీనాద వినోదుఁడగు శ్రీకృష్ణుని భావించి సేవించి వర్ణించి ఆతనిం జేరి ఆడిపాడి పతిపుత్రాదిక సర్వమాతఁడేయని శ్రీకృష్ణతత్వములో క్రీడించి ధన్యులైనవారు గోపికలు. శ్రీకృష్ణుని పాదముద్రల ముక్తికాంతా మనోమోహనములుగా భావించిన చరితార్థ లా గోపికలు ఆ కథలు వినినంతసేపు తానొక గోపికననియే పరీక్షిత్తు భావించుకొనుచుండెను. తా నంతకంతకు అల వైకుంఠపురమ్ములో ఎచ్చటోవున్న శ్రీమన్నారాయణునకు చేరువ నగుచున్నట్లే తోచసాగినదతనికి. శుకుఁడుబోధించుచున్న శ్రీకృష్ణ చరిత్రము మధుర మనోహరముగా సాగుచున్నది. శ్రీకృష్ణుని వివాహములైనవి. దుష్టులెందఱో వధింపబడినారు. పాండవ రాజసూయమైనది. కౌరవ పాండవ యుద్ధమైనది. యుద్ధ మధ్యమున శ్రీకృష్ణు డర్జునునకు

చెప్పిన ఆధ్యాత్మికోపదేశము శ్రీకృష్ణుడు తనకు చెప్పుచున్నట్లే పరీక్షిత్తు అనుకొనెను. ధరణిపై శ్రీకృష్ణుండు చేయవలసినపని ముగిసినది. పరీక్షిత్తు ఒక్కసారి తన మనోనేత్రము విప్పి చూచినాడు. తాను వినినది శ్రీకృష్ణ భాగవతము – నాయకుడు శ్రీకృష్ణుడు. వ్రాసినది కృష్ణద్వైపాయనుడు – బోధించినది ఆ మహనీయుని కుమారుడు శ్రీశుకయోగీంద్రుడు. జన్మతరించినది పరీక్షిత్తునకు. హరికథా శ్రవణఫలము పరిపూర్ణముగ లభించినది.

నారద వశిష్ఠ విశ్వామిత్రాది మహాఋషులు శ్రీకృష్ణుని దర్శనార్థమేతెంచుట, బ్రహ్మాదిదేవతలు శ్రీకృష్ణుని వైకుంఠమున కాహ్వానించు కథలుగూడ రచింపఁబడినవి. విష్ణుసేవా ప్రాశస్త్యము భక్తులకు పరమపద లబ్ధియేయని ఆత్మతత్త్వము, జీవాత్మ పరమాత్మల సంయోగము మోక్షసిద్ధిగా శుకుడు వర్ణించుచుండగనే పరీక్షిత్తునకొక విష్ణుచింతనా సమాధిస్థితి వచ్చినది. పరీక్షిత్తు స్థితి శ్రీశుకుఁ డెఱుగును. అయినను మఱొకసారి, ఆమహనీయుని శ్రీశుకయోగీంద్రుడు–

ఉ॥ ఏనుమృతుండ నౌదునని యింతభయంబు మనంబు లోపలన్
మానుము సంభవంబుగలమానవకోట్లకుచావునిక్కమౌ
గాన హరిందలంపు మికఁగల్గదు జన్మము నీకుధాత్రిపై

మానవనాథ పొందెదవు మాధవలోక నివాస
సౌఖ్యముల్.

అని పరీక్షిత్తు నాశీర్వదించినాడు. పరీక్షిత్తు జీవము మహా తేజోవంతమై శ్రీహరినిఁ జేరుచున్నది. ఆ మహాచక్రవర్తి దేహమంతయు ప్రకాశమానమైనది. ముఖమున బ్రహ్మభావము ఒక నూత్నవికాసమున వెల్గుచున్నది. యోగ నిష్ఠితుఁడైన ఆ మహానుభావుని ఆయుర్వాయువు లాగిపోవు చున్నవి-

ఆదరి శమీకమునికుమారుడు శృంగిశాప మూరక పోలేదు. సర్పకులాధిపుఁడైన తక్షకుఁడొక విప్రవేషమున వచ్చుచున్నాడు పరీక్షిత్తునెట్లయిన కాటేసి కడతేర్చుటకు. అతని వెనకనే కశ్యపుఁడను ఒకమహామంత్రవేత్తయు వేవేగచనుదెంచుచున్నాడు. తనమంత్రబలముచే యెట్టి సర్ప విషమైనను నిర్మూలించి సర్పదష్టుని పునర్జీవితుని చేయగల మాంత్రికుడాతడు. తన విద్యచూపి ఆ రాజువలన ధనసహాయము పొందవచ్చునని యా మాంత్రికుని యాశ. సర్ప విషమున భస్మమైపడియున్న వృక్షమును తన మంత్రముచే బ్రతికించి కశ్యపుఁడు తన శక్తిని చూపెను. అతని మహిమ ప్రత్యక్షముగ జూచి తక్షకుఁ డామంత్రికుఁడాశించిన ధనము కన్న మిక్కుటముగు ద్రవ్యము నాతనికిచ్చి వెనుకకుఁ బంపి వేసెను. తక్షకుని కార్యము సుకరమైనది.

పరీక్షిత్తువున్న ప్రదేశముచేరి విప్రాకృతినున్న తక్షకుడు ఒక ఫలము నా రాజునకు కానుకగా లోనికి బంపినాడు. ఆ ఫలములో తానొక క్రిమిరూపమున సూక్ష్మదేహుడై చేరి సమయముకొఱకు నిరీక్షించుచుండెను. ఆ ఫలము పరీక్షిత్తును చేరినదో లేదో, ఆ క్రిమి ఒక్క త్రుటి కాలమున భీషణ విషోగ్ర సర్పాకృతియై మహా ఫూత్కారములతో చుట్టి ముట్టి పరీక్షితుని కాటేసి యదృశ్యమయ్యెను. ఆహా! యెంతవానికైనను విధి నిర్ణయము తప్పదుగదా యనుకొని, పరీక్షిన్మహారాజు ధన్యచరిత్రము తలంచుకొనుచు ఇట్టిదికదా జన్మమని ప్రశంసించుచు పరిపూర్ణ బ్రహ్మభావ వికాసకాంతివిస్ఫూర్తితో వెలిగిన ఆ పృథ్వీశుని మరియొకసారి సానుకంపతో వీక్షించి, శ్రీశుకునకు ప్రణతులర్పించి అచటచేరిన మునులు జనులు వెనుకకు మఱలిరి.

పవిత్రమగు పాండవ వంశమున ప్రభవించిన పుణ్యశీలి ధర్మపరిపాలనము నెఱపిన ధరణీశుడు, కలియుగమారంభమైనను తన రాజ్యమున కలికాలుష్యము లేకుండఁజేసి ధర్మదేవతను నాల్గుపాదముల స్వేచ్ఛగ విహరింపఁజేసిన ప్రాభవోపేతుడు, హరికథా శ్రవణానందమయుఁడై పరమపదమును జేరఁగలిగిన మహాభక్తుడు పరీక్షిత్తు.

సమాజ శ్రేయోమార్గమును జూపు కొన్ని ఇతర ముఖ్య విషయములనుగూడ పరీక్షిత్తు కథవలన తెలియనగును. మహాధార్మికుఁడు కన్నతండ్రిని బోలిన పరిపాలకుఁ

డైన పరీక్షిన్నరపాలుని జీవనముకన్న తక్షకుఁ డిచ్చిన ధనమే మాంత్రికుఁడైన కశ్యపునకు విలువగలదిగ కానుపించినది. ధనాశ, లోభము యెంతటి ద్రోహమునైనను చేయించునుగదా! ఆదుర్గుణమిచ్చట సకల సద్గుణ సంపన్నుడైన చక్రవర్తినే బలిగొనినది.

పరీక్షిత్తు మాన్యుఁడగు భూపాలకుఁడే. పిపాసార్తుడనిన విషయముగూడ సత్యము. సమాధిగతుఁడైన శమీక మునిస్థితి గ్రహించు ఓరిమిలేక తొందరపాటున అనుచితమని కూడ తలంపక. ఒకమృతోరగమునుదెచ్చి ఆ ముని మెడకు జుట్టెను. ఆ పాపము శాపమై తన మీదికే వచ్చినది. యెట్టి పరిస్థితులలోనైన పెద్దలను జ్ఞానులను తిరస్కరించి అవమానించుట యెంత ఘనునికైనను తగనిపని.

ప్రతిశాపమీయఁగల సమర్థుడయ్యు, మునిబాలకుని శిక్షింపఁదలపెట్టలేదు సరికదా. తనతప్పుతానెరిఁగి పరీక్షిత్తు ఆవిప్రకుమారుని శాపమున కధీనుఁడై ఆ శాపమునే వైరాగ్యకారణముగ నెంచి మనసును మాధవచింతనమున కంకితమొనర్చిన మహాజ్ఞాని యనిపించుకొని కైవల్యసిద్ధినందిన పరమభాగవతుఁడయ్యెను. ఉత్తముల వర్తనము లిట్లుండును.

3. ధాస్యము - అక్రూరుడు

ఉ॥ ఎట్టితపంబుసేయఁబడె నెట్టిచరిత్రము లబ్ధమయ్యెనో
యెట్టిధనంబు లర్థులకు నీఁబడెనో తొలిబామునందు నా
యట్టివివేకహీనునకు నాదిమునీంద్రుల యోగదృష్టులం
బట్టఁగలేని యీశ్వరుని బ్రహ్మమయున్ హరిఁ జూడఁ
గల్గెడిన్.

వ్రేపల్లెలో నందునింటఁ బెరుగుచున్న బలరామ కృష్ణులను కంసుని ఆదేశమున మధురకుఁ గొనివచ్చుటకేగు అక్రూరుని మనసునందున్న భావములవి. శ్రీకృష్ణుఁడు తన మృత్యుకారణమని నమ్మి ఏదో వ్యాజమున ఆ బాలురిద్దరిని తన నగరికి రప్పించి చంపవలయునన్న భ్రమ కంసునిది. ఆ దుష్టభావము నెఱిఁగియు సద్వర్తనుఁడగు అక్రూరుఁడును వారిని గొనివచ్చుటకేగెను; నారాయణుని అవతారమగు శ్రీకృష్ణుని కెట్టియాపదయు వాటిల్లదని అతని ధైర్యము.

ఉ॥ శూరులు తొల్లి యెవ్విభుని శోభితపాదనఖప్రభావళిం
జేరి భవాంధకారములఁ జిక్కక దాఁటుదు రట్టిదేవునిన్
వైరముతోడనైన బిలువన్ ననుఁబంచి శుభంబుసేసె ని
ష్కారణమైనప్రేమ నిదె కంసుని బోలుసఖుండు
గల్గునే.

కంసుని తలఁపెట్టిదై నను, ఆ కారణముచే మోక్షదాయకుఁడగు శ్రీకృష్ణదేవుని దర్శనభాగ్యము కలుగుచున్నది. ఇదియును శుభమే అని అక్రూరుడు మఱియొకసారి భావించెను. అతని ధ్యానమెల్లపుడును శ్రీకృష్ణుని పదారవిందములయందే. శ్రీకృష్ణునిగూర్చి వినిననాటినుండియు ఆ మహాసీయునే తన ప్రభువుగా నెన్నుకొని జీవించుచుండిన అక్రూరుని భావన అట్టిది. సత్కులీనుఁడైన అక్రూరుని కిట్టి నిర్మల దైవచింతన మలవడుట పసిడికి తావి అబ్బినట్లయినది.

ఉత్తర భారత వర్షమున ప్రసిద్ధికెక్కిన మధురరాజ్య ప్రాంతమున వసించు భోజకులమునకు చెందినవాడు అక్రూరుఁడు. సౌహార్దమునకు సౌజన్యమునకు పేరెన్నికఁగనిన సుగుణవర్తనుఁడు మధురానగరవాసి శ్రీకృష్ణునిమాహాత్మ్య మెఱిఁగి శ్రీకృష్ణునే తనప్రభువుగా భావించుచుండువాఁడు. ఇతని జనకుఁడు శ్వఫల్కుఁడు.

కాశీ దేశమున ఒకప్పుడు వానలులేక దుర్భిక్షమేర్పడి ప్రజలనేక బాధలు పడుచుండిరి. కాశీశుని భార్య గర్భవతియై యీ శిశువును చాలాకాలము మోయుచుండెనే గాని ప్రసవము కాలేదు. మహాప్రాభవశాలియగు శ్వఫల్కుని కాశీకి ఆహ్వానించినచో ఈ కష్టములనుండి గట్టెక్కఁగలవని పురోహితులు చెప్పిన మాటలు శిరసావహించి కాశీరాజు స్వయముగ అనుచరసహితుఁడై చని శ్వఫల్కుని సగౌరవ

ముగ నాహ్వానించి కాశీకి తీసికొనివచ్చి సకల సత్కృతు లను గావించుచుండెను. శ్వఫల్కుని రాకతో కాశీ రాజ్య మునకు మంచి దినములు వచ్చినవి. వానలు కురియ సాగి నవి. పంటలు పండినవి. పశుగణము వృద్ధియైనది. ప్రజలు సుఖించిరి. శ్వఫల్కుని ఆశీర్వాదబలమున కాశీరాజు భార్య సుఖప్రసవమై చక్కనిచుక్క యనందగు పుత్రికను గనెను. ఆబాలికపేరు గాందిని. క్రమముగ గాందిని పెరిగి సౌందర్య వతియగు జవ్వనియైనది - శ్వఫల్కుఁడు తన కొనరించిన యుపకృతిని మఱవక కాశీశుఁడు తన ముద్దులతనయయగు గాందినిని శ్వఫల్కునికిచ్చి పెండ్లి చేసెను. ఆ పుణ్య దంప తులకుమారుఁడే శ్రీకృష్ణునిభక్తశేఖరుడగు అక్రూరుడు.

కంసుడు మధురరాజ్యమును చేజిక్కించుకొని పాలిం చుచుండెను. ఇతని సోదరి దేవకి వివాహసమయమున విను వీధినుండి ఒకవాణి వినిపించినది. దేవకి అష్టమ గర్భమున జనించు కుమారుడు కంసునిమృతికికారణమగునని. కంసుడు భయపడి, దేవకిని ఆమె భర్తయగు వసుదేవునితో చెఱసాల యందుంచి దేవకికి జనించు శిశువులను వరుసగ చంపుచుం డెను - దేవకి యెనిమిదవసారి గర్భవతియైనది. ఒకనాడు కెవ్వన ఒకశిశువు రోదనము వినిపింపగనే కంసుడు పరుగెత్తి ఆ శిశువును తనకరవాలమున రెఁడుజేయ నుంకించుచుండగా ఆ క్రూరుని హస్తములనుండి ఆ శిశువు తప్పించుకొని ఆకస మునకెగసి ఓరీ కంసా! నిన్ను జంపు వీరబాలుఁడు వేఱుగ

పెరుగుచున్నాడు. అతడు నిన్ను వధించితీరుననిపలికి అదృశ్య యయ్యెను. ఆ శిశువు యోగమాయ. వ్రేపల్లెలోన ందుని భార్య యశోదకు జన్మించినది. ఆ క్షణమునందే చెఱసాలలో దేవకికి జనించిన మగశిశువును వసుదేవుడు తనకు చెఱసాలలో విన్పించిన దివ్యవాణి నిర్దేశానుసారము వ్రేపల్లెలో దేవకి మంచముపైనుంచి, దేవకికి తెలియకుండగనే దేవకికి జనించిన యోగమాయను యశోద ప్రక్క నుంచెను. కంసుడా యోగమాయను చంపబోయి నిష్ఫలుడై ఆ యోగమాయ పల్కులు విని భయభ్రాంతుడై ఏమిచేయుటకు తోచక తనరాజ్యమునగల శిశువులనందఱిని తన భటులగు రాక్షసులచే చంపించుచుండెను. క్రూరులగు ఆదైత్యులు వ్రేపల్లెకేగి అనేక మాయాకారములతో దేవకికడ పెరుగుచున్న కుమారుడు కృష్ణునిగూడ చంప యత్నించి కృష్ణుని చేతులలో మరణించుచుండిరి.

కంసుడు పంపగా నేగినవారిని చంపుటేగాదు, మఱెన్నియో సాహస కృత్యములను కృష్ణుడు పిన్ననాడే యొరించెను. ఆ చిన్నికృష్ణుని లీలలు జగదాశ్చర్యకరములైయుండి ఈ బాలునివలననే తనకు మృత్యువని కంసుని గుండెలు దిగజారిపోవుట మొదలిడినది. పరిస్థితులింకను ముదిరినచో తన శత్రువునకు బలమెక్కువగును. వెంటనే ఈ బెడదను త్రుంపకపోయినచో కృష్ణుడే విజృంభించి

తనపైఁబడ వచ్చును. ఇట్లాలోచించి కృష్ణుని తానే చంపుటకు కంసుడు నిశ్చయించుకొనెను.

నందుని ఇంట పెరుగుచున్న కృష్ణుని, ఆ బాలునితో సఖుడైన అతనియన్న బలరాముని ఇద్దరిని చంపుటకై కంసుడొక పన్నాగము పన్నెను. ఏదోమిషచే బలరామ కృష్ణులను మధురకే రప్పించి కడతేర్చవలయును. తన మధురలోనున్న అక్రూరుఁడు కృష్ణప్రియుడు. అక్రూరుడేగి చెప్పినచో కృష్ణుఁడు తప్పకవచ్చునని తలఁచి తాను చేయదలపెట్టిన ధనుర్యాగోత్సవములను తిలకింపవలసినదిగా బలరామ కృష్ణులను వ్రేపల్లెనుండి నందాదులతోఁగూడ తోడ్కొనిరమ్మని కంసుఁడా యక్రూరునంపెను.

కంసుని దురాలోచనము నక్రూరుఁడెఱుగును కాని, రాజాదేశము ఆ పనికై పోవకతప్పదు. శ్రీకృష్ణుడు సామాన్యమానవుడుగాదు. లీలామానుష విగ్రహుడైన పరమాత్మయే. ఈ విషయము నక్రూరుఁడు తన యాత్మయందెఱుంగును. నిత్యము చిత్తమున శ్రీకృష్ణునే తలఁచుచు ధ్యానించుచు, తన ప్రభువుగానెంచుచు ఇదియే జీవిత పరమార్థముగా నెంచుచు బ్రతుకు గడపుచున్న అక్రూరునకీరాజకార్యము తలకంటగింపైనది. శ్రీకృష్ణునెడలనా? తుదకు తానీ దుష్కార్యమొనరించుట, ఆతఁడేమనుకొనును, ఆతని బంధువులేమనుకొందురు? ప్రజలేమనుకొందురు? ఈసంశయములతో అక్రూరుని మానసము తహతహ లాడ

పోయినది. యెట్టి చెడుతలంపు మనమునలేని అమాయకుం
డను నేను ప్రభూ! నీదాసుని రక్షింపుము అని శ్రీకృష్ణు
నకు మనసునందే నమస్కృతు లాచరించి మఱునాడు
కంసుడు పంపిన రథమునెక్కి అక్రూరుడు నందుడున్న
బృందావనమునకు బయలుదేరినాడు.

శ్రీకృష్ణ పరమాత్మను చూచుభాగ్యము లభించిన
దను ఉత్సాహ మొకప్రక్క, అయ్యో కంసుడు చేయ తల
పెట్టిన క్రూరకార్యముకై శ్రీకృష్ణుని కొనిరావలసి వచ్చి
నదే అనుభయము మఱొకప్రక్క ప్రబలిన తత్తఱపాటుతో
అక్రూరుడు ప్రయాణము సాగించెను. అక్రూరుని మనసు
నందన్నియు సందేహములే. తనరాక నెవరైన చూచినచో
ఇందేదో దురాలోచనమున్నదని తప్పక అనుమానింతురు.
యెవరికంటను పడకుండ పోవలయును. శ్రీకృష్ణుని పాద
ములపై బడవలయును. తనస్వామి సన్నిధానమున తన సర్వ
స్వము అర్పింపవలయును. పోదును సరే, శ్రీకృష్ణుడు
నన్నేమని తలంచునో కంసునివద్దకు చేకొనిపోవు దుష్టునిగా
తలంచునో యేమోనను భయము, ఆ మహనీయుడు సకల
భూతాంతర్యామి నా సుజనత్వ మెఱుంగకుండునా అను
ధైర్యము కొంత డెందమున సందడింప బృందకరగుచు-

ఉ॥ మాపటివేళ నేనుచని మాధవుపాదసమీపమందు దం
డాపతితుండనైన నతఁడాశుగ కాలభుజంగవేగసం

తాపిత భక్తలోకభయదారణమైన కరాబ్జ మాదలన్
మోపి హాసించి నాకభయముం గృపతోడుత
నీయకుండునే.

అని తలంచిన అక్రూరునకు ఒకింత గుండెదిటవు కుదురుకొనినది- నేను బృంద చేరునప్పటికి చీకటిపడునుగదా ఒంటరిగా ఆతని పాదపద్మములపైఁ బడుదును. భక్తులను సదా రక్షించు ఆ దేవుని అభయహస్తమే నా కవలంబము. అక్రూరుని హృదయము తలఁపులు కృష్ణమయములైనవి.

ఆమలి సంజవేళ బృందావన ప్రాంతములు పసపు బంగరులు జల్లులాడినట్లు మఱింత అందమొల్కినవి. కోష్ఠములవైపు బరువులెత్తు గోవుల పదధూళి ఆకసమున వేచుచున్నది. ఆ వనమార్గముల కిరుగడలనున్న పూఁబొదలనుండి తీయతావులు దిక్కుల కెగయుచున్నవి- ఆ యాలమందల మధ్య పుష్పమాలాంకృతులై చనుచున్న బలరామకృష్ణుల దిలకించినంతనే అక్రూరుఁడు వివశుఁడై వారిపాదములపై బడెను. స్వామిపాదములపై తన శిరసుంచినాడు. ఆనందాశ్రువులు కట్టలుతెగి పారినవి. శ్రీకృష్ణుఁడక్రూరు నాదరమున లేవనెత్తి ఇంటికి తీసికొనిపోయినాడు. నందుడును తగిన మర్యాదలొనరించి ఆసనమిచ్చినాడు - కుశల మడిగినాడు.

అక్రూరున కేమిచెప్పుటకునోరు పెగులుటలేదు. తాను వచ్చినపని వేరు, వీరడుగు ప్రశ్నలు వేరు. శ్రీకృష్ణుని మనసు

తనతలిదండ్రులు దేవకీ వసుదేవులపై బోయినది. అక్రూరా! మీరందఱు కుశలమేగదా - మామ కంసుని భయములు తీరినవా? అతని కారాగారమున బంధితులైన మా అమ్మ నాన్నయు యెట్లున్నారు- వచ్చునపుడు నీకేమైన చెప్పిరా? శ్రీకృష్ణుని ప్రశ్నలు పరంపరగా వచ్చుచున్నవి. అక్రూరుని మనసునకు దుడుకెక్కువైనది. రాజకార్యవృత్తి వేరు, తన ప్రవృత్తివేరు. ఆ ప్రశ్నలకు తగు నుత్తరము లిచ్చి తా నరుదెంచినపనిని మెల్లగనుడివెను. "మధురాధిపతి" కంసుడు ధనుర్యాగ మొనరించుచున్నాడు. సకల రాజన్యులు వచ్చుచున్నారు. మిమ్మందర నాహ్వానించి ప్రత్యేకముగ బలరామ కృష్ణులఁ దోడ్కొని రమ్మని నన్నంపెను అని - వారియెడ కంసునికిగల ఆదరాభిమానములు వారెఱుగనికావు. శ్రీకృష్ణుడు అన్న బలరాముని జూచి చిరుఱునవ్వు నవ్వి, నందుని దెస అంగీకారము దెల్పెను - పూతనవధ నోటినుండియు, కృష్ణునియెడ కంసుని చేతలు చేతములందు అందఱెఱుగుదురు. అక్రూరుఁడును తన రాయబారమునకు తానే బిక్కు బిక్కుమనుచుండెను. ఏమిజరుగనున్నదో శ్రీకృష్ణునకే వేద్యము. మఱునాఁడు నందాదులు మధురకు పయనమైరి. అక్రూరుని యరథముపై బలరామ కృష్ణు లాసీనులయిరి. అక్రూరుని మనోభావములను శ్రీకృష్ణు డెఱుగును.

శ్రీకృష్ణుని మధురకు తీసుకొనిపోవుచున్నారను వార్త గోకుల బృందావనముల నలుదిక్కులకు ప్రాకినది. వినినవారెల్లరు విషణ్ణచిత్తులై విచారింపసాగిరి. అయ్యో మన వంశీమోహనుఁడు రాసలోలుఁడు మనోహరుఁడు ప్రేమమూర్తి శ్రీకృష్ణు నా నాగరికవధూమణులు చూచిన మరల వెనుకకు రానిచ్చెదరా, యెంత విపత్తు వచ్చినది. ఈ ప్రయాణమునాపెడువారు లేనేలేరా.

శా॥ అక్రూరుండని పేరుపెట్టుకొని నేడస్మన్మనోవల్లభుం
జక్రిన్ మాకడ బాపికొంచు నరుగం జర్చించి
యేతెంచినా
డక్రూరుండట క్రూరుడీతడు నిజం బక్రూరుడౌ నేని ని
ర్వక్రత్వమ్మునఁ గృష్ణుబెట్టి తనత్రోవంబో
విచారింపడే.

అని గోపికలు పలుతెఱంగుల విలపించుచు కృష్ణుఁడేగు రథము దృగ్గోచరమగు దనుక చూచి చూచి వెనుకకు మరలిరి.

రథముపై రమణీయమూర్తులు రామకృష్ణులు వారి పాదపీఠమున రథచోదకుఁడై తాను. యెంతటిభాగ్యము! అక్రూరుని ఆనందమునకు మేర లేదు. మాటి మాటికి రామ కృష్ణుల నేదో మధురాభిలాషతో చూచును. ఆలస్యమగు నేమోయని యశ్వముల నదలించును. ప్రతి నిముషము శ్రీకృష్ణవదనారవింద దర్శనానంద రసాస్వాదన చేయవల

యుననియే అక్రూరుని తలంపు. రథము యమునానదిని సమీపించినది. సూర్యసుతా స్రవంతిక యమున. పుణ్యఝరీ పూరము లా నీరములు. రామకృష్ణుల యనుమతిగైకొని, యమునాజలస్నానమునకై చని వేదమంత్రముల విధిపూర్వకముగ నుచ్చరించుచు ఆశీతలోదకముల మునిఁగి లేచి, మరల మునుఁగునంత ఆ జలగర్భమున రామకృష్ణులు కన్పడిరి. ఆహా ! ఇది ఏమి వింత, భ్రాంతి యేమో; కనుదమ్ములు విచ్చి చూచెను. వారు రామకృష్ణులే. నిలబడి రథమువైపు విలోకించెను. అచటను రామకృష్ణులే. నీట మరల మునిగెను ఆ రామకృష్ణులే. ఒక అద్భుత కాంతిలోకమునకు త్రోసివేయఁబడినట్లు అక్రూరుడు మరల నీటిలో మునిగెను. సహస్రఫణి ఫణాభిశోభితుఁడైన శేషుడు. ఆ భోగి భోగ పర్యంకమధ్యమున శ్రీ రమాసహితుడు శంఖచక్ర గదా పద్మహస్తుడు శ్రీవత్స కౌస్తుభవనమాలికా విరాజితుఁడు జలజగర్భ రుద్రసనకసనంద నాద్యమర సేవ్యమానుఁడు ప్రహ్లాద నారదాది పరమభాగవత సంభావితుఁడు మహాసౌందర్యనిధియు మహాపురుషుఁడునగు పద్మనాభుని మూర్తి అక్రూరుని నయన గోచరమయ్యెను. భూమిపై నీటిలో వెలుపల బయటయు అంతయు భగవన్మయము. తానా కాంతి ప్రవాహమున గొట్టుకొని పోవుచున్నాడు. ఆ పరమేశ్వరుని దర్శనమున తనను తానే మఱచిన అక్రూరుని భక్తిపారవశ్యము అవధులు దాటినది. ఆనందబాష్పములు వఱదలై

పారుచున్నవి. గళము వణకుచున్నది. చేతులు జోడించి ఆ మహామూర్తి నిట్లు స్తోత్రము చేసినాడు.

ఓ దేవాదిదేవా, మహామునీంద్రుల కలభ్యమైన నీ దర్శనము లభించినది. నా మనోరథము ఫలించినది. నిన్నే మని స్తుతింపగలను. ఈ విశ్వ విశ్వముునకాదియు ఆధారము నీవే. సమస్తంబు జలమయంబై యున్నవేళ, ఆ కల్లోల జల తరంగముల బాలకేళీగతిని దేలియాడు నారాయణుడవునీవు. నీ నాభిపద్మమ్మునం దుద్భవంబైన బ్రహ్మయేకదా! ఈ లోకములెల్ల సృష్టించెను. ఈ లోకములెల్ల నీయందే వికసించి వసించి నశించుచుండును. పునఃపునరావృత్తిగజరుగు సృష్టి స్థితిలయముల కీవే కారణుండవు. సకలసాక్షీభూతుడవు. అఖిలభూతమ్ములందంతర్గత జ్యోతినీవే, నీ వొక్కండవు, నీ వనేక రూపాధిశోభితుండవు, నీవే ఆత్మవు, వాసుదేవాది అనేకరూపములు నీవేయని జ్ఞానులెల్లరు నుతింతురు. అనేక జలపూర్ణఘటమ్ముల ప్రతిబింబించు ఒకే రాకేందు బింబమువలె నీ వొకడవే సగుణుండవు, నిర్గుణుండవు, నిర్వికారనిరంజనుడవు, నీ వదనము వహ్ని. సూర్యచంద్రులు నేత్రములు, దిక్కులు చెవులు, భూమి పాదము. సాగరములు కుక్షి, శైల్యములద్రులు. లతలు తరులు రోమములు, గాలి ప్రాణము. సర్వవిశ్వము నీవేదేవా. నీవే విశ్వరూపము. చక్రివై మధుకైటభుల బ్రమందింతివి. మహాబ్ధిమధ్యమున మత్స్యాకృతిని బూని సోమకుంద్రుంచి వేదములదెచ్చి విరించి

కిచ్చితివి. కూర్మమవై క్షీరసాగర మథనార్థము మందర
గిరి నెత్తితివి. వరాహమవై హిరణ్యాక్షుఁద్రుంచి భూగోళ
మును జలములనుండి పైకెత్తి నిల్పితివి. నరసింహుఁడవై
హిరణ్యకశిపు జీల్చి ప్రహ్లాదాది భక్తుల గాపాడితివి. వామ
నుఁడవై బలిగర్వమడచి త్రివిక్రముఁడవై ముల్లోకము లాక్ర
మించితివి. భార్గవరాముఁడవై దుష్టరాజన్యుల రూపుమాపి
తివి. శ్రీరాముఁడవై లోకవిద్రావణుఁడైన రావణు
బోకార్చి క్షేమరాజ్యము నిల్పితివి. బుద్ధుఁడవై వైరిజాలా
తరంగముల గరంగించితివి. ధరణి నిధర్మము నిలుపకల్కివై
వర్తింతువు, దుష్టశిక్షణ శిష్టరక్షణ గదా యుగ యుగముల
నీ యుద్యమము. అశాశ్వతములయిన లౌకిక భోగభోగ్య
ములు సత్యములనినమ్మి వర్తించు మూఢుఁడను స్వామీ
నీ తత్త్వమెఱుంగలేని అల్పుఁడను. నీ పాదయుగ్మము చాలు
నీ దాసుఁడనై నిన్ను సేవించి ధన్యుఁడనయ్యెదను. నీ కిదే
నమస్కారము దేవా! కృపాకల్పాయని ప్రార్థించుచు అర్థ
నిమీలిత నేత్రముల ధ్యానముద్రలో మునిగిన అక్రూరుని
నేత్రములముందా నారాయణుని మూర్తి అదృశ్యమై మొద
టగానుపించిన శ్రీకృష్ణవిగ్రహ మగుపించినది. అక్రూరుని
కనులు మిఱుమిట్లు గొలిపినవి. కనులలో శ్రీకృష్ణమూర్తి
మెఱసిపోవుచున్నాడు. అంతయు కృష్ణమయము. ఆ తా
దాత్మ్యములో లేచి తీరమును జేరి రథముకడ కరుదెంచిన

అక్రూరునికి చిఱునవ్వులొలుకు నందకుమారులు బలరామ కృష్ణులు యథాపూర్వము కనుపించిరి.

అక్రూరుని మనోభావము లింకను వైకుంఠమునందే యున్నవి. నారాయణుని పాదయుగ ముద్రాంకితమైన యతని హృదయ మా వైష్ణవ లోకమునందే తిరుగాడు చున్నది. అనన్యచింతనమున నున్న భక్తిపారవశ్య మది. శ్రీకృష్ణుఁడు లీలామానుషవిగ్రహుఁడు అక్రూరుని దృష్టి అవనికి కొనిరావలయును.

"అక్రూరా! నీ చర్యవింతగా నున్నది. నదీ జలములు చాలా చేరువలో నున్నవి. నీవు స్నానమునకై యేగి చాలాసేపయినది. భూమ్యాకాశములందెచటను లేని చోద్యములేమయిన నీకాజలమునందు కనపడినవా" అని కృష్ణుడు మేలమాడుసరికి అక్రూరునికి తెలివివచ్చినట్లయినది; ఆహా! యెంత భగవదనుభూతి, బ్రహ్మభావమును పొందితిని అనుకొని తన యుత్తరము నెట్లీయవలెనో తెలియక- "మహాత్మా! నన్ను పరీక్షించుచుంటివి. నా కనుల పండువుగా చూచిన దివ్యరూపమును నేనేవర్ణింపలేకున్నాను. అంతయు నీవే అన్నియు నీవే నీలోలేని చోద్యము లేమియుండును? యెచ్చట నుండును? నీకరుణ లభించినది, నా కింకేమియు వలదు. నీ సేవసేయు తలంపొకటియున్నది. నా చిత్తమున మధురానగర మేగిన పిదప స్వామీ, దాసుడనైన-

కం॥ నా యింటికి విచ్చేయుము
నీయంఘ్రి సరోజరేణునికరము సోకన్
నా యిల్లు పవిత్రంబగు
శ్రీయుత నీభటుని పెద్దసేయం దగదే.

అని శ్రీకృష్ణుని పాదములంటి మఱిమఱి వేడినాడు. భక్తుల మనోరథముల తీర్చుట పద్మాక్షుని కర్తవ్యమేకదా! అట్లే చేయుదాను రథమును పోనిమ్మని అని శ్రీకృష్ణుఁడు బలరామునితో మధురాపురిఁ జేరగనే రథముదిగిఁ అక్రూరుని వాని యింటికిఁబంపి పాదచారియై తాను మధురాపుర ప్రవేశము గావించెను.

బలరామ కృష్ణులలో దుష్టజన విదళనోగ్రములైన తేజఃపుంజము లుజ్జ్వలములైనవి. కంసుడు ధనుర్యాగ మనుమిషపై తమ్ము రావించెనని గ్రహించెను. ధనుశ్శాల కరిగి కంసుని మహాభీకర ధనువునుబట్టి తుత్తియలుజేసి ఆ యాగమునట్లు తానే పూర్తిగావించెను. దారిలో తనమీదికి తోలబడిన మత్తగజము కువలయాపీడమును దంతములు పెఱికి అంతమొందించెను. కంసుని సభకేగి, తనపై కురుక నెంచు చాణూరముష్టికులను మల్లవీరుల వధించెను. ఖడ్గ మూని తనపైకిరాబోవు కంసుని శిరోజములఁబట్టి క్రిందకు లాగి పిడికిళ్ళతో బొడిచి చంపెను. తల్లి దండ్రులవద్ద కేగి రామకృష్ణులు చెఱ విడిపించిరి. ఉగ్రసేనునికి తిరిగి రాజ్య పట్టము నిచ్చిరి. తన బిడ్డల నిద్దఱిని పుట్టిననాటినుండి నేను

పొంగిన దేవకికి దేహము రోమాంచమై కుచయుగ్మము క్షీరధారల వర్షించినది. ఆ ప్రేమామృతమూర్తి వారిని పావివిపార్తియల కెత్తుకొనినది. వసుదేవుడు వారిశిరములు మూర్కొని ఇరువురును ఇరుచేతుల నెత్తికొని ముద్దాడెను. జగన్నాథుడైన నారాయణుని తమ బిడ్డగా కని మోసిన పావనమూర్తులా దంపతులు.

ఇట్లెన్నో బృహత్కార్యములైనవి— ఇంకను కావలసి యున్నవి— కాని కృష్ణుని మనసు తన భక్తుడు అక్రూరుని మీదనేయున్నది. తా ననినమాట చెల్లించుకొనవలయును. భక్తుని యోగక్షేమములు వహించునది పరమాత్మయే గదా !

నేను నీ భటుడను నీ పాదసేవ నాకుచాలును, శ్రీ కృష్ణదేవా అని వేడిన అక్రూరుడు బలరామ కృష్ణులను మథురాపుర ప్రవేశద్వారమునందు దింపి తన ఇంటికే వెడలెను. కంసునిమొగము తిరిగి చూడనైనలేదు. ఇక అక్రూరుని సర్వము కృష్ణార్పణమైనది. శ్రీకృష్ణునే ధ్యానించుచు స్మరించుచు భావించుచు తదేక దీక్షితుడై యుండును. నీ ఇంటికట్లే వచ్చెదనని మాటయిచ్చిన శ్రీకృష్ణుడు రాక పోవునా అని ధైర్యము. కాని అక్రూరుని మనసు సందాక సందియ మావరించినది. మొడతెరిపిలేక తాను ధ్యానించి స్మరించునది శ్రీకృష్ణుని దివ్యసుందర విగ్రహము; కాని తన మనోగోచరమగునది తాను యమునా జలగర్భమున

చూచిన ఆ జగన్నాథుని స్వరూపము, మాటి మాటికి ఆ జలజాజాతునిరూపమే, ఆ జనార్దనునివిగ్రహమే కనుపట్టు చున్నది. తానెచ్చటికి పోవుచున్నాడు. తనకయ్యది గమ్య స్థానము. అక్రూరునికంతయు అస్ఫుటముగా నున్నది. ఆ సందేహాస్పద సమయములో మనసు ఒకింత వివశమై తన హృదయ స్థితమైన పద్మాక్షుని పాదములను రెండు హస్త ములతో పట్టుకొనినాడు - కనువిప్పి చూచుసరికి యెదుట చిఱునవ్వులుచిందు శ్రీకృష్ణవిగ్రహము. ఆ పరమాత్ముని పాదములపై తన చేతులు, తన శిరము. ఆనందబాష్పము లంబుధులై పారలినవి - అక్రూరా! ఏమ్మ యేమి అట్లే కూర్చుంటివి? అను శ్రీకృష్ణుని ఆదరవచనములతో అక్రూ రునికి తెలివివచ్చినది- అక్రూరుని కల నిజమైనది, జన్మము ధన్యమై చరితార్థమైనది. పరమార్థ ప్రదమగు ఒక పథము అక్రూరునికి లభించినది - భగవదనుగ్రహముసందిన భ శిఖామణి యతడు.

బలరామకృష్ణులను తన యెదుట ప్రత్యక్షముగఁజూ చిన అక్రూరుని ఆనందమునకు మేరలేదు. తాను పరమపదము నకు జేరినట్లే భావించుచు, "శ్రీకృష్ణా పరమేశ్వరా నీవు విశ్వమయుఁడవు విశ్వకారణుఁడవు సృష్టి స్థితి లయ కార ణుండవయ్యు విజ్ఞానమూర్తివగు నిర్గుణుండవు. పరతత్త్వమైన నీ దర్శనమాత్రమున నీ యనుగ్రహావేశమున యెల్లజీవులు

చరితార్థులగుదురు. దుష్టుల శిక్షించి ధర్మరక్షణ కుద్భవించిన నారాయణుడవు, నిన్ను జూచితిని నాకదిచాలును.”

శా॥ ఏపుణ్యాతిశయప్రభావముననో యీజన్మమందిక్కడన్
నీపాదంబులుగంటి నిన్నెఱిఁగితిన్ నీవున్ గృపాళుండవై
నాపై సర్మిలిఁజేసి మాన్పఁగదవే నానాధనాగార కాం
తాపుత్రాదుల తోడిబంధనము భక్తవ్రాతచింతామణీ!

అని ప్రార్థించినాడు. అక్రూరుని వైరాగ్యభావము తారాపథమందుకొనిన మనస్థ్సితి యిది.

కాని శ్రీకృష్ణుని యాలోచనవేరు. అక్రూరునివలన కాదగిన పనులు ముందున్నవి. ఈ విరాగమునుండి అక్రూరుని మరల్పవలయును. శ్రీకృష్ణుఁడు మందహాస మొనరించుచు “అక్రూరా, నీవు ధన్యచరిత్రుడవు, పెద్దవాడవు, మాన్యుడవు అందఱకిని హితుడవు. పరమభాగవతుఁడవగు నీకు దైవానుగ్రహము తప్పక లభించును. ప్రస్తుత మీభావములట్లుంచి, నీకుకరణీయమగుపని యొకటున్నది. కుంతీ సహితులైన పాండవులు హస్తినాపురమున ధృతరాష్ట్రు నింట నున్నారు. ఆ యంధనృపతి కుమారుఁడు దుర్యోధనుఁడా పాండవుల ననేక బాధల బెట్టుచుండెనని వినుచున్నాము. పుత్రమోహంబున ధృతరాష్ట్రుడేమియు అనజాలకుండెను. నీవేగి వారి యోగక్షేమములు పరిశీలించి వారి దుస్థితిని వారించిరమ్ము” అని నుడివెను.

శ్రీకృష్ణుని వాక్యములు శిరసావహించి అక్రూరుడా మఱునాడే హస్తినకేగి అచటి పెద్దలనుచూచి కుంతి నోదార్చి, విదురాదులెదుటనుండగా, దుర్యోధనుని దుశ్చేష్టల మాన్పి పాండవులకు న్యాయము చేకూర్పుమని ధృతరాష్ట్రుని కెంతయో చెప్పెను-

శా॥ నిందంబొందకుమయ్య యీతనువు నిద్రాకళాదృష్టహా
సందోహంబు విధంబు నిల్వదుసుమీ జాత్యంధతన్
బొందియున్
మందప్రజ్ఞత లేలచేసెదవు సమ్యజ్ఞాన చక్షుండవై
సందేహింపక యిమ్ము పాండవులకున్ సర్వాంసహా
భాగమున్.

అని స్పష్టముగ ఉద్బోధించెను. కాని ధృతరాష్ట్రుఁడవివేకి అసమర్థుడు. కుమారునికేమియు చెప్పలేకపోయెను. నిరాశాహతుడయి అక్రూరుఁడు వెనుదిరిగెను.

అక్రూరుఁడు సుప్రసిద్ధిగనిన భోజకులీనుడు. నిరంతర శ్రీకృష్ణ చింతనాభిలాషియై మధురనువిడిచి ద్వారకయందు తన నివాసమేర్పఱచుకొనెను. సత్యభామను తనకిచ్చి వివాహము గావింపలేదను కినుకతో శతధన్వుఁడనువాడు ఆమె తండ్రి సత్రాజిత్తును చంపి అతనివద్దనున్న శ్యమంతకమణి నపహరించెను. అయ్యది శ్రీకృష్ణునికి కోపకారణమగుట తెలిసి శతధన్వ డామణిని అక్రూరునొద్ద దాపరికముపెట్టి

తాను దిక్కుబట్టి పారిపోయెను. శ్యమంతకము అనంతమగు మహిమ గలిగిన రత్నము.

ప్రతి దినము వందసినంత పసిండియు ధన ధాన్యములు కురియుచునే యుండును. భగవత్పాద సేవాపరాయణుడు, శ్రీకృష్ణచింతనుండగు అక్రూరున కీ యైహికభాగ్యము లేల కావలయును. అదియొక పరీక్ష. శ్యమంతకమణి ఇచ్చుచుండిన ధన కనకములను ఆత్మసభోగమున కావంతయయిన దాచుకొనక; అక్రూరు డాసంపదనెల్ల దాన ధర్మములకు క్రతుకార్యములకు దైవపూజలకు వినియోగించి, అర్థుల నెల్లర సంతృప్తిపరచి గురుగోవిప్ర పోషణమున్ననే సంతృప్తి పడువాడు. ఒకటి రెండుగాదు ఇట్లుయువది రెండేడులు గడచి నవి. "దానపతి"యను పే రక్రూరునకు వచ్చినది. ఆతని వితరణశీలము నలుదిక్కులకు ప్రాకినది.

ఇంతలో నొకయాపదవచ్చిపడినది. ద్వారక ప్రాంత ములనున్న భోజ లేదో వైరమున శత్రుఘ్నుండను యాదవుని జంపిరి. ఆవధ భోజ యాదవకులములమధ్య తీవ్ర కలహమును రేపెను. అక్రూరున కా కలహముమధ్య నిలువ అనువుగాక ద్వారకను విడచి దూరమేగెను - అక్రూరుండు లేడు. నిత్యదానములు లేవు. అర్థిపోషణ మడుగంటినది. అన్ని చోటులలోను అశాంతి ప్రబలినది. ప్రజలు సంక్షు భితులైరి. అనావృష్టితోబాటు ఈతి బాధలు సర్వము ఆ ప్రాంతమున పొడగట్టినవి. ఈ జనసంక్షోభము శ్రీకృష్ణు

నకుఁ దెలిసినది - సహజముగ అసాధారణ గౌరవోదారుఁడు మాన్యుఁడయిన అక్రూరుడున్నంతదనుక యదుపురమున కేయాపదలును లేవు. ఆ మహనీయునివద్ద అనుదినము సువర్ణ సంపదలొసఁగు శ్యమంతకమణి యుండనోపునని శ్రీకృష్ణుఁడు స్వయముగనేగి అక్రూరుని మరల ద్వారకకు తోడ్కొని వచ్చుటతో ప్రజలకు మరల సౌఖ్యములన్నియు లభించెను.

ఆనాఁడు దుష్టశిక్షణకై భక్తుఁడగు అక్రూరుఁడేగి శ్రీకృష్ణుని మధురకుఁ దోడ్కొనివచ్చెను. ఈనాఁడు శ్రీకృష్ణదేవుఁడే ప్రజల శ్రేయమునకై స్వయముగ నేగి అక్రూరుని ద్వారకకు తీసికొని వచ్చెను. ఆహా! భగవానునికి భక్తునికిగల సామ్యమిదియగాబోలునని ప్రజ లద్భుతం పడిరి.

అక్రూరుఁడు తిరిగి ద్వారక కరుదెంచుటతో ప్రజల సంతోషము మిన్నుముట్టినది. అక్రూరుని సౌజన్యమునకు వితరణశీలమునకుఁదగిన మర్యాద ప్రజాముఖమున జరుగవలయునని శ్రీకృష్ణుని యభిలాష. శ్యమంతకమణి యేమైనది అను సందేహమింకను ప్రజలడెందములం దున్నది. ఆ శంక యుతీర్చవచ్చునను తలంపుతో శ్రీకృష్ణుఁడు తన సభాస్థానము సుధర్మయందు పెద్ద కొలువేర్పాటు గావించి కుల వృద్ధులందఱితోపాటు అక్రూరునిగూడ ఆహ్వానించినాడు.

ఇట్టి సభలు యదుపురమునందరుదుగ జరుగును. మహావిశేష మేదియోయున్నపుడే శ్రీకృష్ణుడు బలభద్రుగూడి దానిని నేర్పాటు జేయును. సభాసదుల హృదయములందలి కుతూహలమునకు మేరలేదు.

శ్రీకృష్ణుం డక్రూరుని దిక్కుమొగంబై దానపతీ! నీ వితరణప్రశస్తి విశ్వవిదితము. నీ రాకతో ద్వారక మరల సర్వసమృద్ధమైనది – అనుదిన దానోత్సవములు జరుగుచున్నవి– ఇందులకు ద్వారకావాసులేమి ఈ పరిసర ప్రాంతముల జనులెల్లరు శతధా సహస్రధా నీకు కృతజ్ఞులు. కాని ఒక్కమాట ఈ దాన ధర్మముల కెంతయోవ్యయమగును. తరుగులేని ద్రవ్యముగావలెను. నీకిదిసాధ్యమగుటకు శ్యమంతకమణి నీవద్దనుండవలయును. ఈమాట సత్యాసత్యములు ప్రజలెఱుగగోరుచున్నారనియెను. అక్రూరునకు మంచి సమయము లభించినది. తనయొద్దదాచి యుంచబడిన శ్యమంతక మహారత్నమును వెలువరించుటకు అయ్యది అనుక్షణము అతని యొద్దనే యుండును. అక్రూరుడు చేతులు జోడించి, స్వామీ, నీవనినది ముమ్మాటికి సత్యము. నీ యాగ్రహము నకు భయపడి శతధన్వుడిది నాయొద్దదాచి పారిపోయినాడు. ఇంత శక్తివంతమైన మణిరాజము అల్పుడనయిన నాకేల వలయును ప్రభూ! మీకిది సమర్పించుతఱిణ మెప్పుడేతెంచు నాయని చూచుచుంటిని. నేడేతెంచిన దట్టి శుభముహూర్తము. ఈ శమంతకమణి నీవద్దనుండవలసిన వస్తువు. ఇదిగో

నీకిది భక్తితో సమర్పించుచున్నాను. నీపాదాబ్జ చింతనము నాకు చాలును. నీ దాసానుదాసుఁడనని అక్రూరుడు తన యోగవస్త్రపు కొంగు ముడివిప్పి ఆ రత్నమును ప్రజలకు చూపునంతలో, ఆ మణికాంతి ప్రభలునిండి అత్యాశ్చర్య కరము అద్భుతముగ సుధర్మాస్థానమంతయు మధ్యందినార్క తేజోవిరాజితమయ్యెను. అక్రూరుడా రత్నమును శ్రీకృష్ణు ముందటపెట్టెను.

శ్రీకృష్ణుఁడు, వదనమున మందహాస సుందరకాంతు లొలుక సభనంతయుజూచి, అక్రూరు నానందముతో సంభా వించెను. శ్రీకృష్ణుఁ డీరత్నము నెవరి కీ దలంచెనోయని జనులు కుతుకమున నుండిరి. సభ్యశ్రేణి విస్మయమ్మంద శ్రీకృష్ణుఁడారత్నమునెత్తి అక్రూరా! సూర్యదత్తమగు ఈ మహారత్నమునుగైకొన బలభద్రుఁడు, నేను, సత్యభామయు అర్హులము, మరెవ్వనుగాదు. అయినను దీనినింగైకొను వాంఛ మాకు లేదు. సుజనులచేతనే ధార్యమాణమగు ఈ రత్నము వేఱొండుచోటికిఁ బోరాదు. నియమవర్తనుడవు, నీతిశాలివి, సకలకాలశుచుఁడవు, పరిశుద్ధ భావుడవు, నిత్య జ్ఞానవినోదివగు నీవంటివానివద్దనున్నపుడే ఈ మణి నిజ ప్రభావము జూపును. కాన దీనిని ధరింప నీవయర్హుండవు. దీనినిఁగొని యథాపూర్వము నీ దానధర్మ వ్రతములు నడు పుము అని శ్రీకృష్ణుఁ డారత్నమును మరల అక్రూరునకే యొసఁగెను. శ్రీకృష్ణభగవానుఁడు తన శిరోవీధినిమోపిన

గురుతరభారమో లేక అనుగ్రహించియిచ్చిన బహుమానమో యెఱుంగఁజాలక ఒక్కక్షణ మాలోచించి దేవా! నీ దాసునకిది నీయాజ్ఞ. నా శక్తికొలది ఈ రత్న ప్రభావమున ప్రజాసేవ పాలింతునని రామకృష్ణులకు ప్రణతులర్పించి, సభాసదులకు నమస్కారములు గావించి సంతృప్త హృదయుఁడై ఇంటికేగి మునుపటివలెనే అక్రూరుడు అనుదిన దాన ధర్మాది సద్వర్తనుడై మనియెను. ఆహా, భగవానునికి తన భక్తునియెడల యెంత గౌరవము, యెంత విశ్వాసము అని విబుధులెల్లరు శ్రీకృష్ణాక్రూరులను వినుతించుచు వెడలిరి.

కాశీ నగర రాజాస్థానమున సకల సంపద లనుభవించుచు కాలముగడపు సౌకర్యములున్నను శ్రీకృష్ణునిసేవయే పరమార్థముగ నెంచిన భక్తశేఖరుడు అక్రూరుడు. శ్రీకృష్ణుని దర్శనమాత్రమున ఆత్మజ్ఞానమునందిన బ్రహ్మభావుడతడు. అనుదినము ధన సంపదలను గ్రుమ్మరించు శ్యమంతకమణి తనయొద్దనున్నను ఆ భోగ భాగ్యములను తనకొఱకు వినియోగింపక ప్రజాశ్రేయమునకే వినియోగించిన నిస్వార్థజీవి అతడు. అక్రూరుని చరిత్రము సర్వకాలముల సర్వప్రజలకు మార్గదర్శకముగనుండు పవిత్రవర్తనము.

4. వందనము - సుదాముడు

కం॥ నీపాదకమలసేవయు
నీపాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపారభూతదయయును
తాపసమందార నాకు దయసేయఁగదే.

నీకు కావలసినవరము కోరుకొనుమనగా శ్రీకృష్ణుని ముందీకోరిక కోరినవాడు పూవులదండలమ్ముకొని జీవించు సుడాముడను నిరుపేద. అతనికి భోగభాగ్యము లక్కఱలేదు. శ్రీకృష్ణ పాదభక్తి, శ్రీకృష్ణ భక్తులతో చెలిమి, సర్వభూతదయ ఇవియే సర్వస్వము. ఆహా, ఏ మునీంద్రులో యోగులో నుడువవలసినకోర్కె ఈ సామాన్యుని నోటినుండి వచ్చినది. భక్తిభావము పరమసిద్ధినందిన భాగధేయమది. శ్రీకృష్ణసుదాముల సమావేశ మొకచిత్రమైన సన్నివేశము.

కంసుఁడు పాలించు మధురానగరమున వసించు ఒక మాలాకారుఁడు సుదాముఁడు. జీవనోపాధికై పూలు, పూలదండలు అమ్ముకొనుట అతని వృత్తి. కొందఱొనరించిన పూర్వపుణ్యము లట్లుఫలించును. హృదయాభిలాషకుఁదగిన వృత్తికూడ వారి కమరును. రాజాస్థానమునవలయు పుష్పమాలికలను పుష్పముల నందించుచుండును. కంసుడు

క్రూరుడేయయినను ఆ రాజనగరమునవసించు తనకు మను గడకై పూవుల నా భూపాలునకు ఇచ్చుచుండును.

పుష్పము లెంతమృదువైనవో సుదాముని హృదయ మంతమృదువైనది. పుష్పము లెంతసుందరములో యెంత సురభిళములో సుదాముఁడును అంతటిసుందర భావలలితుడు. తా నమ్మిన పూవులు సత్కార్యములకు వినియోగపడవలె ననియే యతని మనోవాంఛ. దేవకార్యములకు ప్రతిఫలము కోరకయే ఇచ్చును. పూజాదులు జరుగుచోటులకు తాను స్వయముగ బోయి యిచ్చును. తాను చేయగలిగినదిది. ఉదయముననే లేచును. పురపరిసర ప్రాంతములకేగి ఉషస్సుందరములు పూర్ణవికసితములైన పూలను కోసి తీసికొనివచ్చును. పూలుకోసినపుడు పూమొక్క కేమి బాధ కలుగునోయని పరితాపపడును. చిత్ర చిత్ర వర్ణ శోభితములైన పూలను దెచ్చును. అందమైన మాలలుగా కూర్చును. ఏపూవు ఎచ్చటనుండవలెను, ఏవర్ణము ఎచ్చట నుండిన కనులకింపగునో ఈ విషయములన్నియు కడు శ్రద్ధతో తానే చూచుకొనును. పూలను నలగనీయుడు, క్రిందకు తొలఁగనీయుడు, పూవులనినచో పుత్తడి కన్నమి న్నగా భావించు పుష్పహృదయుఁడు సుదాముడు. తీరికకలిగి నపుడెల్ల ఓపికచేసుకొని తాను ప్రతిదినము పూలుకోయు మొక్కలకు స్వచ్ఛమయిన నీరము సమృద్ధిగ పోసివచ్చు చుండును.

వ్రేపల్లెలో నందునింట పెరుగుచున్న బాలకృష్ణుని లీలలు మహిమ దూరదూరములకు ప్రాకినది. మధురాపుర వాసులందఱకు కృష్ణునిగూర్చి తెలియును. కంసుని మనోభావములెట్లున్న నేమి? మధురానగరవాసులందఱకు కృష్ణుఁడనిన అనురాగము. ఆబాలునిచూడవలయుననుఅభిమతము. సుదాముఁనికిగూడ కృష్ణుఁడనిన యెంతయోప్రీతి. ప్రీతికన్న భక్తిభావము మిక్కుటము. వ్రేపల్లెనుండి యెవరైన వచ్చినచో వారివద్దకుపోవును. కృష్ణునిగూర్చి అడుగును, వేయి ప్రశ్నలువేయును. వేసినవానినే మరలవేయును. వినిన విషయములనే మరల వినును. కృష్ణుఁడు ప్రతిదినము గోవులు గోవత్సములు గోపకులతోకలసి వనములకేగునట. మంచి మంచి పూలుకోసికొని తాను వక్షమున గళమున శిరమున అలంకరించుకొనునట. తనతోడిబాలుర కిచ్చునట, లేగదూడలకు పూలమాలల లంకరించునట— యివియే యెక్కువగ సుదాముడువిను కథలు. పూవులనిన ఇంత ప్రేమగల కృష్ణుని మనసెంత మృదువైనదో, కృష్ణుని ఆకారమెంత అందమైనదో ఇవియే సుదాముని తలపులు. శ్రీకృష్ణుఁ డొనరించిన మహితకార్యములు, యెందఱెందఱో దుష్టరాక్షసులను మట్టుపెట్టుట, ఈ కథలుగూడ వినవచ్చినవి. శ్రీకృష్ణుఁడు సామాన్య బాలకుఁడుగాఁడు. కేవలము భగవానుఁడే. సుదామునియందు ఇట్లొక అచంచలమైన విశ్వాసమేర్పడినది. శ్రీకృష్ణునే మనసులో మాటిమాటికి తలచుకొని సమ

స్తుతులాచరించును. నిదురపోవునపుడు నిదురలేచునపుడు శ్రీకృష్ణునే స్మరించును.

ఎపుడైన శ్రీకృష్ణుడు మధురకేతెంచును. తానా మహనీయుని దర్శింపఁగలఁడా. తానిచ్చిన పూలదండల నాతఁడు స్వీకరించునా, స్వీకరించినచో అవి యాతనికి నచ్చునా? ఇవియే సుదాముని యూహలు. శ్రీకృష్ణుఁడు శ్యామసుందరుఁడట. శిరమున నెమలిపింఛము ఉండునట. ఈ వర్ణముగల పూలదండ అయినచో ఆ బాలునికి అందముగా నుండును. ఈ వర్ణములుగల ఈ చిన్ని చిన్ని పూలు ఈ పెద్ద పెద్ద పూలు ఆ సుకుమారుని గళమున వక్షమున యెంతో సుందరముగ నుండును. సుదాముఁ డనుదినమిట్లే యాలోచించును. ఆ యాలోచనల మరల విమర్శించుకొనును. శ్రీకృష్ణుని పూజించు సమయమున ఏ లోపమురా రాదుసుమా అని తన బుద్ధిని తానే హెచ్చరించును. ఈ భావములతో ఈ ఆశలతో తూగాడిపోవుచున్నది సుదాముని మనసు.

సుదాముని ఆశ లీడేరు సుదినము వచ్చినది. శ్రీకృష్ణుఁడు మధురకు వచ్చుచున్నాడట. అక్రూరుఁడప్పుడే శ్రీకృష్ణుని తోడితెచ్చుటకు రథముతో నేగినాఁడు. మఱునాఁడే శ్రీకృష్ణుడు మధురకరుదెంచుట. శ్రీకృష్ణుని ప్రత్యక్షముగ చూచినట్లే సుధాముని చిత్తము పొంగిపోయినది. వివిధములైన పూలు ఏ వర్ణపుపూలు ఏ వాసనగల పూలు

ఎంత పెద్దవి ఎంత చిన్నవి కావలెను. ఈ యోచనలన్నియు ఒకదానివెంబడి మఱియొకటి సుదాముని మనసులో సాగి పోవుచున్నవి. ఆతని తత్తరపాటు అంతకంతకు అధికమగు చున్నది. ఆ బాలగోపాలుఁ డరుదెంచు దారి గాయవలెను. ఆ మహనీయుని పాదాబ్జములకు వందనము లర్పింపవలెను. తనతక్కినపని ఆనాడు మానుకొని యయినసరే శ్రీకృష్ణుని తన ఇంటికి గొంపోయి తృప్తితీర తానెంచి తీసికొనివచ్చిన పూలతో పూజింపవలయును. ఈ సుందరభావములన్నియు ఒక సురభిళపుష్పమాలవలె సుదాముని మనసులో వ్రేలు చున్నవి.

సుదాముఁ డానాడు రాజగృహమునకేగి పూలదండ లీయనేలేదు. తన జీవనస్వామియే వచ్చుచుండగా ఈ రాజు లందఱిగొడవ తనకేల. తన యింటిదారినే శ్రీకృష్ణుఁ డేతెంచు సమాచారము తెలిసినది. ఆ బాలకృష్ణుని దర్శనార్థము జనులతో ఇండ్ల గుమ్మములు గవాక్షములు వాకిండ్లు నిండిపోయినవి. వారి ఆనందమునకు అవధులు లేవు. సుదాముఁడట్లే కాచుకొనియున్నాడు.

శ్రీకృష్ణుడు బలరామునితో గలసి పురప్రవేశ మొన రించి దారిలో తన్నెదిరించిన రజకుని ఒక పిడిగ్రుద్దుతో గూల్చి ముందుకు సాగినాడు. మొగముల వేయికన్నులు చేసికొని మధురపౌరులా బాలవీరుని తిలకించుచున్నారు.

పూతనను జంపిన చిన్నిబిడ్డ డితడకే, ఈ విశ్వమోహానుని నోటియందా యశోద విశ్వరునిదర్శనము పొందినది. గోపికల కనుమొఱగి వెన్నలుదొంగిలించు బాలుఁడితఁడా, గోపికలతో యమునాపులినముల రాసలీలల మరగిన సురుచిరాకారుఁ డీ సుందరుఁడా, ఆ గోపలీలావతులెంత పుణ్యామూర్తులోగదా! ఈముద్దుబిడ్డతోకలసి ఆడి పాడుటకని ఒకరికొకరు కృష్ణుని కథలు చెప్పుకొనుచున్నంతలో బలరామకృష్ణులు రమణీయమూర్తులు విజయాలంకార విభూషితులు దాపునకు రానేవచ్చిరి.

ఉ॥ నందతపఃఫలంబు సుగుణంబులపుంజము గోపకామినీ
బృందము నోముపంట సిరివిందు దయాంబుధి యోగి
బృందముల్
డెందములందుకోరెడు కడింది నిధానము సేరవచ్చె నో
సుందరులార చనిచూతము కన్నులకోర్కె తీరగన్.

అని ఆబాలవృద్ధులు బాలకృష్ణు నాలోకించుటకు గుంపులు గుంపులై యుండిరి.

శ్రీకృష్ణ దర్శనాభిలాషయందే మగ్నమానసుఁడై తాదాత్మ్యమంది పరవశతనున్న సుదాముఁడొక్కయుంగలో ముందునకు దూకి రామకృష్ణుల పాదములపైఁబడి వందన మాచరించినాడు. చేయెత్తి మ్రొక్కినాడు. శ్రీకృష్ణుఁడాతని లేవనెత్తి అతనితోబాటు అతని యింటికేగినాడు. సుదాముని మనోనిలయములో నెలవున్న శ్రీకృష్ణుఁడాతని

గృహమునకే ప్రత్యక్షముగా విచ్చేసినాఁడు. భక్తులహృదయము లెఱిగిన కరుణాళుఁడా భగవానుఁడు- సుదాముడు మరల మరల మ్రొక్కెను. అర్ఘ్యపాద్యము లిచ్చెను. తానేర్చికూర్చిన పూలదండలతో వారి నలంకరించును. పాదములపై ఆనందబాష్పముల వర్షించును. ఆ పాదమస్తకము చూచిన కృష్ణునే మరలచూచును. చేసినవందనమే మరలచేయును. కుసుమగంధములదారి నలంకరించిన అలంకారములే మరల నొనర్చును- కొంతవడికి సుదాముని పెదవులునుండి మాటలు వెలువడినవి-

ఉ॥ పావనమయ్యె నాకులము పండె దపంబు గృహంబు లక్ష్మికిన్
సేవితమయ్యె నిష్టములుసేకుఱె విశ్వనిదానమూర్తులై
భూవలయంబుగావ నిటపుట్టినమీరలు రాకజేసి నే
నేవిధమాచరింతు పనులెయ్యవి బంట నెఱుంగజెప్పరే.

యని కైమోడ్పులతో వేడినాడు- తా నానాడు ఏరితెచ్చిన పూవులకు పరిపూర్ణ వినియోగము లభించినది - శ్రీకృష్ణుడనుగ్రహముతో సుదాముని సేవలస్వీకరించి, సుదామా! నీకు కావలసినదేమైనను కోరుకొనుమని స్పష్టముగా చెప్పినాడు - సాక్షాత్ భగవత్ స్వరూపముల చరణములంటి వందన మాచరించి వారికరుణకు పాత్రుఁడైన భక్తుని కేమి కావలెను - ధన ధాన్యములా, భోగభాగ్యములా, సువర్ణ సంపదలా, ఇవియన్నియు ఆ పురాణపురుషుని కృపాకటాక్ష

లవమునకైనను చాలవు. శ్రీకృష్ణుని దివ్యదర్శనముతో సుదాముని భక్తిభావము ఫలసిద్ధికి వచ్చినది - అతని మనో బుద్ధులు యోగిపుంగవులందాకొనలేని పరువమునందుకొన్నవి - స్వామీ! నీయనుగ్రహామునుపొంది ధన్యుడనైతిని, నాకలలు నిజమైనవి, నా పూలదండలకు సద్వినియోగము లభించినది- నీపాదసేవ నినుపూజించు భక్తులతో స్నేహాము మెల్లపుడు నే నందటియెడలను సహృదయుఁడనై యుండుట చాలును-

కం॥ నీపాదకమలసేవయు
నీపాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపారభూతదయయును
తాపసమందార నాకు దయసేయగదే.

అని సుదాముడు మరల ముకుళితకరములతో బలరామ కృష్ణుల చరణముల వ్రాలినాడు. ఆ దివ్యానుభూతిలో సుదామునికి సర్వము ఈశ్వరమయమే. శ్రీకృష్ణుడు సుదామునిజూచి, నీ కోర్కెలీడేరును. సుదామా! నీవు బలాయుః కాంతి కీర్తులతో వర్ధిల్లగలవని దీవించి, బలరాముని జూచి, అన్నా! ప్రధానకులజుడు కాకపోయిననేమి ఈ సుదాముని చిత్తశుద్ధియు భక్తిభావము మనఃపరిపాకము మెంత ఉన్నతమైనవో చూడుము. పరమయోగులకైనను మార్గదర్శకమైన పవిత్రభావములని యనిచెప్పి వెలుపలికేగెను-

సుదాముఁ డొక నిరుపేదమానిసియని శ్రీకృష్ణుఁడు నిరాదరింపలేదు. విశ్వాత్మకుడైన పరమేశ్వరున కఖిల భూతములు సమానమేకదా! సుదాముడు కోరినవెంటనే ఆతని పూరింటి కతిథియై యేగినాఁడు. భక్తులముందు భగవానుఁడెప్పుడును వినయుఁడే. ఏ వ్యక్తికైనను సమాజ గౌరవము లభింపఁజేయునది వినయమేగదా! సమయము వచ్చినది సుదాముఁడు సర్వసంపదలను వరములుగా బడయవచ్చును. కాని యాతఁడు వాంఛించినది శ్రీకృష్ణ పాదభక్తి సాధుజనులతో స్నేహము సర్వభూతదయ. ఇవి యలవడినచో చిత్తమునకు శాంతి సౌఖ్యములు తమంతవచ్చునని ఆ మాలాకారుని విశ్వాసము. ఇట్టి ఆదర్శవర్తనము నిజముగ చిత్తశుద్ధిగల తపస్సిద్ధి.

5. అర్చనము - అంబరీషుడు

శా॥ సప్తద్వీపవిశాలభూభరము దోఃస్తంభంబునంబూని సం
ప్రాప్తశ్రీయుతుఁడై మహావిభవసంపచ్ఛాతుడింగల్గి దు
ర్వ్యాప్తింజెందక వైష్ణవార్చనలమేరం గాలముం
బుచ్చుచున్
సుప్తింబొందకయొప్పె సద్గుణగరిష్ఠుం డంబరీషుండిలన్.

ఒకప్రక్క సప్తద్వీప విశాలమైన సర్వభూమండల ప్రజలకెట్టి లోపము రాకీయని ధర్మపరిపాలనము, వేఱొక ప్రక్క శ్రీహరియే సర్వశరణ్యమని నమ్మి నిరంతర హరి పదార్చనము నిష్ఠతోడను నియమముతోడను నెఱపిన మహాత్ముడు అంబరీషుఁడు. ఈ మహారాజు హరిభక్తియెదుట జగదప్రతిహతమగు బ్రాహ్మణ శాపముగూడ నిరర్థకమై వ్యర్థమయ్యెను. ధర్మపాలకులుగ లోకమున సుప్రసిద్ధి గనిన వారు సూర్యవంశపు రాజులు. ఇక్ష్వాకు, మాంధాత మున్నగువారీవంశీయులే. ఇట్టిసత్కులమున నాభాగుఁడను మహారాజునకు పుత్రుడై అయోధ్యనుండి భూచక్రమేలిన చక్రవర్తి అంబరీషుడు. ఈ ఇక్ష్వాకు వంశమున ప్రసిద్ధులైన రఘువు అజుడు దశరథుడు శ్రీరాముడు మున్నగువారు అంబరీషుని తరువాత ధరణినేలిన సూర్యవంశీయులు-

జగత్ప్రసిద్ధిఁగనిన సద్వంశజననమునకుఁ దోడు సంపూర్ణ విశ్వాసముతో సంతత విష్ణుపూజాచరణ మీ

మహారాజున కలవడుట పదాఱువన్నె మేలిమి బంగారునకు మధురసౌరభ మబ్బినట్లున్నది. అనంతమైన సామ్రాజ్యము, అప్రతిహతమగు అధికారము, అరిభీకరములగు బలసాహసములు, అమరేంద్రుని తిరస్కరింపఁజాలు అగణిత భోగభాగ్యములు. ఇన్ని మహావైభవములున్నను ఈ మహానీయుని చిత్తమెప్పుడును శ్రీహరి పాదములందే. కరములు విష్ణుమందిర సేవలయందు, భాషణములు హరికీర్తనమందు, వీనులు హరికథా శ్రవణమందు, చూపులు శ్రీహరిరూపమందు, శిరము హరి నమస్కారములందు, కాళ్ళు హరి నిలయముల కేగుటయందు, కోరికలన్నియు హరిపదసేవలయందు. ఇట్లు తన నిత్యకార్యక్రమములెల్ల హరిచింతనమునందే గడపుచు వైష్ణవార్చనమునకే తనజీవితమంకితమొనరించినపరమ భాగవతు డంబరీషుడు - మహారాజభోగములున్నవి. కాని అంబరీషునకు కావలసినది ఆత్మోద్ధరణము, ఆధ్యాత్మికానందము, నిరంతరతపోనిమగ్నులకలవడని హరిపదార్చనయందు తాదాత్మ్యము. ఆతని తపస్సు ఫలించి ఇవి పుష్కలముగ ఆ నరపాలునికి లభించినది-

ప్రజాక్షేమమున కెట్టి అంతరాయములులేవు. వర్ణాశ్రమ ధర్మములు సక్రమముగ ఆచరింపఁబడుచున్నవి. గోవిప్రమునికులమునకు తగిన రక్షణయున్నది. సామ్రాజ్య పాలన విధ్యుక్తముగ సాగుచున్నది - ఆ పుణ్యావర్తనుని

చిత్తము ఈశ్వరాయత్తమైనది. ఐహిక వ్యాసంగములందు కాంక్ష క్రమముగ నశించినది - సరస్వతీ నదీతటమున కేగి తత్పుణ్య ప్రదేశమున యాగశాలలు యథావిధిగ నేర్పఱచి వశిష్ఠ వామదేవాది కులగురువులను మునిపుంగవుల దీవించి అశ్వమేధ యజ్ఞము లనేకములు గావించినాడు - పవిత్ర హవ్యములతో దేవతలెల్లరు తృప్తులయిరి. విస్తృత దాన ధర్మములతో ప్రజలన్నివర్గములవారు తృప్తినందిరి. క్రతు నిర్వాహమున కేతెంచిన మునులు విప్రులు పూజలంది ముదితులైరి - ఆ రాజర్షి ఇట్లు సర్వకార్యములు హరిపర ములుగా నొనరించుచు, ఐహికాపేక్షలు త్యజించి, ఒకనా డేకాంతమున హరిపద ధ్యానమగ్నుఁడై యున్న తరుణమున భక్తవత్సలుఁడగు పద్మాక్షుఁ డారాచతపసి భక్తపార వశ్యమునకలరి ఓరాజవర్యా! నిన్నెల్లవేళలను ఈయది రక్షించుచుండునని యాశీర్వదించి ఒక చక్రము నిచ్చి చనెను.

ఆ॥వె॥ అతని కీహమానె హరులందు కరులందు
ధనములందు కేళివనములందు
పుత్రులందు బంధుమిత్రులయందును
పురమునందు సంతిపురమునందు.

ఇట్లు సకలసంగ పరిత్యాగి యయిన ఆ కర్మయోగి కేమి కావలెను. ఈశ్వరార్చనమే యామహనీయుని నిత్యాను

ష్ఠానము, అనుదినార్చనలిట్లుండ, అంబరీషుడు అనురూపగుణాఢ్యయు అమలవర్తనయునగు తన అర్ధాంగితో గూడి కాళిందీతటమున విధ్యుక్తముగ ద్వాదశీ వ్రతము నారంభించెను. పూజానిర్దిష్టమగు వత్సరకాల మా పుణ్య వ్రతము సంపూర్ణముగా సాగినది. శరదృతువేతెంచినది. కార్తీకమాసపు వెన్నెలలో నలుదెసల రాత్రివేళల వెలుగులార బోయుచున్నవి. కాళింది నిర్మల జలములు ఇరుగట్ల నొరసిపారుచున్నవి. స్వచ్ఛకౌముదివలె మాధవార్చనమున మఱింత నిర్మలమైన అంబరీషుని మనస్సు భాసిల్లినది—వ్రతోద్యాననోత్సవదిన మేతెంచినది. మహావైభవముగా సర్వసంతృప్తికరముగ, సంతోషప్రదముగ జరుపవలెనని అంబరీషుని అభిలాష— ఆ దినము దినమెల్ల వ్రతకార్యములే, కేశవార్చనలే, దాన ధర్మములే, హరికీర్తనములే. విష్ణుపద పూజాఫలమగు ఒకవిశిష్టతేజ మా యంబరీషునిలో వెలుగులీనుచున్నవి. ఆతేజః పుంజముముందు యెట్టి అపకృతియు అనుచితమును నిలువఁజాలని మహిమరూప మది—

వ్రతఫలము నందుటకు నియమయుక్తమగు ద్వాదశి పారణము చేయవలెను. అంబరీషుఁడు తన నిత్యానుష్ఠానములు నిర్వర్తించి, హరిపూజనము జరిపి, గోవిప్రపూజలు గావించి అమలసువర్ణశృంగములు అక్షీణ క్షీరపూర్ణములు, వత్సాన్వితములునగు అసంఖ్యాకములగు గోవులను బ్రాహ్మ

ణులకు దానమొనర్చి షడ్రసోపేత భోజనములచే వారికి పరితృప్తి గావించి ఆ పుణ్యపురుషుల యనుమతితో వ్రత ప్రసాదము ద్వాదశిపారణము చేయుట కేగుచున్నంతలో ఋషిపుంగవుఁడు దూర్వాసుఁ డతిథియై యేతెంచినాడు- అంబరీషుని యానందమునకు మేర లేదు. తలవనితలంపుగా పరమపూజ్యుడయిన తాపసవరుడు ఆ పర్వదినమున తన కతిథిగా చనుదెంచినాడు. ఇంతకన్నను భాగ్యమేమి వల యును. అర్ఘ్యపాద్యాదులిచ్చి ఆసనమొసగి అర్చనలుజరిపి భోజనమునకులెండని యాహ్వానించినాడు.

"రాజా! ఒకక్షణమాగుము, నదీజలములస్నానమొన రించి ఇచ్చటున్నట్లు వచ్చెదను. నా భోజనమగువరకు నీవును ఆగు"మని చెప్పి దూర్వాసుఁడు వెడలెను. మహా ప్రసాదమని యా మునిని స్నానమునకు సాగనంపి అంబ రీషుఁడా యతివరునిరాకకై యెదురు తెన్నులు చూచు చున్నాడు - గడియ లొక్కొక్కటి గడచిపోవుచున్నవి. స్నానమొనరించి వెనుకకు వచ్చుటకు యెంత సమయము కావలెను? పది పదునైదు నిముషములలో రావచ్చును. కాని యీ కమండలుధారి కదలువచ్చు జాడ లేదు. మధ్యా హ్నము కావచ్చినది- మాటి మాటికి ఋషికై బాటలు చూచిన ప్రభుసత్తమున కాత్మలో ఆందోళన అధికమైనది. ద్వాదశి మఱికొన్ని క్షణములలో దాటును. ఈశ్వరార్చన ప్రసాదము సకాలములో ద్వాదశిపారణగ గ్రహింపకుండు

టయా, భగవానునియెడల యింత అపచారమా – అచట ఆసీనులయి వున్న యతీంద్రులను జేరి అంబరీషుడంజలి బద్ధుడై ప్రార్థించినాడు.

ఆర్యులారా! మీరు ధర్మవిధులు, కర్మాకర్మ విచక్షణులు. ద్వాదశికాలము మీరుచున్నది– దూర్వాసముని అతిథియైవచ్చి స్నానమునకేగి యెంత ఆలస్యమైనను తిరిగి వచ్చుటలేదు. వ్రతభంగముకానివిధము సెలవీయుడయ్యా యని వినయుడై విన్నవించినాడు. ఆ మహారాజు వచనముల నాలించిన మునులకు మనస్సులందు దూర్వాసముని వర్తన మనుచితమనిపించినది. నిరంతర హరిచరణార్చనాపరతంత్రుడు ధర్మపరిపాలకుడగు అంబరీషునివంటి నరపాలునకా తాను నిశ్చలభక్తితో నొనరించిన ద్వాదశీవ్రత పారణాము భంగమగుట కారాదు, కారాదు, అది క్రమవిరుద్ధము ధర్మనిరాసము ఆ మహాముని లేకకంఠముగ–

ఆ॥వె॥ అతిథివోయి రామి అధిప! యీద్వాదశి
పారణంబు మానఁ బాడిగాదు
కుడుచుటయునుగాదు, కుడువకుంటయుగాదు
సలిలభక్షణమ్ము సమ్మతమ్ము.

అని ధర్మసందేహ నివృత్తి జేసిన యతీంద్రుల యానతి శిరసావహించి వారికిమ్రొక్కి అంబరీషుడు నిశ్చలచిత్తమ్మునసీరజాక్షుని నిలిపి, ద్వాదశీవ్రత ప్రసాదతీర్థము

నొకింత సేవించి తనవ్రతదీక్ష సక్రమముగ సంపూర్తియయి నందులకు శ్రీహరిని వినుతించుచున్నంతలో-

స్నానమునకేగిన దుర్వాసనంయమిచనుదెంచి అంబరీషునిచే సేవితుఁడై, యా రాజు చేసిన పనిని బుద్ధినూహించి ఒక్కత్రుటిలో ఆగ్రహావేశుఁడై, ఔరా! అంబరీషా! మహారాజునని నీకు గర్వమెంత ప్రబలినది - మునివరులను గూడ కన్నుగాన కుంటివి. నన్ను స్నానమునకుఁ బొమ్మని చెప్పి. వినయమునటించి నేను వచ్చునంతదనుక ఒక నిముసమాగక నీవు మునుముందు సలిలపానమొనర్చి నన్నిట్టులవమానింతువా. నీ యపరాధము మునిలోకమునకే అపచారము. పరమశివుఁడయినను అడ్డుపలుకని నా యెడలనా, నీ దురహంకారము. నిన్నంత మొందించినగాని నా స్వాంతము శాంతింపదు. హరిగాదు గిరిగాదు యెవ్వరడ్డ మేతెంతురో చూతునుగాకఅని చిందులు త్రొక్కినాడు-

తనపరిస్థితులు విన్నవించుకొనుట కంబరీషుని కవకాశమే యీయలేదు. అచటనున్న మునులందరు దుర్వాసుని ఆగ్రహాబలమెఱిగినవారు గాన భయభ్రాంతులై యూరక చూచుచుండిరి.

దుర్వాసునికి మేనదరినది - పండ్లు పట పట లాడుచున్నవి. బొమముడిసుడివడుచున్నది. వక్త్రిలమునుండిహుంకారములు వెలువడుచున్నవి. కోపోద్రేకమున ఆపాదమస్త

కము భీకరాకారమైనది. తన శిరోజములనుండి ఒక జటను మొదలంటపెరికి మంత్రించి కృత్యయను ఒక మహాశక్తిగా ప్రాదుర్భవింపజేసి సర్వాయుధ సమన్వితగా నొనర్చి ఈ దురహంకారుని ఈ దుష్కర్ముని ఈ ధర్మఘాతుకుని ఈ గర్వోన్మత్తుని అంబరీషుని హతమార్చుమని ఆరాజుపై కాశక్తిని కవ్వించి పంపినాడు. యెంత ఘోరము! యెంత ఘోరము! అని అచటివారెల్లరు భీతిల్లి వణకిపోవుచుండిరి. అంబరీషు నంతటిజ్ఞాని భక్తుడు ప్రజాక్షేమ మెరిగిన జనపతి, క్షణములో ఆభయంకరశక్తియొక్క అగ్నిశిఖాజ్వాలలకాహుతి కావలసియున్నది. దిక్కులు సంక్షుబ్ధమైనవి. వాయువీచికలు స్తంభించినవి. దుర్వాసుని వదనమున నొక వికృత క్రూర హాసోన్మిషితరేఖ తాండవించుచున్నది. తన శక్తిసామర్థ్యములు చూపింపఁబోవుచున్నాడు ఆ ఋషి.

ప్రశాంతచిత్తుఁడు అంబరీషున కావంతయు భయభావము లేదు_ సంతోషముగ ఆతిథ్యము గ్రహింపవలసినచోట ఆగ్రహోన్మత్తుఁడైన దుర్వాసుని దుశ్చర్య కాశ్చర్యపడినాడు. తనకు కోపమురాదు. ఆ సాత్త్వికగుణాభిరామునకు కోపించుటకును ఆవశ్యకతలేదు. తనవద్ద హరి యొసంగిన రక్షాచక్రమున్నది. దానిని ప్రయోగించు ప్రయత్నములేదు. మఱుక్షణములో ఆ శక్తినుండివచ్చు పెనుమంటలలో దగ్ధమగుటకే సిద్ధమగుచున్నాడు. కాని తన సర్వస్వము ఆ

పరమాత్మునిది, ఆ జగద్రక్షకునిది. ఆ భక్తవత్సలుని ఆ ఆపన్నశరణ్యుని ఆ ధర్మపరిపాలకుని అచంచల విశ్వాసముతో ఆత్మయందు నిలిపి, శ్రీహరీ ! నేను నిరపరాధిని నీ దాసుఁడను ఈ యగ్నిపరీక్షలో నన్నేమియొనర్చిననుసరే నీ ఇష్టము అని నిమీలితనేత్రుఁడై ధ్యానముద్రాంకితుఁడయినాడు. ఏ మహాగ్నులుదరిఁజేరలేని ఒకయాధ్యాత్మిక తేజమంబరీషునిలో వెలుఁగుచున్నది.

తనభక్తులనెప్పుడెట్లు రక్షించుకొనవలయునో సర్వజగత్ సాక్షియయిన జగన్నాథుఁడెఱుగును. అదియొక విరతిలేని విశ్వదర్శనము - ఒకలిప్త, ఒకత్రుటి, ఏమిఁజరుగఁబోవుచున్నదోయని ద్వాదశీవ్రతయాగమంటపమందున్నయందఱి కనులు అన్నిదిక్కులవైపు చూచుచున్నవి - అంబరీషుని ఆత్మవేదన నచ్యుతుఁడాలించినాడు. ఒకకరుణామృతరేఖ వైకుంఠముననుండి ఆ వసుధాధిపునిపై సోకినది- అంబరము నుండి అవనీగర్భమువరకు పెళిల్లున ప్రీలిప్రేలినట్లయి ఒక చక్రము దుర్నిరీక్ష్యరయతేజములతో పరిభ్రమించుచు ధగధగాయతముగవచ్చికృత్యకుఅడ్డుపడినిలచినది. విశ్వవిక్రాంతమగు ఆ చక్రవేగముననే ఆ దుష్టశక్తిదగ్ధమై భస్మీభూతమైనది – అంతటితో ఆ చక్రమునకు తనివి జనింపలేదు- హరిభక్తుడగు అంబరీషు నకారణముగ అంతమొందించుటకు హేతుభూతుఁడైన దుర్వాసునిపై తిరిగినది. ఆ దుర్వార చక్రోద్ధతికి దుర్వాసురునికనులు తిరిగిపోయినవి. ముచ్చెమ

టలుపోసినవి. కాలుసేతులు వణకుచున్నవి. గుండెలు కొట్టుకొనుచున్నవి. వచ్చుచున్నది, వచ్చినది, మీదపడ బోవుచున్నది. ఆ వహ్నికీలాభీలా చక్రమున కడ్డులేదు- శిఖిశిఖాజ్వాలనోగ్రమైన దావానలమువలె తన్నావరించుచున్నది. దుర్వాసుడు వెఱ్ఱివానివలె నలుదిక్కులు చూచినాడు. ఆతనినాదుకొనువారు లేరు. తనమంత్రశక్తియు తపోబలమేమైపోయినదో ఆ మునికే తెలియదు - దండకమండలువు లచటజారవిడచి పరుగెత్తిపోయినాడు - ఆ చక్రమాతని వెంటాడ నారంభించినది-

ఆ యాగమంటపమున ప్రళయమునుండి బయటపడినట్లొక ప్రశాంతవాతావరణము సుప్రసన్నముగ ప్రకాశమానమైనది. అంబరీషుడట్లే తనధ్యానముద్రలోనున్నాడు- ఆ చక్రమెచ్చటిది, ఆ శక్తియేమైనది, దుర్వాసునిశాపబలమేమైనది- దుర్వాసుడు కనుపింపడే. అచటినున్నవారికా సంఘటనక్రమ మంతుపట్టలేదు- అద్భుతాశ్చర్యమగ్నులై యెటనున్నవారటనే ఉండిపోయిరి.

వెనుకకు చూచును. దుర్వాసుడు ముందునకు పర్వెత్తును. చక్రమడ్డుదగులును. ప్రక్కలకు దుర్వాసుడు తప్పుకొనబోవును. అచటను చక్రమే. కుంభించి పైకెగురబోవును. పటుక్కున తలకేదియో తగులును- యెచటచోటు దొరకిన అచటకు దుర్వాసుడు పరుగెత్తును. వానివెంటనే

చక్రమువచ్చి మీదపడుచుండును. ఆ చక్రమున కొక్కటే గతి- దానిని తప్పించుకొనుటకై దుర్వాసుడు-

మ॥ భువిదూరన్ భువిదూరు నబ్ధిఁజొర నబ్ధుల్ సొచ్చు నుద్వేగియై
దివిఁ బ్రాకన్ దివిఁ బ్రాకు దిక్కులకుఁబో దిగ్వీథులంబోవు జి
క్కి వెసం గ్రుంగిన గ్రుంగు నిల్వ నిలుచుం గ్రేడింప గ్రేడించు నొ
క్కవడిన్ దాపసు వెంటనంటి హరిచక్రం బన్యదుర్వక్రమై.

దుర్వాసుని ఒకఆటబొమ్మజేసి ఆ చక్రమాడించుచున్నది.

దుర్వాసుఁడెటు తప్పించుకొనిపోవఁజూచిన యచటికే వెంటాడి తరుముచున్న దాచక్రము. ఆ చక్రము పద్ధతియే వింతగానున్నది- ముందునకు త్రోయును, వెనుకకు నెట్టును, ప్రక్కలకు పడగొట్టును, అంతియేగాని ఒక్కసారిగా దుర్వాసుని పట్టుకొని మట్టుపెట్టదు. అట్టు చేసినచో పరిపూర్ణమైన ప్రయోజనములేదని కాబోలును. హరిభక్తున కెదురుతిరిగినాడు, హరిచరణార్చనకు విలువలేకుండ చేయసంకల్పించినాడు, దుర్వాసుని యపకృతి యతనికే తెలిసిరావలయును. దుర్వాసుని కీలుబొమ్మవలెచేసి వెంటబడి తరుముచున్న దాచక్రము- ఊపిరిసలుపక మరి తప్పించుకొని పరువిడుట కోపికలేక ఉక్కిరి బిక్కిరియగుచున్నాడు

దూర్వాసుఁడు - భూనభోంతరములలో తనకు రక్షణనిచ్చు ప్రదేశమే కనుపించ లే దామునికి-

బ్రహ్మలోకమున కేగి బ్రహ్మపాదము లంటినాడు. తనను వెంటాడి తరుము చక్రమునుచూపి పాహి! పాహి! మాం అని ప్రార్థించినా డా దుర్వాసుడు- నేనేమియు చేయ లేను మునీ! అని వనజభవుఁడావలి కేగెను- కైలాసమున కేగి కాలకంఠుని కాళ్ళమీదబడినాడు. వెనుకనుండి మీదబడఁ బోవుచున్న చక్రమునుజూపి రక్షింపుము! రక్షింపుము! అని వాపోయినాడు. ఇందు నేను కలగఁజేసుకొని చేయుకార్య మేమియును లేదు. దుర్వాసా! నీవు వైకుంఠమున కేగి నారా యణునే వేడుము. ఏదేనొక దారిజూపఁగల దైవమాతఁడు అని పరమశివుఁడు దుర్వాసురుని పంపివేసెను- వైకుంఠ పురము నందొక కేళీవనమున భర్మమణి సౌధవేదికాతల మున శ్రీ రమాదేవి సరస సంభాషణలవినుచు వినోదించు చున్న భక్తరక్షణ కళానందమనసుఁడగు శ్రీహరికడకు దుర్వాసుఁడేగి పాదములమీదఁబడి మరిలేవక కాలువలుగా కన్నీరు గార్చుచు, శ్రీహరీ, దేవాదిదేవా, భక్తవత్సలా, వరదా, నీ మహిమ మెఱుఁగ లేక నీదాసున కెగ్గొనరించితిని. జగన్నాథా! నా నేరమును సైరింపుము. ఈ చక్రానల జ్వాలలు నన్ను దహించుచున్నవి. నన్ను క్షమింపుము-

నాయజ్ఞానము తొలగినది— నాకిక నీవే శరణ్యమని విలపించు దుర్వాసునిపై శ్రీహరి కరుణించి ఇట్లనెను—

మునీంద్రా! నా భక్తులు, నా కతిప్రియులు, నా హృదయము వారియందే యుండును. గోవు వెంటఁబోవు గోవత్సముఁవలె నా మనస్సు భక్తుఁడెచటనున్న యచటి కేగును. నిజదారసుతాదులను సంపదలనువిడచి నన్నే ఆశ్రయముఁపొందు భక్తులను నిరంతరమంటిపెట్టుకునేయుందును— మా హృదయమార్గములనన్యోన్యము మేమే యెఱుగగలము. తపము విద్య విప్రవరులకు ముక్తిప్రదములై ముదమునిచ్చును. దుర్జనులకివియే కంకటములై బాధించును. నా తేజము ప్రకాశించు సాధువర్తనులకు బాధలుగల్పింపఁ జూచువారిట్లే యాపదల పాలగుదురు. దుర్వాసా, నీ కిపుడభయమీయ గలిగినది ఆ సాధుపురుషుడంబరీషుఁడేయని వెనుకకంపెను. దుర్వాసునకు మతితోచనిస్థితి యేర్పడినది. ఏమహానీయునిపై దురహంకారమున కాలుద్రువ్వి కడముట్టఁజేయ సంకల్పించి నాఁడో తిరిగివచ్చి ఆ యంబరీషుని పాదకమలపైఁబడినాఁడు. కన్నీరు గార్చినాఁడు. రాజేంద్రా! హరిభక్తవరేణ్యా, నన్నీ చక్రమునుండి రక్షింపుము. నన్ను నలువురిమధ్య బ్రతుకనిమ్ము. నీకరుణకై వేచియున్నానుఅని ఆ మహీవల్లభు పాదములు విడువక విలపించు ఋషినిగాంచి, అంబరీషుఁడాశ్చర్య పడి, చేతులు జోడించి ఆ విష్ణుచక్రము దెసవీక్షించి ఇట్లు వినుతింపసాగెను—

"సాక్షాత్ సారసాక్షునిహస్తమునవిలసిల్లు ఆయుధ రాజమా నిన్నేమని సన్నుతింపఁగలను. పంచభూతములందున్న శక్తి సామర్థ్యములు తేజఃపుంజములు నీయవియే- దురన్వితులైన దైత్యులెందఱో నీ నిశితధారలకు మడిసిరి. సాధుజనులెందఱో నీ మహిమవలన సురక్షితులయిరి. నీ రణోద్ధతికడలిదుర్నీతులు పలుపంచలపరువిడితలలుదాచుకొనుచున్నారు. మా మనస్సులెప్పుడు నీయందేలగ్నమై యుండును. ఈ మునీంద్రుని దుర్వాసునిదుస్థితి దయనీయమైనది. ఇంతవఱకి శిక్షచాలు. నావలనగదా నీకింతశ్రమ వచ్చినది. నన్ను స్మరించి, కరుణించి, ఈ దుర్వాసునిక వదలిపెట్టుము అనఁగానే చక్రము తననిర్వక్ర విక్రమోగ్ర వహ్నిజ్వాలా విక్రాంతులు త్యజించి ప్రసన్న ప్రశాంత తేజమ్మున ఆ మునినివిడచి వైకుంఠమున కరిగెను-

అంబరీషుఁడత్యాదరమున ఆ మునీంద్రుని లేవనెత్తి ధూళిధూసరితమైన అతనిమేను శుభ్రమొనర్చి, మూలనుబడియున్న యాతని దండకమండలు లాతని చేతులకిచ్చి, తదంఘ్రులంటి మునీంద్రా, చాలా అలసియున్నావు అని షడ్రసోపేతమగు భోజనము విందుఁగూర్చి తృప్తునిజేసి సుఖాసనమిచ్చి శీతలోపచారముల వింజామరల వీవసాగెను. అంబరీషుని భక్తికి వినయమున కాముని యాశ్చర్యపడెను. తానుచేసినపనికి తానే సిగ్గుపడి నోటమాటలేక కొంత తడవట్లేయుండి తుదకు-

రాజేంద్రా నీవర్తన మతిపవిత్రిమైన దయ్యా. ఏ దేవుని నామస్మరణ మాత్రమున సకలాఘములు నశించి శుభము లొందవునో ఆ దేవదేవు నర్చించు మహాభక్తుఁడవు. నిన్నుబోలు సాధుజనుల కేయాతంకములు గలుగవు. నా తప్పును సయిరించి నన్ను సదయుఁడై సంరక్షించి సత్కృతు లొనరించి మహోత్తమగుణుఁడవు నీవు. నీకు సర్వవేళలందును శుభములే కల్గునుగాక. త్రిభువనములందును నీకీర్తి స్వచ్ఛమై వ్యాపించును. నీ ధర్మగుణము సర్వజనులకు మార్గదర్శకము. నీయింటతనివితీర భుజించితిని. నీమహిమ గ్రహించితిని,

శా॥ కంటిన్ నేటికి నిన్ను నీవచనముల్ కర్ణద్వయిన్ బ్రీతిగా
వింటిన్ అన్నముగొంటి నీగృహమునన్ వేడ్కన్ ఫలంబబ్బె నే
మంటింబోయెద నీచరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై
మింటన్ మేదిని సన్నుతింపఁగల రీమీదన్ నరేంద్రాగ్రణీ.

అని శుభంబుపల్కి దుర్వాసుడు మరలి బ్రహ్మలోకంబునకు జనెను. ఆ మునీంద్రుఁడు భుజింపమిగిలిన పవిత్రంబైన యాహారముగుడిచి అంబరీషుఁడచటివారలకెల్ల నమస్కృతులుసలిపి దక్షిణ తాంబూలాదులు బహుమాన సంయుత

ముగనిచ్చి వీడ్కొలిపి తన ద్వాదశీవ్రత కార్యక్రమము విధ్యుక్తముగ పూర్తి నొందించెను.

హరిచరణపూజాతత్పరులగువారికి తక్కుంగల సౌఖ్యములెల్లను బంధములే. తనయుల రావించి ధర్మపద్ధతుల బోధించి ధరణీభారము వారిభుజస్కంధములనునిచి అంబరీషుఁడు హరిధ్యాన తపోనియమానుష్ఠాననిష్ఠుండై యడవులందు శేషకాలమును గడపుచు తుదకు పరమపదమధిష్ఠించెను.

అంబరీషుని ద్వాదశీవ్రతముం జూడవచ్చిన యనని జనులకెల్లరకు ఆ మహామహిముని చరిత మత్యద్భుతముగా గోచరించినది - భగవానుఁడెప్పుడును తన భక్తులవెనుకనే యుండి గాపాడుచుండునను సత్యము గ్రహించి, అంబరీషోపాఖ్యానమును మరల మరల తమలో తాము చెప్పుకొనుచు గృహములకేగిరి.

దురహంకారులు, దుష్టవర్తనులు తాము త్రవ్వుకొనిన గోతియందు తామే పడుదురనిన సామెతకు దుర్వాసుని కథ ఒక నిదర్శనము.

అంబరీషుఁడు అంబుజాక్షుని భక్తశేఖరులలో అగ్రశ్రేణికి చెందిన పరమభాగవతుడనినది లోకవిదితము. అంతటి భక్తుఁడై, అఖిలావనీ సామ్రాజ్యమేలు ఆ మహాపురుషుని

వర్తనము సాధుత్వమునకవధి, తనకపచారము చేయనెంచిన దుర్వాసుని హృదయపూర్వకముగ ప్రేమించి సేవించి పూజంచినాడు. ఆ రాజఋషి మనస్సున సర్వజనులు భగవదనుగ్రహమున సుఖశాంతులతో నుండవలయునని ఆశయమే సర్వకార్యములకుమూలమై భాసించినది. జగత్పూజ్యుఁడైన సద్వర్తనుఁడు భక్తాగ్రణి అంబరీషుఁడు.

6. సేవ - యశోదానందులు

మ॥ గతజన్మంబుల నేమినోఁచితిమొ యాగశ్రేణు లేమేమి సే
సితిమో, యెవ్వరి కేమిపెట్టితిమొ యేచింతారతిం
బ్రొద్దుపు
చ్చితిమో సత్యము లేమి పల్కితిమొ యేసిద్ధ
ప్రదేశంబులఁ ద్రొ
క్కితిమో యిప్పుడు సూడగంటి మిచటం గృష్ణార్భకున్
నిర్భయున్.

ఇవి బాలకృష్ణునిజూచి యశోద గోపికలు మరల మరల ఆడుకొను మాటలు. తొట్టెలో శిశువుగానున్ననాటి నుండియు కృష్ణుని కేవియో ఆపదలు సంభవించుచునే యున్నవి. అందుండి యాతడు విజయవీరుఁడై వెలువడును. గోప గోపికలు ఏదో దైవమీయర్భకుని రక్షించుచున్నదను కొందరు. పూర్వజన్మముల మనమొనర్చిన పుణ్యఫల మీ కృష్ణుఁడని సంతృప్తిపడుచుందురు. నిజము క్రమక్రమముగ గాని తెలియరాలేదు.

బాల్యమునుండియు శ్రీకృష్ణుని చరిత్రము చిత్రాతి చిత్రముగ జరిగినది. జననము మొదలు నిర్యాణమువరకు ఊహాకందని వేగముతో సంఘటన లొకదాని తరువాత నొకటి సాగినది. శ్రీకృష్ణుఁడు విష్ణుదేవుని అవతారము,

లీలామానుష విగ్రహుఁడు. జన్మించినది కంసుని మధురా పురమున కారాగృహమునందు దేవకీ వసుదేవులకు. ఆ మరు క్షణమునుండియే బాల్యము గడిపినది వ్రేపల్లెలో యశోదా నందుల ఇంట. పెరిగి పెద్దవాడయి నివసించినది ద్వారకా పురమున. ఈ మధ్యలో యెన్ని లీలలు, యెన్ని మహాత్కార్యములు, అవి అసంఖ్యాకములు. యమునా తీరము, బృందావనము, మధుర, ద్వారక, ఇంద్రప్రస్థము, హస్తిన, కురుక్షేత్రము ఈ ప్రాంతములన్నియు శ్రీకృష్ణుని లీలా విశేషములతో నిండి ఆ యవతారపురుషుని శ్రీచరణముద్రాంకితములయి పవిత్రములైనవి. బాలుఁడుగానున్న శ్రీకృష్ణునకు మాతాపితృభావ మధురవాత్సల్యవిశేషములతో సేవ చేయు విశిష్టభాగ్యము యశోదా నందులకు దక్కినది. శ్రీకృష్ణుఁడు అవతార పురుషుఁడని నంద యశోదలకు తెలియునా; తెలియును, తెలియదు కూడను- శ్రీకృష్ణుఁడొక నిముషములో తన దివ్యలీలలు ప్రదర్శించును. మరు నిముషములోనే మరపించును. అది శ్రీకృష్ణుని మాయా రహస్యము.

కంసాది విమతులొనరించు పాపభారము వహించలేని భూదేవి మొరవిని శ్రీహరి అభయమొసగినాఁడు. అవనిపై తానవతరించి ఆ బాధలను బాపెదనని - తనసోదరి దేవకికి జనించు అష్టమశిశువు తన మృత్యుహేతువని మధురాపతి

కంసుఁడెరుగును. పుట్టిన పిల్లలను పుట్టినట్లు చంపుట కను వుగా దేవకీ వసుదేవులను కంసుఁడు రాజగృహాకారగారము నందేబంధించినాడు. శ్రీహరి శ్రీకృష్ణరూపమున ఆ కారాగారమునందే దేవకి అష్టమగర్భమున దివ్యభాసురమూర్తియై జనిస్తించినది.

చతుర్భుజుఁడు గదాశంఖచక్రపద్మహస్తుఁడు కౌస్తుభ హారకాంతిభాసుఁడు శ్రీవత్సలాంఛనుఁడు రత్నకిరీటుఁడు రమణీయమూర్తియయిన ఆ చిన్నిబిడ్డనుజూచి దేవకీ వసు దేవులు అద్భుతంపడి, దేవా! నీవు మా బిడ్డడవై యుద యించుట మా భాగ్యవిశేషము. మహాజ్ఞానులు యోగులు చూడఁజాలని నీ పరంజ్యోతిరూపము చూచినారము– మా జన్మములు ధన్యములైనవి కాని... కాని ఇంక నొక క్షణ ములో దుష్టుఁడా కంసుడు వచ్చును. నిన్ను తన కత్తి కెఱ చేయుటకు. భక్తవత్సలుఁడవు సర్వసమర్థుఁడ వీవేయని స్తుతి యించుచున్నంతలో కరుణాకటాక్షభాసురమగు చిర్నగవున ఆ సర్వేశ్వరుఁడు ఆ పుణ్యదంపతులజూచి మీరు స్వాయం భువమనువుకాలమునపృశ్నిదుతపులు, తరువాత అదితి కశ్య పులు, ఇప్పుడు దేవకీ వసుదేవులు. వరుసగా మీకు బిడ్డ డనై యుదయించుచుంటిని. నన్ను పరబ్రహ్మముగా నెరిగి వర్తించుచుండుడు. మీకిటుపై భవబంధములుండవు అని

పలికెను. "వసుదేవా! కృష్ణునివేగమె వ్రేపల్లెకు గొనిపోయి నందుని ఇల్లాలు యశోద మంచమునబెట్టి ఆమె కుదయించు శిశువు నిటకు గొనిరమ్ము" అను వాణియు వినబడినది. మఱుక్షణములో ఆబిడ్డ తనరూపమునుపహరించి పసిపాపయై దేవకిపా ర్శ్వమందు నిదురించెను. ... [Unclear line]

దేవకిపాత్రిలియం దొదిగినాడు. అంతయు లిప్తలో జరిగి పోయినది. దేవకీ వసుదేవులు మాయామగ్నులైరి. వెలుపల అంతయు ప్రశాంతము.

వసుదేవుఁ డాబిడ్డ నొకచిన్న మందసము నందుంచి నిశ్శబ్దముగ వ్రేపల్లెకేగి నందునిగృహముజేరినాడు. అచ్చట అంతకన్నను ప్రశాంతము. వసుదేవుఁడట అడుగుపెట్టినాడు. యశోదగర్భమున యోగమాయ ఉదయించినది. యశోద ఒడలెఱుగదు. తక్కినవారికి మెలకువయేలేదు. యోగమాయయే దాదిరూపమున ఆ ఆడశిశువును వసుదేవునకిచ్చి వసుదేవునిబిడ్డనుయశోదప్రక్క పరుండబెట్టినది .వసుదేవుడు మధురజేరినాడు. కనినపసికందు కడుదూరమైనాడను క్రందులో దేవకీ వసుదేవులకు కంసునిబారినుండి యీ బిడ్డను తప్పించితిమిగదాయను ఆశాకిరణమొకటివెలిగినది. అచ్చట కారాగారమున ఒకశిశువు కేరుమని యేడ్చినది. ఇచ్చట నందునింట ఒకబిడ్డ కెవ్వున గొంతెత్తి యేడ్చినాడు. ఆ క్షణముకొఱకెదురుచూచు కంసుడు కత్తినిదూసి దేవకి బిడ్డనులాగి ఖండింపఁబోవునంతలో యోగమాయ ఆకాశ

మున కెగసిపోయినది. కంసునిజంపు పసిబిడ్డ డెచ్చటనో యెదుగుచున్నాడు. తెరమీది చిత్రములవలె మహావేగమున యీ సంఘటనలన్నియు ఒకదానివెంబడి ఒకటి జరుగుచున్నవి–

పురుడింకను ఒకటి రెండు రోజులలో వచ్చుననుకొన్న నందుని ఇంటిలో ఆయర్ధరాత్రమున అనుకొనకుండగనే ఆనందము వెల్లివెలిసినది. మధురాతి మధురమ్మగు ఆ బిడ్డను మొదటి కేరింతతో అందఱు ఒకత్రుటిలో లేచిరి. ఒకకత్తె చిన్నపసివానిని యశోద గుండెల కద్దుకొనుచున్నది. నందుడు తెరనొకింత తొలగించితిలకించినాడు. ఆ శ్యామ సుందరునిచూపులో రూపులో ఒకదివ్యతేజము వెలుగొందు చున్నది. ఆపుణ్యదంపతులిరువురికన్ను లేకమైమోదబాష్పములతో కాంతి రేఖలు వెల్లువలుగట్టినవి. ఇది మా గారాముబిడ్డ మాపూర్వపుణ్యఫలముమాభాగ్యములపంటఅనుకొనిరి.ఎవరి మనసులోవారు– విధినిర్ణయ మెన్ని విధములబోవుచున్నదో ఊహాతీతముకదా – ఆ బిడ్డకు వారికిజనియించిన బిడ్డడేయని వారిమనసులందుగల తలపు సందేహము లేశమ్మునులేదు–

ఆ జగన్నాథుడు ఆ అవతారమూర్తి ఆ లీలామానుష విగ్రహుడు నందుని ఇంట వెలసినాడు. యశోదానందులా శిశువు తలిదండ్రులు. ఎచ్చటి వికుంఠమందిరమ్ము యెచ్చటి వ్రేపల్లె – యెవ్వరి కెవ్వరగుదురో అదిదైవనిర్ణయము– దేవ

లోకమున దేవతలలో వసువులనువారుకలరు. వారిలో అగ్ర గణ్యుఁడు ప్రముఖుఁడైనవాడు ద్రోణుఁడనువాడు. అతని భార్య ధర. ఒకానొక సందర్భమున బ్రహ్మ వారినిజూచి మీ రిరువురు భూలోకమున జన్మింపవలసియున్నది అని యాజ్ఞాపించెను. ద్రోణుఁడు తెల్లబోయి ఒకింత తడవాలో చించి పద్మసంభవా! నీవు సృష్టికర్తవు. నీ మాట యెటులైనను చెల్లును. ఈ అమరలోకమున సుఖముగనున్న మమ్ము అవనికిపొమ్మనుచున్నావు. నీయాజ్ఞ శిరసావహింతుము. మాకు విష్ణుసేవాభాగ్యము వరముగ దయసేయుము. కాదనకుము. ఇది మా హృదయపూర్వకమగు అభిలాష- అని వేడగా చతుర్ముఖుఁడట్లేయగుగాకయని వారినంపెను- ఆదంపతులిరువురు నేడు వ్రేపల్లెయందు యశోదా నందులు. జగన్నాథుడు చిన్నికృష్ణుడై వారింటికేతెంచెను. యశోదా నందులకు వారియెఱుకలేకయే విష్ణుమూర్తి సేవలభించినది. పూర్వపుణ్య విశేషములు లూరకబోవుకదా-

శ్రావణ బహుళాష్టమి. ఆనాడు వ్రేపల్లెయందు నూత్నానందము వెల్లి వెరిసినది. ఆకసమున గ్రహరాజి ఉత్తమ స్థితులయందున్నది. రోహిణితార రుచిరమై వెలుగొందుచున్నది. చల్లని గాలులు మెల్లగ వీచుచున్నవి. ఆ గాలులందు నవఫుల్లసుమ సౌరభములు నల్గడల ప్రసరించుచున్నవి. కర్మనిష్ఠితుల గృహములందు హోమాగ్నులు

చెన్ను మీరుచున్నవి. వ్రేపల్లెవాసుల హృదయములందేదో చెప్పరానియామోద ముదయించుచున్నది. పక్షులు పెందల కడనేలేచి కలకలారావములు గావించుచున్నవి. ప్రజలను మేల్కొలుపుచున్నవాయనునట్లు వత్సములు క్రేళ్ళుదాటి తల్లుల పొదుగులను తాటించుచున్నవి. ఆనాడు గోవులు నిర్మలక్షీరమధువులను కుంభవృష్టిగా కురిసినవి. కేవలము జగన్నాథుడైన పురుషోత్తముడు వ్రేపల్లెకు వేంచేసినాడు. ప్రకృతిమాతకు పట్టరాని పరమానందము — తెల్లతెల్లవారి నది. సుమసౌరభ సుగంధిలములైన సమీరవీచికలతోపాటు యశోదకు చిన్నిమగబిడ్డ కలిగినవార్త వ్రేపల్లె నలుప్రాంత ముల ప్రాకిపోయినది. గొల్లయిల్లాండ్రు త్వరత్వరగా వారి ప్రాతః కాలకృత్యములు చక్కబెట్టుకొనుచున్నారు. పల్లె లందు యెవతె ఇంటనైనను పురుడువచ్చినచో ఆడపడుచు లందఱు వెంట వెంటనే చూచిరావలయును. అదియొక తీయనితితీక్ష. శిశువనగా స్త్రీగర్భశుక్తి ముక్తాఫలము. నవ మాస మధురస్వప్నముల సుందరస్వరూపము — విశేషించి యశోద ఆయూరిపడుచులందరికి తల్లివంటిది—

నందుని ఇంట ఆ చిన్నిబిడ్డకు వలసినసేవ లారంభ మైనవి. పుట్టువులేని పురుషోత్తముడు నందుని ఇంట ఉద యించినాడు. దాదులు పాపనికి వెచ్చ వెచ్చని జలముల స్నానమాడించితుడిచి మల్లెపూవులబోని మెత్తనితెలిమడుగు మఖతల పరుండబెట్టిరి— నందుఁడు మహానందమున వేదవిదు

లగు పురోహితులరావించి స్వస్తిపుణ్యాహవాచనములు సదివించి, జాతకర్మముల జరిపించి, పితృదేవతల నర్చించి, విరివిగ దానధర్మములు విప్రులకు సుందరగోదాన సహితముగజేసి వ్రేపల్లెవాసులందఱకానాడు విందులేర్పఱచినాడు. ఒకనాడు తన ముద్దుబిడ్డను నందగోపుడు చూచివచ్చును. మఱునిముషము తిరగకపూర్వమే మరల మరల పోయిచూచును. అది పితృమూర్తి యానందము. యశోద ఒకమారు కుమారుని చూచును. ఱెప్పలార్పక ఆ చూపు నందునిపై ద్రిప్పును. అది మాతృమూర్తి మధురభావము– ఆదంపతుల కనులపండువుగ ఆకట్టి నిసుగుతనువెల్లను కమనీయప్రసన్న కాంతులను ప్రసరించుచున్నవి. ఆతెలివలువలమధ్య ప్రశాంతముగనిదురబోవు ఆచిన్నిబిడ్డను చూచినపుడెల్ల యశోదానందుల కనులలో పాలకడలిపై పవళించు బాలనారాయణుఁడే మెఱసిపోవుచుండెను.

గొల్లపడుచులు క్రొత్తవలువముల సింగారించుకొనిరి. మొగమున తిలకము లద్దుకొని మేనభూషణముల ధరించి అద్దములలో మఱియొకమారు మరల మరల తమరూపములు దిద్దుకొని–

ఆ॥వె॥ ఏమినోముఫలమొ యింతప్రొద్దొకవార్త
వింటి మబలలార వీనులలర
మనయశోద చిన్నిమగవాని గనెనట
చూచివత్తమమ్మ సుదతులార.

అని ఒకరి నొకరు పిలచుకొని, కానుకలు కరముల గైకొని, తమయందములు తామే చూచుకొనుచు యశోద ఇంటికి కదిగిరి. ఒకరి తరువాతనొకరు కాళులు కడుగుకొని ఆ పురుటి మంచముపై నున్న చిన్నికృష్ణుని చూచిరి. ఆ చిఱుచీకటిగదిలో ఆ చిన్నికృష్ణుని చూపులతో ఏదోమా ధుర్యమున్నది. ఆయాకృతిలో నేదో ఆకర్షణయున్నది. గొల్లపడుచుల హృదయము లుప్పొంగి మేనులు రోమాంచ మగుచున్నవి– శ్రీకృష్ణుని యాకారమా చిన్ననాడే మనో హరముగనున్నది. అది గోపికల మనసులో బుద్ధిలో హృద యములో చెరగనిముద్రగా నిలిచిపోయినది – అనుదినము వ్రేపల్లె గోపికలు వచ్చుచుందురు. దినదిన ప్రవర్ధమానుడౌ చిన్నికృష్ణుని యెత్తుకొని ముద్దాడుదురు. వారి చేతులలో ఒకఅరనిముసముకూడ యశోద కృష్ణునిడుంచనీయదు. తిరిగి చేరదీసి తనయురమున కద్దుకొనును. అనవరత తపోతత్పరు లై ననుదరిజేరలేని వారి నేడు యశోదయురమునచిఱుబిడ్డడై క్షీరములను ద్రాగును. ఆ మాతృమూర్తి యొనరించిన పుణ్యపరిపాకమది.

మధురలో కంసునకు మనసులో మనసులేదు. మగ శిశువు జన్మించుననిన యశోద అష్టమగర్భమున ఆడశిశువు జనించినది. తన చేతులనుండి నింగికెగసిపోయినది. తన మృత్యుకారకుడైన యొకశిశు వెచ్చటనో పెరుగుచు న్నాడు. నిదురపట్టుటలేదు. తినినయన్నము రుచించుటలేదు.

కంసుడు మంత్రులతో నాలోచించి తనరాజ్యముననున్న. శిశువులనందఱిని అంతమొందించుడని ఆదేశమిచ్చినాడు. దానితో తనకు మృత్యుకారకుడయినవానిపీడ వదలును. మారువేషమునబోయి కార్యము నెఱవేర్చగల రక్కసులను పంపుడనికూడ కంసునియాజ్ఞ. ఈ హింసాకాండతో ఆ రాజ్యప్రజలు సంక్షుభితులగుచున్నారు.

దినము దినమెల్ల గోపవనిత లేదోనెపమున యశోద ఇంటికేతెంచి కృష్ణునిఁజూచి నవ్వించి పోవుచుందురు. అంత కంతకు వారికి, వారి ఇండ్లవద్దకంటె కృష్ణునికడనే ప్రొద్దు గడపుటకు ఇష్టముగా నుండును. యశోదకృష్ణునివదలి ఒక నిముషమైనను ఉండలేదు. నీరుపోయుట తుడుచుట ప్రక్క సరిచేయుట క్రొత్తవలువముల పరచుట, తొట్టెను శుభ్రము చేయుట, ఆ చిట్టితనయునకువలసిన పరిచర్యలన్నియు తానే చేయవలెను. పరిచారికలు వేరే ఇంటిపనులు చూచుకొందురు_ సాయంతనమగుసరికి మఱికొందఱు గోపికలు చేరుదురు _ యశోదకృష్ణునికి దృష్టితీసి తొట్టెలోఁపరుండబెట్టి జోల పాటలు పాడును_

కం॥ జోజో కమలదళేక్షణ
జోజో మృగరాజమధ్య జోజోకృష్ణా
జోజో పల్లవకరపద
జోజో పూర్ణేందువదన జోజోయనుచున్.

గోపికలుగూడ సన్నసన్నగా గొంతులుకలిపి తొట్టె నూపుచు కృష్ణుని నిద్రబుచ్చెదరు. ఒకొక్కదినమున అర్ధ రాత్రమునలేచి ఆ చిన్నిబిడ్డడు పోరుపెట్టి యేడ్చును. తన చిట్టితండ్రికి అయ్యో ఏమయినది. పాలు సరిపోలేదేమో-చన్నులు కుడుపును. ఏచీమయైన కుట్టినదేమో, ప్రక్కలు దులిపి సరిచేయును. కృష్ణుడు నిదురబోయినను యశోద తాను నిదురింపక, కనుపెట్టియేయుండును. ఆమె కనులలో ఆ చిట్టితండ్రి భగవత్స్వరూపుఁడే.

వ్రేపల్లె కంసుని రాజ్యములోనిది. నందుఁడచ్చట నున్న గొల్లలపెద్ద. ఏటేట కంసునికి కప్పము చెల్లించ వలయును. తనకు లేకలేక తనయుడు కలిగినాఁడు. సంతోషముతో నందుఁడు మధురకేగి ఆ కప్పము చెల్లించి వసుదేవునిచూచుట కేగినాడు. వారిసంభాషణ మొకచిత్రముగ సాగినది-

నందా! మీ మందలును మీ రందఱును కుశలమే గదా! లేకలేక నీకుతనయుఁడు లభించినాడు. భాగ్యశాలివి. ఆ నా బిడ్డ క్షేమమేనా- మిమ్ములను అమ్మా, నాన్నా యనిపిలిచి ఆనందము కలుగఁజేయునా అని యడిగిన వసుదేవుని పలుకులలోని నర్మము వెఱ్ఱిగొల్ల నందుఁడు గ్రహింపలేకపోయెను. "అవును వసుదేవా, మీకు పుట్టినబిడ్డలను కంసుఁడు తన పొట్టనుపెట్టుకొన్నాడుగదా! ఊఱడిల్లుము-

నా బిడ్డడు నీబిడ్డఁడే యనుకొమ్మ్న - కంటికిఱెప్పవలె ఆ చిట్టి తండ్రిని కాచుకొనుచున్నాము." అనిన నందునిమాటలు వినిన వసుదేవుని కొక్కమారు తాను ఆచిన్ని బాలుని నందునింట వదలిన దృశ్యము మనసులో కదలినది. కనులు చెమర్చినవి. కంసుని దురితచర్యలును మనసునఁ దోచినవి. మంచిది నందా! వ్రేపల్లెలో ఏ యుత్పాతములైన పుట్ట వచ్చును. త్వరగ ఏగుమని నందుని సాగనంపినాడు.

నందునిడెందమందొక సందేహమావరించినది. వసుదేవుడు సర్వమెఱిగిన మహామనీషి. వ్రేపల్లెలో ఉత్పాతములని నుడివినాడు. నందునిమనస్సు తనచిన్నికృష్ణునిపై బడినది. ఆబిడ్డనువదలినందుఁడిప్పుడు ఆలమందలతో పోవుటలేదు. వ్రేపల్లెను వదలి అప్పుడే ఒక దినము గడచినది. వెనుకకు నందుడు వేగముగా పయనించినాడు.

కంసుపంపున పూతనాదులు పెక్కుకఱకురక్కసులు నలుదిక్కులకేగి ఇల్లిల్లు వెదకి తల్లియొడిలోని పిల్లలనుకూడ పైకిలాగి హింసించుచున్నారు. ఒకనాఁడొక క్రొత్తమనిసి నందునింట గోపికలందరుతోటికలసి తిరుగుచున్నది. చూపులకు బహుసుందరాంగి. అందఱికనులామెమీదనే యున్నవి. ఈమె యెవరు? యెవరో తెలియదు. తిన్నగాబోయి చిన్నికృష్ణుని ముద్దాడుట నటించి, నీకాకలైనదిబిడ్డా, మీ అమ్మపాలీయలేదా, ఏడవకుము, నా చనుబాలుత్రాగుమని పైటతొలగించి రైకసడలించునంతలో యశోదచూచినది.

తనబిడ్డ నేరిదగ్గరకును పోనీయకుండ చూచుచున్న యశోద కది ఇష్టము లేదు. రోహిణితో కలసి ఆమె కడ్డమువచ్చి—

మ॥ వనితా ముట్టకుమమ్మ చన్నుగుడుపన్ వల్దమ్మ నీ చన్ను మా
తనయుండొల్లడు వాసిపొమ్మని యశోదారోహిణుల్ చీరఁగై
కొన కీక్షించుచు మాయఁబన్ని పెలుచన్ గోశంబులో పాలు మె
ల్పువ రాజిల్లుచు మాటమెత్తదనమున్ లోవాడియు న్నేర్పడన్.

ఎంతచెప్పినను వినక సుందరాంగి రూపమున వచ్చిన ఆ రక్కసిపూతన కృష్ణునెత్తుకొని విసపుబాలు పొంగివచ్చు చన్ను గుడిపినది. బాలకృష్ణుడు సర్వజ్ఞుడు. ఆమె సంకల్ప మెఱుగును. ఒక్క గుక్కలో ఆమె ప్రాణవాయువులే పీల్చినాడు. తాళవృక్ష పరిమాణమున నిజభయంకర రూపమున పూతన క్రిందబడి గిలగిల లాడినది. ఆమె వక్షముల నెక్కి కృష్ణుడు గుద్దులు గుద్దినాడు. దానితో సరి— ఇంతలో మధురనుండి నందుఁడు తిరిగి వచ్చినాడు. ఇంటవాకిలి యందు పడియున్న పూతనను జూచి అడలిపోయినాడు. సుర క్షితముగ వెలుపలికి దొరలివచ్చు చిన్నికృష్ణుని యశోదానందులు గుండెలకు హత్తుకొని శిరము మూర్కొని తమ బిడ్డను రక్షించినందులకు సర్వదేవతలను సంస్తుతి జేసినారు.

ఏదేవుడో అడ్డుపడి రక్షించెనుగాని ఈబిడ్డడు మనకు దక్కు వాడా అయ్యయో అని గోమయమూత్రమ్ముల దృష్టితీసి అంగరక్షలు పెట్టిరి. కృష్ణు నెత్తుకొని పాలీయఁబోయిన పూతన చటుక్కున క్రిందఁబడి చచ్చుటేమి? అది యేదో మహాశ్చర్యకరముగానున్నది అందఱకును. ఈబాలకృష్ణుని యందు యేమైనా మహత్త్వమున్నదా ? ఏమో అని పించినది_

శ్రీకృష్ణుడు కొంచెము కొంచెము పెరుగుచున్నాడు. నలువైపుల జూచును. నవ్వును యశోదనుచూచి నవ్వి నపుడు ఆ పసినిగ్గులనవ్వులు వేరు. గోపికలనుజూచినవ్వినపు డున్న మాధుర్యము వేరు. బోరగిలపడును. తప్పటడుగులు వేయును. గడపలుదాటి కంచములకెగబ్రాకును. బయటకు పోఁజూచును. తనచిట్టి తండ్రి అదిచేయును ఇదిచేయును అని ఆవిద్దెలన్నియు యశోద తనసాటివారితో గర్వముగచెప్పుచు కృష్ణుని ముద్దాడును. చిట్టికృష్ణుడుచూపు చిన్నిచిన్నివిద్యల కెప్పుడే వేడుకలు విందులు చేయవలెనో, విప్రులరావించి వేదమంత్రముల అభిషేచనాదికము లొనరించి వారి దీవెన లంది యశోద ఆ వేడ్కలన్నియుఁజేయును. నా చిట్టితండ్రి కిన్నికావలెనాయని కుహనానిందతో ప్రేమ లొలికించును. మాతృహృదయము అట్టిదేకదా-

పూతనపనియైనది. ఆ వెనుకనే తక్కిన రక్కసులను ఊరూరఁదిరిగి వేపల్లెకరుదెంచినారు. ఆనాడుచిన్నికృష్ణుడు

గుమ్మము ముందాడుకొనుచున్నాడు. ఒకవైద్యుడు శకట
మువలె రయమునవచ్చి కృష్ణుని తనచక్రములక్రింద చంప
బోయెను. కృష్ణు డొకతన్నుతన్నెను. ఆబండిపై కెగిరిక్రింద
బడి ముక్కలైనది. కృష్ణుడు దొంగయేడ్పు యేడ్చినాడు.
యశోదపరువిడి వచ్చినది. "నయమే ఏదేవతలు రక్షించురో
బండిక్రిందపడలేదు నాబిడ్డ" అనుచున్న యశోదనుచూచి
అచట నాడుకొనుచున్న బాలురు "అది కాదమ్మా తనమీ
దకువచ్చుచున్న యీ బండిని కృష్ణున్నయే తన్నినాడు.
బండి విరిగినది. ఇది మేము చూచామమ్మా" అనినారు.
యశోద నమ్మలేదు. ఈ పసికూన తన్నుట బండి విరుగుట
యునా, ఇవి యన్నియు కల్లలు. ఏడ్చుచున్న కృష్ణునిదీసి,
యశోద గుండెల కద్దుకొనుచు—

ఆ॥వె॥ అలసితివిగదన్న ఆకొంటివి గదన్న
మంచియన్న! యేడ్పు మానుమన్న
చన్నుగుడువుమన్న సంతసపడు మన్న
యనుచు చన్నుగుడిపె నర్భకునకు.

తల్లియొడిలోనున్న కృష్ణుడు ఉన్నటులుండి పెద్ద
పాషాణమంత బరువయినాడు. యశోద భయభ్రాంతయై
మోయలేక ఆబాలుని నేలపై దింపునంతలో పెద్ద సుడిగాలి
వలె చుట్టుకొనుచు తృణావర్తుడను రక్కసుడు కృష్ణు నాక
సమున కెత్తుకొనిపోయినాడు. యశోద కండ్లుతెరచి ఏభూ
తమో నాబిడ్డనుయెత్తుకొనిపోయినది. అయ్యో! అని గుండె

బాడుకొనుచున్నది- ఇంతలో బయటగభాలుమని మిన్ను విరిగిపడినంత శబ్దమైనది. పాషాణమేకాదు, బ్రహ్మాండ మంతబరువై బాలకృష్ణుఁడా రక్కసిగొంతుకనులిమి పట్టుకొని వ్రేలాడినాఁడు. పీనుగై ఆ తృణావర్తుఁడు క్రిందబడినాడు. చిఱునవ్వుఁచు చిట్టిపొట్టి యడుగులంతో కృష్ణుడు ఇంటిలోనికి వచ్చుటఁజూచి యశోద ఒకపెట్టున కృష్ణునెత్తి గుండెల కద్దుకున్నది. అయ్యో నా తండ్రికి దినదినము గండములే. నాబ్రతుకెట్లు తెలవాఱునోయని వలవల విలపించినది. దృష్టితీసినది. అంగరక్షలు పెట్టినది. దేవతలను తలచుకొని బలిదానము లిచ్చినది. నా చిన్నియయ్యా! నీ యడుగులు బ్రహ్మ, గుండెలీశ్వరుండు, భుజములు చతుర్భుజుడు, ముందు చక్రి, వెనుక గదాధరుడు, ఆడుచున్నప్పుడు గోవిందుడు నడచునప్పుడు నారాయణుడు, కుడుచునప్పుడన్ని, కూర్చున్నయప్పుడు ముకుందుడు, శయనించునపుడు శేషశాయి. నిన్ను రక్షించుచుండవలె తండ్రీ! యని ఆ చిన్నిబాలుని అంగములన్నియు తడిమి అందరి దేవతలను అభయమడిగినది - చుట్టుప్రక్కలనున్న గోపస్త్రీలకేమియు తోచుటలేదు- తెలతెలబోవుచుండిరి- ఇది యేదోదయ్యపుని యని కొందఱు, భూతమని కొందఱు, సర్వజగద్రక్షకుఁడైన ఆ జగన్నాథుని కీరక్షలన్నియు కావలెనా - పసిపాపఁడై బాలుఁడై ఒకతల్లివలె యశోదచే చేయించుకొన

వలసిన సేవలన్నియు చేయించుకొనుచున్నాడు. భక్తుల సేవలు భగవంతునికి ప్రీతికరములుగదా-

యశోద కంతకంతకు అంతరంగమున భయమెక్కువగుచున్నది - ఎట్లో ఇంతవరకు సరిపోయినది. ఇకముందెట్లుండునో ఎవడు కాపాడుదురు, ఎవరు రక్షింతురు, నందుండామెప్రక్కనేయుండును. పురుషుడు గావున కొంతఓర్పుతో ధైర్యవచనములు చెప్పును - ఈ చిన్నిబిడ్డం డందరివలె సామాన్య బాలుఁడుగాడను ఏదోభావము వారి మనస్సులలో ద్రోచుచున్నది- ఒకనాడు యశోద కృష్ణునకు పాలిచ్చుచున్నది. కొన్ని చుక్కలపాలు బయటికి వచ్చినవి. అయ్యో ! ఈ బాలుని నోటిలో ఏమైనవున్నదేమోనని యశోదకృష్ణుని వక్త్రము పరీక్షగా చూచినది. ఆహా, ఆమె కందేమి కన్పించినది. విశ్వమే అందిమిడియున్నది. సూర్య చంద్రులు తారకలు గ్రహములు వార్నిధులు సప్త ద్వీపములు పర్వతములు నదీనదములు కాననములు శాద్వలములు గోగణములు అఖిల లోకములందున్నవి. కలగాదు నిజముగనే ఆమె తనబిడ్డ నోటిని చూచుచున్నది. ఏదో విభ్రాంతిలో ఆమె ఆశ్చర్యమగ్నమైనది. మఱునిముషమున కృష్ణు డెప్పటిబిడ్డడే. నందునకీవిషయములన్నియు యశోద చెప్పుచుండును. ఏదినమున కాదినమే కృష్ణుని సంగతులు వారి కాశ్చర్యములై తోచుచున్నవి.

ద్రేపల్లెయందే వసుదేవుని మొదటి భార్య రోహిణి యున్నది. శ్రీహరితల్పమగు శేషునంశ దేవకిసప్తమ గర్భమున బడినది. పురుడురాకమునుపే ఆ గర్భస్థ పిండమును యోగమాయ రోహిణి గర్భమునకు తరలించినది. ఆ శిశువే బలరాముడు- రోహిణి దినమందు చాలాకాలము యశోద కడనే కాలముగడపును. కృష్ణునకాడుకొను ఈడు వచ్చినది. బలరామ కృష్ణులు జట్టువిడువరు. యశోద వారినన్నద మ్ములవలెనే పెంచుచుండును. అన్నదమ్ములేకదా వారు. పుట్టినదొకచోట, మాతాపితృసేవలుగొనుచు ఆ అవతార పురుషులు పెరుగుచున్నది మఱొకచోట-

నందుడు తనతోమాటలాడి వెడలినదాది, వసుదే వుని మనసులో బలరామ కృష్ణులే మెలఁగుచుండిరి- వారి మహిమ నాతఁడెఱుఁగును. కాని అది ఇంకను గోప్యముగానే యుంచవలెను. బాలకృష్ణుని చర్యలు కర్ణాకర్ణిగ తెలియు చున్నవి. కంసుఁడెందరిని పంపినను ఆబాలురకేయాపదలు రావు. కాని యెవరివలననే యాటంకములు కలుగనున్నవో ఇది వసుదేవుని యాందోళన. మధురలో తానెఱిఁగిన గర్గు డను గొప్పజ్యోతిశ్శాస్త్ర పండితుని ద్రేపల్లెలో నందునింట యోగక్షేమము లెఱిగి రమ్మని పంపెను. గర్గునిఁజూచి పూజించి నందుడు మహానందమందెను. నందుని మనసులో ఇప్పుడున్న సమస్య ఒకటే. బలరామ కృష్ణుల జీవితముల గూర్చి ఇదమిత్థమని యాతనికి తెలియుటలేదు. గర్గునిజూచి

"ఆర్యా మీరు జగత్పూజ్యులు ఆగతానాగత విషయ జ్ఞానులు. ఈ బిడ్డలు ఇరువురకు ప్రతిదినమేవిమో గండములే. వీరెట్టివారగుదురో దీవించి చెప్పు"డని నందుఁడు వేడెను. గర్గుఁడొకింత యోచించి, నందగోపా! నీకును నీ యర్ధాంగి యశోదకును వీరిని గూర్చిన భయమక్కఱలేదు. మీరిరువురు ధన్యులు. మీ పురాకృతపుణ్యఫలమున ఈ బాలకులసేవ మీకు దక్కినది. రోహిణీపుత్రుఁడీతడు బలరాముడు, మహాబలుడు. ఆ చిన్నబిడ్డ మొదట ధవళారుణ పీతవర్ణుడయ్యె క్రమముగనల్లనయి కృష్ణుఁడయ్యెను. ఒకప్పు డీతడు వసుదేవుని సుతుడు గాన వాసుదేవుడనియు పేరం దును. ఈ కుమారుడు నారాయణసముఁడు. ఈ బాలునిచే మీ దుఃఖములు నశించును. సుజనరక్షణ దుర్జనశిక్షణ చేయ గల సమర్థుఁడీతఁడని చెప్పి గర్గుడేగెను. నందయశోద లీమా టలువిని పరమానందమందిరి. ఆ బిడ్డలయెడవారికేదో భక్తి భావముదయించుచున్నది. మరల మఱునిముసమునందే ఒక సహజవాత్సల్యభావము మబ్బుపొరవలె వారి మనస్సులఁ గప్పివేయును.

బలరామ కృష్ణులు బయటకుపోయి ఆడుకొను ఈడు వచ్చినది. కృష్ణుడింటికడనే యుండడు. ఉన్నట్లుండి పొరు గిండ్లకుపోవును. లేగదూడలతో పరుగెత్తును. తోడి బాల కులను జట్టులుగగూర్చి తాను నాయకుఁడై ఆడించును.

యశోద అవి అన్నియుజూచి మందలించును. "నాయనా! గంతులు వేయకురా పడెదవు, దెబ్బలు తగులును. నేనీ బాములు పడలేనురా, ఈ పాటికింటికిరారా" అని పిలుచును. కృష్ణుడు మరింతదూరము పారిపోయి ఒకనిముసము కనుమఱుగై, వెనుకనుండి ఒక్కదూకున యశోదఒడిలోపడి ఒక్రగుక్కెడు పాలుద్రావి మరలపరువెత్తును– "ఒకచుక్క పాలైన కడుపున ఇముడనీయడుగదా ఈ అల్లరివాడు" అని మరలయశోద లోలోపలేలనుకొనును. అదిఆమెకొకగారము, ఆనందము. నందుడీలీలలుచూచి మహానందముపడును.

ఇప్పుడు కృష్ణుఁడెచ్చుడెచ్చటికో పోవును. ఆలస్యముగ వచ్చును. ఎఱుఁగనియట్లు మంచముమీద పరుండి నిద్ర నటించును. యశోద అన్నియు గమనించుచునేయుండును. తానేగిన ఇండ్లవద్ద కృష్ణుఁడేవియో చిలిపి పనులు చేయును. పొరుగిండ్లవారికి కొన్నాళ్ళవి ముచ్చటగనేయున్నవి. కృష్ణుఁడు కొంచెము మితిమీరుచున్నాడు. వద్దన్నను మానడు.

యశోద కీవిషయములు నుడువుట కాగొల్లపడుచులుల్లములందు మొదట మొదలసందియపడిరి. కృష్ణుడుమేర మీరుటలో వారికి ధైర్యము వచ్చినది. ఒకరొక్కరేవత్తురు. యశోదమ్మ నీ కొడుకు వట్టి అల్లరివాడమ్మా. మా ఇంటి పాలకడవ బ్రద్దలు కొట్టినాడమ్మా. దూడను కొన్ని త్రాగించి మా ఆవుపాలన్నీ కృష్ణుడే త్రాగినాడమ్మా. నాకు

మా అత్తగారికి ఏవో ఒకరిమాట లొకరికిచెప్పి కలహములు రేపినాడమ్మా. ఇన్నియెందుకు ఈడువచ్చిన మాపిల్లవెంట బడినాడమ్మా అని ఒక్కొక్కరే చెప్పుదురు. యశోదవిని విననియట్లేదో సర్ది చెప్పును. ఊరివారికి తృప్తిలేదు. ఒక రోజున—

కం॥ ఓయమ్మ నీకుమారుడు
మా ఇండ్లను చాలుబెరుగు మననీడమ్మా
పోయెద మెక్కడికైనను
మాయన్నల సురభు లాన మంజులవాణీ.

అని పెక్కుమందివచ్చి నిందావాక్యము లాడువరకు వచ్చనది— మీకు భోగభాగ్యములుండిన మీరు తిని అనుభవింతురుగాక, కొడుకుల నిట్లూరిమీదికి విడచుట మంచిదికాదమ్మా అనిగూడ పలికిరి—

యశోద వారిమాటలు నమ్మును, నమ్మదు — వారిట్లు బారులై వచ్చి చెప్పుచుండ, కృష్ణుడు బుద్ధిమంతునివలె యశోద చీరచాటునదాగును — "ఏమోనమ్మా మీరిటు లాడుట వింతగానున్నది— ఇంకా కన్నుదెఱవని పసికూన వీడు పొరుగిండ్లకే పోడు—

తే॥గీ॥ అన్యమెఱుగడు తనయంత నాడుచుండు
మంచివా డీత డెగ్గులు మానరమ్మ
రామలార త్రిలోకాభిరామలార
తల్లులార గుణవతీమతల్లులార.

అని బ్రతిమాలి యశోద వారినిండ్లకు పంపినది- తన కుమారుని అల్లరి తనకండ్లతో ఎదురుగ చూచినగాని ఏ తల్లియు ఒప్పుకొనదు - వారి మాటలు యశోదకుమాత్ర మెట్లు రుచించును.

కృష్ణునిపై నేరములు పెచ్చు పెరుగుచున్నవి. బలరామునితో గూడి బాలకులు కొందఱువచ్చి "కృష్ణుడు మన్ను తిన్నాడమ్మా, వాని నోరంతయు మన్నే" అని యశోదకు చెప్పిరి. యశోదకు కొంచెము కోపమువచ్చినది. మన ఇంటికడ మరి పదార్థములేనట్లు మన్నే కావలసివచ్చినదిరా నీకు అని కృష్ణునివైపు చూచినది - ఏమియు చేయనివానివలె కృష్ణుడు దగ్గరకువచ్చి అమ్మా నేను మన్నేల తినెదను. నన్ను నీచే కొట్టింపవలెనని చాడీలు చెప్పుచున్నారమ్మా. కావలసినచో నానోరువాసన చూడుము. మట్టివాసన యున్నదేమో అని నోరుతెరచెను. ఒకఅంగుళము వెడల్పైనలేని ఆ నోరు చూడగనే యశోదకేమి కన్పడినది. సకలలోకచరాచరభూతాదికరండమైన బ్రహ్మాండమే అందు ప్రజ్వరిల్లుచున్నది. యశోదకు కనులు తిరిగిపోయినవి. తాను చూచుచున్నది నిజమా. తనకనులను తానే నమ్మలేకపోవుచున్నది-

మ॥ కలయో వైష్ణవమాయయో ఇతరసంకల్పార్థమో
సత్యమో
తలపన్నేరకయున్నదాననో యశోదాదేవి గానో పర

స్థలమో బాలకుడెంత ఇతనిముఖస్థంబై యజాండంబు ప్ర
జ్వలమై యుండుట కేమిహేతువో మహాశ్చర్యంబు
చింతింపగన్-

అని భావించు యశోద కేదో యూర్ధ్వలోకమున విహ
రించుచున్నట్లనిపించినది. వ్రేపల్లె గోగోప గోపికలు తాను
తనభర్త నందుడు ఆ చిన్నినోటియందు గన్పించిరి-
ఈతడు బాలుడుగాదు పరమేశ్వరుడు - ఇన్నాళ్ళుగా ఈ
చిన్నికన్నని వేరువిధముగా భావించి నేర మొనరించితిమి-
అనుకొనునంతలో యశోద మనసును మరల మాయ కప్పి
నది. అంతయు మఱపు ఆ చిన్నికృష్ణుని ఒడిలో జేర్చుకొ
న్నది- యశోదా కృష్ణులమధ్య ఇట్లొక నూతనప్రపంచము
సృష్టియగుచున్నది-

ఆ మఱునాఁడు మరియొకవింత జరిగినది - ఉదయ
మునసే యశోద వెన్నకై మీగడపెరుగు చిలుకుచున్నది.
కవ్వపుఁద్రాడురాపిడికి అరచేతులు కెంపులవలె మెఱయు
చున్నవి. చిఱుచెమటబొట్లున్న ఆమెముఖము మంచుతుంపర
లున్నపద్మమువలె ప్రకాశించుచున్నది- అమ్మా నా
కాకలియగుచున్నదమ్మా, పాలీయమనుచు కృష్ణుడు పరు
వెత్తుకొనుచువచ్చికవ్వముపట్టి ఆపినాడు - ఆ చిట్టితండ్రి
ఆకలి కామె ఓర్వలేదు. కడుపార స్తన్యములిచ్చి క్రిందకు
దింపి ప్రక్కగదిలో పొంగిపోవుచున్నపాలు దింపుటకేగినది-
తిరిగి చూచినంతలో తనపెరుగుకుండ బ్రద్దలై ఇల్లంతయు

కాల్వలు గట్టుచున్నది. కృష్ణుఁడు కిలకిలనవ్వుచు పరువెత్త చూచుచున్నాడు - యశోద ఇటువచ్చిన, కృష్ణుఁడటు పోవును. కృష్ణుడొనరించు అల్లరిపనులామె కిపుడరమైనవి. ఇంక కృష్ణుని బయటకు వదలగూడదు - దండించి కట్టి యుంచవలెను. అదియొక టే మార్గము-

తొట్టెలోనున్న పసిబిడ్డ, తల్లిని చూడగనే కిలకిల నవ్వి, కేరింతలు కొట్టును. తల్లి నీవు కొంటెవాడవగుచున్నావురా, ఇంత అల్లరా, దెబ్బలుతిందువుసుమా అని సొట్టలు పడ్డపసికూన చిగురుబుగ్గలపై గిల్లినట్లు నటించును. మా నాయనా బుగ్గకందిపోయినదని చటుక్కునబిడ్డనెత్తుకొనును. చంటికుర్రని దండింతుననుకొనుట మాతృమూర్తి మనసు లోని ఒకమధురభావము. యశోదకాభావము కల్పింపవలెను. ఆమె యేమేమిచేయునో తానుచూడవలెను. ఇది శ్రీకృష్ణుని తలంపు. ఆ అవకాశము ఇప్పుడువచ్చినది. తనను పట్టు కొనవచ్చు యశోదకు అందినట్లు గన్పడును, అందక పరు వెత్తును - ఆ పరువెత్తుట ప్రక్కఇంటిలోదూరి వారి యుట్టి మీదనున్న వెన్ననుతీసి ఒకకోతికి పెట్టుచున్నాడు కృష్ణుడు. యశోద ఒకబెత్తము పుచ్చుకొన్నది-

కానీ, కానీ, అల్లరివాడా నన్ను తప్పించుకొని పారి పోదమనుకొనుచున్నావా, అదిసాగదులే, ఇదిగో బెత్తము అని చేతనున్న సెలగోలను ఝుళిపించును. ఇదివరకు ఊరకున్నాను. ఇప్పుడు వదలిపెట్టను, యెఱుగుదువా అని

యశోదవెంటాడి తరుముచున్నది. వెంటనే ఆమె మనసులో ఒకభీతి- ఈ కుఱ్ఱడు భయము యెఱుగడుగదా. పట్టుకొని గట్టిగా బుద్ధిచెప్పెదననుకొన్నచో లేక లేక ఒకపసికూన మరల ఒక్కొక్కవేళ ఎంతబుద్ధిమంతుడో ఏ పెద్దలుచాలరు. వీనిమాటలకూ చేతలకూ అని భావించుచూ-

మ॥ స్తనభారంబున డస్సి క్రుస్సి యసదై జవ్వాడు మధ్యంబుతో
జనితస్వేదముతో చలత్కబరితో స్రస్తోత్తరీయంబుతో
వనజాతేక్షణగూడ బారితిరిగె న్వారించుచున్ వాకిటన్
ఘనయోగీంద్రమనంబులున్ వెనుకొనంగా లేని లీలారతున్-

తనబాలుని పట్టుకొనియుంచు ప్రయత్నములలో యశోద పరమాత్మకొఱకే ప్రయత్నించుచున్నది. ఆమె యన్వేషణ లోని రహస్యమది. ఆమె నటునిటు త్రిప్పెను, కృష్ణుడు పట్టుపడును-

ఎట్లయిననేమి, కృష్ణుని పట్టుకొని ఒకరోలునకు కట్టినది. యశోద తన పనులు చూచుకొనుటకు లోనికేగినది. నీకు తగినశాస్తిఅయినదిలే, ఇక ఇక్కడే పడివుండు అన్నది. లోనికేగినదో లేదో యశోద వాకిటిముంగల ఫెళ్లు ఫెళ్లు మను మహాశబ్దము, బయటకు పరుగిడి వచ్చినది. గృహద్వారము ముందున్న రెండు పెద్ద మద్దిచెట్లు కూలిపడియున్నవి. వానిమధ్య రోలు నీడ్చుకొనుచు కృష్ణుడున్నాడు.

అన్ని అసాధ్యమే ఈ అల్లరివానితో, ఇంకనునయము! ఈ మహావృక్షముల క్రింద వీడు నలిగిపోయినాడుకాదు. తాడు విప్పి కృష్ణు నెత్తుకొని గుండెల కద్దుకొనినది. నలువురు ఇంతలో చేరిరి. "ఎంత అల్లరివాడయిన మాత్రము, ఇంత చేయుదురా, చాలులే నీ పనులని యశోదను నిందించిరి." పిల్లనికి దృష్టితీసి లోనికి గొంపోయినది యశోద-

కృష్ణుని పాదస్పందముమాత్రమున ఆతరువులు కూలి పోయినవి. కుబేరుని కుమారులు శాపగ్రస్తులై ఆ వృక్షములుగా పుట్టి తిరిగి శ్రీకృష్ణుని దయవలన శాప ముక్తులై చనిరి-

శ్రీహరి యవతారమాకృష్ణుఁడు. ఘనయోగీంద్రుల ఊహకైన అందని దారూపము- ఏ కర్మములు బాములు లేని ఆ పరమాత్మకు యశోద ఇంటిలో జాత కర్మములు వచ్చినవి. రజ్జువున బంధితుఁడైనాడు. భక్తవరులనుగాని ఇతరుల కాదైవము పట్టువడునా, బ్రహ్మాండమునంతయు తనలో నిముడ్చుకొనినదిట్టు, యశోద రోలునకు గట్టిగా ఒక చిన్న తాడునకు లొంగిపోయినాడు. ఏ బంధము లెఱుగని జగద్బంధునికి జననీబంధము తప్పలేదు- తనయెఱుక లేకయే పరమాత్మునికి యశోద చేయుచున్న సేవా ఫలమిది-

నందున కిపుడు ఒక్కటే యోచన. వ్రేపల్లెలో ఉత్పాతములు పరంపరగా వచ్చుచున్నవి - విసపు రక్కసి,

సుడిగాలి ఇప్పుడీచెట్లు. ఏదోభూత మిచ్చటనున్నది - రామ కృష్ణులనిచటనుంచుట శ్రేయముగాదు. కులవృద్ధులతో ఆలోచించినాడు—గోగణసహితముగా యమునాతటినున్న బృందా వనమునకు ప్రేపల్లెనంతయు తరలించి తీసికొనిపోయినాడు.

బృందావనమొక యందాలసీమ. అచట తిరుగాడు కృష్ణుడే వేరు - బలరామునితో, గోపబాలకులతో కలిసి ఆలమందతో ఆడుకొనుచు వనములకేగి సాయంతనము తిరిగి వచ్చును. బాలకులతో చల్దులు తినును. వనవిహారము సేయును— పూలమాలలు చేతిలో మురళి, శిరమునపింఛము గోలోకపతియగు కృష్ణస్వామిని మరపించును - అచట గోలోకమున రాధయొక్కతెయె యున్నది. ఇచట గోపిక లందఱు రాధలే. వెన్నెలరాత్రులందు కృష్ణుని మురళీగా నము వినితీరవలయును. గొల్లపడుచు లిళ్ళువదలి ఒడళ్ళు మఱచి ఆ బాలకృష్ణునితోనే యుందురు. రాసము లాడు దురు. వారికిప్పుడు సర్వమతఁడే. ఆ దివ్యవిగ్రహముచూచి యశోదానందు లమితానందము పొందుదురు—

వనములనుండి వచ్చిన గోపబాలకులు యశోదా నందుల కెన్నియోకథలు చెప్పుదురు - పెనురక్కసులవలె వచ్చు బకమును వత్సమును కృష్ణుడు పోరాడిచంపినాఁడు. బలరాముడు గార్దభధేనుకుని చంపినాడు. ప్రలంబుని చంపి నాడు. కార్చిచ్చునుండి గోవులను గోపకులను కృష్ణుడు

రక్షించినాఁడు: ఒక పెద్ద చిలువనుండికూడ రక్షించినాడు. ప్రతిదినమేదియో ఇట్టి కథయే. ఈ విపత్తులన్నియు యాదృచ్ఛికములు గావని నందునకు గట్టిగాఁదోచినది. గర్గునిమాటలు అదేస్ఫురింపఁజేయుచున్నవి. కంసుఁడిట్లు ఈ రక్కసులచే బలరామ కృష్ణులను పొలియింపజేఁయవలెనని చూచుచున్నాఁడు. రామకృష్ణులు ఈ యుద్యమముల కతీతులు, తన కనులముందే నందుడు చూచినాడు. కాళిందిమడుగున డాగి ప్రజలనుజంపు కాళియనాగుని కృష్ణుడు త్రొక్కి-రక్తమును గ్రక్కించినాడు. ఇంద్రుడు కురిపించు రాళ్ళవాననుండి గో గోపకులను గోవర్ధనాద్రి క్రిందికిఁజేర్చి కృష్ణుడు కాపాడినాడు. ఏకాదశీవ్రతము ముగించి నందుడు యమునలో స్నానమునకుఁ బోయినపుడు వరుణునిభటులాయనను గొనిపోయి వరుణునొద్ద పెట్టినారు. నందుడు మరణించెనని బృందావనమందు ఆక్రందములు రేగెను. కృష్ణుఁడా నీటమునిగి వరుణునొద్దకేగి పూజితుఁడై తండ్రి ప్రాణములు కాపాడెను-

యశోదా నందుల కివియన్నియు తామొక దివ్యలోకమున నున్నట్లనిపించినవి. ఇంతకాలము ఆడించి పాడించి పెంచి పెద్దజేసి ఒడలెల్ల కళ్ళుగా అనుక్షణము కాపాడిన దెవనిని, ఏమియెఱుగని ముగ్ధబాలకుని తమచుట్టు తిరుగుచున్న ఈ ముద్దులాడెవరు, మురళీగానముచే లోకమెల్లను గరగింపఁజేసి తనవశమొనర్చుకొను ఈ మోహనమూర్తి

యెవరు, తమ మాతాపితృభావ సేవాజాలమునఁ జిక్కిన చిదానందుడు ఆ నారాయణుఁడే అని తోచినది. ఈ జ్ఞాన చింతనములో మరల నొకభీతి. ఈ మహాత్మునికి మన ఇంట ఎప్పుడేమి లోపమువచ్చినదో, మనల నీతఁడు మన్నించునా అని అట్టి భావము ఆ దంపతులకు తోచిన క్షణములో ఎటనుండివచ్చునో బాలకృష్ణుడు వారియొడిలో దభాలున దూకి తాను నవ్వి వారిని నవ్వించును. మరల ఆ కృష్ణుడు వారిబిన్నారి నల్లనయ్యయే.

రామకృష్ణుల మహిమ జగద్విదితమైనది. కృష్ణుడు దేవకి యష్టమగర్భమున పుట్టినవాఁడే. యశోద ఇంటఁబెరిగెను. సందేహములేదు. వారినెట్లయిననసరే చంపి తీరవలెను. ఇది కంసుని యాలోచన. ధనుర్యాగమొనరించుచుంటినను మిషపై కంసుడు రామకృష్ణులను మధురకు రప్పించినాడు. ఏమి జరుగనున్నదో అనుభయముతో నందాదులును వెంట వచ్చిరి. ఆబాలవీరులకెదురులేదు. కంసుని ధనుస్సు విరచిరి. తమపై కురికిన మత్తేభమును ౘ్రమందించిరి. ముష్టియుద్ధమున ముందునకు దుమికిన మహామల్లురు చాణూరముష్టికులను పడనేసి కడముట్టించిరి. సభాముఖమున తనుపైకి కత్తిదూసిన కంసునిమీదకు సింహమువలె లంఘించి కృష్ణుడు హతమార్చెను. వారి చర్యలు జగదాశ్చర్యకరములై భాసించినవి—

రామకృష్ణులకొక ముఖ్యమైన కరణీయము మిగిలినది. పదునెత్తి కారాగృహబంధితులై యున్న తల్లిదండ్రులు దేవకీ వసుదేవులను అందుండి విముక్తులను జేసి, మీ కడుపునబుట్టి ఇంతవరకు మీ కేమి చేయలేకపోతిమిగదాయని క్షమాభిక్ష వేడిరి. ఈ బిడ్డలను కనినతరువాత కనులువాచునట్లు వేచివేచి, ఇన్ని దినములకు చూడగలిగిరి ఆ దంపతులిరువురు. దేవకీ వసుదేవుల కన్నీరు మున్నీరయినది. ఆ ఇరువురి బాలకులను యెత్తి కౌగలించుకొనిరి. దేవకితనువు పులకించెను. చనువుగ అమృతధారలే వర్షించినది-

రామకృష్ణులకు ఒకప్రక్క కనిన తల్లి దండ్రులు దేవకీ వసుదేవులు; మఱొకప్రక్క అల్లారుముద్దుగ పెంచి పెద్దజేసిన జననీ జనకులు యశోదా నందులు. ఆ వీరబాలకులను అచ్చటచూచినవారి హృదయములు సమోహ్లదమున ఉప్పొంగిపోయినవి. ఆ ప్రాంగణమంతయు ఆనందవార్ధులు పొంగి పొరలినవి. కంసుని హింసావృత్తినుండి లోకమును రక్షించిన జగద్వల్లభులువారు. ఆనాడు మధురకు వైకుంఠమే దిగివచ్చినట్లయినవి-

నతశిరస్కులై, వినయవినమ్రులై రామకృష్ణులు దేవకీ వసుదేవులనుజూచి, ఆర్యులారా, మహీతలమున మా జన్మములకు మీరుగదా కారణులు, మీ ఋణము నూరేండ్లకైనతీర్చుట సాధ్యముగాని పని. తల్లికి తండ్రికికాని తనయుడు రాక్షసప్రాయుడే. మీ కీనాటివరకు మేమేమి చేయ

గలిగితిమి? ఆహా, మా కొఱకు పడరాని కష్టముల పాలయిరి గదా_

శా॥ కారాశాలల మా నిమిత్తము కంసుండు కారింపగా
వారింపంగసమర్థతల్ గలిగియున్ వారింపగారాక ని
ష్కారుణ్యాత్ములమైన క్రూరుల మహాకౌటిల్య
సంచారులన్
సారాతిక్షములార మమ్ము కొఱతల్ సైరించి
రక్షింపరే!

అని పాదములపై బడి వేడుకొనిరి. లేచి యీ ప్రక్కకు జూచిరి. యశోదా నందులను చూడగనే రామకృష్ణుల హృదయములు వికసించినవి. చూపులు చంద్రికా కాంతులను వెదజల్లినవి.

శా॥ తండ్రింజూడము తల్లిఁజూడము యశోదాదేవిశాయున్
నీవు మా
తండ్రిందల్లియునంచు నుండుదము సద్ధర్మంబులం
దొల్లి యే
తండ్రుల్ బిడ్డల నిట్లుపెంచిరి భవత్సౌజన్య భావంబులన్
తండ్రీ! ఇంతటివారమైతిమి గదా తత్తద్వయోలీలన్.

అని ఇరుప్రక్కలనున్న తండ్రులకు తల్లులకు కృతజ్ఞతతో తలలువాల్చిన ఆ దివ్యపురుషుల నేత్రములనుండి ముత్యములవలె భక్తిబాష్పములురాలి వారి పాదములు పూజించినవి. ఆ దంపతులకు, ఈ దంపతులకు ఆనందము

అవధులు దాటినది. కారణజన్ములు అవతారపురుషులైన రామకృష్ణులకు యశోదానందులొనర్చినదే వాత్సల్యసేవ పూలుపూచి పరిమళించినది - ఆబాలురిద్దలోని దేవకీ వసుదేవుల కప్పగించి ప్రేమవిహ్వలులకై బాష్పజలపూరితులై ప్రేపల్లెకు జనిరి-

సేవలుగొననేర్చిన శ్రీహరి ఈనాడు శ్రీకృష్ణావతారుఁడై తనను కనినవారికి, పెంచినవారికి తనసేవ లర్పించి వారలను ధన్యులను జేసినాఁడు. శ్రీహరిసేవలో సిద్ధులై పరమపదమును బొంది పరమభాగవతులనిపించుకొనినవారు దేవకీ వసుదేవులు, యశోదానందులు- శిశువైన శ్రీకృష్ణునెడల యశోదచూపిన మాతృవాత్సల్యము, మధురాతి మధురము. శ్రీకృష్ణుడు భగవదాకారుడని తెలిసిన తరువాత యశోద చూపిన మాతృభక్తి, పవిత్రభావభాసురము, యశోదా కృష్ణుల అన్యోన్యానురాగమొక పవిత్రానంద యోగమై ప్రకాశించినది-

7. ఆత్మలో నెఱుక- భీష్ముఁడు

శా॥ ఆలాపంబులుమాని చిత్తమునసీహాయత్తముంజేసి దృ
గ్జాలంబున్ హరిమోముపైఁబఱపి తత్కారుణ్యదృష్టిన్ విని
ర్మూలీభూతశరవ్యథా నిచయుఁడై మోదించి భీష్ముండు సం
శీలంబొప్ప నుతించెఁ గల్మషగజశ్రేణీహరిన్ శ్రీహరిన్.

భారత మహారణరంగమున, పార్థునిబాణహతికొరిగి, శరతల్పగతుడై, దివికేగుటకు ఉత్తరాయన పుణ్యకాలము నకై వేచియున్న భీష్మనిరూప మీపద్యమున చిత్రితము. శ్రీకృష్ణ సహితులయి ధర్మజాదిపాండవులేవురు నచటనే యుండిరి. దేవర్షి బ్రహ్మర్షు లేతెంచిరి. భీష్ముడు వారిని సత్కరించి, ధర్మజునకు రాజనీతి, ధర్మతత్త్వముల బోధించి సత్పరిపాలకుడవు కమ్మని దీవించి, చిత్తము నీశ్వరాయత్త ముజేసి, శ్రీహరి రూపమైన శ్రీకృష్ణుని మనసునందు పూజించి నుతింపఁదొడఁగెను.

యాదవపతియైన శ్రీకృష్ణుఁడు లీలామానుష విగ్రహుఁడు ఆనందస్వరూపుడు స్వయంభగవానుడని మొదటి నుండియు యెఱిఁగిన జ్ఞాని భీష్ముడు. మరణకాలమున తన సర్వము కృష్ణార్పణముజేసి దివికేగిన ధీరుఁడు.

భారతదేశ చరిత్రలో భీష్మునంతటి సద్వర్తనుఁడు, ధర్మదీక్షితుఁడు, పరాక్రమశాలి, వీరుడు, ఆత్మజ్ఞాని మఱి యొకడు లేడని నిశ్శంసయముగ చెప్పవచ్చును. ధీరోదాత్తతకు భీష్ముఁడు మొదటి యుదాహరణము. ఈతడు గంగా శంతనుల పుత్రుఁడు, దేవతా సంభూతుఁడు.

పుట్టువుతో ఈ మహనీయునికి గలిగినపేరు దేవవ్రతుఁడు. ఈతని జన్మవృత్తాంతము చాలావిశిష్టమైనది. వేయి యశ్వమేధము లొనరించి దివికేగిన ఇక్ష్వాకు వంశీయుఁడు మహాభిషుఁడు ఒకశాపవశమున ప్రతీపమహీపతికి సుతుఁడగు శంతనుడై పుట్టెను. గంగయొక సుందరాంగన రూపమున దేవసభనున్నప్పుడు మహాభిషుడును గంగయు అనురాగమున అన్యోన్యము చూచుకొనుచుండుటచే ఆ యనుచితమునకలిగి బ్రహ్మ మీరిక ధారుణిపై దంపతులై జన్మింపుడని శపించెను. దేవతలందొక తెగయగు వసువులు వసుధపై నొకప్పుడు తిరుగుచు వసిష్ఠమహాముని ధేనువునం దాసక్తులై ఆ ధేనువును దొంగిలఁబోవగా వసిష్ఠుడు వారిని ధరణిపై బుట్టుడని శపించెను. స్వర్గమును వీడుటకు వారుచింతించి శాపవిముక్తిని గల్పింపుఁడని యాసంయమిని వేడ, మీ యెనమండ్రలో మొదటి యేడుగురు పుడమిపై పుట్టిన వెంటనే చత్తురు. నా గోవునందెక్కుడు ఆసక్తిచూపిన యెనిమిదవ వసువు క్షితిపై చాలాకాలము జీవించి సర్వవిధముల ప్రసిద్ధుఁడగునని చెప్పి పంపెను. అవినీతివర్తనమరసి

నపుడు మునులాగ్రహులై నను సహజముగ కరుణామన స్కులుగదా. ఆ యెనిమిదవవసువే గంగాశంతనులకు దేవవ్రతుండై జన్మించెను.

శంతనుం డొకనాడు గంగాతీరమున విహరించుచుండ గంగానది యొకసుందరాంగియై యానృపాలునిదృష్టి నాకర్షించెను. వారిద్దరు పరిణయమాడిరి. ఇంతకుమున్నే, శప్తులయిన వసువులు "తల్లీ గంగా భవానీ! నీగర్భమున మమ్ము జనింపనిమ్ము" అని వేడి యామె సమ్మతింబడసిరి. గంగ శంతనునిజూచి "నిన్ను పెండ్లాడుదునుసరే, ఒకనియమున్నది నేనేమి చేసినను నీ ఊరకుండవలయును" అని ఒప్పించినది. శంతనువలన గంగ వరుసగ మొదటియేడ్వురు వసువులను కని వెనువెంటనే గంగలో ద్రోసినది. ఎనిమిదవవసువు మహాసుందరుడు మహాతేజస్వియై జన్మించినాడు. ఆ బిడ్డను శంతనుడు వదలలేక గంగచర్య కడ్డుతగిలెను. నియమభంగ మొనర్చెను గాన గంగ శంతనుని విడచి యేగినది - ఆ శిశువే దేవవ్రతుడు.

ఒకానొక దేవకార్యమునకై ఇట్లు చేసితిని, నన్ను న్యథాతలంపకుము, నరనాథాయని గంగనుడివి ఆ శిశువును తనతోడ దోడ్కొనిపోయి పెంచిపెద్దచేసి వసిష్ఠునొద్ద సకలాగమశాస్త్రములు పరశురామునొద్ద సమరవిద్యలు అస్త్ర

శస్త్రాభ్యాసము చెప్పించి విజ్ఞానుని వీరునిజేసి, తిరిగి శంతనున కర్పించెను.

ఇది భీష్ముని జన్మకథ. సకలాఘములను సమయింపజేయు గంగామతల్లికి దేవేంద్రసముండగు మహాభిషుని వంశీయుడగు శంతనునికి తనయుండై జన్మించిన దేవవ్రతుడు సామాన్యుడగునా. పదునీ వశిష్ఠ పరశురాములంతటి పుణ్యపురుషులయొద్ద సుశిక్షితుండైన ధీశాలియు సుగుణోత్తము డతడు. ఈ యుత్తమగుణములే దేవవ్రతుని తరువాతి వర్తనమునకు ప్రోద్బలమైనవి. ధరణినేలందగినవాడని యెంచి శంతను డా తనయుని యువరాజుగ నొనరించెను.

కాలక్రమమున శంతనుండు దాశరాజ పుత్రియగు సత్యవతియందు బద్ధానురాగుండయ్యెను. కాని దాశరాజు సత్యవతి తనయులే శంతనునితరువాత ధరణీశులు కావలెనని పట్టుబట్టెను. శంతనునకుతలకు గొకలిచుట్టుకొన్నట్లైనది. ఇంట సర్వసమర్థుండైన కుమారుడు యువరాజయి యుండ దాశరాజు కోరికల కియ్యకొనుటయెట్లు? దేవవ్రతుడు తండ్రి చింతనెఱిగి తాను స్వయముగ దాశరాజుకడకేగి, తనకు రాజ్యమక్కఱలేదనియు, తాను కుమారులులేకుండ నిత్యబ్రహ్మచారిగ నుందుననియు సత్యవతీ తనయులె జననాథులగుదురని పలువురయందు ముమ్మారు ప్రతిజ్ఞజేసి సత్యవతిని గొనివచ్చి శంతనునకు వివాహ మొనరించెను. తండ్రికై యంతటి త్యాగమొనరించిన మహాపురుషుం డా

దేవవ్రతుఁడు. తాను భీష్మముగ జేసిన ప్రతిజ్ఞ కారణముగ భీష్ముఁడని కొనియాడబడెను - శంతనుఁడా భీష్ముని వర్తనమును మెచ్చి కుమారా! నీవు కోరుకొనినపుడే నీకు మరణము కలుగునని స్వచ్ఛంద మరణము కలవానిగా వరమిచ్చెను- సత్యవతిపుత్రులు చిత్రాంగదుఁడు విచిత్రవీర్యులను భీష్ముడు తానవిమాటప్రకారము జనపతులనొనరించెను- ఆ ఇరువురు సోదరులకు వివాహములు చేయుంచు సందర్భమున, అనాలోచితముగ తనపై కరుదెంచిన తనగురువు పరశురాముని, మహాపరాక్రమముతో భీష్ముడు ధర్మదీక్షితుడై యెదిరించి యుద్ధము చేయగలిగిన న్యాయశీలి. విచిత్రవీర్యుని సతులందు గలిగిన ధృతరాష్ట్ర పాండుభూపతులకు సర్వవిద్యలు చెప్పించి వారితనయులగు దుర్యోధనాది కౌరవులకు ధర్మజాది పాండవులకు ధనుర్విద్యతో సహా సకల విద్యలు చెప్పియూ వంశమునకు మూలపురుషుఁడై మహాప్రసిద్ధిఁగాంచెను. భీష్ముఁడెఱుగని శాస్త్రములేదు, యెఱుగని ధర్మములేదు, యెఱుగని నీతిలేదు; అధ్యాత్మ జ్ఞానమున అనంతమైన ప్రజ్ఞ యాతనికిగలదు. చిరతరతపోనిమగ్నులగు సంయమీంద్రులనుమించిన చిత్తశుద్ధియు, పరమేశ్వర చింతనము, పరమాత్మ జ్ఞానము గలిగిన మహామనస్వియతడు.

ఇది సంగ్రహముగ భీష్ముని వ్యక్తిత్వము. త్రిజగములకు మూలము, ఆధారము ఆశ్రయము పరమాత్మ.

ఇదమిత్థమని చెప్పనలవి కాని, స్త్రీ పుంసభావాతీతము. సాకారమును సగుణమై ధర్మసంస్థాపన మెట్లు జగమున నొనరించునో, నిర్గుణము నిరంజనము నిరాకారమై భక్తుల హృదయము లందట్లు భాసించును. సకలచరాచర స్థితమైనశక్తియు చైతన్యము ఆ పరమాత్మయే. సర్వాంతరామియై సర్వసాక్షియై యున్న ఆ జగన్నాథునాత్మలో నెఱిఁగియుండుటయే జ్ఞాన సంసిద్ధి. జ్ఞాని ఈశ్వరసమానుడు - నెఱుఁగుటయే గాదు ఆ పరమాత్మభావమును పరిస్ఫుటముగ గ్రహించుశక్తి గావలయును. ఆ బ్రహ్మభావమున తనసర్వస్వము సమర్పింపవలయును. ఇది మహాభక్తాగ్రణులకే సాధ్యము. ఈ సిద్ధినిఁ బడసిన పరమభాగవతుఁడు భీష్ముడు. ప్రహ్లాద నారద అంబరీషాదులకోవకుచెందిన జ్ఞానకోవిదుడు భీష్ముడు.

శ్రీకృష్ణుఁడు పరమాత్మ స్వరూపుఁడు. శ్రీమన్నారాయణుని యవతారము. జగదుద్ధరణకై జన్మమునందిన లీలామానుషవిగ్రహుడు. శ్రీకృష్ణుని మహిమలు కనులారఁ జూచియు, వీనులారవినియు, పరమాత్మరూపునిగా యెఱుఁగలేనివారనేకు లాకాలమందేయున్నారు. ఆ నిజము నెఱిగిన వారిలో భీష్ముడు త్తమభావుకుడు. పాండవాగ్రజుఁడు ధర్మరాజింద్రప్రస్థమున మహావైభవముగ రాజసూయమొనరించుచున్నాడు. సకలదేశరాజన్యులా యుత్సవము జూచుటకేతెంచిరి. క్రతుదీక్షితుఁడైన ధర్మజుఁడు సంప్రదాయానుసారము మునుముందెవరినిపూజించి యాగనిర్వహణ కుపక్ర

మింపవలెనని అచటనున్న బుధజనుల నడిగెను. అనేకులనేక విధముల వచించిరి. కురువృద్ధుఁడగు భీష్ముండులేచి, "ఈ పవిత్రకార్యమున పూజార్హుఁడగు పుణ్యపురుషుఁడు శ్రీకృష్ణుఁడొకఁడే. అతడు పరమాత్మస్వరూపుఁడు జగదారాధ్యుడు. అతని పూజించి పరమార్థఫలమందుము" అని యుపదేశించెను. అది ఒకమహాభక్తుడు భగవానునిలో నెఱిగినమాట. అచటనున్న చాలామంది కాబోధము విరోధమయ్యెను. ఉత్తమరాజవంశీయులెందఱో ఇటనుండగా ఒక గొల్లవానికా ఈ మర్యాద అని శిశుపాలాదులు మహోగ్రులై మారణాయుధములు బూని శ్రీకృష్ణుపైఁబడిరి- శ్రీకృష్ణుని చక్రనిహతికి నిముషములో నిర్మూలమయిరి- భీష్ముని మాటప్రకారము ధర్మజుఁడు శ్రీకృష్ణుని పూజించి క్రతువును యథావిధి పూర్తిగావించెను- శ్రీకృష్ణుఁడొనరించినది ధర్మపాలన. దానిని భీష్ముఁ డెఱుఁగును.

భీష్ముడు హస్తినలో ధృతరాష్ట్రునివద్దనే యుండువాడు, ఆ యంధరాజునకు ఒకహితబోధ సేయుచు. ధృతరాష్ట్రుని కుమారుడు దుర్యోధనుడు దురాలోచనాపరుడై దాయాదులు సజ్జనులగు ధర్మజాది పాండవులకు రాజ్యభాగములేకుండ అనేకబాధల పాలొనరించి చంపించుటకుఁ జూచెను. పాండవులు ధర్మవర్తనులు అయిదూళ్ళయిన చాలునని శ్రీకృష్ణునే సంధిచెయఁబంపిరి. భీష్మద్రోణాది వీరుల అండచూచుకొని దుర్యోధనుడామాత్రమును వదలక

సభాముఖమున శ్రీకృష్ణునిబంధింప యత్నించెను. మహాతేజ ముతో సహస్రభాస్కరకాంతిదీపింప శ్రీకృష్ణుడు తన విశ్వ రూపమునయెదుటఁ గన్పించుటతో దుర్మార్గులగు దుర్యోధ నాధులు పరువెత్తిరి. భీష్మాదులా దివ్యదర్శనమున కద్భు తానందమంది పాహి, పాహి, యని శ్రీకృష్ణుని ప్రస్తుతించి ధన్యులమైతిమనుకొనిరి.

కౌరవ పాండవులకు యుద్ధము తప్పలేదు. దుర్యోధ నునికి ధర్మమూర్తియగు భీష్ముడు అనేకవిధముల న్యాయ మార్గములు బోధించిచూచెను. "నీవు చేయునది అనుచితము నీ వపకీర్తియేగాక అపజయపరాభవ మొందెదవు. పరమా త్మయగు శ్రీకృష్ణుడు ధర్మోద్ధరణకై జన్మించిన యవతార పురుషుడు. ధర్మవర్తనులగు పాండవులకు సర్వవిధముల సాయమొనర్చు" నని - అవి దుర్యోధనుని చెవికెక్కలేదు.

యుద్ధమారంభమైనది. ధర్మరాజు మున్ముందు తాత భీష్మునికడకేగి యామహాత్ముని పూజించెను. భీష్ముడు ధర్మజుని హృదయపూర్వకముగ ఆశీర్వదించి విజయవంతుఁ డవగుదువని చెప్పి పంపెను.

కౌరవుల ఇంటివద్దనే మొదటినుండియు తానుండుటచే భీష్ముడు దుర్యోధనునిపక్షమున సమరనాయకత్వము వహిం చెను. అజేయపరాక్రమశాలియగు భీష్మునిముందు పాండవ సైన్యములేమియు చేయలేకపోయినవి. అర్జునుని బలవిక్ర మములు వ్యర్థమగుచున్నవి. పదిరోజులైనది. ఇరువాగుల

సై నికులుహతమగు చేగాని, భీష్ముని విజృంభణను పార్థుడు నిరోధింపలేకపోయెను. తుదకు శ్రీకృష్ణుడు తనచక్రమును బూని భీష్మునిపై కురుక సంసిద్ధుడగుదనుక వచ్చినది. మఱి యొకదిన మోపికపట్టుమని అర్జునుడు కృష్ణుని వారించెను. ఆనాటిరాత్రి ధర్మజుడు భీష్మునికడకేగి యావీరుని పాదము లంటి, మహాత్మా నీవు మాకెదురునిలచినంతవరకు మాకు విజయమబ్బదు- మాకొకదారిచూపుము అని ప్రార్థించెను. ధర్మచింతనుఁడు స్వార్థత్యాగియునగు భీష్ముడు తాను మర ణించు మార్గమును తెలిపి ధర్మజునంపెను - మఱునాఁడు శిఖండిని ముందిడుకొనివచ్చిన అర్జునునితో పోరుటకిష్టము లేక భీష్ముడస్త్రసన్యాసమొనరించి అర్జునుని సునిశితాస్త్ర పరంపరకాగలేగ నేలకొరగెను. సమరాంగణ సార్వభౌము డగు భీష్మునకానాడు రణరంగమున శరతల్పమే హంసతూ లికాతల్పమైనది- స్వచ్ఛందమరణమంద సమర్థుడైన భీష్ము డుత్తరాయణమువచ్చువర కాగదలంచెను. శ్రీకృష్ణుడా మహనీయునికి అంపశయ్యబాధలు, ఆకలిదప్పులబాధలు లేకుండ నిశ్చలచిత్తోపశాంతి నిచ్చెను-

ఆనాడు తండ్రికొరకై సామ్రాజ్యభాగ్యము త్యజించి సత్యప్రతిజ్ఞాపరిపాలకుఁడై నిశ్చలబ్రహ్మచారియైన భీష్ము డీనాఁడు ధర్మవిజయమునకై తన యసువుల నర్పించెను- మనుజమాత్రులకందని మహాత్ముల మార్గమిది-

పాండవ కౌరవ యుద్ధమంతమయినది. కౌరవులను రూపుమాపి పాండవులు విజయమందిరి. ధర్మరాజు సోదర సహితుఁడై శ్రీకృష్ణునితోఁ గూడి రణరంగమధ్యమున శ్రీ హరిని చింతించుచు దివ్యతేజోవిరాజమానుడై తనమరణ పుణ్యకాలమునకై నిరీక్షించుచు శరతల్పగతుఁడైన భీష్ముని కడకేగి ప్రదక్షిణపూర్వకముఁగ ప్రణతులర్పించి పాదాక్రాంతుడై, "తాతా! నీవు బ్రహ్మభావుడవైన పరమభాగవతుఁడవు. నీ దర్శనము పుణ్యప్రదము. నీ మరణకారణుడనైన అపరాధిని నన్ను క్షమించి రాజ్యపాలనార్హుని జేయవే" యని దీనుఁడై వేడెను. భీష్ముని ముఖారవిందము వికసించినది. కనుగవనుండి ఆనందామృతవీక్షణములు ప్రసరించినవి. "ధర్మజా! విధినిర్ణయము బలీయమైనది. భూభారమణగినది. దురాత్ములగు దుర్యోధనాదులు నశించిరి. ధర్మరాజ్యము సకలప్రజలకు శ్రేయోరాజ్యము నీ పాలనలో విస్తరింపవలయును. నీవే అందులకు తగినవాడవని తానెఱిగిన ధర్మబోధములన్నిటిని ధర్మరాజున కుపదేశించెను. ఐహికాముష్మికానంద సాధనములగు ధర్మసూత్రములు, రాజనీతి, పాలనావిధానము, న్యాయనిర్ణయము, వేదవేత్తల విధానములు, వర్ణాశ్రమ పద్ధతులు, దైవభక్తి మహిమము, అధ్యాత్మిక జ్ఞానము, ముక్తిమార్గము ఇదియది యననేల మానవునికి దివ్యత్వమాపాదించు సర్వము భీష్మునివాక్కుల నుండి అమృతధారలవలె వెలువడినది. ధర్మజుని హృద

యము తేలికబడినది. ధర్మజుడు భీష్ముని పాదములంటి "తాతా, ఏదేవు నుపాసించిన మానవజన్మసఫలమై గమ్య స్థానము చేరగలదని సూటిగ ప్రశ్నించినాడు. భీష్ముండు శ్రీకృష్ణుని దిక్కు మొగమై "ఆ శ్రీహరి మనయెదుటనే యున్నా"డని చూపుచు సహస్ర నామముల ఆ విష్ణుదేవుని కీర్తించెను.

భీష్ముడట్లు ధర్మజునికి ధర్మబోధ సేయుచునే హృదయ మంతయు శ్రీకృష్ణుని పదపంకజములందు లగ్నము చేసినాడు. ఏ మహామహుడు శ్రీమన్నారాయణుని యవతారమై లీలామానుషవిగ్రహుడై ధర్మసంస్థాపన కవతరించెనో, ఏ పరమాత్మస్వరూపము తన హృదయపీఠమున నిరంతరము భాసమానమై యుండునో, ఎవని కృపాకటాక్షరేఖామృత ధారకై తపోనిధుల హృదయములు తహతహలాడుచుండునో, ఆ చిదానందమూర్తి శ్రీకృష్ణభగవానుడు సుప్రసన్న మృదుమందహాసాననుడై తనవైపు చూచుచున్నాడు. ఇంతకాలము పరమాత్మస్వరూపునిగా ఎవనిని లోనెఱిగి, ఎవనిసాయుజ్యము తానందజూచెనో ఆ నారాయణుని సుందరవిగ్రహము తన కన్నులముం దున్నది. ఆనాడు యుద్ధరంగమున మహాపరాక్రముడైన పార్థుడు తన్నోంచలేని సమయమున చక్రధారియై తన్ను పరిమార్చుటకరుదెంచు శ్రీకృష్ణ రూపము భీష్ముని కనులలో మెరసినది. శ్రీకృష్ణుని నానాటి

యుద్యమము తనను భవబంధములనుండి, లౌకిక పాశముల నుండి రక్షించుటకొఱకే యని భీష్మునికి తోచినది. ఇక కొలది క్షణములలో ఉత్తరాయణ పుణ్యకాలము మాఘ శుద్ధ ఏకాదశిరానున్నది. ఈ మరణకాలమున కృష్ణభగవానునికన్న ఆరాధ్యదైవము లేదుగదా - నిశ్చలబుద్ధితో, చిత్తశుద్ధితో, తన సర్వస్వము శ్రీకృష్ణునియందు లగ్నము జేసి చేతులుమోడ్చి ఇట్లు స్తుతించినాడు -

త్రిజగన్మోహననీలకాంతి దనువుద్దీపింప బ్రాభాతనీ
రజబంధుప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజసంయుక్త ముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా
విజయుంజేరెడు వన్నెకాడు మదినావేశించు నెల్లప్పుడున్.

ఉదయభానుని పసిడికాంతుల మిసమిసలుగల పట్టు పుట్టమువాడు, ముంగురులు ముచ్చటలు గురియు మోము దమ్మివాడు, మా అర్జునుని తోడై యున్న శ్యామసుందరుడు త్రిజగన్మోహనుడు సదా నా హృదయపద్మమునం దుండు గాక -

హయరింఖాముఖ ధూళిధూసర పరిన్యస్తాలకోపేతమై
రయజాతశ్రమతోయబిందుయుతమై రాజిల్లు నెమ్మోముతో
జయమున్ బార్థునకిచ్చు వేడ్క నని నాశస్త్రాహతిం జాలనొ
చ్చియు బోరించు మహానుభావు నెదలోఁజింతింతు
నశ్రాంతమున్.

సమరమునం దర్జునుని విజయమేకోరి, అర్జునునకు రథసారథియై వచ్చిన ఆ కృష్ణభగవానుని మోము రణాంగణమందు లేచిన ధూళి గ్రమ్మి, చిఱుచెమట చిన్కులతో ప్రకాశించుచున్నది. నా బాణహతులతో ఆ మహనీయుని నొప్పించినాను. ఆ దివ్యపూరుషునే నేను నా భావములందు నిల్పుకొనెదను.

నరుమాటల్ విని నవ్వుతో నుభయసేనామధ్యమక్షోణిలో
పరులీక్షింప రథమ్ము నిల్పి పరభూపాలావళి జూపుచుం
బరభూపాయువులెల్లఁ జూపులన శుంభత్కేళివంచించు నీ
పరమేశుండు వెలుంగుచుండెడును హృత్పద్మాసనాసీనుడై.

పాండవకౌరవసేనల మధ్య రథమునిల్పి పార్థునకా మహనీయుడు శత్రుపక్షమున నున్నవారిని చూపుచున్నాడు. ఆతని చూపులు సోకినంతనే శత్రురాజులు నిశ్చేష్టులగుచున్నారు. ఆ పార్థసారథి పరమేశ్వరుడు నా హృదయకమలమున సుస్థిరముగా నుండుగాక.

చక్రము చేపట్టి నామీదికి రాబోవు శ్రీకృష్ణుని రత్నకుండలములకాంతి గగనసీమల కెగసినది. జగన్నాథుఁడు రథమునుండి క్రిందికి ఉరుకుచో భుజములపైనున్న పసిడిపుట్టము జారిపడుచున్నది, ఉదరములోనున్న జగముల బరువునకు భూగోళము కంపించుచున్నది, ఈ యుద్ధభారము నా కేవదలుము నీ కేల కృష్ణా ఈ తొందర అని అర్జునుడాపుచుండగా -

తే.గీ. కరికిలంఘించు సింహము కరణి మెరసి
నేడు భీష్మునిఁజంపుదు నిన్నుగాతు
విడువుమర్జున యనుచు మద్విశిఖవృష్టి
తెరలి జనుడంచు దేవుండు దిక్కునాకు.

అని మనసార అచ్చట శ్రీకృష్ణరూపమున సాకారుడై యున్న శ్రీహరిని భీష్ముండు ధ్యానించి తాదాత్మ్యమందుచున్నాడు.

ఇదియొక చిత్రాతిచిత్రమైన సన్నివేశము; అభిలాషలొక్కటైనను అన్యోన్యవిరుద్ధములగు వర్తనము లిందున్నవి. భీష్ముడు పరమధర్మపరాయణుడు. హృదయములో పాండవులు విజయులు కావలెనని, అర్జునునకే విజయము లభింపవలయునని అతని వాంఛ. కాని తాను సశరశరాసనుఁడై అజేయముగ పోరాడినది దుర్యోధనునిపక్షము వహించి అర్జును నెదిరించి, తాను కాలూని సంగరమున నిలిచినంతకాలము ఎంతమంది అర్జునులైన అసమర్థులే. భీష్ముఁడు నిరుపమాన హరిభక్తుఁడు. పరమాత్మ జ్ఞానమెఱిగిన భాగవతుఁడు. శ్రీకృష్ణున కంతకన్న ఇష్టు లెవరుండురు- కాని అర్జుననకు విజయము లభింపవలయును లేకున్న ధర్మమే నశించును. భీష్ము నంతమొందించినగాని ఆ విజయము లభించదు. చక్రము చేపట్టి తనభక్తుఁడైన భీష్ముని కడతేర్చుటకు శ్రీకృష్ణుడు లేచినాడు. ఆ కడతేరుటలో లభ్యముకానున్న అర్జునుని విజయము భీష్మునకు కావలసి

నదే, శ్రీకృష్ణునకు కావలసినదే. ఇన్ని పరస్పరవిరుద్ధపరిస్థితులలో భక్తునియొక్కయు, భగవానునియొక్కయు అభిమత మొక్కటియే.

తనను చంపుటకే తెంచఁదలఁచిన ఆదేవుడే దిక్కు నాకు అని ధ్యానించుచు శ్రీకృష్ణస్వామి విగ్రహము చిత్తమున నెలకొల్పి భీష్ముడు కనుమూసినాడు. ఆభక్తుని తేజము తనలో లీనముచేసికొనినాఁడా శ్రీమన్నారాయణుడు. ఒక మహాత్తరతేజముతో దివినుండి భువికివచ్చిన ఒక మహామనస్వి, ఒక ధర్మదేవత. అంతకన్నను మహాత్తర తేజముతో ఉర్విని వీడి ఊర్ధ్వలోకముల కేగినాఁడు. ఆమహనీయుని కీర్తి క్షితినెల్ల నిండినది. ఋషులుచేరి కీర్తించిరి. దేవతలు పుష్పవృష్టి కురిపించినారు. ధర్మజుడు శ్రద్ధాంజలి ఘటించి పితృకార్యము తీర్చినారు.

భీష్ముని తేజమట్లు భువిపై వెలుగొందిన తుదిదినము భీష్మఏకాదశిగ సర్వభూమికి పర్వము పూజాదినమై నేఁటికిని మిగిలినది.

పురుషుని జన్మము సఫలమై చరితార్థత నందుటకు వలయు సద్గుణములన్నియు భీష్మునియందు పరిపూర్ణముగ నున్నవి. మాతాపితృభక్తి, త్యాగము, పరోపకారము, పౌరుషము, శౌర్యము, ధర్మనిరతి, న్యాయపాలన, రాజనీతిజ్ఞత, వివేకము, సర్వశాస్త్రపరిజ్ఞానము, పరమాత్మజ్ఞానము-మున్నగు ఉత్తమోత్తమ లక్షణములన్నియుమూర్తీభవించిన సమగ్రమహామనస్వియు పుణ్యపురుషుఁడతడు.

---

8. సంకీర్తనము - ప్రహ్లాదుఁడు

కం॥ గుణనిధియగు ప్రహ్లాదుని
గుణము లనేకములు గలవు గురుకాలమునన్
గణుతింప నశక్యంబులు
ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్.

దానవపతియైన హిరణ్యకశిపుని కుమారుఁడు ప్రహ్లాదుఁడు సకలసద్గుణ సంపన్నుఁడు. ఆదిశేషుడు, బృహస్పతి తుదకు బ్రహ్మయైనను ఆ బాలునిసుగుణము లింతింతయని వర్ణింపఁజాలరు. సద్గుణనిధియగు ప్రహ్లాదునకు వాసుదేవుని యందు సహజసంవర్ధమాన భక్తిధ్యానములు సంపూర్ణముగ ప్రకాశించినవి.

బ్రహ్మవరములచే మదోన్మత్తుఁడై లోకకంటకుఁడై హిరణ్యకశిపుడు ముల్లోకములకు పెద్దపీడగా పరిణమించెను. తపస్సిద్ధులైన మునులుగూడ ఆ రాక్షసునికి వెఱచి యూర కుండిరి. దేవత లారక్కసిబాధలకు తాళలేక రక్షింపుము దేవాయని శ్రీహరిచరణములంటి ప్రార్థించిరి. సాధుజనరక్షకుఁడు కరుణాళుఁడైన యా కేశవుడు, విపన్నులైన విబుధులఁజూచి-

మ॥ భయముం జెందకుఁ డయ్య నిర్జరవరుల్ భద్రంబు
మీకయ్యెడున్
జయమున్‌లాభము భూతసంతతికి మత్సందర్శనప్రాప్తి న

వ్యయమై చేరు, నెఱుగుంమున్ దితిసుతవ్యాపార
భాషావిప
ర్యయముల్ కాలముగూడఁ జంపెద జనుండందాక
మీ త్రోవలన్.

హిరణ్యకశిపుని దురితము లాతనినే కట్టి కుడుపును. కాలము కూడిరావలెను. హరిభక్తుఁడైన యాతనిసుతుఁడగు ప్రహ్లాదుని నాతడెప్పుడు హింసింపఁదలచునో అప్పుడు నేనే స్వయముగ ఆ హిరణ్యకశిపుని పరిమార్తును అని అభయమిచ్చి పంపెను.

ఇది బాలభక్తుఁడు, హిరణ్యకశిపుని పుత్రుఁడునగు ప్రహ్లాదుని కథావస్తువు.

ప్రహ్లాదుఁడు పరమభాగవతులలో పరిగణింపఁబడిన మహాత్ముఁడు. శ్రీవిష్ణువును తనయెట్టయెదుట ప్రత్యక్షము జేసికోఁజాలిన భక్తవరేణ్యుఁడు. ఇంతటి భక్తిపారవశ్యము అయిదారేండ్ల చిఱుతప్రాయమునాఁడే పొందఁగలిగిన పుణ్యపురుషుఁ డితడు. మహాక్రూరరాక్షసుఁడగు హిరణ్యకశిపుని కుమారుడు; అయిననేమి రాళ్ళగోతులనుండి రత్నముద్భవించిన చందమున భక్తాగ్రణియై ప్రఖ్యాతినందెను.

సర్వసంపదలకు నిలయము, సౌందర్యశోభితము, వర్ణనాతీతవైభవోపేతమని విష్ణుమూర్తి నెలవగు వైకుంఠమును తలచుకొనుచుందుము. అదియెచ్చటనోసుదూరమగు ఊర్ధ్వలోకమందున్నట్లు తలంతుము. ఇదియొక ఊహాసుందరమగు

యోచన. సర్వ జగన్నాథుఁడు లోకరక్షకుఁడైన ఆ మహా విష్ణు వెచ్చట నివసించుచున్న నేమి, భక్తుల హృదయము లందు, యోగిజనుల యుల్లములందు. మునీంద్రుల మానస మందు వసించుచు పిలిచినపుడెల్ల పలుకును. ఇది సత్యము. తగిన సాధనాపరిణతి సమకూడవలయునేకాని భగవంతుఁడు భక్తసులభుఁడని ప్రతి భక్తుని చరిత్రము సుస్పష్టము చేయును.

అభ్యాసముచే భక్తినలవఱచుకొనవచ్చును. తప స్సాధనచే, శమదమ సద్గుణములచే, ధ్యాననిరతులై దైవ మునకు దగ్గఱగా చేరవచ్చును. అంత కాలవ్యవధి లేదు, అయిదేండ్ల బాలప్రహ్లాదుడే భక్తవరేణ్యుఁడయ్యెను. బలీ యమైన పూర్వవాసన యుండవలయును ఇట్టి సిద్ధికి. ఆకస్మి కముగ ఆకసమునందుండి ఊడి పడునదిగాదు భగవద్భక్తి.

ఒక యాఖ్యానమిట్లు చెప్పుదురు. హిరణ్యాక్ష హిరణ్య కశిపులు దితికుమారులు. మహాబలవంతులైన క్రూరాసు రులు. శ్రీహరియందు బద్ధవైరులు. హిరణ్యాక్షుని శ్వేతవ రాహరూపుఁడై శ్రీహరి వధించెను. ఆ కారణమున హిరణ్య కశిపుడు మరింత క్రుద్ధుడై అజేయవిక్రమమునందగోరి తగిన వరములు బడయుటకై బ్రహ్మనుగూర్చి తీవ్రమైన దీర్ఘతప మొనరింప నేగను, ఆయదనుగన్పెట్టి దేవేంద్రుఁడు దైత్యు లపై దండెత్తి ఓడించి హిరణ్యకశిపుని భార్య గర్భవతియైన లీలావతిని గొనిపోయెను. నారదమునీంద్రుఁ డమరేంద్రుని

కడ్డుపడి, ఇంద్రా! నీకిది తగదు, లీలావతి మహాసాధ్వి. ఆమె గర్భముననున్న శిశువు విష్ణుభక్తుఁడు. నీవు చేయగోరినను వీరి నేమియు చేయలేవు. ఈమెను విడచుటయే నీకు శ్రేయమని నుడువగా ఇంద్రుఁడామెను వదలెను. నారదుఁడా లీలావతిని గొనిపోయి తన యాశ్రమమున ఆశ్రయమిచ్చెను.

ఇచ్చుటేకాదు, లీలావతికి ప్రతిదినము విష్ణుచింతనము, ఆధ్యాత్మికతత్త్వము, దైవభక్తి వైశిష్ట్యము, మానవనీతి వేదమార్గములు మున్నగు ఉత్తమ ధర్మమార్గములు బోధించుచుండెను. మున్యాశ్రమముల జీవనపద్ధతులు వాతావరణము ఆచారవిచారము లెట్టివి ?

సాధువాదసంకలితములు, సత్త్వగుణసమాశ్రయములు ప్రశాంతిసుందరప్రదేశములు, నిత్యహరికీర్తనానిలయములు. అందునను దేవమునీంద్రుఁడగు నారదముని యావాసమయ్యెది— లీలావతి సహజముగ సాధుసద్గుణశీల. ఆ యాశ్రమమున నున్నంతవరకు ఆమెపీల్చిన ప్రతివాయులవము, ఆమెగ్రోలిన ప్రతిజలకణము, ఆమెవినిన ప్రతిపదము, ఆమె మనోవాక్కాయములందు విష్ణుభక్తిని పెంపొందించినవి. ఆమెకిపుడు తలఁపులన్నియు శ్రీహరిమయములు — దుష్టుల దుర్మార్గముల నంతమొందించుటకు మూలకారణ బీజములనెవరు నిక్షేపింపవలయునో జగద్రక్షకుఁడైన ఆ శ్రీహరికే తెలియును. లీలావతి గర్భస్థమయిన శిశుమూర్తి యందామెభక్తి

బీజము నాటెనవి. లీలావతి నిరంతర పుణ్యభావనాఫలము ఆమె గర్భమునుండి, పాల్కడలినుండి అమృతభాండమువలె ప్రహ్లాదు డుదయించినాడు.

నందనారామ మందారమువలె అయిదేండ్ల వయసు నాటికే ప్రహ్లాదుని సద్గుణములు భాసించినవి. సకల ప్రాణులను సమబుద్ధితోఁ జూచును. పెద్దలను పూజించును. స్త్రీలందఱతనికి మాతృసమానులు. మిత్రులందఱు సోదరప్రాయులు, గురువులు దైవసమానులు, దీనులకు తనకొలది సాయపడును. పరిహాసమునకైన అనృతమాడడు. రాజ్యసంపద యున్నది. సర్వభోగములున్నవి అని గర్వముగాని విషయవాంఛలుగాని మచ్చుకైన ఆ బాలునియందు గన్పడవు. ప్రహ్లాదునకు తెలిసినది, ప్రహ్లాదుడు పాటించునది అనుక్షణము హరిచింతనము. ఆ బాలుని హరిపరతంత్రత హరిభక్తి పారవశ్యము దేవతలకే అద్భుతాశ్చర్యమునిపించినది.

ప్రహ్లాదుని హరిభక్తిపారమ్యము ఇట్టిదని వర్ణించి చెప్పుట కలవికానిదిగా పెంపొందినది. సహస్రజిహ్వలున్న సర్పరాజే వర్ణించలేడనిన అతిశయోక్తిగాదు. శ్రీహరి స్వయముగ తనతోనున్నట్లు తనతో ఆడుచున్నట్లు తనతో భాసించుచున్నట్లే తన్మయుఁడై తనయాటపాటలు మఱచును. ప్రహ్లాదునిసర్వము ఇప్పుడు హరిభక్తిమయము. శ్రీహరి కనుపించలేదే అని ఒంటరిగా కూర్చునియేడ్చును.

హరిని భావించి ఎలుగెత్తి పాడును. ఆ జగన్నాథుఁ డిడిగో నా వద్దనే యున్నాడని సంతసమున గంతులు వేయును. ఆ భక్తి పారవశ్యమున పులకితసర్వాంగుడై కన్నులనుండి అశ్రువులు గార్చుచి ఏదియోసమాధిగ్రస్తుఁడైనట్లు కన్పట్టును. ప్రహ్లాదునివర్తనమునభావనమున శ్రీహరి సాంగత్యముతప్ప అన్యప్రసక్తియే లేదు-

శా॥ పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణపాదపద్మయుగళీచింతామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారిసుతుఁడేతద్విశ్వమున్ భూవరా!

హరిచింతామగ్నమానసుడు, హరికీర్తనాపారీణుడు, హరిభావనామృతాస్వాదపరితుష్టుడయిన ప్రహ్లాదున కన్య వర్తనమేల రుచించును. హరిభక్తిమాధురులతో ఆ బాలు హృదయము నిండినది. అది ప్రహ్లాదునిపూర్వజన్మ సుకృత ఫలము. అట్టి భక్తికితోడు సంసారబంధసాంగత్యాభిలాష లేని నిశ్చలవైరాగ్యభావము అలవడినది. తనయెదుటనున్న శ్రీహరియొక్కడు తక్క మఱియొకవస్తు వీ విశ్వమునన్నదనుతలంపే లేదు ప్రహ్లాదునకు-

తన తనయుడు తనకు మంచి పేరుకీర్తులు వచ్చునట్లు జేయును. తనకు లభ్యమయిన అమరలోకసామ్రాజ్యము నేలును. త్రిలోకములను తన కెదురులేక ఏకచ్ఛత్రముగ పాలించుననుకొని కలలు గాంచుచున్న హిరణ్యకశిపునికి ప్రహ్లాదుని ప్రవర్తన ఆశాభంగము కావించినది. ఈ వయసు నందే బాలురకు తగిన గురువులచే విద్య నేర్పించుట మంచి దని తలంచి హిరణ్యకశిపుఁడు రాక్షసగురువగు శుక్రా చార్యుల పుత్రులైన చండామర్కుల రావించి, రాక్షసాధి పతికి వలయు విద్యలన్నియు ఈ బాలకునకు నేర్పుడని ప్రహ్లా దుని వారితో సంపెను. గురువులు చెప్పినదెల్లను ప్రహ్లా దుఁడు శ్రద్ధతో వినును. తనకు ఇష్టమగు ఈశ్వరభక్తి చెప్పుటలేదని తిరస్కరించఁడు. తన మనసున హరినామస్మర ణము మానఁడు. కొన్ని దినములాగి తనయు డెంతవరకు విద్వాంసుఁడయ్యెనో తెలిసికొనుటకు హిరణ్యకశిపుడు ప్రహ్లా దుని బిలిపించి నీ చదువెంతవరకు వచ్చినది, నీకు తెలిసిన విషయము చెప్పుము నాయనా అని అడిగెను. అంత ప్రహ్లా దుఁడు "తండ్రీ ! ఈ విశ్వమంతయు శ్రీహరి దివ్యకళా మయము. ఆ విష్ణుదేవుని స్మరించి కీర్తించుటకన్న ఉత్తమ కార్యము నాకు కన్పడుటలేదు'' అనిన కుమారుని మాటలు విని హిరణ్యకశిఁడు భగ్గున మండిపడినాడు. "కుమారా ! నీకీ దుర్బోధ లెవరుచేసిరి, శ్రీవిష్ణువు మనకు శత్రువు. శిక్షార్హుడు. నీవు నేర్వవలసిన దిదికాదు; త్రిలోకములను

జయించి, దేవతలను ముప్పుతిప్పలు పెట్టి నర యక్ష కిన్నర గంధర్వాదులను రూపుమాపి మునివాటికలను ధ్వంసమొనర్చి అవక్రవిక్రమంబున పాలనము సాగించుట నీవు నేర్వవలసినది, తెలిసినదా''యని తండ్రి ధట్టించి నుడువగనే ప్రహ్లాదుఁడు —

"తండ్రీ! నీవు పొరబడుచున్నావు. మాయామోహములందు మునింగినవారు అజ్ఞానమున అచ్యుతుని మహిమ నెఱుఁగక మూఢులై యుందురు. వీనిని వదలిన జ్ఞానులే దేవుని పాదపద్మములఁజేర ఆసింతురో ఆ పరమేశ్వర ధ్యానము, కీర్తనమే నా లక్ష్యము. హరిభక్తి మాధుర్యమెఱుఁగక నీవట్లు మాటాడుచున్నావు, వినుము —

సీ. మందార మకరంద మాధుర్యమున దేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీ వీచికల దూగు
రాయంచసనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియై చొక్కు
కోయిల సేరునే కుటజములకు
పూర్ణేందుచంద్రికాస్ఫురిత చకోరకం
బరుగునే సాంద్రనీహారములకు
అంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృతపాన విశేష మత్త

చిత్తమేరీతి ఇతరమ్ముఁ జేరనేర్చు
వినుతగుణశీల మాటలు వేయునేల.

తేనెటీగ సుమమకరందములకడకే యేగును. రాయంచ నిర్మలోదకములందే విహరించును. కోయిలకు లేలేతమావి చిగురులే యిష్టము. చకోరపక్షి చల్లని నిండువెన్నెల కాసపడును. మఱియొకచోటికి అవి పొమ్మన్నను పోవు. శ్రీవిష్ణుని పాదసేవామాధుర్య మెఱిఁగినవానికి మనస్సు మఱియొకచోటి కేగదు. నామనస్సు అట్టిదే. వేయిమార్లు చెప్పనేటెందులకు'' అని నిర్భయముగా పలుకు ప్రహ్లాదుని చూడగనే హిరణ్యకశిపునకు అరకాలుమంట నెత్తికెక్కినది. ఛీ ! నీచా ! నీవు నాకు శత్రువుగాని కుమారుఁడవు గావని పడద్రోసినాడు. చండామర్కుల రావించి చీవాట్లు పెట్టినాడు. మీరీ బాలకుని సరిగా చదివింపలేదు. బుద్ధిఁగలిగి వీనికి తగిన నీతులుజెప్పి తీసికొనిరండని కోపోద్రేకుఁడై పంపినాడు.

చండామర్కులకీబాలుడు కంఠమున గుదిబండయే యైనాడు. వీరు చెప్పునది వేరు, ఆ శిష్యునకు కావలసినది వేరు. సురభికుసుమముతో పరిమళమరుగునట్లు ప్రహ్లాదుఁడెచ్చటికేగిన అచ్చట విష్ణుభక్తి మాహాత్మ్యమే వర్ణించుచున్నాడు. తోటిబాలురను పిలుచును. "అన్నలారా ! వినుడు, మనకీగురువు మంచిమార్గములు బోధించుటలేదు. మనచుట్టును చూడుడు_ శిశుమరణములు, చిరకాలరోగము

లతో ఎందఱు బాధపడుతున్నారో. ఈబాధలు లేకుండ ప్రాణులకెల్లరకు ఐహికాముష్మిక సుఖశాంతులు ఆనందము నిచ్చు మార్గము మాధవుని పూజయే'' యని విష్ణుకీర్తనము వారికి నేర్పును. తనతో భాషించు నెల్లరతోడను ఈవిషయమే నుడువును. కర్ణాకర్ణిగ విని ఈసంగతులు హిరణ్యకశిపుడు కనుపెట్టుచునే యున్నాడు. తుదకు చండామార్కులకు మఱియొకమార్గము తోచక హిరణ్యకశిపుని కడకేగి ప్రభూ! మీబాలునికి మే మిటుపైని శిక్ష గఱపలేము. మేము చెప్పవలసిన రాక్షసవర్తన విధులన్నియు చెప్పితిమి. విరోధమార్గములు బోధింపలేదు అని ఆబాలుని నటవిడచి చనిరి.

హిరణ్యకశిపు డాయర్భకు నరసి "కుమారా! నీచదువు పూర్తియయినదా? ఏమి తెలిసినది నీవు చదివిన శాస్త్రము లలో- పద్యం బొక్కటి చెప్పి సార్థముగ తాత్పర్యంబు భాషింపుమా అని యడిగిన తండ్రిని జూచి ప్రహ్లాదుఁడు తండ్రీ!

కం. చదివించిరి నను గురువులు
చదివితి నే ధర్మార్థముఖ్యశాస్త్రంబులు నే
జదివినవిగలవు పెక్కులు
చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ.

నేను సర్వశాస్త్రములు చదివితిని. వాని రహస్యములు తెలిసికొంటిని. ఆ చదువులలో నేను గ్రహింపఁగలిగిన మర్మ

మును వివరించెద వినుము. ఈ రాజ్యములు, ఈ అధికారములు, ఈ భోగభాగ్యములు వ్యర్థములు. మాయామోహ పాశములు. ఈ బంధములనుండి తప్పించుకొని శాశ్వతమైన ఆత్మానంద మనుభవించుటకు శ్రీహరి ధ్యానముతప్ప మఱి వేరు దారిలేదు. మన శక్తి కొలంది ఏ మార్గముననైన మాధవుని సేవింపవచ్చును.

మ. తనువాఙ్మానసల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనమున్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుదలఁతున్ సత్యంబు దైత్యోత్తమా.

ఇట్లు వివిధమార్గములలో విష్ణుసేవ గావించి మహాభక్తులుగ జన్మము సఫలము జేసికొనినవా రున్నారు. తండ్రీ! నీవును అట్లు చేయుము. హరిభక్తి లేని జీవితములు బూడిదలో పోసిన పన్నీరువంటివి."

ప్రహ్లాదుఁ డింకెంతవరకు తనయాట సాగించునోయని తనలోని క్రోధము బిగబట్టి హిరణ్యాక్షుఁ డట్లే చూచుచున్నాడు. తండ్రి మౌనముగాంచి ప్రహ్లాదుఁ డెలుగెత్తి శ్రీహరికీర్తనము నారంభించినాడు. ఆబాలుని కేదో తన

ప్రార్థనము సఫలమై తనజన్మము చరితార్థమగు క్షణము సమీపముననే యున్నదను ఆశ యుదయించినది. ఆయాశతోపాటు ధైర్యము వచ్చినది. తండ్రిగాని, మఱొక్కరుగాని హరికీర్తనమునందాసక్తి లేనివారితో తనకు పనిలేదు. శ్రీహరి విగ్రహము తన హృదయమున సుస్థిరముగనున్నది. తనముందున్నది. తన కన్నులలో మెఱయుచున్నది. తనకున్న సర్వావయవములు శ్రీహరిసేవ కుపయోగపడినప్పుడే తన పుట్టువు ధన్యమగును. "తండ్రీ! వినుము" అని ప్రహ్లాదుఁడు మరల తనభాషణము సాగించినాడు.

కమలాక్షునర్చించు కరములు కరములు
శ్రీనాథువర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁజూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికిమ్రొక్కు శిరము శిరము
విష్ణునాకర్ణించు వీనులు వీనులు
మధువైరిఁదవిలిన మనము మనము
భగవంతువలగొను పదములు పదములు
పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి
దేవదేవునిఁ జింతించు దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడు గురుఁడు గురుఁడు
తండ్రి హరిఁజేరుమనియెడు తండ్రి! తండ్రి!

తండ్రీ! నాకిట్టి హరిమార్గ ముపదేశ మిప్పింపుము. ఇంకను వినుము —

కమలాక్షునకుఁగాని కాయంబు కాయమే
పవనగుంభిత చర్మభస్త్రి గాక
వైకుంఠుబొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనములేని హస్తంబు హస్తమే
తరుశాఖనిర్మిత దర్విగాక
కమలేశుఁజూడని కన్నులు కన్నులే
తనుకుడ్యజాలరంధ్రములు గాక
చక్రిచింతనలేని జన్మంబు జన్మమే
తరళ సలిల బుద్బుదంబు గాక
విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువుగాక.

హిరణ్యకశిపు డీమహోపన్యాసమును విన్నాఁడు. తాను కనిన కుమారుడే తనను పశువుతో సమము జేసినాడు. ఇంకెట్టి మాట లాబాలునుండి వచ్చునో. ఈపైని తానొకపలుకైన వినఁజాలడు. క్రోధము పెల్లుబికి వచ్చినది. మొగము కందగడ్డ యయినది. కనులు నిప్పులు గ్రక్కినవి. ప్రహ్లాదు నొక్కతన్ను తన్నినాడు. "ఓరీ! నీవు నాపుత్రుఁడవు గావురా. నా శత్రుఁడవు. నాకన్న అధిపతి ముల్లోకముల లేదు. రాక్షసకులమున విషపుతీగవలె జన్మించి

ఎవఁడో పాఱుబోతు శ్రీహరిని మాటిమాటికి కీర్తింతువు. నిన్ను సైరించినచో అసురవంశనాశనమే యగును. నిన్ను నిర్బంధించి బుద్ధివచ్చువరకు పలుహింసల పాలుజేసెదను. నీకు దిక్కెవరో చూచెద”నని కఱకుగుండెల కింకరులను బిలచి ప్రహ్లాదుని దోడ్కొనిపోయి నిర్దాక్షిణ్యముగ హింసింపుఁడని కఠినాజ్ఞ నిచ్చెను.

ఆ కింకరులకు దేవేంద్రుఁడనినను లెక్కలేదు. జనులను మునులను హింసించి బాధించుటలో హిరణ్యకశిపుని కన్న ఆరితేరిన క్రూరులు- ప్రహ్లాదుని రెండు కాళ్లు త్రాటితో గట్టి ఈడ్చుకొనిపోయిరి. చూచినవారి గుండెలు చెరువులైనవి. ప్రహ్లాదుని నేలమీద బడవైచి కాళ్ళతో త్రొక్కి కత్తులతో పొడచి గదలతో మొత్తిరి. ఆబాలుని శరీరములో నేమున్నదో దేహముకందనైనలేదు. సముద్రమునఁ ద్రోసిరి. చిఱుచేఁపవలె పైకి వచ్చినాడు. పర్వతశృంగములనుండి పడ నెట్టిరి. చిటికిన వ్రేలికైన దెబ్బతగులలేదు. పాములచే కఱపించిరి. ఆ విష మమృతతుల్యమైనది. ఆ కింకరులకు విసువెత్తి ఆబాలు నగ్నిమంటలలోఁ బడవైచిరి. అగ్నిజ్వాలలు పూలపాన్పులైనవి. ఇక చేయునదిలేక జరిగినదెల్ల హిరణ్యకశిపునకు జెప్పిరి. ఆ బాలున నొకచెట్టునకుకట్టియుంచితిమి ఇకమీద మేమేమియు చేయఁజాలమని చేతులు జోడించి వెనుకకుఁ బోయిరి.

మఱునాఁడు సభాభవనమున ఒంటరిగ కూర్చున్న హిరణ్యకశిపునకు ప్రహ్లాదుడు తలపునకువచ్చుటతో మతి పోయినట్లయినది–

ఉ॥ ముంచితివార్ధులన్ గదలమొత్తితి శైలతటంబులందు ద్రో
బ్బించితి శస్త్రరాజిఁబొడిపించితి మీఁదనిభేంద్రపంక్తి ద్రో
ప్పించితి ధిక్కరించితి శపించితి ఘోరదవాగ్నులందు ద్రో
యుంచితి బెక్కుపాట్లనలయించితి జావడిదేమి చిత్రమో.

చం॥ ఎఱుగడుజీవసౌమధము లెవ్వరుభర్తలు లేరు బాధలం
దరుగడు నైజతేజమునదత్త్యము జాడ్యము లేదు మిక్కిలిన్
మెఱయుచునున్నవాఁడొకనిమేషము దైన్యమునొంద డింక నే
తెఱగున ద్రుంతు వేసరితి దివ్యము వీనిప్రభావమెట్టిదో–

ప్రహ్లాదునిగూర్చి యాలోచించిన కొలఁదియు హిరణ్యాక్షున కొకవిధమగు భయమే కలుగుచున్నది. చంపెద ననుకొన్నను వీడు చచ్చుటలేదు. "పుట్టతుదకిది నాకే యేదియో విపత్తు తీసుకొనివచ్చునేమో"– ఇట్లనుకొనుచు తలపట్టుకొని చింతించుచు కూరుచుండెను–

కింకరులచే నిర్బంధితుడైన ప్రహ్లాదుఁడెట్లువచ్చునో తండ్రికూరుచున్న సభాగారమునకు వచ్చెను. ఈనాఁడు

ప్రహ్లాదుని వేషమే వేరు. పట్టుపీతాంబరము ఆపైని బంగారు జలతారు, నీలిరంగు ఉత్తరీయమొకయందముగా నడుము నకు చుట్టుకొనెను. మెడలో పూలమాలలు, ఫాలమున ఊర్ధ్వపుండ్రములు, కాళ్ళకు గజ్జెలు, ఎడమ చేతిలో చిడ తలు, కుడిచేతి నొకయందముగా త్రిప్పుకొనుచు విష్ణు మూర్తిపై పాటలు పాడుకొనుచు వచ్చెను. ప్రహ్లాదునిమొ గమున ఒకకాంతిమంతమగు తేజ ముట్టిపడుచున్నది. అధర ములపై మధువులొలుకు మందహాసము భాసించుచున్నది. నిరంతర హరికీర్తనాపరుడగు ఒకచిన్ని నారదునివలె ఆబాలు డచటకనుపట్టెను. ఊరివారందఱు అతనివెంటఁబడిరి. ప్రహ్లా దునిలో కనుపట్టు ఆకర్షణకు ఆశ్చర్యపడుచుండిరి. ఎవరో కొందఱు ముఖ్యపౌరులు మాత్రము ప్రహ్లాదునివెంట ఆ సభాభవనమున ప్రవేశించిరి.

ప్రహ్లాదుఁ డాపగిది ఒకనూత్నవర్తనమున నర్తిం చుచు, ఒకభద్రాసనమున చింతాముద్రనున్న హిరణ్యకశి పుని తండ్రీ! యని కూర్మిమై సంబోధించగనె మెలకువ దెచ్చుకొని కుమారునివైపు మొగమై, హిరణ్యకశిపుడు ఆకాంతిసందీపిత విగ్రహమును ఆముఖతేజమును చూడలేక మార్గమిడి, "ఆహా! యేమిది ముల్లోకముల గెలిచిన నేను నా కుమారుని ముఖతేజమే చూడలేకున్నాను" అను కొనునంతలో ప్రహ్లాదుఁడు తండ్రీ! నేను చదివిన చదువు లలో సారమేదియో ఒకటి రెండుసార్లు చెప్పితిని. నాకు

తెలిసిన విషయము నీకు నచ్చినటులలేదు. తుదిసారి మఱి యొకమాటు వినుము. ప్రాణులెల్లరు హరిభక్తివలన లభించు ముక్తిమార్గమునఁగాని సంసార బంధములువీడి శాశ్వతా నందముగలుగదు. లౌకికసుఖములు అశాశ్వతములు సంసారము నిజమునకొకనరకకూపము అని తనచిన్ని పాదములందలి గజ్జెలుఘల్లని మ్రోయనాడుచు పాడమొదలిడినాడు.

సీ॥ సంసార జీమూతసంఘంబు విచ్చునే
చక్రిదాస్యప్రభంజనము లేక
తాపత్రయాభీలదావాగ్ను లారునే
విష్ణుసేవామృత వృష్టి లేక
సర్వంకషాఘౌఘ జలరాసు లింకునే
హరిమనీషా బడబాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధకారమ్ము లడగునే
పద్మాక్షునుతి రవిప్రభలు లేక
నిరుపమాన పునరావృత్తి నిష్కళంక
ముక్తినిధి గానవచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గ కోదండ చింతనాంజనము లేక
తామరసగర్భునకు నైన దానవేంద్ర!

మనకెల్లరకు ఆ విష్ణుదాస్యమే శరణ్యము. ఆ ముక్తిని చూఱగొనుటే లక్ష్యము తండ్రీ! అని ప్రహ్లాదుడింకేమేమి యోనుడువబోవుచుండ హిరణ్యకశిపుడు మహోగ్రుడై లేచి ఓరీ డింభకా, మూఢా! కులవిధ్వంసకా! శత్రుపక్షపాతీ!

నీవా, ప్రేలెదు లేవు, నాకు చెప్పవాడవు. మా తమ్ముని జంపి పందియై పారిపోయిన ఆ విష్ణువా నీకు జగన్నాథుఁడు— నా కన్న వీరుఁడు ధీరుఁడు అధిపతి ఈ యఖిల బ్రహ్మాండమున వేఱొకఁడు లేదు. శ్రీహరి! శ్రీహరి! యని కారులు ప్రేలు చున్నావు. ఎక్కడరా నీహరి, గిరి, కనపడినచో ఇదే ఆ శ్రీహరిని నాగదాదండమున తల పగులగొట్టెదను. లేకున్న నీతల బ్రద్దలగును. నా బాధలడఁగును. శ్రీహరియందు నీ కంత విశ్వాసమున్నచో ఈ క్షణములోనే ఆతడెందున్నాడో చూపుము. వానిరక్తము రుచిచూచెదను— అని వజ్రాయుధ మునుబోని ఒక ఇనుపగదనుదాల్చి తాళవృక్షమెత్తున లేచి హిరణ్యకశిపుడు దిక్కులు పిక్కటిల్లు గర్జనతో ముందున కురికినాడు. ఆ మహారాక్షసుని పాదఘట్టనకు భూమి కదలాడిపోయినది—

ప్రహ్లాదుడు చిఱునవ్వు, తండ్రీ! నీమాటలు విని నా కమిత సంతోషము కలిగినది. ఈనాఁటికైనను శ్రీహరి యెక్కడున్నాడని నీనోటితో అడిగితివి. నీకేకాదు మఱెవ్వరికికూడ ఈ ప్రశ్నకు తావులేదు— ఆ జగన్నాథుఁడు ఆ భక్తరక్షకుఁడు ఆ శ్రీహరి—

మ॥ కలడంభోధి గలండు గాలి గలడాకాశంబున కుంభినిం
గలదగ్నిం దిశలన్ బగళ్ళ నిశలన్ ఖద్యోత
చంద్రాత్మలం

గల డోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగవ్యక్తులం
దంతటన్
గలడీశుండు గలండు తండ్రి వెదకంగా నేలయీయా
యెడన్.

ఆ శ్రీహరి ఆ భక్తరక్షకుడు ఆముక్తి ప్రదాత అన్ని చోటులను కలడు తండ్రీ-

కం॥ ఇందుగల డందు లేడని
సందేహమువలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
అందందే గలఁడు దానవాగ్రణి వింటే.

మఱునిముసములో తనతండ్రి గదాహతికి తలపగుల వలసిన ప్రహ్లాదుఁడు అయిదేండ్ల బాలుడు నిర్భయముగ ఈ మాటలనెను. ఎంత ఆత్మవిశ్వాసము! ఎంత ధైర్యము-

హరిలేడను తండ్రికి, హరి అంతటనుగలఁడను కుమారునిమాటలకు మధ్య లోకోత్తరమగు ఒకమహత్తర విశేషమున్నది. భక్తుని భక్తి యెంత నిశ్చలమైనదో యెంతనిర్మలమైనదో యెంత పరిణతినందినదో తుదివరకు పరీక్ష చేసినఁగాని భగవంతునికి తృప్తిలేదు. ఆ పరీక్ష నిజముగ ప్రాణాపదయే. గజేంద్రుని కట్లైనది. అంబరీషున కట్లైనది. మహాభక్తుల కథలన్నియు ఇట్లేయుండును. ఈ సంబంధమిక్కడ తారుమారైనది. తనభక్తుఁడైన ప్రహ్లాదుడనిన శ్రీహరి చెవులలో పెద్దపరీక్షలై మారుమ్రోగినవి. "శ్రీహరి

ఎందుజూచిన అందేయుండును” అని ప్రహ్లాదుడు తండ్రితో ననెను. ఈ పరీక్షకు తాను నిలవవలయును. లేకున్న ఆ చిట్టి ప్రహ్లాదుని తల బ్రద్దలగును. హిరణ్యకశిపుని ఇనుపపాద ముల క్రింద ముల్లోకములు నలిగి చూర్ణమగును. లోకమున ధర్మవ్యవస్థ ఇంతటితో సరి- హిరణ్యకశిపుడు ఎచ్చట శ్రీ హరిని చూపమని అడుగునో ఇంత విశాల విశ్వమున తానెందుండవలయును ? ఆలోచనలకు అరనిముసమైనను తావులేదు-

మ॥ హరిసర్వాకృతులం గలండనుచు ప్రహ్లాదుండు
భాషింప స
త్వరుడై యెందును లేడులేడని సుతున్ దైత్యుండు
తర్జింప శ్రీ
నరసింహాకృతినుండె నచ్యుతుడు నానాజంగమస్థావరో
త్కరగర్భంబుల నన్ని దేశముల నుద్దండప్రభావంబునన్.

శ్రీవిష్ణువు విశ్వమయుడు, విశ్వాత్మకుడు. విశ్వవిశ్వ మున ప్రతి అణువునందు నృసింహాకృతి నుండెనట. నరుడు, మృగముకాని ఆరూపమేలనో, ఆ భీకరాకార మెందులకో ? ఈక్షణ మదియే అవసరము వచ్చినది. నరులు సురలు అసు రులు యక్ష కిన్నర గంధర్వాదులు ఇతరు లెవ్వరిచేతను, జంతువులచేతను గూడ చావులేని వరబలమున్న దర్పోద్ధ

ళుఁడు హిరణ్యకశిపుడు. అతనినిఁ జంపుటకు నరుఁడు మృగము గాని రూపమే ఆవశ్యకమైనది.

ప్రహ్లాదా! నీ శ్రీహరి అన్ని చోటులను గలఁడని అరచు చున్నావు, ఈ స్తంభమున శ్రీహరిని చూపగలవా, లేదేని ఈ నిముషముతో నీ కాయువుసరి- అని హిరణ్యకశిపుఁడు వేయి మేఘములు చేసిన ప్రళయగర్జనవలె హుంకరించి, ప్రహ్లాదుని ధిక్కరించి, ఒక మహాఖడ్గమును గైకొని ఆ యెదుటనున్న స్తంభము నొక్క వ్రేటున విఱుగఁగొట్టెను. ఆకాశమే బ్రద్దలై పడినట్లు స్తంభము ఫెళఫెళమని ముక్క లైనది. ఆ స్తంభగర్భము నుండి బ్రహ్మాండకటాహంబు బ్రద్దలై చిటచిటమను మహోత్కటారవం బొప్ప భూనభోంతరము లాక్రమించు సహస్రభాను ప్రభా సమాన తేజం బెసంగ మహాగ్నికుండజాజ్వల్యమానశిఖశిఖాసన్నిభ నేత్ర యుగ్మమ్ముగ్రమై దీపింప, కరాళవహ్ని జ్వాలా చేలవిలాసా లోలజిహ్వాంచలమున కిరుదెసల ప్రళయాభ్ర ప్రభూటోరు విద్యుత్ప్రభాధగద్ధగాయమాన దంష్ట్రాంకూరమ్ములు మెరయ, కంఠస్థలాలంకారిత సటాజటోత్కటాటోప పాటవం బతిశ యింప, శంఖ చక్ర గదా శార్ఙ్గాయుధ హస్తుఁడై, వైజయంతీ కౌస్తుభహార కేయూరమణిభూష దుకూలాద్యలంకార కాంతి సంయుతుండై యుద్భవించిన నృసింహాకారుండైన నారాయ ణుండు హిరణ్యకశిపున కెదురై తన పాదహాతికి సప్త

పాదోధి సమావృతాఖిల వసుధాతలం బుత్కంపించు సహా విజృంభణమున దుస్సహా దుర్దాంత దుర్నిరీక్ష్య తేజమ్మున,

"ఓరోరి పాపీ! హిరణ్యకశిపా ! ఇదే చూడుము. నేను శ్రీహరిని. ఈ చిఱుతబాలకునిపై నిరర్థకశుష్కార్భటులు కాదు, నీకు శక్తియున్నచో నాతో పోరుము'' అని హిరణ్యకశిపుపై లంఘించి తన యంకతలమున కీడ్చి నిశితనఖముఖాగ్రములతో జీల్చి హిరణ్యకశిపుని ఖండఖండములుచేసి దేహభాగమ్ము లెక్కడివక్కడ ముక్కలై రాలి, రక్తంబు లేరులై పార మాంసపుముద్దలు రాశులై పడి, ప్రేగులు ప్రోగులై ప్రేశి యా సభాభవన మొక పీనుగుపెంట యయినది. పరమభాగవతశిఖామణియగు నొకపసి నిగ్గులారని బాలుని హింసింపబోవు దుష్టునికి జరిగిన శిక్షయది. రాక్షసకులమున హాహాకారములు రేగినవి, భక్తునియెడ భగవానునికిగల వాత్సల్యమున కాహా యని సుజను లాశ్చర్యపడిరి.

భక్తరక్షకుండై యేతెంచిన యా పరమేశ్వరుని తిలకించు మహాభాగ్యమునకై బ్రహ్మ వచ్చెను. ఇంద్రాది దిక్పతు లరుదెంచిరి. సర్వామర యక్ష కిన్నర గంధర్వ ముఖ్యు లేతెంచిరి. వైష్ణవగణములు విచ్చేసిరి. మునిముఖ్యులు చనుదెంచిరి. చేతులు జోడించి, "దేవా! దేవాదిదేవా! నీవు విశ్వకారణుడవు, విశ్వమయుడవు. విశ్వసృష్టిస్థితిలయములు నీలీలలు. దుష్టశిక్షణ భక్తరక్షణములు నీనియమములు, సాధుజనోద్ధరణము నీ యుద్యమము. నీ మహిమ

వర్ణింప మేమెంత ? మ మ్మనుగ్రహింపవే" యని పలు విధముల బ్రార్థించిరి.

ప్రహ్లాదుని పూర్వజన్మకృతమయిన తపోనియతియు ఈ పుట్టువున నొనరించిన హరికీర్తనములు ఫలించినవి. శ్రీమన్నారాయణుడు తనకై యవతరించినాడు. యాతని తను వెల్ల హరిభావమున పులకించి యా నృసింహుని పాదములపై వ్రాలి బహుప్రకారముల ప్రస్తుతించెను. "జగన్నాథా నేనొక రక్షస్తనూజుఁడనైన జడమతిని. దర్పాతిశయములేని నిర్మలభక్తిగదా నిన్ను సంతుష్టి జేయునది. భక్తబాంధవుఁడ వీవు. నిత్యకరుణాళుడవు. నీమహిమ వర్ణించు సంస్తుతులుగదా ముక్తిమార్గములు. నాకట్టి సద్గుణమ్ము లొసగి కామక్రోధలోభమోహాది దుర్గుణమ్ములు దూరమొనర్చి నన్ను ధన్యుఁజేయుము, నీ దాసుడను. కలుషుడైన యసురుని మర్దించి నన్ను రక్షించితివి. ఇంద్రాద్యమరులకుఁగూడ భీతిఁగొలుపు నీ యుగ్రాకృతి నిక నుపసంహరించి మమ్మను గ్రహింపవే'' యని ప్రణతు లర్పించెను. ఆ మఱునిముషమే ఆ నృసింహాకార మదృశ్యమై భక్తసులభుఁడు, భక్తప్రియుఁడైన మాధవుని సుందర సుప్రసన్న ప్రశాంతరూప మచ్చట నిల్చి ఆ బాలభక్తుని శిరమునం దభయహస్త ముంచి, "ప్రహ్లాదా ! నీవు పరమభాగవతశిఖామణివి. నీ చరిత్రమ్ము నేను మెచ్చుటేగాదు, సర్వజనసంస్తుత్యమానమై సకల కాలమ్ము వర్థిల్లును; ఈ మన్వంతర సమయమెల్ల యసురేం

ద్రుఁడవై సామ్రాజ్యభోగము లనుభవించెదవు. నన్నాత్మ నిలిపి ధ్యానించి నాకథలు వినుచు వినుపించుచు కాలమ్ము గడపుము. తుదకు నన్ను జేరగలవు. నిన్నుగనిన నీ జనకుండును నాకృపకు పాత్రుడగు''నని దీవించి యంతర్ధానుఁడయ్యెను.

బాలుడయ్యు కేవలము తనభక్తి ప్రభావమున శ్రీమన్నారాయణుని సాక్షాత్కరింపఁజేసికొని చరితార్థుఁడైన పరమభాగవతోత్తముఁడు ప్రహ్లాదుడు. బాలురకుండఁదగిన వినయము, పెద్దలయెడల భక్తి, సద్విద్య, దైవచింతనము అతనియందు పూర్ణముగ భాసించి ఆతని సత్కీర్తిని ముల్లోకముల వ్యాపింప జేసినవి.

9. చింతనము - గోపికలు

మ. శ్రవణోదంచితకర్ణికారకముతో స్వర్ణాభచేలంబుతో
నవతంసాయితకేకిపింఛకముతో నంభోజదామంబుతో
స్వవశుండై మధురాధరామృతముచే వంశంబు
బూరించుచు
న్నవిదా! మాధవుఁ డాలవెంట వనమం దొప్పారెడుం
జూచితే.

ఉ. గోపదరేణుసంకలితకుంతలబద్ధమయూరపింఛు ను
ద్దీపిత మందహాసశుభదృష్టిలసన్ముఖు నవ్యపుష్పమా
లాపరిపూర్ణు గోపజనలాలితవేణురవాభిరాము నా
గోపకుమారునిం గనిరి గోపసతుల్ నయనోత్సవంబుగన్

ఆ. కమలనయను వదనకమల మరందంబుఁ
దవిలి నయనషట్పదముల వలనఁ
ద్రావి దినవియోగతాపంబు మానిరి
గోపకాంతలెల్లఁ గోర్కు లలర.

తలపై నెమలిపింఛము, మెడలో పూలదండ, చెవి సందున చక్కని పూవు, కాంచనచేలము, పెదవులపై మురళి– ఈ మోహనవేషముతో శ్రీకృష్ణమూర్తి ఆలవెంట వనములకుఁ బోవును. గోపసుందరు లాతనిని దృష్టి సోకు నంతవరకు చూతురు. శ్రీకృష్ణుఁ డింకను తిరిగి రాలేదే యని దినమంతయు శ్రీకృష్ణునే చింతించుచు, ఆతడు గోపద

ధూళివర్ణుఁడై, మందహాససుందరుఁడై ఇంటికి తిరిగివచ్చునపుడు తనివితీర నయనోత్సవముగ చూతురు. శ్రీకృష్ణుని వేణుగానము ఆ గోపలీలావతుల మనసులు కరగించును. ఆ మోహనవిగ్రహము మధురమనోహరముగ గనుపించును; తేనెలు ద్రావుటకు పరువిడు తుమ్మెదలవలె వారి కనులు ఆ బాలకృష్ణుని వదనారవిందమును జూచుచు మరలిరావు.

ఆకృష్ణుఁడెవరు? అతని మురళీమధురగానములోనేమున్నది? అతని రూపుకొఱకు, చూపుకొఱకు అహర్నిశలట్లు తపించు గోపవనితల మనోచింతనమునందుగల పరమార్థ మెయ్యది? అతని దర్శనము గోపికలకు నేత్రపర్వము, ఆమురళీరవము మనోహరము, ఆదివ్యవిగ్రహము లోకాభిరామము. ఇదియే గోపికల ఆలోచన. ఆకృష్ణసౌందర్యములో తాము కలసిపోయి ఒకటికావలెను. అంతవరకు వారికి తృప్తిలేదు. కృష్ణుఁడెచ్చటనున్న అచ్చటికే వారి దృష్టులు, మనసు పోయి చేరును. ఇదియొక మధురశృంగార భరితమయిన ఆధ్యాత్మిక చింతనము. జగదీశ్వరుడగు కృష్ణుడు వారికి సర్వస్వము. వారి హృదయేశ్వరుఁడైన పరమాత్మ స్వరూపము.

క్రమక్రమముగా ఈ చింతనమెట్లు గోపికల యుల్లములందు సంఫుల్లమయినదో చూడుడు.

గోపికాకృష్ణుల సంబంధమొక రసోత్తరమగు మధుర భావ ప్రభావితమైన జీవనము; నందకృష్ణుని మధురవర్తన

ములో గోపికల శ్రీకృష్ణచింతనము లీనమై యేకప్రవాహ
ముగ పొంగి ఇరుగట్లొరసిపాఱిన విశ్వప్రేమవాహిని-
శ్రీకృష్ణుని చరిత్రములో మూడు భిన్నభాగములున్నవి.
మొదటిది గోపికలతోసంబంధము. రెండవది కంస శిశుపాల
జరాసంధ దుర్యోధన నరకాసురాది దుర్మతుల నిర్మూల
నము - మూడవది సర్వమానవజాతికి, అర్జునునికొసగిన
గీతాప్రబోధముద్వారా, ప్రసాదించిన ఆధ్యాత్మిక చింత
నము- దుష్టులదునుమాడుటతో వారిదురాగ్రములడగినవి.
అది కేవలము లౌకికము. భూదేవికాపాపభార ముడిగినది.
ఆధ్యాత్మికచింతనకై గీతోపదేశములో భాసించినవి కర్మ,
భక్తి, జ్ఞానయోగ మార్గములు. ఇవి ఆముష్మికానందదా
యకములు. ప్రాపంచికవర్తనము తప్పనివారికి మోక్షసాధ
నకు భక్తిమార్గముసులభము. భగవంతుఁడు భక్తసులభుఁడు.
భక్తుఁడు భగవంతునికి ప్రియుఁడు - సుందరాంగనలైన
గోకుల గోపికాబృందముల డెందములు వంశీమోహనుఁ
డైన బాలగోపాలుని యాశ్రయము పొందినవి, ఆలంబ
మర్దించినవి, ఒకఅపురూపమైన విలక్షణమైన భక్తిమార్గ
మున తాదాత్మ్యము చెందినవి. మురళీనాదములో రాస
విలాసములలో బాలగోపాలుడు విశ్వప్రేమాంబుధుల గురి
పించినాడు- ఆ సుందరభావములో ఆ సుందరాకారములో
ఏకాకారులైన గోపికలభావములు ఆ విశ్వప్రేమను చూఱ
గొన్న మధురాతిమధురములు- అచ్చట స్త్రీపుంస భావము

లకు తావులేదు. తదతీతమైన సౌందర్యావధి యది- నిత్య వర్తనమున ఇట్లొక మనోజ్ఞమార్గమున శ్రీకృష్ణునిలో భగవత్సాయుజ్యమును పొందగలిగిన గోపికాంగనల హృదయాంగణములు, నిత్యతపోనిష్ఠాగరిష్ఠములై శుష్కములై భగవచ్చింతనామృతాసేచనమున ఆర్ద్రములైన మునిమనములవంటివికావు. శ్రీకృష్ణతత్త్వానంద మరందరసాస్వాద తుందిలములైన నందనారామమందారములు. స్వచ్ఛకాంతులారవోయు శరత్కౌముదులు. అమృతపూర్ణములైన క్షీరసాగరములు-

గోకులవాసి నందుని ఇంట అందాలరాశిగా పెరిగిన ఈ సుందరగోపాలుఁ డెట్టివాఁడు. గోకులబృందావనములందు సౌందర్య దీపికలవలె వెలుఁగొందు గోకులాకృతులాగోపికలెటనుండివచ్చిరి. దివినుండి భువికిదిగిన దివ్యసౌందర్యము మూర్తిభవించిన ముగ్ధమోహనాకృతులువారెల్లరును -పుణ్యస్థలములైన ఊర్ధ్వలోకములయందు గోలోకమత్యుత్తమము. విశ్వప్రళయమునఁగూడ రూపుమాయని రుచిర ప్రదేశము. మురళీధరుఁడు నృత్యవినోదుఁడు సకలలోకముల కారణుఁడైన కృష్ణుఁడు గోలోకపతి సౌందర్యనిధి; శక్తి స్వరూపిణి రాధ కృష్ణునితో సహవాసిని. ఆ రాధామాధవ యుగళము, ప్రకృతిపురుషుల సంయోగము, రాధలేని కృష్ణ రూపము కృష్ణుడులేని రాధాకృతి అసూహ్యము- క్షీరసాగ

రకయనుఁడైన నారాయణుఁడు కృష్ణాంశ. వైష్ణవీజనములు దేవతాంగనలు రాధాకళావిలాసినులు. భూమిపై కంసాది విమతుల పాపభారము మేరమీఱి, "దేవా ! ఈ భారమును నీవు పరిహరింపనిచో నీశ్వేతవరాహావతారమున నిలబెట్టిన నేను అధోగతిపాలుకావలసినదే, నన్నుగాపాడవలసిన సమయమేతెంచినది" యని ప్రార్థించిన వసుధామాతల్లి వినతులు విష్ణుదేవునికి హితములైనవి – ఆ నారాయణుఁడు గోకుల శ్రీకృష్ణుడైనాడు. ఆదివ్యరూపుని అనుసరింప అవతరించిన వైష్ణవీజనము అమరాంగనలు గోకుల గోపికలు, దేవతాకార్యమునకై మానవాకారులై మహికేతెంచిన పవిత్రమూర్తులు. వీరలరాకతో గోలోకము గోకులమైనది. రాధామాధవ రమ్యసంబంధము గోపికా కృష్ణుల జీవనరాగమైనది– వీరివర్తనమున విశ్వప్రేమ బీజములు విస్తృతములై మర్త్యలోకమును ఆత్మానందపూరితమైన రమ్యాలోకసర్వస్వము కావింపవలెను–

వీరు వచ్చినది మర్త్యలోకము, వీరు మానవులు. మానవులవలె పుట్టుదురు, పెరుగుదురు, అనుభవములు పొందుదురు. ఆసించిన ధర్మము లాచరింతురు, ఆచరింపవలయును. ఇది ప్రకృతిరహస్యము.

కొందఱు బాలురు బుద్ధిమంతులై అల్లరిలేకుండ నమ్రములై యున్నను మనముల నాకర్షింపరు. కొందఱు పిల్లలుచేయు అల్లరిపను లొకయందముగా నుండును. ఆ

యల్లరి కందఱును ఆకర్షితు లగుదురు. ఆ యల్లరిపను లొక్కప్పుడు కొంత కష్టము కలిగించినను ఇష్టముతో సహింతురు. మరల మరల ఆబాలురచే అట్టి అల్లరిపనుల కవకాశము కల్పింతురు. ఇది మానవస్వభావము. ఆ బాలునియందొక ఆకర్షణ ఆ పనులయందొక అందము ఆనందము. నందకుమారుడు శ్రీకృష్ణుఁ డిట్టివాఁడు. ఇసుమంత పెరిగి పొరుగిండ్ల కేగనేర్చిన నాటినుండియు చిన్నచిన్న అల్లరులే గాదు పెద్దపెద్ద అల్లరులే చేయును. ఆ గోకులవాసుల ఇళ్ళలో పాలు వెన్న పెరుగులు ఉండనీయఁడు. ఆ కడవలను ముక్కలు జేయును. ఆ పాలుపెరుగులను తాను తినును, లేగదూడలకు త్రాగించును; కోతులకు పెట్టును: గోపబాలురకు పంచి పెట్టును. బయటకు పారిపోవుచు ఏ గోపిక ముఖముమీఁదనో ఆ వెన్న వ్రాయును. ఆమె నాకస్మికముగ కౌగలించుకొని విడిపించుకొనులోపున ముద్దుపెట్టుకొని పారిపోవును. ఈ ముద్దులకృష్ణుని ముద్దులాఁ డనుకొందురా, ఆతతాయి అనుకొందురా. ఆగోపికల కేమాత్ర మాగ్రహము కలిగినను మఱుక్షణములో మఱచిపోదురు. ఆకోపము మనసునకు తాపము కల్గించిన ఏ నిముసమునందో గోపిక లేగి యశోదతో చెప్పుదురు. ఆమె తన అల్లారుముద్దుబిడ్డను మందలించును. మందలించకు– "మాకుఱ్ఱవాఁడు మంచివాఁడమ్మా, వీథిలోనికి కాలుపెట్టి యెఱుగఁడు పొరుగిండ్ల కెట్లుపోగలఁడు? ఇటువంటి మాటలు నాతో చెప్పకుఁడు" అని యశోద

కృష్ణుని ముద్దాడి లోనికికొనిపోవును. ప్రతిదిన మిట్లు జరుగు చున్నను మఱునాడు చిన్నికృష్ణుఁ డెచట గన్పడినను చిఱు నవ్వుతో వాని చేతులు పట్టుకొని వారియిండ్లకు తీసికొనిపోవు వారే గోపికలందఱును. ఇంటి యజమానులు, పెద్దగోప కులు పొలములకు పోదురు; ఆలమందలతో అడవుల కేగు దురు. ఇంటిపనులు పెందలకడనే ముగించిన గోపికల కిక ఆకృష్ణునితోనే లోకము. ఆతడు అనుదినము రావలెను. ఆత నితో కాలము గడపవలెను. అబ్బా. ఎంతమంది గోపికలు! అందఱు సంతుష్టు లగుచున్నవారే. అంతమంది కృష్ణులా ఏమో.

కృష్ణుడు కొంచెము పెరిగెను. పెద్దపెద్ద అల్లరులే చేయును. యశోదతో గోపిక లేవో నేరములు చెప్పెదురు. మరల ఆ ధూర్తగోపాలుఁడే కనుపించినచో ఆ చిఱునవ్వు లకు ఆ చిలికి చూపులకు కరగిపోవుదురు. శ్రీకృష్ణుని మంద లించుటా, మానుటా ఇది యశోద సంశయము. ఆ చిన్ని బాలుని పనులలో ఏదో గొప్పతన మున్నట్లు కనుపించును. ఈభావము గోపికలలోను ప్రబలమగుచున్నది. పసిపిసుగుగా ఉన్న కృష్ణునకు పాలీయవచ్చిన ఒక రక్కసి తనంత తాను క్రిందబడి చచ్చినది. కృష్ణుని కాలుతగిలి ఒక శకటము ముక్కలైనది. రెండుచెట్లు నేలకూలినవి. ఒకనాడు సుడి గాలిలో ఉపవీధి కెగిరిపోయి సురక్షితముగా క్రిందకు వచ్చి నాడు. ఈపను లితడే సాధించెనా లేక తమంత నవి జరిగి

నవా. ఇన్ని ఆశ్చర్యకములగు పనులు వరుసవరుసగా ఎట్లు జరుగును ? పొరుగిండ్ల కేగిన శ్రీకృష్ణుని దుడుకుపను లెక్కు వయినవి. చిన్నికృష్ణుడు యశోద కొకసమస్యయే యయ్యెను. ఏమిచేయుటకు పాలుపోక యశోద —

సీ. బాలు డీతండని భావింతునందునా
    యే పెద్దలును నేర రీక్రమంబు
వెలపెలుంగుటకునై వెలపింతునందునా
    కలిగి వేరొక్కడుగాని లేడు
వెలవంగ నాబుద్ధి వినిపింతునందునా
    తనుదానయై బుద్ధిఁ దప్పకుండు
ఒండెలుంగక యింట నుండెడినందునా
    చొచ్చి చూడని దొకచోటు లేదు
తన్ను నెవ్వడైన తలపోయ బాలెడి
మోజలేదు భీతినొకటి యెలుగఁ
డెలమి నూలకుండఁ డెక్కసక్కెములాడు
పట్టి శాస్తిసేయు భంగి యెట్లు.

ఇట్లు ఒకప్రక్క మందలింప నుంకించియు వేఱొక వంక మందలింపరాని వాత్సల్యభావముతో యశోద దూగాడుచున్నది. ఈ అల్లరులు, ఈ విపత్తులు తగ్గునేమో అను నాసతో నందాదులు గోకులమును వీడి కుటుంబము లతో, గోగణములతో బృందావనమునకు వలసపోయిరి.

కృష్ణుం డిప్పుడు కొంచె మెదిగెను. గోపికల యిండ్ల కంతగా పోవడు. బలరామునిగూడి గోపబాలురనుగూడి అనుదినము ఆలమందతో అడవులకు పోయి తిరిగి వచ్చుచుండును. కృష్ణుడు వచ్చుట మానినప్పటినుండియు కృష్ణునిపై గోపికలకు మక్కువ యెక్కువైనది. మానవస్వభావమట్లే యుండును. మనసున కిష్టమైన వస్తువు దూరమైనకొలదియు దానియందు మమత యెక్కువగును. శ్రీకృష్ణుడు మురళి నూదుచు గోగణములతో వనములకు బోవును. మురళి నూదుచు సాయంతనము తిరిగి వచ్చును.

సీ. రా పూర్ణచంద్రిక రా గౌతమీగంగ
రమ్మ భగీరథరాజతనయ
రా సుధాజలరాశి రా మేఘబాలిక
రమ్మ చింతామణి రమ్మ సురభి
రా మనోహారిణి రా సర్వమంగళ
రా భారతీదేవి రా ధరిత్రి
రా శ్రీమహాలక్ష్మి రా మందమారుతి
రమ్మ మందాకిని రా శుభాంగి ! ....

దూరముగానున్న గోవులను ఈపగిది ప్రియమౌలుకు పేరులతో పిలుచును. గోపికల కామురళీనాదము వినినను, ఆ పిలుపులు వినినను ఒడలు రోమాంచమగును. ఆ చిన్నికృష్ణుడు పెద్దకృష్ణుడైనాడు. అవంశీనాదములో సుధామోదమాధుర్యము లున్నవి. తమ నాపేరులతో పిలచు

చున్నట్లు తమకొఱకే ఆమురళి ప్రమోయించుచున్నట్లు గోపి కలలో ఒక క్రొత్తభావ ముదయించినది. ఆహా! ఆ గోవులు గోవత్సములు ఎంతపుణ్యజీవులు కృష్ణునివెంటఁ దిరుగు చున్నవి. కృష్ణుని అటునిటు తాకుచు తిరుగుచున్నవి. కృష్ణుని గానమాధుర్యముల సొక్కి సోలుచున్నవి. తమకట్టి భాగ్యము కలుగవలెను. తామా మాధుర్యమును గ్రోలవల యును. తామును కృష్ణునంటిపెట్టుకొనియే యుండవలెను. తమ యిళ్ళవద్ద పాలుపెరుగులు దొంగిలి పారిపోవు చిన్ని కృష్ణు డెంతవాడయ్యెనే! అనుతలపులో తమ మనస్సులు మెల్లగాఁ దోచుకొనుచున్నాఁడను మధురభావములో గోపిక లూగిసలాడుచున్నారు. చిఱుపాపఁడైన శ్రీకృష్ణుఁడు తానే మునుముందు పొరుగిండ్లకు పరువెత్తి చుట్టివచ్చువాడు. ఇప్పుడు వారందఱు తనకొఱకే యెదురుచూచున ట్లురులు పన్నుచున్నాడు. శ్రీకృష్ణుని లీలలలో నిదియొక ముఖ్య విశేషము. ఒక్కసారిగా తానొక మధురమూర్తిగా మాధవ స్వరూపునిగా వారిని తలపింపఁజేయుచో వారి భావములలో ఇప్పు డున్నంతటి గాంభీర్యము ఉదాత్తత ఉండకపోవచ్చును. ఏదేనొకభావము క్రమక్రమముగా బలపడుటలోఁగల స్థైర్యము వేరు.

క్రమక్రమమున శ్రీకృష్ణుని మరికొన్ని చేష్టితములు విదితములైనవి – కాళియుని చంపెను, కార్చిచ్చును రూపు

మాపి దావాగ్నిని క్షణములో నణచెను. అజగరమగు పెద్ద చిలువను పొలియించెను. కేశివ్యోమములను ఉద్ధతులను జంపెను. గోవర్ధనమునెత్తెను. సామాన్యబాలకుఁడొకడు చేయదగినవికావివి - కాళిందిలో మునిగిపోయిన నందుని తిరిగి తీసుకొనివచ్చెను - స్నేహపాత్రుఁడు ప్రేమపాత్రుఁడయిన శ్రీకృష్ణునిలో ఒక తెలియని మహత్వమున్నది. ఇతఁడా భగవంతుడే యేమో - గోపికల చింతనము శ్రీకృష్ణునెడ ప్రియతమభావముతో పాటు ఒకభక్తిభావరేఖను సంతరించుకొనునది. ఒకప్పుడు నల్లని ముద్దులాడు, మరియొకప్పుడు ఇష్టమైనబాలుడు, తరువాత తమలో మధురభావము లేవోరేకెత్తించిన మురళీమోహనుడు. ఇప్పుడతనిలో దేవత్వమును గూడ చూచుచుండిన గోపికల మనోభావములు మరింత ముందునకు పోయినవి-

శ్రీకృష్ణునియందే గోపికల ఆలోచనలు. ఆ చిన్నిబాలుని మనోహరాకృతినే మరల మరల ఊహించుకొందురు. ఆ కృష్ణుని పింఛము పూలమాలలు ఆ చిఱునవ్వు ఆ మురళీనాదము ఇవియే వారిహృదయములలో కదలాడును- సన్నసన్నగ గోధూళిపడిన ఆ బాలగోపాలునిమోముపై నులిసంజపసిడివన్నెలు మరింత అందము చిందుచుండును. ఆతనిని చూచుకోరిక, మరల సిగ్గు, ఆ మధురమూర్తిని చూడక తప్పదు-

ఉ॥ గోపదరేణుసంకలితకుంతలబద్ధమయూరపింఛు ను
ద్దీపితమందహాసశుభదృష్టిలసన్ముఖు నవ్యపుష్పమా
లాపరిపూర్ణు గోపజనలాలితవేణురవాభిరాము నా
గోపకుమారునిం గనిరి గోపసతుల్ నయనోత్సవమ్ముగ
గన్ -

ఇట్టున్న కృష్ణవిగ్రహము గోపసతుల హృదయము లపై స్థిరపడినది - ఆ మనోహరత్వము వారినెచ్చటికో మున్ముందుకు లాగికొనిపోవుచున్నది - కృష్ణునిఁగూర్చి వారొకరితో నొకరు చర్చించుకొందురు. అందరిడెందమ్ము లందాయందగాని భావములోకటీరే. ఒకరియెడ మరియొకరి కీర్ష్యయులేదు- ఆ నూతన మధురభక్తి భావమునకు వారి హృదయములు అంకితములైనవి-

మంగళస్వరూప, మనములందున్న కోరికల నీడేర్చు తల్లి కాత్యాయని. గోపకుమారికలు హేమంత పుణ్యకాలా రంభమరసి కాళిందితీరముజేరి ఇసుకతో కాత్యాయని విగ్రహము నిర్మించి ఒకనెల ధూపదీపగంధ నైవేద్యంబు లిడి పూజాదికములు పూర్తిగావించి-

కం॥ ఓ కాత్యాయని భగవతి
నీకున్ మ్రొక్కెదము నేము నేడనుకంపన్
మాకిందఱకును వైళమ
శ్రీకృష్ణుఁడు మగడుగాగ జేయుముతల్లీ!

మధురానురాగమూర్తి కృష్ణునెడ మానసంబులు నిల్పి గోపికలనినపల్కులివ్వి. మానసికముగ వారు కృష్ణునే చింతించుచు కృష్ణునికి దగ్గఱగుచుండిరి. కాని ఒకవిధమగు దేహాభిమానము, సిగ్గు వారినలముకొనియున్నది. ఆ తెరలు తొలగినగాని యీ పరమపురుషునియందు తాదాత్మ్యము సిద్ధింపదు. ఆ చింతనమునకు సాఫల్యము లభింపదు.

ఆ మఱునాడు ప్రొద్దున గోపరమణులు చేరి ఒయ్యారముగ ఒకరిచేతులొకరు పట్టుకొని శ్రీకృష్ణునిగూర్చిమాటాడుకొనుచు పాటలు పాడుకొనుచు యమునాతీరము జేరి మేనివలువలువిడిచి గట్టునబెట్టి, స్నానాతురలై నదీ జలంబులసొచ్చి పలువితమ్ముల జలక్రీడలాడిరి—

నీవు కృష్ణుడవనగా నీవు కృష్ణుడవని ఒకరిపై నొకరు నీరము చల్లుకొని, ఒకరి నొకరు పట్టుకొని జలకములు ముగించి వెనుదిరిగిచూచుసరికి గట్టున వారిచీరలులేవు. ఏమైనవి ? ఎవరు దొంగిలిరి ? విభ్రాంతలై వారిటునటు నల్గడల కలయతిలకించుచుండ తీరముననున్న వృక్షశాఖలనుండి కృష్ణుని మురళి సన్నసన్నగ వినిపించినది. అటుచూచిరి. అచట బాలకృష్ణుడు ఆ ప్రక్కనే వారిచీరలు. ఎచటనుండి యీ బాలుడు వచ్చెను. ఎపుడచటికి చీరలు గొంపోయెను. అందఱకాశ్చర్యమే. ఇపుడేమిసేయుట. ఒకరిమొగమొకరు చూచుకొనిరి. ఆ సిగ్గుతో కంఠప్రమాణజలంబు లందుండి—

"ఏమయ్యా శ్రీకృష్ణా ! ఇది యేమియాగడము, నీ వెన్నెన్నో ఘనకార్యములు లొనరించిన గొప్పవాడవని యెఱుగుదుము, నీ ధర్మనిరతి యేమైనది–

శా॥ ఇంతుల్ తోయములాడుచుండ మగవా రేతెంతు రే
వచ్చిరా
యింతల్ సేయుదు రే కృపారహితులై యేలోకమందైన
ఈ
వింతల్ నీతలఁ బుట్టెగాక మఱియేవీ కృష్ణయో చెల్ల నీ
చెంతన్ దాసులమై చరించెదము మా చేలంబు
లిప్పింపవే.

కం॥ వచ్చెదము నీవు పిలిచిన
ఇచ్చెదమేమైనగాని యెటజోరుమనినం
జొచ్చెదము నేడు వస్త్రము
లిచ్చి మము గరుణతోడ నేలుముకృష్ణా.

అని ప్రార్థించి, కృష్ణామేము నీవారమేయనిచెప్పుచు ఇంకను తమదేహాభిమానము చూపుచున్న గోపవనితలజూచి శ్రీకృష్ణుడు చిఱునవ్వి–

" మీ మాటలుసరియే, మీ వలువలకేమి అనియే వచ్చును. మీరీవ్రత మెవ్వనిపై మోహమున చేసినారు. ఎవరు మీకు ప్రియుఁడగుటకు దేవిని వేడుకొనిరి. నేను అన్యుఁడనా. మిమ్ములను మీ హృదయములనెఱుఁగని వాడనా, అయినను ఈ బహిరంగస్థలమున మీరిట్లునగ్నలై

స్నానమాడుటయేల, మీ వ్రతఫలము మీకు కావలయుచో చేతులెత్తి నమస్కారములతో వెలుపలికి రండు మీ వలువలు చేకొండు అని మర్మంబులు నాటుమాటలనుసరికి ఆ గోపాంగనలకేదో అన్యలోకముననే పోయినట్లయినది. ఇది యొకహృదయపరీక్ష అయినది. తామెవరు తాము వాంఛించిన ఆ తరుణుం డెవరు- ఆ హృదయములమధ్య అవరోధములు లేవు; తనువులాటంకములగునా, కావు. ఆ కృష్ణభావములో సమాకృష్టలై వారొక్కక్కరే మాధురీభరమైన శృంగారజాలమున చిక్కుకున్నారు. మానభంగమనుమాట కాని, సిగ్గనుమాటకుగాని అచ్చట అర్థములేదు. వారర్థించిన రూపమచ్చటనున్నది. అది పరమాత్మ సన్నిభము. ఇతర ఆలోచనల కటతావు లేదు. వారు విగతవస్త్రలనుమాట వారికి తెలియని ఒక తాదాత్మ్యస్థితివారిచింతనమునందున్నది. ఒకరి విషయము మఱొకరి కక్కఱలేదు. శ్రీకృష్ణ విగ్రహము చిత్తములందు వెలుగుచుండ చేతులెత్తి నమస్కరించి నీరములనుండి వెలువడి వచ్చిరో లేదో వారివలువలు వారి చేతులందున్నవి."

ఆ.వె. చీర లపహరించి సిగ్గులు విడిపించి
పరిహాసించి యైన బరంగమనకు
ఘనుండు నోముగొఱత గాకుండ మ్రొక్కించె
ననుచు హరి నుతించి రబల లెల్ల.

వల్లభులు సేయుపనులు వల్లభులకు ఎగ్గుగాదు. కృష్ణుని హృదయపూర్వకముగ వారు నిజమనోవల్లభునిగ స్వీకరించిరి.

యమునాతీరముననున్న బృందావన మొక అందాల కోన. అది నిక్కువముగ మధురభావుక బృందావనము. పూబాదలు, పూలు, పుప్పొళ్ళు, పూవులతావులు, పులిన సీమలు తిలకించు ఒక సౌందర్యసీమ. మందమలయానిలములు, ఆ వీచికలకు కదలాడు యమునాజలముల చిఱుతరగలు, ఆ స్థలమున కొక ఆకర్షణ. శ్రీకృష్ణుని విహారములతో ఆ ప్రదేశములు మఱింత సుందరములు. ఆగోపకిశోరుడు మురళి నూదును. ఆ మధురనాదములు బృందావనము మూలమూలల కేగును. గోపకాంతల హృదయతంత్రులు కదలించును. ఆ స్పందనకు వారు నిలువలేరు. శ్రీకృష్ణుడు దూరమున నున్న కొలందియు ఆ మురళీరవభరమును వారు ప్రోయలేరు. ఆనాదము వారిని పేరుపేరున పిలుచుచున్నట్లుండును. చేతులు పట్టుకొని యమునాతీరమునకు లాగుచున్నట్లుండును. ఇప్పుడు వారి సర్వస్వము శ్రీకృష్ణుడు. అచ్చటికి పోక యెట్లుండగలరు? తమ ఆత్మీయుని వద్దకు పోవునప్పుడొకరి యనుజ్ఞ యేల? కృష్ణుని వంశీరవాహ్వానములు చాలు.

కాలచక్రము తిరిగి శరత్కాల మరుదెంచినది. వర్షములు వరదలులేవు. మబ్బుపొరగూడ లేని వినువీథిని నిండు

చంద్రుఁడు నాడు లక్ష్మీదేవి ముఖమండలమువలె వెలుగు లారవోయుచున్నాడు. ఆశరచ్ఛంద్రకాకౌముదులలో అచటనున్న లతావల్లరులు పూఁబొదలు క్రొంబూవులతీయ తావులతో మఱింత భాసించినవి. నిర్మలములు ప్రశాంతములై యమునాజలములు మిలమిల మెఱయుచు కదలుచున్నవి. ఆనాఁడచటికి వచ్చిన శ్రీకృష్ణుని యందమే వేరు. ప్రకృతి సర్వము ఆ బాలగోపాలుని మోహించి తన సర్వాంగసౌంద ర్యము చుట్టుముట్టినట్లున్నది. తన మురళిని కృష్ణుడు పూరించి ఒక గీతమును పాడెను. మురళీనాళోద్గతవాయునాద ములు జగన్మోహన గానస్వరములతో గలువడినవి. వల యములైనవి విరళీకృతములైనవి నలుగడలు నిండినవి. బృం దావన మెల్లెడల ఇంటింట మధురాతిమధుర మధువులు జల్లు లాడినవి. ఒక్కడే కృష్ణుడు, ఒక్కటే మురళి గోపవనితల కోటి గుండెలు మోహయించినవి. వారెవరియుండ్లను వారు వదలిరి. పనులను విడచిరి. బంధుగులను మఱచిరి. గానపరా యత్తలై దత్తఱమున పరువిడి తమ ప్రియతముని జేరిరి. మేనులు కంపమొందుచున్నవి. కనులు చెమ్మగిలుచున్నవి. కృష్ణా! కృష్ణా! అని కృష్ణుని జేరిరి. ఆ పారవశ్యములో అన్యచింతనమే లేదు వారికి.

ఆ గోపకాంతలు తమ ప్రణయభావమున కేంద్రస్థాన మును జేరిరి. ఇక వారికదియే ఆవాసము. ఆ లీలావతుల భావము లెంతపరిణద్ధములో శ్రీకృష్ణుడు కనుగొనవలయును.

వారి నా లక్ష్యమునకుఁ జేర్చవలయును. శ్రీకృష్ణుడు పరమ పురుషుడు, యోగేశ్వరుడు, నిర్వికారుఁడను భావస్థితి కా భామలింకను రాలేదు. కృష్ణునెడ వారొక ప్రణయావేశములో నున్నారు. ఇదియే అదను. వారి నాయవధికి తీసికొనిరావలెను. శ్రీకృష్ణుఁ డొకనేర్పుగ వారితో ననెను.

మీరీ రాత్రిసమమున యిక్లేల వచ్చిరి ? మీ మంద లం దే క్రూరమృగములయిన రావచ్చును. మీకు భయము వేయుటలేదా ? ఇల్లు వదలి, పిల్లలను వదలి, బంధుగుల మాటలు పాటిచేయక తుదకు మీ భర్తలనుకూడ వదలి నామీద కోరికతో ఇట్లు పరువెత్తుకొని వత్తురా, వారేమను కొందురు ? సత్కులాంగనల కిది తగినవర్తనము కాదుసుడీ. మీ రీరీతి జారవాంఛలతో నాకడకు వచ్చిరని తెలిసినచో ఊరకుందురా ? చులకనగా జూతురు. మీరు శిక్షార్హు లగు దురు. నామాట యందురా నాకందరు ప్రియులే. మీ తలఁ పులు, మీ ధ్యానము నాయందున్న చాలు. మీరు కృతా ర్థులే అని మొదట వారి వర్తనమునం దొకభీతి గలిగించి నాడు. తరువాత మరల ఒక ధైర్యపుమాట. తనయందు ధ్యానాకర్ణ నదర్శనాభిలాష యుండవలెనని ఒకమాట- వారి ముఖములు పరీక్షించుచున్నాడు. వారి నొక్కొక్క మెట్టే ఎక్కించుచున్నాడు- మరల మొదటికి తీసికొని వచ్చు చున్నాడు. మీ రనవసరముగా సాహసముతో ఇంతదూర మేతెంచిరి.

చం ఇది యమునానదీజలసమేధిత పాదపపల్లవప్రసూ
నదళవిరాజితంబగు వనంబు మనంబులు మేరదప్పెనో
పొదిగిట నేడ్చు బిడ్డలకు పోయుడు పాలు విడుండు లేగలన్
మొదవులకున్ నిజేశ్వరుల ముద్దియలార భజింపు
డింపుగన్.

అని కృష్ణుడు ప్రస్ఫుటముగా పలికినాడు. ఈ పలుకులవెనుక ఏదో ఒక అభయము దాగియున్నది. ఇది చక్కని చల్లని యమునాతీరము. తీయని పూతావులు ఎగయుచున్న వనుటలో గోపలీలావతుల ఆసలకొక దోహలము చూపించును. వెనువెంటనే మీకు మతిపోయినదా యేమి? మీ యిండ్లకు పొండు, మీ పిల్లలను వల్లభులను చూచుకొనుడు అనును.

గోపికల కాక్షణమున నిజముగనే మతిపోయినది. ఆపోవుట పోయిపోయి శ్రీకృష్ణునియందే చేరినది. అన్నియు మఱచి, తనకొఱకై చనుదెంచినవారిని ఆ ప్రణయమూర్తి యిట్లాడునా? ఆమాటలు రుచించలేదు వారికి రుచించక పోవుటేకాదు, వారి నొక విచారమున ముంచుచున్నది. ఆ విచారములో ఒకింతకోపము. ఆ కోపములో మరల భయము– అన్నియు కలసిన ఒక తొట్రుపాటులో తనువులు కంపించి కన్నీరు కాల్వలైనవి. కృష్ణుని అప్రియవచనములకు తెలతెలబోవు మోములతో గద్గదస్వనముతో ఇట్లను చున్నారు–

శ్రీకృష్ణా ! మనోవల్లభా ! అన్నియు వదలి నిన్న నమ్ముకొని నీకడకు పరువిడి వచ్చిన మమ్ము వెనుకకుఁ బొమ్మందువు. నిన్నే మనగలము ? నీ పాదారవిందములకడ కీనాటికి రాగలిగి మాతపము పండినదనుకొంటిమి. నీవుదక్క మా మాటలందు తలఁపులందు మఱి వేఱొండు లేదు. మాకు గావలసినది నీవే.”

శ్రీకృష్ణునికన్న గోపిక లోకయూకు ఎక్కువగానే చదివిరి. మరల వారి వాదము నారంభించిరి.

కృష్ణా ! నీవేవో మాయమాటలతో మమ్ము మఱపింపఁ జూచుచున్నావు. ఈ యాటలు సాగవు. సతులకు పతులు బిడ్డలు మాన్యులంటివి. అల్లయినచో వినుము.

మ॥ పతులన్ బిడ్డల బంధులన్ సతులకున్ బాటించు టే ధర్మ ప
ద్ధతియా నంటివి దేహధారిణులకున్ ధర్మజ్ఞ చింతింపుమా
పతిపుత్రాదికనామమూర్తి వగుచున్ భాసిల్లు నీయందుఁ ద
త్పతిపుత్రాదికవాంఛలన్ సలిపి సంభావించు టన్యాయమే.

మాకు పతిపుత్రాదికరూపములన్నియు నీవే. మా కనులముందుగాని మనసునందుగాని మఱియొకరు లేరు. మోహాసక్తులగు తపోనిధులను గాపాడినట్లు మమ్ము గాపా

డుము. మా తపస్సంతయు నీకొఱకే. మా ఇండ్లవద్ద సకలమువదలి నీకొఱకై వచ్చినమాట యెఱుఁగవా. మా జీవన సర్వస్వములు నీ పాదములకడ సమర్పించుటకే వచ్చితిమి. ఇంకను వివరించి వచింపమందువా వినుము_

మ॥ భవదాలోకనహాసగీతజములై భాసిల్లు కామాగ్నులన్
భవదీయాధరపల్లవామృతముచే బాపందగుం బాపవే
ని వియోగానలహేతి సంహతులచే నీతైౖ భవచ్చింతలన్
భవదంఘ్రిద్వయవీథి బొందెదము నీ పాదంబు
లానంబ్రియా.

సీ॥ నీపాదకమలంబు నెమ్మిదగ్గఱగాని
తరలిపోవంగ పాదములురావు
నీకరాబ్జంబుల నెఱినంటితిమగాని
తక్కినపనికి హస్తములుసారవు
నీనాగమృతధార నిండ గ్రోలగగాని
చెవు లన్యభాషల సేరివినవు
నీసుందరాకృతి నియతిసూడగగాని
మాడవన్యంబులు చూడ్కిగవలు
నిన్నెగాని పలుకనేరవు మాజిహ్వ
లొల్లననుచు పలుక నోడ పీవు
మామనంబు లెల్ల మరపించి దొంగిలి
తేమిసేయువార మింక కృష్ణ !

కృష్ణా మాకు నీ తరువాతనే విశ్వమందేదియైనను-నీ దాసులముస్వామి! నీ మాటలతో నీ చూపులతో నీ చేతలతో మమ్మాదరింపకున్న మతిదిక్కు లేదు. నీ వియోగ చింతానలతాపమునఁగ్రమ్మి నీ ముందు మా ప్రాణములర్పింప వలసినదే. నీ యభయహస్తము మా శిరముల, మా యుర ములనిడుము. చిన్ననాటినుండి మా మనసులు దోచుకొనిన వాడ వీనాఁడు కాదందువా అని నిశ్చేష్టలై గోపిక లెడలి కృష్ణునిముందు వ్రాలిరి-

గోపికల ప్రేమ తపస్సు పండినది. వారి మధురభక్తి కృష్ణతత్వమున తాదాత్మ్య మందినది - వారిశృంగారము శ్రీకృష్ణహృదయమున క్రొత్త అందములు వన్నెలీనినది-శ్రీకృష్ణుడు వారిని పేమార్ద్రదృష్టులతో చూచును. వారి చేలాంచలములాకర్షించును. బాహుబంధములగౌరవించును. నవ్వును, నవ్వించును, ముద్దిడుకొనును - అచట భావైక్యమేగాని తనుసౌఖ్యములకు కామవాంఛలకు తావులేదు. భగవంతుని మూర్తిత్వమున భక్తులనుభవించు వాత్సల్య మది - గోపికాచింతనము శ్రీకృష్ణభావములో చిదానంద సిద్ధినందినక్షణము - శ్రీకృష్ణుడొక్కరియందు వారి వారి ఆత్మారాముడై వారి నానందాబ్ధిలో నోలలాడించెను-

పరమావధినందిన ఆ మధురభావస్థితిలో గోపికలొడ లెఱుగరు. కృష్ణలీనములయిన మనసులేగాని వారికిప్పుడు తనువులులేవు. శృంగారమార్గమున శ్రీకృష్ణచింతనామృత

సరసిలో వారుకరగిపోయిన అమృతక్షణమది. ఆత్మానంద మూర్తియై ఆ యోగిరాజు వారి మనోవీథుల వెలుగు చున్నాడు-

మఱుక్షణములో కృష్ణుఁ డచ్చటలేడు. ఆ వేణు గానము దూరమునుండియైన వినిపించుటలేదు. గోపిక లొకరి మొగమొకరు చూచుకొనిరి. ఒకరివెనుక నొకరు వెదకిరి. కృష్ణుఁ డెక్కడ దాగెను ? ఏమయ్యెను ? మరల నిదియొక పరీక్షయా ? కృష్ణు డెక్కడనున్నను పట్టుకొనవలయును. పట్టుకొని వారినడుమ బంధింపవలెను. వారి యన్వేషణ ఆ యమునాప్రాంతమంతయు సాగినది. వెదకినచోటనే మరల వెదకుదురు- తిరిగినచోటనే మరల తిరిగెదరు. చెట్టుచెట్టున కొమ్మకొమ్మను రెమ్మరెమ్మను ఆకుఆకున పరిశీలింతురు. ఉన్మాదినులవలె దారి కడ్డుగనున్న జడవస్తువులను గూడ కృష్ణుని జూచితివా అని ప్రశ్నింతురు.

"పున్నాగ కానవే పున్నాగవందితు
తిలకంబ కానవే తిలకనిటలు ...."

అని ప్రతి పుష్పలతవద్దకుపోయి అడుగుదురు.

"మానినీమన్మథు మాధవుగాననే
సలలితోదారవత్సకము లార ..."

అని మొక్కమొక్కకు బోయి ప్రార్థింతురు.

"అదె నందనందనుం డంతర్హితుం డయ్యె
పాటలీతరులార పట్టరమ్మ ...."

అని ప్రతితరువును హెచ్చరింతురు. ఆ యడుగుటకు ఆ ప్రార్థించుటకు అంతులేదు. శ్రీకృష్ణుఁ డిట్లు నవ్వును, ఇట్లు నడచును, ఇట్లు నిలచును, ఇట్లు మాట్లాడును అని అనుకరించి చెప్పెదురు. కృష్ణుడు చేసిన పనులు తలచుకొందురు. నీవు కృష్ణుఁడవు, నేను గోపికను అని ఒకరినొకరు పట్టుకొందురు. ఇంతలో మరల కృష్ణునికై పూబొదలు వెదకుదురు. కృష్ణుని వర్ణించి చెప్పెదురు. మా కృష్ణుడు చాల అందమైనవాడమ్మా! మీరంద రెఱుగుదురు. ఎప్పుడును చిఱునవ్వుచునే ఉండును. కనులు కమలములే. శిరమున నెమలిపింఛ మున్నది. ఎవరినైనను లోఁబరచుకొను జగన్మోహనావతారమది. మాయందు దయఉంచి చూచి చెప్పుడు. మీచాటున లేడుగదా —

ఉ. నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై
జల్లెడువాడు మాళిసరిప్తి(?)పింఛమువాడు నవ్వురా
జిల్లెడుమోమువాఁడొకడు చెల్వలమానధనంబుఁ దెచ్చెనో
మల్లియలార మీపొదలమాటున లేఁడుగదమ్మ చెప్పరే.

ఉ. అంగజునైనఁ జూడ హృదయంగముఁడై
కరగించువాడు శ్రీ
రంగదురంబువాడు మధురంబగు వేణురవంబువాఁడు మ
మ్మంగజుపూవుదూపులకు నగ్గముసేసి లవంగలుంగనా
రంగములార మీకడకు రాడుగదా కృపయుంచి
చూపరే.

గోపికల అన్వేషణ మిట్లు శ్రీకృష్ణుని భౌతికరూపమునే వెదకుచున్నది. వారి చింతన మొకతరుణమున శ్రీకృష్ణ తత్త్వము రుచిచూచి మరల మోహాచ్ఛాదితమైనది. ఆధ్యాత్మికభావప్రకాశపు వెలుగుదారుల వెదకినగాని ఈ అన్వేషణ మిట్లే యుండును. గోపికల తపస్సింకను పరిపక్వము గావలెను.

ఇంకను ముందునకు ఆ బృందావన తరువీథులఁబడి శ్రీకృష్ణుని వారు వెదకుచున్నారు. నింగిని చూచుచున్నారు. నేలను జూచుచున్నారు. ఒకచో ఏవో ఆకర్షణీయములైన అడుగులు కనపడినవి. ఆ అడుగులు ముందునకు సాగినవి. ఆహా ! ఈ అడుగు లెవరివి ? ఇంత అందమైన అడుగులు కృష్ణునివే. తప్పక కృష్ణునివే. ఇవే హలకులిశకలశాంకుశాది చిహ్నములని ఒకతె చూపును. ఇవే సరోజాతకేతన చిహ్నములని మఱియొకతె చూపును. ఇవే ఈచెట్టుక్రింద ఈ అడుగులున్నవి. ఇక్కడాతడు పూవులు కోసినాడు. ఇచ్చట నాలుగు అడుగులు ఎదురెదురుగ నున్నవి. ఎవరినో కలసినాడు అని వారా అడుగుముద్రలకడనే ఉందురు. తప్పక కృష్ణుడీప్రాంతములందే ఉండుననుకొందురు. నే నెఱుగుదును ఈపాదముద్రలు మన కృష్ణునివే. ఈ శుభలక్షణలక్షితములైన లళితచరణము లావిశ్వమోహనునివే అని ఒకతె నుడువును. మెఱపు మెఱసినయట్లు వారిభావము లాజగన్నాథుని ఆ సర్వభూతమహేశ్వరుని ఆ నిర్వికారనిర్గుణనిరంజనుని

పాదములందు లగ్నములైనవి. ఆ పాదములు సకలభక్త జనాశ్రయములు ముముక్షుజనమనోవాసములు ముక్తిప్రద ములు. గోపవనితల హృదయభావము లోకనూతనమార్గము ద్రొక్కినవి. ఆపాదములే తమకు జీవనలక్ష్య మిచ్చుననిన ధైర్యము వారిలో కలుగుచున్నది. యమునాసైకతములం దున ఆ పాదముద్రలలో శ్రీకృష్ణుని శ్రీపాదములే, పూర్ణ విగ్రహమే వెలుగొందుచున్నట్లు వారిలో ఒకదివ్యానుభూతి కలిగినది. ఒకరికొకరు వర్ణించి చెప్పుచున్నారు.

సీ. ఈచరణమ్ములే యిందునిభానన
సనకాది మునియోగసరణి నొప్పు
ఈపాదతలములే యెలనాగ శ్రుతివధూ
సీమంతవీథుల చెన్నుమిగులు
ఈపదాబ్జంబులే యిభకులోత్తమయాన
పాలేటిరాచూలిపట్టుగొమ్మ
ఈసుందరాంఘ్రులే యిందీవరేక్షణ
ముక్తికాంతామనోమోహనమ్మ
ఈయడుగులరజమె యింతి బ్రహ్మేశాది
దివిజవరులు వ్రాలిదిశల దాల్తు
రనుచు కొందఱబల లబ్జాక్షు జేగిన
క్రమముగనియు నతనిఁగానరైరి.

అక్కా! ఈ పాదాబ్జములు నిజముగ వేదాంతవేద్య ములు. ఈ చరణాబ్జధూళినిగదా బ్రహ్మాదులు శిరోవీథుల

తొల్పనెంతురు. రండు రండు వెదకుమని గోపికలు బయలు దేరిరి. వారికి సరియైన దారి దొరకినది. చిత్తశుద్ధినందిన భావనిశ్చలత కావలయును. ఆ పరమాత్ముడే వారిదరి నుండును.

బృందావనమంతయు వెదకిరి. కృష్ణుడు కానరాడు. గోపికలకు వారిశృంగార కృష్ణుని చూడక వానితో నాడక ఇండ్లకుపోవు ఇచ్ఛయే లేదు. మరల మనోవాక్కాయకర్మ శుద్ధిగ, యమునా సైకతములఁజేరి, కృష్ణుని కీర్తింప దొడగిరి.

"కృష్ణా నీవు లక్ష్మీనివాసుడవు. నీ వలన మా మందలు డెందములు లక్ష్మీనివాసములయినవి. మా మనము లేనాడో చూఱగొంటివి. తలపగారాని పెక్కు ఉత్పాతములనుండి మమ్ముగాపాడితివి. ఈ వియోగబాధను మమ్మేల పాలుసేతువు" అని గోపికల విరహమిప్పుడు ప్రేయసీప్రియుల వియోగపరిధులదాటి భగవంతునికై భక్తుడువిలపించు తీరము లందుకొనినది - ఆ భక్తిలో ఒకమాధుర్యము ఒక శృంగారము-

"లోకరక్షకై యుద్భవించిన జగన్నాథుఁడవు నీవు కృష్ణా ! దుష్టభుజంగఫణామిష్టమైన నీ చరణములకు మా వక్షములింపుగావా. నీ నగవులు నీ చూడ్కులు నీ కథామృతములు మా కాస్వాద్యములుకానిమ్ము. మా తాపము నీ వంశీనాదమధురధారలగాని శమింపదు. గృహములందు

విడచి నీకై వచ్చిన మాకీ ప్రాణవ్యధయా. నీ చింతనమున మా హృదయములు మృదులములయినవి. మా కీర్తనములయందున్న మృదుమధుర ప్రేమ భావార్ద్రమయిన నీ హృదయము కఠినమగుట అసంభవము, నీవు పాపుల నెందఱనో ప్రమదించితివి. దుష్టరాక్షసులను దునుమాడితివి. మాలోనేమైన పాపములున్న భంజింపుము. నీభక్తులము నీ దాసులము దీనులము నిశ్చయముగ నీవారము నమ్మలేని ఇదే ప్రాణములాన అని నిస్సహాయలై కృష్ణుడుగాక వేఱు దిక్కులేక కన్నీరు కాల్వలుగట్టు ఆ ఇసుకగట్టుల విలపించుచున్న గీతలలో వారిచేతనములుగరగి పారినవి. ఒకఉన్మాదావస్థలో వారెల్లరు కృష్ణా! కృష్ణా! యనుటదప్ప అన్యము లేదు– శ్రీకృష్ణనామ సంస్మరణలో భక్తరక్షకా! బ్రోవవే!

మ॥ అని యిట్లంగన లంచితస్వరముతో నంకించుచుం బాడుచున్

దను రావే యని చీరి యేడువ జగత్ప్రాణుండు త్రైలోక్యమో

హనుడై మన్మథ మన్మథుండయి మనోజ్ఞాకారియై హారియై

ఘనపీతాంబరధారియై పొడమె తత్కాంతా సమీపంబునన్.

గోపికల ప్రణయ తపస్సు పూర్ణముగ ఫలించినది. గోపికలముందు ప్రత్యక్షమైన శ్రీకృష్ణవిగ్రహము అభయ హస్త ముద్రాంకితమైన వరదాకారముగాదు. మనోహరము మనోఽభిరామమునైన త్రైలోక్యమోహనాకారము. ఒక భక్తుడు భోగభాగ్యములు కోరును, ఒకభక్తుడు సద్వర్తనము కోరును. ఒకభక్తుడుముక్తిగోరును. కాని, గోపికలుకోరినది శ్రీకృష్ణుని యాదరము, శ్రీకృష్ణుని శృంగారరూప సర్వస్వము శ్రీకృష్ణుని హృదయము. ఆ భాగ్యము నేటికి లభించినది-

ఒకతె శ్రీకృష్ణుని కరములు తడిమిచూచును. ఒకతె దగ్గఱగఁజేరి నిలుచును. ఒకతె యాతని చేతులను తనచుట్టు చుట్టుకొనును. ఒకతె, కృష్ణా మేమనిన నీకింత ఉపేక్షయా యని తన చేతులతో కృష్ణుని కంఠమును చుట్టివేయును. వేఱొకతె కృష్ణునే చూచుచు తలపులన్నియు నా రూప మందే నిలిపి సమాధి స్థితినందును. మమ్మన్యాయముసేసి నీవెక్కడికో యేగుటయా, నీవు భగవానుడవు పరమాత్మ వని యెఱుగుదుము. పరమాత్మ భక్తులను విడచి యరుగడ నును వేదోపనిషత్తులు. సీవెట్లరిగితివి. గోపికలీ ప్రశ్నల వర్షము గురిపించిరి. ఆ వాక్యములన్నియు నిరంతర శ్రీకృష్ణ చింతనోద్గతములు, పరిశుద్ధములు, నిర్మలభక్తి భావోద్దీపితములు, ప్రత్యుత్తరమీయవలసినస్థితి శ్రీకృష్ణున కేర్పడినది-

వినుడు నేను నానారూపుడనుగాను, సాకార స్వరూపుడనుగూడగాదు. కేవలము మానసబంధుడను. మీకు నాయెడ నిరంతరధ్యానమొసంగుటకే ఒకింత కనుమఱుగయితిని. ఎన్నిధి దూరమందున్నప్పుడుగదా దానియందాశక్తి మెండగును ఏరికైనను – మీరాడిన మాటలన్నియు వినుచుంటిని. నేను మీ హృదయములందే ఉన్నాను. మీ కన్నులకు కనుపించనంతమాత్రమున నేను దూరగుడనని భావింపకుఁడు అని యేమేమో చెప్పుచున్నాడు కృష్ణుడు. కృష్ణుడు ఒకవిచిత్రపురుషుఁడు. విలాసనంసక్తుఁడు గన్పడు వేదాంతి, బ్రహ్మాదులచే సంస్తుతులందిన పరమ పురుషుఁడు.

శ్రీకృష్ణుని ఆ వేదాంతవాక్యములు గోపికలకు చాలవు. వారితృష్ణ వేరు. వారి ఆసక్తి వేరు. వారి అమృత భావన వేరు. గోపికలను కరగింపఁజాలిన కృష్ణుడు మురళీ మోహానుడు గాయకదేశికుడు నృత్యనిపుణుడు శృంగార రసాధిదేవత. ఈరూపము గోపికల హృదయములలో చెరగని ముద్ర అయినది. ఆరీతి కృష్ణభావసందీప్తహృదయలగు గోపికల నిపుడు కృష్ణుడు తృప్తి గావించవలయును. కృష్ణునిలో ప్రేమానురాగములు వెల్లిగొనినవి. కనులనుండి ప్రణయభావప్లావిత దృక్ప్రసారములు ప్రవహించినవి. మోము సుప్రసన్నకాంతులు వెదజల్లుచున్నది. కృష్ణుడు

గోపికలతో చేతులు కలిపినాఁడు. డెందము డెందములతో రాచినాఁడు. తనువు తనువునఁ జేర్చినాఁడు.

ఉ. ఆసమయంబునన్ విభుఁ డనంతుఁడు కృష్ణుఁడు చిత్రమూర్తియై
చేసెను మండలభ్రమణశీల పరస్పరబద్ధబాహు కాం
తాసువిలాసమున్ బహువిధస్ఫురితాననహస్తపాదవి
న్యాసము రాసముం గృతవిచిత్రవిచిత్రనేత్రమనోవికాసముల్

ఆ రాసలీలలో ప్రతి గోపికయు పాల్గొనినది. కృష్ణుడు ఒకపాదము ప్రక్కకెత్తి త్రిభంగిగ నిలుచుండెను. గోప లీలావతీకబరీసుగంధగంధిలములయిన కృష్ణుని అంగుళీయములు మురళి నాతని మధురాధరమ్మున గదించినవి. గానామృతము ఏరులై పారుచున్నవి. ఇద్దఱు గోపికలు ప్రక్కప్రక్కల వీణియలూని గానానందలహరుల ప్రవహింపఁజేయుచున్నారు. గోపసుందరులు చుట్టు మండలాకారమున జేరినారు. ఒక్కొక్క గోపిక కొక్కొక కృష్ణుడు. మధ్య కర్ణికాకృతిని మరల కృష్ణుడు. ఎవరు నిజమయిన కృష్ణుడు, ఎవరు కాదు. అందఱు సత్యకృష్ణులే. అందఱు గోపిక లారాధించిన గోపకృష్ణులే. ఒక పూరేకప్రక్క మరొక పూరేక ఒత్తుగా వికచమై సంఫుల్లమైన సురభిళ పుష్పమువలె ఆ రాసమండలము రాజిల్లినది. ఆ గానములు లయలు తాళములు లాస్యములు హస్తవిన్యాసములు శంఖ చక్ర వజ్ర కందుకాది రాసబంధములు తానకములు పాద

కరస్థభేదమ్ములు మంజుమంజీరశింజనమ్ములు రత్నకటకాభరణమ్ముల మెఱుంగులు దేవతాలోకమునకే నేత్రపర్వములైనవి. ఒక్కొక గోపకాంతకు తనముందు తనతోనున్న ఆ గోపకృష్ణుడు తప్ప మఱొకరు గోచరించుటలేదు. అందఱు గోపికల కన్నికృష్ణులయి ఆ పరమాత్మ స్వరూపుడు ఆగోపిక లందఱితో రాసలీలల నెఱపిన సమయమది.

ఆ రాసలీలాకృష్ణుని చరణములు, యోగీంద్రమానసాభరణములు, నృత్యసంస్ఫురణమ్ములు, శ్రుతివధూసీమంత వీథికాలంకరణములు, కరములు భాగవతజనహృదయభావనాకరములు. నర్తనము మహాసింద్రతపోలబ్ధ్యానువర్తనము, మురళి ముముక్షు లోకచింతనాసరళి. గానము జీవాత్మ పరమాత్మైక్యసంధానము. యోగేశ్వరేశ్వరుడు శ్రీకృష్ణుడు, పరమయోగినులు గోపికలు. మధురహృదయలయిన గోపలీలావతులు ఆరాధించి అవలోకించి అనుభవించిన దాశ్శృంగార కృష్ణవేషాభూషితమైన పరమాత్మ స్వరూపము.

ఇట్టి భావపరిణతి యెట్టివారికిని ఒకనాటితో లభించునదికాదు. నిష్ఠాగరిష్ఠులయిన మహాసింద్రులకే యెన్నోయేండ్లు చెల్లినగాని తపస్సిద్ధి సంప్రాప్తము కాదు. కృష్ణుని చిన్ననాటి చిలిపిచేష్టలకు స్పందించిన గోపికల హృదయములు క్రమక్రమముగ కృష్ణుని రాసలీలల నాటికి సంఫుల్లములై భాసమానములైనవి. గోపికలను జీవనగమ్యమైన

బ్రహ్మజ్ఞానధామమునకు తీసికొనిపోయిన లీలలవి. ఆ రాస లీలారహస్య మెట్టిది ?

కృష్ణుడు శ్రీమన్నారాయణుని అవతారము. లీలా మానుషవిగ్రహుఁడు. సాధుజనపరిత్రాణమునకై జనియించిన పరమపురుషుఁడు. భక్తజనులకు పరమపదసిద్ధి కల్పించుటయు శిష్టజనరక్షణమే. శ్రీకృష్ణుని జీవితమంతయు అత్యద్భుతముగ ఆ నిర్ణయానుసారమే జరిగినది. తదనుకూలముగ స్వయంభగవానుఁడయిన శ్రీకృష్ణుఁ డద్వైతాచార్యుఁడై వెలసినాఁడు. గోపికలు కామినులుకారు. ఆదేశికుని ప్రబోధములో సాంగత్యములో గోపికల చింతనము తురీయస్థానమునకు జేరి బ్రహ్మభావభాసితమైనది. గోపికల అన్వేషణ, శ్రీకృష్ణుని అధ్యాపకత్వము ఒక తెన్నునబోయిన దివ్యమార్గములు. ఆ మార్గములు శృంగారశోభితములు. ఈ విలక్షణమైన శృంగారమునకు స్థాయిభావము ఆధ్యాత్మిక జ్ఞాననిరతి. గోపికల భావములు ఆరాధనావిధానములు ఎంత మధురములో శ్రీకృష్ణుని ప్రబోధము లంతకన్నను మధురాతిమధురములు. గోపికల మధురభక్తికి ఫలము శ్రీకృష్ణుని మధురప్రేమ.

గోపికలయెడల ఒక యోగదర్శనమును ప్రసాదించిన విధ మాప్రేమపథము. గోపికల నాకర్షించుటకు శ్రీకృష్ణుడు మురళిని చేపట్టినాడు. అందుండి విశ్వమోహనములైన రాగలహరులు ప్రసరించినవి. శ్రీకృష్ణుఁడు బ్రహ్మపదా

ర్థము; అతనివాక్కు వేదము. ఆగానము వేదోపనిషత్సారము. మాధురీసంభరితము. ఆ గానశ్రవణానందమున వృక్షములు చిగురించి కుసుమించినవి, పక్షులు పరవశించినవి, గోవులు తలలూపినవి. చరాచరముల నిట్లు ప్రభావితము చేయగల ఆ గానమాధుర్యమునకు, ఆ నాదబ్రహ్మమునకు గోపికల చిత్తములు వికసించి ఉప్పొంగినవి. ఆ నాదము కేవల శ్రవణానందము కాదు. విశ్వాసము చిత్తశుద్ధి గల వారికి బ్రహ్మజ్ఞానానందప్రదము. ఆ గానరసము కణశః ఆస్వాదించిన గోపికల హృదయము లాపరమానందముతో నిండిపోయినవి. అది అనుభవైకవేద్యము- అనిర్వాచ్యము. ఆనందో బ్రహ్మయనికదా ఆర్యోక్తి.

శ్రీకృష్ణచేతస్కలైన గోపికలు ఆ యానందభావావేశమున శ్రీకృష్ణునితో రాసకేళి సల్పిరి. వంశీనాదమున వారి కంఠములు కలిపి పాడిరి. కృష్ణుని కరముల వారికరములు కీలించి యాడిరి. పాదవిన్యాసము ననుసరించిరి. శ్రీకృష్ణపరబ్రహ్మతత్త్వము వారిలో ప్రసరించినది. వా రాతత్త్వమున క్రీడించిరి. ప్రతి గోపికయు ఆమె యొక్క తెయే శ్రీకృష్ణునితో కలిసి క్రీడించుచున్నట్లు భావించినది. అనన్యమైనుగని, జీవబ్రహ్మైక్య మాభావము. కనులముం దొకేపరంజ్యోతీ రూపము. ఆరాసము దైహికవాంఛానిరాసము. మధురభక్తి యోగవిలాసము. బ్రహ్మానందక్షీరాబ్ధిలో ఓలలాడిన గోపికల హృదయస్పందనావిన్యాసము. ఈ అనుభవ మితమిత్థ

మని యెవరూహించగలరు. జీవాత్మపరమాత్మలు సారూప్యమందిన సంస్థితి యది.

గోపికల మేనులు, మనస్సులు, బుద్ధ్యహంకారములు ఆ బ్రహ్మానంద రాసలీలలలో లీనమై కరగిపోయినవి. గోపికాకృష్ణుల రూపము లొకటే ప్రవాహముగ గట్లొరసికొని పారినవి. కలిమిలేములు జననమృత్యువులు నామరూపవిభజనములు స్త్రీపుంసభావము లచటలేవు. సృష్టి యెటనుండి పొటమరించెనో ఆస్థానమది. ప్రణవమునుండి గాయత్రి వరకు పరంజ్యోతిరూపమైన కాంతిపుంజమది. శ్రీకృష్ణతత్వ విహారరసికారామము. శ్రీకృష్ణధ్యానాకర్ణన దర్శనోత్సుకులైన గోపలీలావతులు తాదాత్మ్యమంది శ్రీకృష్ణునితో అద్వైతభావ మందగలిగిన యోగసమాధిస్థితి యది. గోపికాహృదయ శ్రీకృష్ణచింతనకు ఫలమైన పరమావధి.